"నామీదో కథ చెప్పి ఇతనిదగ్గర పది రూపాయలు పీకుతున్నావేమిటి?" మళ్ళీ అతనే అన్నాడు.

రిక్షావాడే "చిల్లర కథ" అంతా చెప్పేడు.

కథ విని "నాన్సెన్స్" అన్నారాయన!

ఆ "నాన్సెన్స్" కి అర్థం నాకర్థం అవలేదు.

"ఈ నోటు చెల్లదన్న వెధవెవరు?" నోటు లాక్కొని పులి అడిగేరు.

హమ్మయ్య! ఆ మాట నేనల్లేదు.

పులినోటు పట్టుకొని దుకాణం దగ్గర కెళ్ళింది.

అంతవరకూ కొత్త కారుని చూస్తున్నట్టు చూస్తున్న షాపువాడు అందులోంచి దిగి తన దగ్గర కొచ్చిన "ఆయన" వేపు చూసేరు.

నోటు షాపువాడి మీదికి విసిరి "ఓ గోల్డ్‌ఫ్లేక్ ఫిల్టరు" అన్నారు దూది పులిలా నవ్వుతూ ఆయన.

ఆయన అడిగింది ఒక సిగరెట్టో, సిగరెట్టు పెట్టో తెలీని షాపు వాడు ఒక సిగరెట్టు పెట్టె, మిగతా డబ్బు యిచ్చి మేము అతన్ని వదిలేక నోటు పెట్టెలో పడేసుకున్నాడు.

**(యువ, దీపావళి 10.11.1977)**

# భూమి గుండ్రంగా వుంది

**అ**ది దేవాలయం కాదు. చర్చి కాదు.

మసీదు, మరిడమ్మ గుడి అంతకంటే కాదు.

అక్కడ దేవుడూ లేడు, పూజారీ లేడు.

అయినా చాలా మందికి మతంతో సంబంధం లేకుండా (వి)ముక్తి, మోక్షం దొరుకుతాయి. నాస్తికులతోసహా.

పోనీ కమ్యూనిస్టు కార్యాలయమా? ఛ! ఛ! అయితేనేం? అక్కడ కుబేరుడి ఎక్కువ, కుచేలుడికి తక్కువ లేదు (అనుకుంటారు).

మరైతే? ఏదైనా ఆశ్రమవాఁ? అమ్మమ్మ. ఎంతమాట? అక్కడ బాబాలు, అమ్మలు మచ్చుక్కూడా లేరు. కాని అక్కడికొచ్చే చాలామంది ఆడవాళ్ళకి ప్రసూతి వైరాగ్యం, ఆడ, మగ, యిద్దరికీ స్మశాన వైరాగ్యం వస్తాయి.

అది కోర్టూ, పోలీస్టేషనూ కాకపోయినా అక్కడికి పొలాలు కలిపేసుకున్న వాళూ, ఆడవాళ్ళని అమ్మేసిన వాళ్ళూ, ఖూనీ చేసినవాళ్ళూ అయిపోయినవాళ్ళూ, పన్నులు ఎగ్గొట్టినవాళ్ళూ, పళ్ళూడగొట్టించుకున్న వాళ్ళూ. ఇలా నానా గోత్రభ్యః వస్తారు.

పాపం. ఇళ్ళలో సరదాలు తీరనివాళ్ళు తీర్చుకోవడానికి అక్కడికి వచ్చినంత మాత్రాన అది లాడ్జింగు అనుకోవడం పొరపాటు.

ఏదీ కాకపోతే మరేవిటిది?

అది శ్రీశ్రీశ్రీ గర్నమెంటువారి (ధర్మ) ఆసుపత్రి.

ఒకప్పుడది జెంగాలపాలెం జమీందారుగారి లోగిలి. జమీలు ప్రభుత్వం తీసుకున్నప్పుడు, ఈ లోగిలి కూడా ప్రభుత్వం తీసుకొని, అంతవరకు పశువుల పాకలలో వున్న ఆసుపత్రిని యిక్కడికి మార్చి, దాన్ని ఆ జమిందారుగారి చేత ప్రారంభోత్సవం చేయించింది. ఆ తరువాత కొన్నాళ్ళకి ఆ జమిందారుగారు జబ్బుచేసి యిదే ఆసుపత్రిలో కాలంచేశారు. ఈ ఆసుపత్రిక పక్కనున్న ఏటిగట్టునే మట్టిలో కలిసిపోయింది వారి భౌతిక కాయం.

మహాత్ముల ఆత్మలైతే దేశాన్ని పట్టుకొని వేళ్ళాడుతాయి. ముష్టివెధల ఆత్మలైతే పట్టుకోవడానికేం వుండవు కనుక పిశాచాలై

తిరుగుతాయి. మధ్యతరగతి వారి ఆత్మలైతే కోరికలు తీరక దయ్యాలౌతాయి. కలవారి ఆత్మలైతే ఆస్తిని పట్టుకొని వేళ్ళాడు తాయి.

గవర్నమెంటు ఆస్థినైతే లాక్కోగలిగింది కాని ఆత్మని లాక్కో లేకపోయింది.

చావు దేహానికి గాని ఆస్థికి కాదు కదా.

అంచేత జమీందారుగారి ఆత్మ మాత్రం యిప్పటికీ ఆ ఆసుపత్రి వరండాలలో తిరుగుతూ వుంటుందని ప్రతీతి.

ఆ ఆసుపత్రిలో –

గదులు అగ్గిపెట్టెల్లాగానూ, వరండాలు సిగరెట్టు పెట్టెల్లాగాను ఉంటాయి. గదులలోనూ, వరండాలలోను కూడా ఓ పేరుమోసిన ఇనప కంపెనీ వారిచే తయారు చేయబడిన ఇనప మంచాలుంటాయి. ఆకంపెనీ ఏ పేరూ మెయ్యని ముఖ్యమంత్రిగారి మేనకోడలి మొగుడుగారిది. ఆ మంచాల మీద కోనసీమ కొబ్బరిపీచుతో తయారైన పరుపులున్నాయి.

హెల్త్ మినిష్టరుగారిది కోనసీమ కాదు. ఆయన భార్యదీ రాయలసీమే. కోనసీమ ఆయన మాజీ ప్రేయసిది.

ఆ పరుపులపైన పేషెంట్లూ, కింద నల్లులూ కలిసే కాపురం చేస్తారు. ఆ ఆస్పత్రిలోని నల్లులకీ, దోమలకీ కూడా భూతదయ ఎక్కువ. పగలంతా జబ్బుతో బాధపడిన పేషెంట్లని రాత్రివేళ్ళ దోమల సంగీతంతో నల్లులు నాట్యం చేసి ఎంటర్‌టైన్ చేస్తాయి. పొద్దునే పలకరించే హెడ్ నర్సుకి గుడ్‌మార్నింగ్ చెప్పికాని వెళ్ళవు. రాత్రి నిద్ర పట్టలేదని ఏ పేషెంటు కంప్లైంట్ చేసినా, మరోసారి ఆలోచించకుండా ఓ దబ్బలంలాంటి సూదితో ఆవదం లాంటి మందు ఎక్కిస్తాడు కాంపౌండర్. కారాణాలతో అతనికి నిమిత్తం లేదు. అంచేత అక్కడ పేషెంట్లు తెల్లవార్లూ కంటిమీద రెప్పవెయ్యకపోయినా, పగలు మాత్రం కునికిపాట్లు పడరు.

ఏడ్చే పేషెంట్లని అప్పుడప్పుడు నవ్వించడానికి నవ్వే డాక్టర్లని ఎప్పుడూ కవ్వించడానికి తెల్లగౌన్లలో నల్ల నర్సులు కొందరు అటూ ఇటూ హడావిడిగా తిరుగుతూ వుంటారు. ఆ గౌన్లని గేర్‌లో పెట్టడానికే అన్నట్లు ఎప్పుడూ డీసెలింజన్లా అరుస్తూ వుంటుంది. ఓ లేలాండు లారీ లాంటి హెడ్ నర్సు. ఆవిడ కూర్చుంటే లేవ లేదు. లేస్తే నడవలేదు. అంచేత ఎప్పుడూ అలా మిరపకాయతిన్న కాకిలా అరుస్తూ వుంటుంది.

ఆ హాస్పిటల్ కాంపౌండులో బాగా పెరిగిన అశోక వృక్షాలు న్నాయి. జమిందారు దగ్గర ఉద్యోగం చేసిన మనిషి వంగినా, రీవి కుంగని ముసలి దివాన్లా దర్జాగానూ, దిట్టంగానూ వుంటాయి అవి. అవీ జమిందారుగారి కొలువులోవే మరి. ఆ ఆసుపత్రికి నలుగురో, ఆరుగురో తోటీలున్నారు.

వాళ్ళకడుపునిండా సారా వుంటుంది.

కళ్ళనిండా దైన్యం వుంటుంది.

నోటినిండా బూతులుంటాయి.

వాళ్ళెప్పుడూ ఆ చెట్లకిందే వుంటారు.

మందులుంటే పెట్టకోవడానికి ఒక స్టోర్ రూము నిండా ఖాళీ బీరువాలుంటాయి. ఆ బీరువాల లోపల పైన కొన్ని సంవత్సరాల దుమ్ముంది. ఆ దుమ్ము, బీరువాలు ఎవరూ ఎత్తుకు పోకుండా కాపలాకి ఓ స్టోర్ కీపరు వుంటాడు. ఇవికాక అయిదేళ్ళ నుంచి పనిచెయ్యని ఒక ఎక్స్‌రే ప్లేంటు దాన్నెవరూ ముట్టుకోకుండా చూడ్డానికి ఒక రేడియాలజిస్టు కూడా వున్నారు.

అల్లప్పుడెప్పుడో ఓసారి ఎవరో మంత్రిగారు ఆ వూరు కేంపు చేశారు. మంత్రులు కేంప్ చెయ్యడంలో వింత, విశేషం ఏం లేవు. వచ్చిన ఉపద్రవం అంతా ఆ మంత్రిగారి వేలుమీద వేపకాయంత కురుపు అయి నప్పుడే. సాధారణంగా అన్ని కురుపులూ సలుపుతాయి. అందులోనూ మంత్రిగారి కురుపు మరీను. రాచరికం పోయినా ఈ రోజులలో రాచకురుపు తరువాత అంత గొప్పది మరి మంత్రికురుపే! మరింక ఆ కురుపు సలుపుకి పుర పెద్దలంతా తుఫానుగాలికి గడ్డిపరకల్లా గజ గజ వణికి పోయేరు. కాని పుర ప్రముఖులు వణికినంత మాత్రాన కురుపులు సలుపు మానవు. అందువల్ల అప్పటికప్పుడు ఆ కురుపుకి ఎమర్జెన్సీ సర్జరీ చేయించేరు. ఆపరేషనంతా కలిపి మొత్తం అయిదు విఘడియలు పట్టింది. అయితేనేం, డాక్టరుకి, మంత్రిగారికి ఒకరికి భయంతోను, మరొకరికి బాధతోను చవటలు పట్టేశేయి. ఆఫ్‌కోర్స్. ఆ తరువాత మరో రెండ్రోజులు మంత్రిగారు యిన్‌పేషెంటుగా వుండి సుఖులై వెళ్ళిపోయేరు. ఎలక్షన్లకి ముందు ఋణశేషం, ఆ తరువాత శత్రుశేషం వుండనివ్వ కూడదన్న సిద్ధాంతం అయినది. అంచేత ఆయన పోతూ ఆయన ఆ ఆపరేషను థియేటరుకి రెండు ఎయిర్‌కూలర్లు సేంక్షను చేసి మరీ పోయేరు.

అక్కడ ఆపరేషను చేసేటప్పుడు పేషెంటుకీ, డాక్టరుకీ కూడా చల్లగానే వుంటుంది. ఎటొచ్చీ అక్కడ కురుపులు కలగడం మినహా సర్జరీ జరగదు.

అందుక్కారణం అక్కడ సర్జను లేకా కాదు. పేషెంట్లు దొరక్కా కాదు.

నిజానికి జగన్నాథం ఒక్కప్పుడు మంచి సర్జను. ఇప్పుడతను మంచి సర్జనో కాదో చెప్పడం కష్టం. ఎంచేతంటే ఈ వూరొచ్చేక గెడ్డం గీసుకున్నప్పుడు తప్ప బ్లేడు కూడా ముట్టుకోలేదు.

ఎంచేత?

అతని భాషలో చెప్పాలంటే కూరొండుకు తినడానికి కత్తిపీట, మూకుడు వుంటే చాలదు. తరగడానికో కాకరకాయో, బీర కాయో, నూనె, వగైరాల ఇతర సరుకులు వుండాలి. సర్జరీ కూడా అంతే. పేషెంటు డాక్టరు వుంటే సరిపోదు. మందులు, ఇంజక్షన్లు, ఆక్సిజను, సెలైన్, బ్లడ్ వగైరా చాలా చాలా వుండాలి. సిరంజిలో మందు, సిలెండర్లలో ఆక్సిజను, కళ్లు తుడవటానికైనా కాటన్ యివేవీ మా దగ్గర ఉండవు. జబ్బుతో పాటు పేషెంటు యివి కూడా తెచ్చుకుంటే వైద్యం చెయ్యడానికి మాకేం అభ్యం తరం వుండదు. పైకి రాసి తెప్పించుకోకూడదా అంటారు మీలాంటి పెద్ద మనుషులు. పైకి అనే పదార్థం ఎక్కుడుందో ఆ పైవాడెవడో పరమాత్మకే తెలియాలి. అప్పటికీ రీముల కొద్దీ రిక్వెస్టులు రాస్తూనే వుంటాం. వినే నాదుడేడీ! ఆఖరికి అనాథా శ్రమం నయం మా హాస్పిటల్సు కంటే. వాటికో మేనేజరంటూ తగలడతాడు. ఏ నాథుడూలేని అనాథాశ్రమం ప్రభుత్వ ఆసుపత్రి.

ఎప్పుడూ గ్రాంట్సు వుండవు. వున్నవి మా వరకు రావు. అసలి లాంటి హాస్పిటల్స్ నడపటానికి మేము ఆరేళ్ళు, ప్రభుత్వం అరవై వేలు ఖర్చు పెట్టనక్కరల్లేదు. ఏమందుల షాపువాడ్నో, మళయాళ మాంత్రికుడ్నో... అని అరనిమిషం ఆగి మళ్ళీ ప్రారంభిస్తాడు.

నాకసలు ఈ హాస్పిటల్స్, ఈ వైద్యం, మా చదువులు తల్చు కుంటే రక్తం వుడికిపోతుంది. నేను ఇక్కడికి వచ్చిన కొత్తల్లో ఈ హాస్పిటల్ ఎడ్మినిస్ట్రేషన్ చూచి భయం వేసింది.

కాంపౌండర్లు స్వంతంగా, స్వతంత్రంగా వైద్యం చేస్తు న్నారు.

ఆయాలే పురుళ్ళు పోసేస్తున్నారు.

డ్యూటీలో కూడా పీకల వరకు నాటు సారా పట్టేసిన తోటీలు, పేషెంట్లని బైటకి యిడ్చేవారు. పేషెంట్లు భయంతో ఊపిరి ఆపేసి గుడ్లు తేలేసేవారు. కొత్తలో స్టెత్ పెడితేగాని తెలిసేది కాదు. వాళ్ళు యీడ్చేది శవాన్ని కాదని, మా హాస్పిటల్లో పేషెంట్లని ఎక్జామిన్ చెయ్యడాని కన్నా డెత్ సర్టిఫికెట్కి స్టెత్ చాలా అవసరం.

వీళ్ళందర్నీ ఎలా కంట్రోల్ చెయ్యాలో అర్థం కాలేదు. వాళ్ళకి స్థానబలం వుంది. పైగా మా డి.ఎమ్.ఎస్. చిన్నప్పుడు అయిదో క్లాసు వరకు ఆ వూరి స్టూడెంటుట. మరింక, ఆడవిలో అమ్మా అంటే ఎవడికి పుట్టేవురా కొడుకా? అని నా మాట ఎవరు వింటారు? అంచేత పరిస్థితుల్తోను, మనుషుల్తోను రాజీపడ్డం నేర్చుకున్నారు.

మీకో చిన్న యిన్సిడెంటు చెప్పి ఆపేస్తాను.

ఆ వేళ

అప్పటికి నేను చార్జి తీసుకొని వారం అయిందేమో.

వరండాలో పేషెంట్లను లైనుగా నిల్చోపెట్టి యింజక్షను పొడిచేస్తున్నాడు కాంపౌండరు. ఒక్కసారే సిరంజి బోయల్ చెయ్యడం. నిండా మందెక్కించడం. వరసగా పొడిచేడం.

నాకు ఆశ్చర్యం వేసింది. వీడికి యింతముందు ఎలా వచ్చిందీ అనీ, అక్కడసలు ఏ మందూ పది డోసులు దాటి వుండదు.

"అందరికీ యింజెక్షన్లు యివ్వమని ఎవ్వరు చెప్పేరు నీకు? అసలంత మందెక్కడిదీ?" అని నిలదీశెను. మనిషంటే వాడే. తొణకలేదు, బెణకలేదు మానవుడు. "మీరు రూమ్లో వుండండి సార్. ఇదిగో అయిపోయింది. పది నిమిషాల్లో వచ్చేస్తాను" అన్నాడు చంటిపిల్లాడ్ని నువ్వు పోయి ఆడుకో అన్నంత తేలిగ్గా.

ఏఁవి ఁబేహద్దీ! ఆశ్చర్యంతో బక్కచిక్కిపోయాను.

పది నిమిషాల్లో కాకుండా అయిదు నిమిషాల్లోనే వచ్చేశాడు. నేనేం మాట్లాడలేదు. అసలేం మాట్లాడాలని పించలేదు.

అతనే "టాబ్లెట్స్ యిస్తే ఏ పేషెంటు వప్పుకోదు సార్. ప్రతి వాడికీ సూదిమందు కావాలి. మనం టాబ్లెట్స్ యిచ్చినా అని పారేసి, మరోచోట యింజక్షను తీసుకుంటారు..."

వీడి బతుక్కి సైకియాట్రీ కూడా మాట్లాడుతున్నాడు.

"..... ఇదివరకు డాక్టరుగారున్నప్పుడూ యిలాగే చేసే వాళ్ళం" అంటూ యిందాకటి ప్రశ్నకి సమాధానం చెప్పేడు.

ఏంవిటి వీడి ఉద్దేశం? పాత డాక్టరు ఏం చేస్తే నేనూ అదే చెయ్యాలా? ఇలాంటి పనులు చేయించబట్టే టెలిగ్రాం మీద ట్రాన్సఫరై పోయాడు.

"సరే. అదలా వుంచు. అంత మందెక్కడిది? ఎంత వద్దను కున్నా నాకు తెలీకుండానే నా గొంతుక కఠినంగా వుంది.

ఇలాంటివాటికి బెదిరే ఘటమా? నా అజ్ఞానానికి వాడికి నవ్వొచ్చినట్టుంది. కాని పై ఆఫీసరు దగ్గర నవ్వకూడదన్న సంగతి వాడికి తెలుసు. వాడి తెలివితేటల్ని మనవేం శంకించ నక్కర్లేదు.

అర్జునుడికి గీతోపదేశం చేస్తున్న కృష్ణుడి పోజుపెట్టి "ఏవుంది సార్. మంది ఎక్కువైతే పల్చన" అని అతి సింపిల్ మందోపదేశం చేశాడు.

గీతోపదేశం తరువాత అర్జునుడిలాగే నాకూ యుద్ధం చెయ్యా లనిపించింది వాడితో. కాని వాడికా వూర్లో ప్రైవేటుగా ప్రాక్టీసు, పబ్లిగ్గా పలుకుబడి చాలా వున్నాయి. వాడితో గనుక నేను యుద్ధంచేస్తే మాక్సిమమ్ నేను వాడ్ని ఓ రెండు లెంపకాయలు కొడ్తాను. లేకపోతే నాలుగు తిట్లు తిడతాను. కాని వాడు నా కాళ్ళు విరిచేసి, నా పీక కోసేసి నా చేతిలో పెట్టి పంపించేస్తాడు. వాడ్ని చూసిన ఎవరికైనా కట్లపాము గుర్తొస్తుంది. వాడు ఎప్పుడు నవ్వినా నవ్వు చివర చిటికెడు విషం కనిపిస్తుంది.

అంచేత నెమ్మదిగా నచ్చ చెప్పెను.

"చూడు సుందర్రావ్! నీ పేరు సుందర్రావేనా? ... నువ్విలా చెయ్యడం వల్ల ఎవరికైనా ఏమాత్రం లాభం వుంటుందటావా? అవును. నిజమేఁ మనదగ్గర మందులు స్టాకు వుండదు. వాళ్ళేమో కొనుక్కోలేరు. ఐ. ఎగ్రీ. నేను కాదనను. కాని యిలా మందంతా మంచినీళ్ళు కలిపేస్తే అదేదో డిస్టిల్డ్ వాటరే – ఒక్కడూ బాగుపడడు. మనకీ చెడ్డపేరు. అంచేత నేనో ఉపాయం చెప్తాను. మాటవరసకి మనదగ్గర పెన్సిలిన్ పది డోసులే వుంద నుకో..."

"పది ఎప్పుడూ వుండద్సార్. ఎనిమిదో, తొమ్మిదో..." మాటకి అడ్డొచ్చేడు.

"మాటకి అడ్డు రాకురా హరిశ్చంద్రా" అన్నమాట నోటి చివరే ఆగిపోయింది. "మాటవరసకి అనుకో, అప్పుడు ఒక ఎని మిది మందికో, తొమ్మిది మందికో పెన్సిలినే యిచ్చేయ్. ఏదీ కలపకు. మరింక ఆ మిగిలిన ఒకటి, రెండు డోసులు ఏది, ఎంత కలుపుతావో నీ ఓపిక అలా అయితే కనీసం వో ఎనిమిది మందైనా బాగుపడతారు. అన్నట్టు సిరంజి కూడా అప్పుడప్పుడు బోయల్ చేస్తూ వుండు" నెమ్మదిగానే నచ్చచెప్పేను.

అంతా విన్నాక వాడు అవునన్లేదు కాదన్లేదు. "ఫరవా లేదు. పనికొస్తావు" అన్న ఎంకరేజింగ్ చూపొకటి నా వేపు విసిరి వెళ్ళిపోయాడు.

(కాని వాడు నిజంగా పేషెంట్ల కిచ్చేది ఆ ఒకటి, రెండు డోసులేనని, మిగిలినవి వాడి ప్రైవేట్ ప్రాక్టీసు నిమిత్తం నడిచి వెళ్ళిపోతున్నాయన్న నిజం జగన్నాథానికి తెలీదు. తెలిసుంటే వాడ్నీపాటికి చంపేసి జైలుకో, తన అంతరాత్మని చంపుకోలేక రిజైన్ చేసి ఇంటికో వెళ్ళి పోయుండేవాడు).

ఎప్పుడైనా, ఎవడైనా జబ్బు తగ్గి నన్ను దేవుడనీ, ధర్మప్రభు వనీ దణ్ణాలు పెడితే, నాకు నవ్వాలో, ఏడవాలో తెలీక ఓ వేదాంతనవు నవ్వు నవ్వుతాను. అసలు దగ్గు, జలుబు, జ్వరం, తలనొప్పి వగైరాలు వాటంతటవే తగ్గిపోతాయి. మా క్రెడిట్ ఏవీ వుండదు. అసలు ఈ ప్రిన్సిపల్ మీదే గవర్నమెంటు హాస్పి టల్స్ నడుస్తాయి. ఏ జబ్బైనా ముందు పెంచేసి తరువాత ఇన్‌స్టాల్‌మెంట్ బేసిస్ మీద తగ్గించాలి అన్న పాలసీ మీద ప్రైవేటు హాస్పిటల్స్ నడుస్తాయి. ఇదీ వైద్యాంతసారం.

జగన్నాథం టేబిలు మీద ఒక కాలింగు బెల్లు, నాలుగు అట్ట పెట్టెలూ వుంటాయి. అందులోరెండు పెట్లల్లో ఎ.పి.సి టాబ్లెట్లు, మరో రెంటిలో ఎ.బి.సి టాబ్లెట్లు (విటమిన్లు) ఉంటాయి. ఎప్పుడయినా వాటిలో ఏదయినా ఖాళీ అయితే పని ఆగి పోకుండా వుండడానికి మిగిలిన వాటిలోంచి అప్పు తీసుకొని సర్దేస్తారు. బెల్లు ఒకసారినొక్కితే "అయ్యా" అంటూ వస్తుంది. రెండు సార్లు నొక్కితే, "అమ్మా, బాబూ" అంటూ పేషెంటు వస్తాడు. కంటిన్యూస్‌గా నొక్కితే కాంపౌండ రొస్తాడు. క్యాబాత్‌హై అన్న మొహం పెట్టి.

ఎప్పుడు చూసినా అక్కడ పేషెంట్ల క్యూ తెలుగు సినిమా రిలీజయిన్నాడు నేల బుకింగులా అతి రద్దీగా వుంటుంది. ఎంత స్పీడుగా కేసులు డిస్పోజ్ చేసినా అదంతే. పేషెంటు ఊరు, పేరు వగైరాలు కనుక్కొని చిత్రగుప్తుడి చిట్టాలాంటి ఓ.పి రిజి స్టరులో ఎంటర్ చేసి, వాటిని మళ్ళీ సినిమా టిక్కెట్టంత చిన్న కాయితం ముక్క మీద ఎక్కించి, దాని మొహాన ఓ నెంబరు

వేసి, దాన్ని పేషెంటు చేతిలో పెట్టే సరికి పరుగెత్తి నట్టుచేసినా పది నిమిషాలు పడుతుంది. ఏ మందివ్వాలో ఆలోచించడానికి మరో పావు నిమిషం, వెరసి ఒక్కొక్క పేషెంటుకి పదకొండు నిమిషాలు పడుతుంది. ఆ రేటున ఐదోవంతు క్యూ కూడా అవదు రోజుకి. మిగిలిన వాళ్లంతా మర్నాడు రావలసిందే.

సాధారణంగా డాక్టరు కుర్చీమీద నుండి లేవాల్సిన అవసరం ఎప్పుడో కాని రాదు. పేషెంటుని కళ్ళతోనే పరీక్ష చేసి, అప్పు డప్పుడు రెండు ప్రశ్నలడిగి, ఎపుడయినా వాడు చెప్పే మాటలు వింటాడు. ఆ తరువాత తన కబంధ హస్తాన్ని టేబిలు మీదకు చాపి ఏ పెట్టె అందితే అందులో మాత్రలు తీసి ఇస్తాడు లెక్కపెట్టి మరీ.

ఆ ఆస్పత్రిలో జగన్నాథం కాక ఒక లేడీ డాక్టరు కూడా వుంది.

ఆమె పేరు రుక్మిణీబాయి. చదువుకునే రోజుల్లో ఆవిణ్ణి మగ పిల్లలు ముద్దుగా రుక్మిణీ బోయ్ అని పిలుచుకునే వారు. ఆవిడ ఛెస్ట్ వింబుల్డన్ టెన్నిస్ కోర్టులా వుంటుంది. కడుపు ఎప్పుడు చూసినా ఆరోనెలా అనేటట్టు వుంటుంది. ఎత్తుగా ఉండాల్సిన చోట పల్లంగాను, పల్లంగా వుండాల్సిన చోట ఎత్తు గాను ఉండి, మొత్తానికి ఎత్తు పల్లాలతో గమ్మత్తుగా వుంటుంది. ఆవిడ ఎత్తు మనిషని కూడా ప్రతీతి. తన కూతుర్ని డాక్టర్ను చేస్తానని ఒట్టు పెట్టించుకుని మరీ కన్నది ఆవిడ్ని ఆవిడ తల్లి. ఆవిడికి ఆశ, ఆశయం మాత్రం మరో డాక్టర్ను చేపట్టాలని. ఆ ఆశ ఆవిడకి ముప్పై ఐదేళ్ళు నిండినా ఆశగానే మిగిలి పోయింది. అయినా ఆవిడింతవరకు ఏ డాక్టర్నీ చేపట్టలేక పోయింది. అందుక్కారణం నలుగురూ పదిరకాలుగా చెప్పుకుంటారు.

ఆవిడ ఎమ్‌బిబిఎస్‌లో ఏ పుస్తకమూ రెండోసారి చదువ లేదు. మొదటిసారీ చదవలేదు. అయినా ఆవిడ ఎక్కడా ఏ పార్టూ తప్పలేదు. తప్పకపోవడం ఆవిడ తప్పు కాదు. ఆవిడ తండ్రి ప్రస్తుత ప్రొఫెసరు గారు. తాత మాజీ మంత్రి గారు కలిసి ఆవిడ్ని ఎక్కడా తప్పనివ్వలేదు. ఆ సంగతి తెలీని ఇ.ఎన్.టి ప్రొఫెసరొకసారి ఆవిడ్ని అకస్మాత్తుగా తప్పించేస్తే యూనివర్శిటీ వారు ఆసారి పదిమార్కులు మోడరషన్లో వేసి ఆవిడతో పాటు మరో ఇరవై మందిని కూడా పాస్ చేశారు. ఇలాంటి చిన్న చిన్న విషయాలు ఆవిడసలు పట్టించుకునేది కాదు. ఆవిడ మెడికల్ కాలేజీలో చేరినప్పటి నుంచి తన్నెగరేసుకుపోయే కృష్ణమూర్తి కోసం వెదకడంతోనే సరిపోయింది. ఆవిడ కలలపంట ఎక్కడా కనిపించలేదు సరి కదా కనీసం మెడిసిన్ పధ్నాలుగుసారులో, పదహారు సారులో దండయాత్ర చేసిన గజనీ, ఘోరీ మహా మ్మదులు కూడా ఆవిడకి దొరకలేదు.

చదువైపోయిన వెంటనే తాతగారి తొందరపాటు వల్ల ఉద్యోగం కూడా వచ్చింది. తండ్రి డిగ్రీని, తాత ఉద్యోగాన్ని యిప్పించగలిగారు కాని ఆవిడ బదులు పనెవ్వరూ చేయలేరు. అంచేత ఆవిడ హాస్పిటల్లో ఉన్నంత సేపూ నొప్పులు పడుతున్న పెద్దపులిలా వుంటుంది.

ఆ హాస్పిటల్లో పురుళ్ళ కేసులు బాగానే వుంటాయి. ఇంత కాలానికి మనకో లేడీ డాక్టరొచ్చింది. మరింక పురుళ్ళు పరపర పోసేయొచ్చు అనుకున్నారు అక్కడి స్టాఫంతా.

ఆవిడ ఆ వూరొచ్చిన కొత్తలో....

ఆవేళ ఆదివారం కనకమ్మ అనే ఓ కలవారమ్మాయి కనడాని కొచ్చింది. పొద్దుటనగా వచ్చిన ఆవిడకి అర్ధరాత్రి కిగాని అందు కోలేదు నొప్పులు. అప్పటికి చాలాసార్లు నొప్పులు వచ్చి తగ్గి పోయాయి. కానీ యిప్పుడలా కాదు. నొప్పులు కొంచెం ఎక్కువ య్యేయి. ఆవిడ చుట్టూ చేరిన వాళ్ళు హడావిడిగా తిరిగేస్తు న్నారు. డాక్టరమ్మని పిలవమంటూ. ఓ అరవైసార్లు పిలిపించు కున్నాక "చూడండీ, నొప్పులు మరీ ఎక్కువైతే పిలవండి" స్టైయిలిష్‌గా అని హైహీల్స్ టకటకటలాడించుకుంటూ వెళ్ళి పోయిందావిడ.

ఆ అమ్మాయి అసలే చిన్నపిల్ల. పైగా మూడు తరాలకి ఒక్కర్తే అమ్మాయి. బూరుగుదూది పరుపుల మీదే పెరిగింది. అంచేత ఆస్పత్రి ఎగిరిపోయేటట్లు అరిచేస్తోంది. ఆ అమ్మాయి అరుపులకి వాళ్ళ వాళ్ళంతా భయపడిపోయి మరోసారి డాక్ట రమ్మని తీసుకు రమ్మని గోల ప్రారంభించారు.

"ఇంకా టైము కాలేదు. టైము వస్తే మేమే పిలుస్తాం. మీ అమ్మాయిని ఓర్చుకోమనండి" అన్నారు నర్సులు. వాళ్ళు విన లేదు. పైగా వాళ్ళమ్మాయికి ఓర్పు తక్కువన్నందుకు నొచ్చు కున్నారు. "గొడ్రాలికేం తెలుసు బిడ్డ నొప్పులని మా పిల్ల బాధ మీకేం తెలుస్తుంది" అని బాహాటంగానే విసుక్కున్నారు, నర్సు లంతా గొడ్డువాళ్ళయినట్టు. కేవలం వాళ్ళ గోల భరించలేక డాక్టరమ్మని పిలవక తప్పలేదు. ఎందుకు అప్పుడే పిలిచారని తిడుతుందేమోనని భయప డుతూనే. వాళ్ళ భయం అర్థంలేనిది.

ఎంచేతంటే యింకా టైము పడుతుందన్న సంగతి ఆవిడకీ తెలియదు.

ఆ అమ్మాయికిదే తొలి కానుపు.

పాపం డాక్టరమ్మకి అంతే.

అంచేత అ అమ్మాయి కేకలకి ఆవిడకి చాలా కోపం వచ్చింది. ఆవిడ వస్తూనే చాలా హడావిడి చేసింది. ఆ తరువాత యింకేం చెయ్యాలో అర్థం కాలేదు.

యిలోగా కడుపులో పిల్లకి బైటకి రావాలని బుద్ధి పుట్టింది. కాని తల్లి వేసే కేకలకే భయపడిందో, డాక్టరమ్మ హడావుడికే బెదిరిపోయిందో కాని తొంగిచూసి లోపలికి పారిపోవడం ప్రారంభించింది. ఆలా ఆ పిల్ల డాక్టరమ్మ చాలాసేపు దోబూచులాడుకున్నాక పిల్ల కేమనిపించిందో కాని డాక్టరమ్మకి మాత్రం ఫోర్సెప్స్ వెయ్యాలనిపించింది. కాని ఫోర్సెప్స్ ఫోటోలో చూడ్డమే తప్ప ఏ బ్లేడు ఎలా పట్టుకోవాలో తెలీదే. అంచేత ఈసారి పిల్ల తొంగి చూసి నప్పుడు దాని పిలకపట్టుకుని లాగడానికే నిశ్చయించుకుందావిడ, అప్పటికే నర్సులు భయపడుతూనే ఇంకా సేపు చూద్దాం మేడమ్ అన్నారు.

నాన్సెన్స్ నర్సులా నాకు చెప్పేది. అన్నట్టోసారి చూసి పిల్లని పిలక పట్టుకొని లాగడం ప్రారంభించింది.

పిల్లకీ, డాక్టరుకి మధ్య టగ్ ఆఫ్ వార్ హోరా హోరీగా సాగింది.

చివరికి డాక్టరమ్మే గెలిచింది.

పిల్ల తలమీద మాత్రం గుమ్మిడికాయంత బొప్పి కట్టింది. మరోసారి...

ఒకావిడ పిల్ల తల మాత్రం బయటకి వచ్చి మిగిలినది రానంది. అప్పుడు కూడా డాక్టరమ్మ గారు ఆ పిల్ల పీక పట్టుకొని గుంజగా, గుంజగా పిల్ల తాప్పని వచ్చేసింది. ఆ గుంజడంలో పిల్లకి ప్రాణం, డాక్టరమ్మకి ఓపిక పోయాయి.

యిలా వరుసగా పిల్లలు బలైపోడం చూసి అక్కడి నర్సులకి భయమేసింది. అప్పటి నుంచి మామూలు పురుళ్ళన్నీ నర్సులే కానిచ్చేస్తున్నారు. కొంచెం అటూ ఇటూ అయితే జగన్నాథం చెయ్యి చేసుకుంటాడు.

యిదీ ఆ హాస్పిటల్ వాతావరణం.

## 2

ఆ వేళ జగన్నాథం ఓ.పి.లో వున్నాడు.

ఆడవాళ్ళ అరుపుల్తో, చంటిపిల్లల ఏడుపుల్తో రణరంగంలా వుంది.

"ఏమిటమ్మా నీ బాధ?"

ఊం!! ఓ మూడు నిలువుల నిట్టూర్పు.

"తరువాత నిట్టూర్చుదువు కాని ముందు జబ్బేవిటో చెప్పు".

"ఒకటేవిటండి, గుండెలలో పోటు, కాళ్ళ పీకు, రెండడుగులు వేస్తే ఆయాసం, కడుపులో నొప్పి, తలనొప్పి..." ఆవిడ చెప్తూనే వుంది.

జగన్నాథం చకచక ఒక కాయితం మీద ఏదో రాసి చెయ్యి లేబిలు మీదకు చాపి అందిన టాబ్లెట్లు ఓ అరడజను తీసి చూడమ్మా యివి పూటకి ఒకటి చొప్పున రోజుకి రెండుసార్లు రెండ్రోజులు వేసుకో. అదే తగ్గి పోతుంది. భయపడాల్సిన జబ్బేం లేదు. నాలుగు టాబ్లెట్లు ఆవిడకిచ్చి రెండు మళ్ళీ అట్టపెట్టెలోకి విసిరేసేడు. నీకు ఒళ్ళంతా డబ్బే కాని జబ్బు లేదనుకుంటూ.

ఆవిడకి చేతులకి మణికట్టు మొదలు మోచేతివరకు బంగారు గాజులున్నాయి. మెడనుంచి భుజం వరకు రకరకాల గొలుసులున్నాయి. ఆవిడ్ని ఆ పళంగా ఎత్తుకెళ్ళి అమ్మేస్తే అరవై కిలోల బంగారం, నూరు కిలోల మాంసం వస్తాయి.

తనకేదో పెద్ద జబ్బు వుందంటారని వచ్చిన ఆవిడకి ఆశా భంగం కలిగినా ఏదో జబ్బు వున్నందుకావిడ సంతోషించింది. వెళ్ళబోయిన ఆవిడ మళ్ళీ ఏదో జ్ఞాపకం వచ్చి "అన్నం తినమంటారా?" అంది. "తినొద్దు" అంటా దన్న ఆశతో.

"అన్నీ తినొచ్చు" అని "మనుషుల్ని తప్ప" అనబోయి మానేశాడు.

ఆవిడ మళ్ళీ ఏదో అడగబోయేటంతలో జగన్నాథం రెండుసార్లు బెల్ నొక్కగానే మరో పేషెంటు రావడం వల్ల బైటికి వెళ్ళక తప్పలేదు.

"ఏవిటమ్మా నీ బాధ?"

ఆవిడ జాలిగా చూసింది.

జగన్నాథం తలొంచుకొని ఏదో రాసుకుంటున్నందు వల్ల ఆవిడ జాలిచూపు అతనికన్పించలేదు.

"ఏవిటి తల్లీ నీ బాధ?"

"రాత్రిపూట ఒకటే బాధండి, మరండి... అరికాళ్ళ మంట, గుండెలలో మంట, కళ్ళ మంట...."

"నీ ఒంట్లో అగ్నిపర్వతం వుందేవిటి తల్లీ!" అనుకున్నాడు జగన్నాథం. సాధారణంగా కొంచెం అటూ ఇటుగా ఆడ వాళ్ళకొచ్చే జబ్బులన్నీ ఒకటే. వాటన్నిటికీ ఒకటే మందు. ఓ పేజీ సానుభూతి. ఓ నిద్రమాత్ర.

"ఏం పరవాలేదమ్మా, ఈ మాత్ర పడుకోబోయేటప్పుడు వేసుకొని పడుకో, రేపుకూడా వుంటే యింకోటి వేసుకో" అని కుడిచేత్తో రాసుకుంటూనే ఎడంచేత్తో అందిన టాబ్లెట్లు రెండు తీసి ఇచ్చాడు.

ఆవిడ ఆశ్చర్యపోయింది. "ఇన్ని జబ్బులకీ ఒక్క మాత్రా?"

ఆవిడ వెళ్ళగానే యిందాకటి ఆవిడ తలుపు తోసుకొని మళ్ళీ వచ్చింది. "డాక్టరు గారూ యిందాక చెప్పడం మర్చి పోయాను. ఆవిడలాగే నాకూ ఒకటే అరికాళ్ళ మంటలండి." అంటూ స్టూలు మీద కూర్చోబోయింది.

జగన్నాథం అరికాలిమంట నెత్తికెక్కింది.

"చూడమ్మా, యిందాక ఇచ్చిన మాత్రలకి అరికాళ్ళ మంట కూడా తగ్గుతుంది" అన్నాడు.

ఆవిడ తరువాత వచ్చినవాడు ఒక ముసలతను. ఎము కలు తీసి తూస్తే ఏడు పౌన్లుంటాయి. కేవలం ఎముక తొక్కతో అతనొక ఎండిపోయిన చెట్టులాగున్నాడు. అతని చర్మం కూడా బెరడులాగా వుంది. అతను వస్తూనే బల్లఎక్కి పడుకున్నాడు. తనని ఎగ్జామిన్ చెయ్యక తప్పదన్నట్టు.

"ఎక్కడ నొప్పి?"

"కపుడునొప్పి బాబూ. కిరకిరలాడిపోతున్నాను."

అంతవరకు అలవాటుగా కడుపునొక్కి చూస్తున్న జగన్నా థానికి అకస్మాత్తుగా తట్టింది యింతవరకు స్టెత్ పెట్టలేదని.

పేషెంటు ఏదైనా క్షమిస్తాడు కాని స్టెత్ పెట్టని డాక్టర్ని మాత్రం కాదు.

"నొప్పి అన్నం తినకముందు వస్తుందా? తిన్నాక వస్తుందా?"

"డాక్టరు ధర్మారావుగారొచ్చేరండి. అంటూ వచ్చేడు కాం పౌండరు.

"లోపలికి రమ్మను" అని సమాధానం చెప్పి, నొప్పి అన్నం తిన్నాక వస్తుందా? తినకముందా? మళ్ళీ అడిగేడు.

"అన్నం తిని నాల్రోజులైందండి"

"చూడు బాబూ, నీక్కావలసింది మందు కాదు అన్నం"

"అంచేతేనండి తవరికాడికొచ్చేను. తవరు నన్ను ఆసుపత్రిల్లో సేర్చుకొని అన్నం పెట్టించండి."

"జబ్బుతో చేర్చుకున్న వాళ్ళకే అన్నం లేదు. నీకెక్కడిది? ఫో. పోయి ఎలాగో యింత అన్నంతిను" అంటూ కుర్చీ మీద కూర్చున్నాడు. అప్పటికే డాక్టరు ధర్మారావు కూర్చుని వున్నాడు. అతను ఒకప్పుడు గవర్నమెంటు సర్వీసు చేసి, రిజైన్ చేసి, పక్కనే వున్న పల్లెటూర్లో ప్రైవుటు ప్రాక్టీసు పెట్టేడు.

"బాబూ! కనికరించండి. దిక్కులేనోడ్ని, ముసిలోడ్ని. దరమ రాజులాటోరు. పిడికెడు అన్నం పెట్టించండి" అని ఏడుస్తూ జగన్నాథం కాళ్ళు పట్టుకున్నాడు ఆ ముసలాడు.

జగన్నాథానికి కిదంతా ఆక్వర్డుగా వుంది. లేవయ్యా లే. లే అంటూ కాళ్ళు వెనక్కి లాక్కుని, జేబులు తడువుకున్నాడు. పోనీ వాడికేమైనా ఇవ్వగలనేమోనని. ఒక సిగరెట్టు పెట్టె, అగ్గి పెట్టె, మొన్నటి సినిమా టిక్కెట్టు ముక్కలు, సగం తిన్న వక్కపొడి పొట్లం దొరికేయి. ఇవేవీ వాడికి అన్నం పెట్టవు.

ధర్మారావుకి ఇలాంటివి కొత్తకావు. పైగా అతను ఇలాంటి వాటికి చలించేటంత సెన్సిటివ్ కాదు పరిస్థితుల కను గుణంగా పోయే రకం. "అంచేత అతను చేర్చుకోలేని చెపుతూ వుంటే నీక్కాదు. ఫో. ఫోయి ఎవైనా తిను. నువ్వు రావాల్సింది అసుపత్రి క్కాదు. అన్నదాన సత్రానికి" అని వాడికో రూపాయి యిచ్చి పంపేసి జగన్నాథం వేపు తిరిగి "నువ్వు మరీ ఇంత సెన్సిటివైతే ఎలా బ్రదర్? ఇలాంటి వాటికి అలవాటుపడాలి అంతే. తెల్లారి లేస్తే ఇలాంటి వాళ్ళు ఎందర్నో చూస్తాం! మనం చెయ్యగలిగేందే లేదు. జాలిపడ్డం తప్పు. కాని జాలితో కడుపు నిండుతుందా? నిండదు. ముందు వాడిమీద జాలిపడతాం. ఆ తరువాత వాడికేం చెయ్యలేని మనమీద మనం జాలిపడతాం. సెల్ఫ్‌పిటీ చాలా ప్రమాదం. అంతమాత్రాన జాలి వుండ కూడదని చెప్పేటంత దుర్మార్గుడిని అనుకోకు. కాకపోతే కాస్త మనసుని రఫ్‌గా చేసుకోవాలి. అంతే..." అంటూ హితోపదేశం చేసి, "అవును గాని, యింత రష్‌గా వున్నా నువ్వొక్కడివే చేసుకుం టున్నావు. మీ కొలీగ్ ఏమైంది?" అన్నాడు.

"తెలీనట్టు అడుగుతావేం?" నీరసంగా నవ్వేడు జగన్నాథం.

"తెలిస్తే అడక్కూడదా? నే నడిగేది ఆవిడేమైందని కాదు. నువ్వెందుకు ఊరుకుంటున్నావూ అని. సాగుతే సాగినంత సుఖం లేదని ఆవిడగారు టింగురంగా అంటూ కూర్చోవటం ఏవిటి? నువ్వు ఇద్దరి చాకిరీ చెయ్యడ వేవిటి?"

పోన్లెద్దూ...

"ఎందుకా వేదాంతం? నీ మెత్తదనమే దీనికంతటికీ కారణం. అయినా డిగ్రీ ఉద్యోగం అప్పనంగా వచ్చేయి కదా! కనీసం పనన్నా కష్టపడి నేర్చుకోకూడదూ? జీతం పుచ్చుకుం టోంది కదా?"

"టాపిక్ మార్చు. నీ ప్రాక్టీసెలా వుంది? వుండు. ఈ పేషెం ట్లని గబగబా పంపించేసి వచ్చేస్తాన" అంటూ మిగతా పేషెంట్లని చూడడం ప్రారంభించేడు.

ధర్మారావు రాక మినహా అతని రోజూ రొటీన్లో పెద్ద మార్పేమీ వుండదు.

ఈ హాస్పిటల్, ఈ వైద్యం ఇవన్నీ తల్చుకుంటే ఆవేళ అతని మనస్సేం బాగులేదు. నిజం చెప్పాలంటే ఆ వేళే కాదు, ఏ వేళా బావుండటము మానేసింది.

తను చదువుకునే రోజుల్లో ఆశించిందేమిటి?

అనుకున్నదేమిటి?

జరిగింది, జరుగుతున్నది ఏమిటి?

ఇదే ఆస్పత్రిలో గనక తనింకా కొన్నాళ్ళుంటే వచ్చిన వైద్యం పూర్తిగా మర్చిపోవడం ఖాయం. కనీసము మందులైన సప్లయి చెయ్యలేని వాళ్ళు ఇంత డబ్బులు పోసి డాక్టర్లను తయారు చేసి, జీతాలిచ్చే బదులు కొన్ని ఆస్పత్రులు, కాలేజీలు మూసేస్తే సరిపోదా?

డబ్బున్నవాడు ప్రైవేటు డాక్టరు దగ్గరికి పోతాడు. లేనివాడు దేవుని దగ్గరకు పోతాడు.

వాళ్ళ ఖర్మ!

ఇక్కడేదో వాళ్ళ జబ్బులు నయం చేస్తామనీ, వైద్యం ఉచి తంగా దొరుకుతుందని ఆశించి అయిదు పైసల మాత్రల కోసం అయిదు మైళ్ళు నడిచివస్తారు. ఈ అయిదు పైసల మాత్ర కూడా ఇవ్వకుండా, ఇంకో చోటికి పోనీయకుండా అనవసరంగా చంపేస్తున్నాం.

ఇది ప్రజాసేవా?

ప్రజా ద్రోహమా?

ఏవరికీ సాయం చెయ్యలేని ఈ చదువుల, ఉద్యోగాలు ఎందుకు?

ఏది లేకపోయినా ఫరవాలేదు కాని జాబ్ సాటిస్‌ఫేక్షను లేకపోతే మనసు సుఖం ఉండదు.

"ఇంటి దగ్గర ప్రాక్టీసు చెయ్యకూడదూ?" అంటుంది జానకి. ఆవిడకేం తెలుసు తన కష్టనష్టాలు. ఆసుపత్రిలో వున్న మందు లన్నీ (ఆవేవిటో ఆ దేవుడికే తెలియాలి) పట్టుకుపోయి ఇంటి దగ్గర అమ్ముతున్నాడంటారు. ఇంటి దగ్గర డబ్బిస్తే గాని ఆస్ప త్రిలో చూడడంటారు. మంచాలు అమ్ముతున్నాడంటారు. డబ్బు ఎక్కువిస్తే బాగా చూస్తాడనీ తక్కువిస్తే ఓ మోస్తరుగా చూస్తాడని అంటారు. నిజానికి వాళ్ళ తప్పు లేదు. అలాంటివాళ్ళు లేరని కాదు. కాని తను అలాంటి ముష్టి పనులు చెయ్యలేదు. ఆ వెధవ మాటలు పడలేదు.

అంతే.

## 3

"అంతే" అని జానక్కీ తెలుసు.

అయితే మరింకెలా అన్నదే ఆవిడ్ని వేధిస్తున్న సమస్య అన్నట్లు జానకి ఎవరో యింకా చెప్పలేదు కదూ.

జగన్నాథం ప్రియురాలా! ఛ! ఛ!

చదువుకునే రోజుల్లోకాని, ఉద్యోగం చేస్తున్నప్పుడు కాని అతనికి ప్రేమించే నేర్పూ లేదు, ఓర్పూలేదు.

జానకి–జగన్నాథం అగ్నిసాక్షిగా, అరుంధతి సాక్షిగా పెళ్ళా డిన భార్య.

అందంగానే వుంటుందా? వుంటుంది.

తెలుగు నవల హీరోయిన్లాంటి అందం మాత్రం కాదు – సంపెంగ మొగ్గ ముక్కు, సన్నజాజిల్లాంటి వేళ్ళు, కలువ రేకు కళ్ళు వగైరాలేం లేవు.

"సంసారపక్షంగా వుంటుంది. అంతకంటే ఆడదానికి అందం ఏం వుంటుంది?" అంటారు వయసు మళ్ళిన వాళ్ళు.

"నలభై ఏళ్ళు, నలుగురు పిల్లలు వున్నా యింకా ఫిగర్ బాగానే మెయిన్‌టైన్ చేస్తోంది' అంటారు. ముప్ఫై ఏళ్ళకే నీరు

పట్టిన ఏనుగుల్లా అయిపోయినచుట్టుపక్కల ఆడవాళ్ళు జలసీతో.

"మీరింత బాగా ఫిగర్ ఎలా మెయిన్‌టెయిన్ చేస్తున్నా రండీ" అని గాని ఎవరైనా అడిగితే.

"ఏముంది? వంచిన నడుం ఎత్తని చాకిరీ, పగలూ, రాత్రీ వెంటాడే సమస్యలు బెంగలు" అంటుంది నవ్వుతూనే.

సాధారణంగా కొంతమందిని చూస్తే, వాళ్ళు మనకు అపకరాం చెయ్యకపోయినా, చూడగానే తన్నాలనిపిస్తుంది. అతి కొద్దిమందిని చూస్తే మాత్రం చెయ్యెత్తి దణ్ణం పెట్టాలనిపిస్తుంది. పరమరౌడీకైనా సరే. ఈ ఆఖరి కోవకి చెందినది జానకి.

"ఇప్పుడంటే పెద్దదాన్ని కాని ఒకప్పుడు నేను చిన్నదాన్నే కదా! అదేవిటో ఏ కుర్రాడూ కన్నెత్తి చూసేవాడు కాడు .నేనెప్పు డైనా తెగించి చూస్తూ, మహాపరాధం చేసిన వాడిలా తలొంచు కొని పరుగెత్తి పారిపోయేవాడు. ఒక్క ప్రేమలేఖ కూడా రాలేదు" అని అప్పుడప్పుడు విచారిస్తుంది జగన్నాథం దగ్గర.

"నిజం చెప్పాలంటే నాకూ పెళ్ళాడాలనిపించలేదు సుమీ." అంటాడతను.

"పోనీ ఇప్పుడొదిలెయ్యండీ" అంటుంది రోషంగా.

"ఇప్పుడు వదలాలనీ అనిపించడం లేదు" అంటాడతను వచ్చే నవ్వుని పెదమల చివరే ఆపేసి.

"చూడు జానకమ్మడూ, నీకిప్పటికి ఓ కోటిసార్లు చెప్పి వుంటానేమో యిలాంటి చొప్పదంటు ప్రశ్నలు వెయ్యొద్దనీ, వేసి నన్ను బాధ పెట్టవద్దనీ" ఏం? నీకు బుర్రలేదా? వుంటే ఆలోచిం చడం చేతకాదా? లేకపోతే ఆలోచనల్తో మనసుని ఆలియబెట్టేస్తే వేగం ముసలితనం వచ్చేస్తుందని భయమా? ఆ భయం యింక యిప్పుడు అనవసరమేమో!

"ఏవండీ అలా పక్కింట్లో కన్నం వేసి ఓ పదివేలు పట్రండి" అను. రాత్రికి రాత్రి గునపం పట్టుకొని బైల్దేరకపోతే నన్ను జగన్నాథం అని పిలవకు (ఇప్పుడు అలా పిలుస్తున్నట్టు) పది వేలు తెస్తానా లేదా అన్నది వేరే సంగతి. లేదూ ముప్ఫై వేల తొమ్మిదికి స్క్వేర్ రూట్ అని ఎంత అని అడుగు. ఏ లెక్కల మేష్టరి దగ్గరైనా నేర్చుకొని మరీ చెప్తాను. అంతేగాని ఎలాగండీ? అని ఓ కామన్ ప్రశ్న వెర్రి మొర్రిగా వేసేస్తే నాకు మహా చిరాకు. నువ్విలాంటి చెత్త ప్రశ్న లేస్తూ కూర్చుంటే కాలం ఆగిపోదు. కాలంతో పాటే సమస్యలూను అసలీ సమస్యనేది వుంది చూశావ్? అది నువ్వు తీర్చకపోయినా అదే తీరిపోతుంది. అంత తీర్చలేని సమస్య గనుక అయితే నువ్వే తీరిపోతావు. ఆయామ్ సారీ, నువ్వంటే నువ్వే కాదులే.

ఇందులో యింకో ధర్మసూక్ష్మం కూడా వున్నది. ఏమిటని అడుగు... కోప్పడకు గాని అమ్మడూ "నీకూ, మీ బాబుకీ గొప్ప అహంకారమే సుమీ... ఆ అహంకారంతోనే అతనలా అయిపోయేడు".

తండ్రి పేరెత్తినప్పుడల్లా జానకి మనస్సులో ముల్లు గుచ్చు కుంటుంది. "మీరు పెళ్ళాడింది నన్నా, మా నాన్ననా?" అన్న మాటని నాలిక చివరే నొక్కేస్తుంది. మరో అరగంట లెక్చరుకి భయపడి. అయినా ఈ మొగుళ్ళందరికీ ఇదో జబ్బేమో!

ప్రపంచంలో అత్తాకోడళ్ళ పొత్తు అరుదుగానైనా వింటాం కాని, మావా అల్లుళ్ళ మధ్య సామరస్యం మచ్చు క్కూడా వినం.

సపోజ్ యిప్పుడు ఈ డబ్బు సమస్య ఎలాగో తీర్చే ననుకో అంతటిలో అయిపోతుందనుకున్నావా? ఆ తరువాత దుప్పట్లు, తువ్వాళ్లు, చీరలు, బాడీలు వగైరా. అమ్మడూ ఇది అనంతం. నీకు తెలీకపోతే నాలాంటి వాడి దగ్గర నేర్చుకో, లేకపోతే మన గరవ్నమెంటువార్ని చూసైనా నేర్చుకో".

ప్రజల ఆహారం, ఆరోగ్యం, నిరుద్యోగం, ఎగురుతున్న ధరలు, ఏడుస్తున్న జనం, యివన్నీ పాపం మన గవర్నమెంటు వారి సమస్యలే కదా. మరి వాళ్ళచేత యివన్నీ పరిష్కరిం చటంలేదంటావ్. ఓసి వెర్రిదానా? వాళ్ళకి పరిష్కారం తెలీక కాదు, చేతకాక కాదు. మరెంచేత? చెప్తాను విను.

తిండి సమస్య తీరిందనుకుందాం. వెంటనే జనం టిఫిన్ సమస్య, 'టీ' సమస్య. గోల్డ్‌స్పాట్ సమస్య. ఓల్డు స్మగ్లర్ సమస్య అంటూ తినేస్తారు లేదూ, అందరికీ ఉద్యోగాలు పారేశేం అనుకో. అప్పుడు పనిచేసి అలిసిపోయేం. మరంచేత మాకు రిక్రియేషన్‌కి బార్లు, బార్‌మెయిడ్‌లు, ఉళ్ళోను, ఊరవతల ఉద్యానవనాలు, యమునా తీరాలు, గోపికలు, కావాలంటారు. అడిగినదల్లా ఇవ్వక పోతే స్ట్రయి కులు, లాకౌట్‌లు, లాఠీఛార్జీలు, కోర్టులు, కేసులు, తప్పుడు సాక్షాలు ఒకటేఁవిఁటి? ఆ సింగినాదం అంటావా? చూడు జానీ డియర్, నువ్వు మనుషుల్ని ముఖ్యంగా మొగుడు వాడ్ని నమ్మడం నేర్చుకో. నీకేం తెలీదన్నావా? ఒప్పేసుకో, మధ్యలో పాములా బుసకొట్టకు. మరీ యింత కామన్ సెన్సు లేని దానిని నీకెవడిచ్చేరు డిగ్రీ? అంటూ అరగంట లెక్చరిచ్చేడు.

నిజం చెప్పాలంటే లెక్చర్లివ్వడం జగన్నాథం వృత్తీ కాదు, హాబీ కాదు. అసలతను ఎవ్వర్నీ, ఏ ప్రశ్న వెయ్యనివ్వడు. అతని డిక్షనరీలో ఫుల్‌స్టాపులే కాని ఆశ్చర్యార్థకాలు, ప్రశ్నార్థకాలు లేవు. ఆఖరికి జానకి "అన్నం తినేద్దావా?" అన్నా కూడా ఒప్పుకోడు. "ఏం అన్నం తినేద్దాం" అనలేవువూ? యింత చిన్న విషయాని క్కూడా బాధ్యత తీసుకోలేవా? అంటాడు.

"జవాబు ఎదుటివాడి చేత చెప్పించేవాడు బాధ్యతల్ని తప్పించుకునే ఎస్కేపిస్టు" అని అతని నమ్మకం. ఎవడి ప్రశ్నలకి వాడే జవాబు చెప్పుకోగలగాలి అన్నది అతని సిద్ధాంతం.

కాని యీ లెక్చర్లకి భయపడితే సంసారం గడిచినట్లే. రానీ, ఇవేళ తాడో, పేడోతేల్చేస్తాను. పిల్లల్ని చదవు మానిపించి ఇంట్లో కూర్చోపెట్టమంటావా? డబ్బు సంగతి ఆలోచిస్తావా? అని నిలేస్తే సరి. పౌరుషం వచ్చేనా పట్టించుకుంటాడేమో! అనుకుంటూ అతనొస్తే ఎలా డీల్ చెయ్యాలా అని జానకి ఆలోచిస్తూ వుంటే వీధి తలుపు చప్పుడైంది.

దులిపేద్దాం అని హుషారుగా తలుపు తీసిన జానకిని ఏం చేస్తున్నావ్ జానకి అంటూ పలకరించింది భ్రమరాంబ.

"మా వార్ని తిట్టడానికి రిహార్సల్సు వేస్తున్నాను." అన బోయి ఏంలేదు. లోపలికి రండి అంది. భ్రమరాంబ వాళ్ళ పక్కింటావిడ.

ఆవిడ్ని ఎ.ఐ.ఆర్. అంటారు జగన్నాథం.

భ్రమరాంభ, జగన్నాథం ఒకే ఊర్లోపుట్టి, ఒకే ఊర్లో పెరిగేరు. చిన్నప్పుడు ఇద్దరం కలిసి ఆడుకున్నాం. జగన్నాథాన్ని తెగ ఏడిపించేవాళ్ళం అంటుందావిడ.

"మా ఊరైతే అవొచ్చు కాని మేమెప్పుడూ కలిసి ఆడుకోలేదు. ఆవిడ విడిగా ఆడుకుందో లేదో నాకు తెలీదు. నిజం అసలు నేను ఏ ఆడపిల్లతోనూ ఆడేవాడ్ని కాను" అంటాడు జగన్నాథం.

జనన మరణ రిజిష్టారు వారి కార్యాలయం రికార్డుల ప్రకారం ఆవిడ వయస్సు నలభై దాటి నాలుగేళ్ళయింది. కాని భ్రమరాంభ లెక్కల ప్రకారం ఏదీ మొన్ననే ముప్పై అయిదు వెళ్ళాయి. ఆ వూరి అనవాయితీ ప్రకారం ఆవిడ పైటలు వెయ్యడం ప్రారంభించగానే చదువు ఆపేసింది. అప్పటికావిడ ఫోర్తుఫారం సగంలోవుంది. ఆవిడ మొగుడు మార్కండేయులు ఎస్.ఎస్.ఎల్.సి. వరకు చదివి మరింక చదువంటే విసుగొచ్చి మానేశాడు. భూమీ, పుట్రా అతనికి బాగానే వున్నందువల్ల ఉద్యోగం చెయ్యవలసిన అవసరం కాని, ఉద్యోగంలేని కొరత, బెంగ కాని లేవు. అతనికి పెద్దలు చిన్నప్పుడే భ్రమరాంభనిచ్చి పెళ్ళి చేసారు. అలా కాకపోయినా కూడా అతనికి పెళ్ళి గురించి బెంగ, పెళ్లాం లేని కొరత వుండేవి కావు. అతని బెంగంతా పేకాటే. అతనికి పేకే పెళ్ళాం. పేకే దైవం. అయితే తన ఇంటికీ, తన ఏక్టివిటీస్‌కీ అతని పేక ఏ మాత్రం అడ్డురానందువల్ల భ్రమరాంబ ఎప్పుడూ అడ్డుపెట్టలేదు. సరికదా ఇంట్లోనే వుండి తన నెత్తిమీద తాండవం చెయ్యనందుకావిడ మనస్సులో పిసరంత సంతోషిస్తుంది కూడా.

అయితే తను ఉద్యోగస్తుడి పెళ్ళాన్ని కానే అన్న బాధ ఆవిడ్ని ఆహర్నిశలూ తినేస్తుంది. ఆ బాధని ఆవిడ ఉద్యోగస్తుల పెళ్ళాలతో స్నేహం చేసీ, వాళ్ళతో తనని బేరీజు వేసుకొని, కొంత ఉపశమింపచేసుకుంటుంది. ఆవిడకి పిల్ల పీచూ లేరు. లేరన్న బాధ ఆవిడకుందో లేదో చెప్పడం కష్టం.

ఉద్యోగస్తుల పెళ్ళాల్తో ఫ్రెండ్‌షిప్ చెయ్యడం ఓ హాబీ. అయితే, నాగుల చవితి, కార్తీక పౌర్ణమిలతో సహా అన్ని పండుగలకి హబ్బీని వదిలేసి పుట్టింటికి వెళ్ళడం మరో హాబీ. వాళ్ళ పుట్టింటి వారిది చాలా పెద్ద కుటుంబం అవడం వల్ల మధ్య తమ్ముడి పెళ్ళానికి కడుపు పోయిందనో, చెల్లెలి కూతురురికి చెవులు కుట్టిస్తారనో ఎక్స్‌ట్రా ట్రిప్పులు కూడా వుంటాయి. ఆవిడ ఎన్నిసార్లు పుట్టింటికి వెళ్ళి ఎన్ని నెలలున్నా, ఆవిడ మొగుడితో సహా ఆ ఉళ్ళో ఎవరికీ ఎలాంటి అభ్యంతరం వుండదు. చిక్కు ఎక్కడ వచ్చిందంటే ఆవిడ పుట్టింటినుంచి వచ్చిన దగ్గర్నుంచి మళ్ళీ వెళ్ళే వరకు ఆ వూరి భోగట్టాలన్నీ ఏకరువు పెడుతూనే వుంటుంది.

ఆ ఏకరువుల్లో తక్కువ భాగాలకు జానకి బలైపోతూ ఉంటుంది.

ఏతా వాతా జగన్నాథం ఊర్లో ఎవరు చచ్చిపోయిందీ, ఏ అమ్మాయి ఎవరితో లేచిపోయినదీ, ఏ డాక్టరు ప్రాక్టీసు ఎలా వున్నది వగైరాలు వివరాల్తో సహా వాడిపోకుండానే జానక్కి చేరిపో తుంటాయి.

అందుకే ఆవిడ్ని జగన్నాథం ఎ.ఐ.ఆర్. అంటాడు.

"మనూర్లో మీ వెనుక వీధిలో రిటైరైన స్కూలు మేష్టారు లేదూ అదేనమ్మా ఫిడేలు డొక్కులా మొహం, డబుల్ రీల్

హార్మనీల గొంతుక వుంటుంది. అతనే అతను మొన్న కూతురికి పెళ్ళి చేశేడమ్మోయ్!" అందావిడ వస్తూనే.

"మీకు శుభలేఖ రాలేదూ. వచ్చే వుంటుందిలే. మీ ఆయన మరిచిపోయుంటాడు. అతను చిన్నప్పటి నుంచీ అంతే ప్రతీది మర్చిపోతాడు. నువ్వెలా వేగుతున్నావో కాని" అంటూ కుర్చీలో కూర్చుంది తన మాటలకి తనే నవ్వుతూ.

అసలే చికాగ్గా వున్న జానక్కి ఆవిడ నవ్వు మరీ చికాకె త్తించింది. అంత నవ్వొచ్చే విషయం ఏవుంది? జానక్కి ఆవిడంటే చిన్న పిసరు చిరుకోపం వుండడానిక్కారణం ఆవిడ జానకిని నువ్వు అనడమే. ఆవిడ జగన్నాథాన్ని కూడా ఏకవచన ప్రయోగం చెయ్యడంతో ఆ చిరుకోపం మరి పోలేదు. చిన్నప్పుడు ఎంత కలిసి ఆడుకుంటే మట్టుకు (నేనావిడతో ఆడలేదు మొర్రో అని జగన్నాథం గోలపెట్టినా) పెద్ద అయిన తరువాత ఉద్యోగం చేసుకుంటున్నప్పుడు మర్యాద అక్కర్లేదూ? అన్నది జానకి ప్రశ్న.

"పోన్లెస్తూ. ఆవిడ తత్వమే అంత. ఆవిడేం మద్రాసులో పుట్టిందా? (జానకి మద్రాసులో పుట్టింది). పల్లెటూరి వాళ్ళకి యిలాంటి మర్యాదలు అంతగా తెలీవు అర్థం కావు" అన్నది జగన్నాథం సముదాయింపు.

అయినా జానక్కి ఆవిడంటే చిటికెడుకోపం ఎప్పుడు వుంటుంది. ఎంత సరిపెట్టుకుందామనుకున్నా, ఆ కోపం పోకుండా నిల్చి పోవడానికి దోహదం చేసింది భ్రమరాంబ. ఆవిడకి జానకి కోపతాపాలతో నిమిత్తం లేదు. ఆవిడ జగన్నాథాన్ని మతిమరుపు మనిషనీ,కోపిష్టి అనీ, అదనీ యిదనీ ఏదో ఒకటి అంటూ జానకి కోపం పోకుండా కాపాడుకొస్తోంది.

అయితే భ్రమరాంబలో చెప్పుకోతగిన మంచి గుణం ఒకటి వుంది. ఆవిడ కబుర్లు చెప్పడంలో మహా చమత్కారి. ఆవిడే గనుక కథలు రాసివుంటే చాలా మంచి రైటరు అయి వుండేది. ఆవిడ మనల్ని తిడుతోందని తెలిసినా సరే, నాలా సరాదాగా వింటాం. ఆవిడ తిట్లన్ని. అంచేత అవసరం వున్నా లేకపోయినా అందరూ వింటారు ఆవిడ కబుర్లు.

"మంచిదే లెండి"అంది జానకి ఏదో ఒకటి అనాలి కాబట్టి.

నీదంతా సత్తెకాలం పోదూ, చెట్టు చచ్చేకాలానికి కుక్క మూతి పిందెలను, ముట్లుడిగిపోయే కాలానికి ఆడదానికీ, మీసాలు పండిపోయే కాలానికి మొగుడికీ పెళ్ళైవిటమ్మా? నా పిండాకూడు (ఆవిడ మాటకోసారి తనకీ పిండం పెట్టుకుంటూ వుంటుంది). పోనీ అదేదదో ఏ దేవుడి గుళ్ళోనో, ఏ రిజిష్టారు ఆఫీసులోనో చప్పుడు లేకుండా చేసుకోకూడదూ? ఊరందర్నీ పిల్చి స్నాతనకం దగ్గర్నుంచి శోభవనం వరకూ ఏం చాదస్తంగా చేశేరనుకున్నావ్? తెలీని వాళ్ళు షష్టిపూర్తి అనుకుంటారు. అందరూ ఒకటే నవ్వుకోవడం. నువ్వు చూడలేదు కాని – అని జానకి చూడనందుకు కాస్త విచారించి, మళ్ళీ ఆ పెళ్ళి తల్చుకొని కాబోలు నవ్వడం ప్రారంభించింది.

జానకి ముందు నవ్వబోయి, మళ్ళీ ఆవిడ మీద కోపం జ్ఞాపకం వచ్చి మానేసింది.

"ఇంతకీ మీ వదిన కూతురు బారసాల బాగా జరిగిందా? డెలివరీ సులువుగానే అయిందా?" అంటూ టాపిక్ మార్చింది జానకి.

భ్రమరాంబకి ఏ టాపిక్ అయినా ఒకటే.

"జరక్కేం చేస్తుందీ. మా బాగా జరిగింది. డబ్బా బాగానే వదిలింది. ఏదో సామెత చెప్పినట్టు" "డబ్బు కొద్దీ వన్నెలు, మొగుడి కొద్దీ చిన్నెలు" అని డబ్బుంటే అన్నీ బాగానే జరుగు తాయి. పురుటికి వెయ్యి రూపాయలా! పూర్వం రోజుల్లో అయితే ఆ డబ్బుతో అయిదు రోజుల పెళ్ళి చేసేవారు. ఏం మాయదారి పురుళ్ళో? మాయదారి డాక్టర్లు..."

కొంపదీసి ఈవిడ అంతా మిధ్య వేదాంతం మాట్లాడుతుంద నకుని భయపడింది జానకి. పైకి మాత్రం "కాలం మారింది కదండీ" అంది ఆ భ్రమరాండకి మధ్యలో బ్రేకు వెయ్యకపోతే, బ్రేకుల్లేని లారీని ఆవిడిష్టమొచ్చినట్లు దున్నేస్తుంది.

ఆ! నా పిండాకూడు, కాలమా? కాకరకాయా? మారింది కాలం కాదు. మనుషులే మారిపోతున్నారు. ఆశ మీరి పోతు న్నారు. ఇదివరకు ఎవరూ పురుడ్లు పోసుకోలేదా? పిల్లల్ని కనలేదా? బొడ్డు కోసిన మంత్రసాని చేతిలో రెండు రూపాయలు, ఓ చేటడు ధాన్యంతో సరి. ఉన్న ఓ పాతచీర పారేసేది లేనమ్మ అదీ లేదు. ఇప్పుడసలు ఎవరైన మామూలుగా కంటున్నారా? అందరికీ కుట్లు పడ్డమో ఆప రేషనో, మరోటో రామ! రామ!" గుక్క తిప్పుకోవడానికి కని ఆగింది.

"ఇప్పుడందరికీ కొంచెం వయసైన తరువాత కాన్పులు కదా, కొంచెం కష్టమే మరి" జానకి బ్రేకు.

ఈవిడ ఈ టాపిక్ మారిస్తే బావుణ్ణు.

పురుళ్ళు, పుణ్యాలు భ్రమరాంబ పెట్ టాపిక్స్. అంచేత ఆవిడ మార్చదల్చుకోలేదు.

"వయసా? నా పిండాకూడా? నీదంతా వెర్రిమాలోకం. జగన్నాథానికి తగ్గదానివి – తాత్కాలికంగా తగ్గిన కోపం మళ్ళీ వచ్చేసింది జానక్కి – (ఇక్కడ, గొంతుక తగ్గించింది. అదేదో రహస్యం చెప్తున్నట్టు) ఈ డాక్టర్లు మామూలుగా కాన్పు అవని వ్వరుట. అలా అయితే వాళ్ళకేం వస్తుంది? మొగ డాక్టరుకైతే ఓ పాతిక రూపాయలు, పోనీ యాభై అనుకో, ఆడడాక్టరుకైతే మరో జాకెట్టు గుడ్డా, ఓ అరడజను అరటిపళ్ళు పారేసి సాయం త్రానికి తల్లీ, పిల్లా టాటా చెప్పేసి ఇంటికి పోతారు. అంచేత అవసరం వున్నా లేకపోయినా చేతిలో కత్తెర వుంటుందికదా. ఓ సారి కటుక్కున కత్తిరించడం, మళ్ళీ కుట్టు పనివాడు జాకెట్టు కుట్టినట్టు కుట్టేడం, ఆ కుట్లు మానేవరకు ఓ వారం ఆస్పత్రిలో వుండడం, ఆరువందల రూపాయలు బిల్లు వెయ్యడం. బాగా డబ్బు పులిసిపోయిన వాళ్ళకైతే నెల తప్పిన మర్నాటి నుంచే భయపెట్టడం, కడుపులో పిల్ల అప్పుడాల కర్రలా అడ్డంగా వుంది. మరంచేత ఆపరేషను చెయ్యాల్సిందేనని వాళ్ళు చెప్పడం మనం నమ్మడం తప్ప మనకేం తెలిసి చావదు కదా పిల్ల ఎటుందో. మరింక ఆపరేషనుకి వెయ్యో, రెండువేలో గుంజడం, యిదే వరసనుకో...."

భగవాన్... ఈవిడీ టాపిక్ మార్చదు కాబోలు, అవతల జగన్నాథం వచ్చే వేళైంది.

ఛ... ఛ.... ఎవరో కిట్టనివాళ్లు అలా అంటారుకాని, అంత అధ్వాన్నం వుండదండీ. ఎన్నో కాంప్లికేషన్సు వస్తే తప్ప అలా చెయ్యరు. అస్తమానం ఆపరేషను చెయ్యడం సరదానా ఏవిటి వాళ్ళకి? డాక్టరు భార్యగా సమర్థించ బోయింది జానకి.

దానికావిడ గవ్వలు, గచ్చకాయలు ఒక్కసారి గిలకరించి నట్టు గలగలా నవ్వింది. నవ్వడం అయిపోయేక ఓసారి బుగ్గలు నొక్కుకుంది. ఆ తరువాత సరదానా నా పిండాకూడా? డబ్బమ్మా డబ్బు. నేను కూరతరిగినప్పుడల్లా ఓ రూపాయి యిస్తానని ఎవరైనా అంటే నేనలా కూర తరుగుతూనే వుంటాను చెయి కోసుకున్నాసరే. "మా వదిన కూతురెంతుందో తెలుసా? తొండ పిల్లలా యిదిగో యింత అంటూ ఓ మూర చూపించింది. అయితేనేం ఆరుకుట్లు పడ్డాయి. బంగారంతో కుట్టేరో ఏవిటో గాని ఆరువందలు వదిలేయి. మనూరు లేడీ డాక్టరు, మొగుడు కలిసి కాళ్ళూ, చేతులా ఆర్జించేస్తున్నారనుకో. బోర్డు కట్టి మూడేళ్లు కూడా కాలేదు. మనలో మనమాట. ఆ మొగుడొట్టి సవటట. అంతా పాపం ఆవిడే చేస్తుందిట. ఆఖరికి మొగాళ్ళకి చేసే ఆపరేషన్లు కూడా ఆవిడే చకచకా చేసేస్తుందిట. అతనూరికే ఉత్సవ విగ్రహంలా పక్కన నిల్చుంటాట్ట. కాకపోతే దూదీ, అదీ అందిస్తాట్టలే...."

ఈవిడ్ని ఎవరైనా డిటెక్టివ్ ఏజెన్సీ వాళ్లు, వార్తలు సేకరిం చడానికి పెట్టుకుంటే బావుణ్ణు అనిపించింది జానక్కి.

భ్రమరాంబ వార్తా ప్రసారం అలా సాగుతూనే వుంది. "వాళ్ల వీధికో బ్రాంచి పెట్టేస్తున్నారు. అన్నట్టు ఈ మధ్య నువ్వు మనూరు చూళ్ళేదు కదూ...." లేదన్నట్టు తలూపింది జానకి.

"... అలా చెప్పు. ఏం పెరిగిపోయింది. పాపం పెరిగినట్టు పెరిగిపోతోందనుకో. ఏవో ఆఫీసులు తెగ పెట్టేస్తున్నారు. ఇళ్ళకి ఎంత గిరాకీగా వుంది! అబ్బబ్బ...."

ఈలోగా జానకికూతురు పరహారేళ్ళది, పాపని పేరుగలది రెండు కప్పుల్తో కాఫీ తెచ్చి ముందు భ్రమరాంబకి ఓ కప్పు ఇచ్చి, రెండో కప్పు తల్లికిచ్చింది.

"పరీక్షలు తెలిశేయా అమ్మాయ్?" అంది భ్రమరాంబ కప్పు అందుకుంటూ.

బుర్ర ఊపింది అమ్మాయ్...

"క్లాసొచ్చిందా? రాకేం చేస్తుందిలే. జగన్నాథం అంతే. అన్నింట్లోనూ చిన్నప్పటి నుంచీ ఫస్టు వచ్చేవాడు.."

అమ్మయ్య యిన్నాళ్ళకో మంచి మాటాడింది జగన్నాథం గురించి.

వేగం కాఫీ తాగేస్తే కప్పు పట్టుకుపోదావని అక్కడే నిల్చున్న కూతురిని కళ్ళతోనే చెప్పింది లోపలికి వెళ్ళమని జానకి.

తల్లి నోటితో చెప్పినా, కళ్ళతో చెప్పినా కూతురెప్పుడూ కాదనదు.

"నీ కూతుర్ని పొగడ్డం కాదుకాని జానకమ్మ, పెద్ద డాక్టరు గారి కూతురు. చదువుకుంటోంది. అయినా ఏం వినయం, ఏం నమ్రత, జగన్నాథం కూడా అచ్చు చిన్నప్పుడిలాగే వుండే వాడు. మా వదిన కూతురుంది చూడు, ఒట్టి పెట కొక్కు అనుకో. కిందుంటే పంటలుండవు పైన వుంటే వానలుండవు..." అని జానకి కూతుర్ని పొగిడి (పాపం ఆ పొగడ్తలో మాత్రం

అబద్ధం వుండదు. అది తిట్టు అయినా, దీవన అయినా ఏది అనుకుంటే అది పైకి అనేస్తుంది ఆవిడ. ఆవిడకి అత్మస్తుతి, ముఖస్తుతి కూడా తెలీవు)... అన్నట్టు ఏం చెప్తున్నానూ – అని జ్ఞాపకం చేసుకోవడాని కన్నట్టు ఓ అరనిమషం ఆగి జ్ఞాపకం వచ్చినట్టు తలతాటించి –

"ఇళ్ళ గురించి చెప్తున్నాను కదూ. నువ్వు నమ్ము నమ్మకపో నాలుగు గోడలు పైన టాపు వుంటే చాలు గదికి నలభై అడిగేస్తు న్నారు మన ఊర్లో ప్రతి ఇంటికి వీధివైపు చిన్న చిన్న కొట్లుం టాయి చూడు. అదే ముట్లకొట్టు అంటాం..."

రామచంద్రప్రభో! ఈవిడ పురుళ్ళూ, ముట్లకొట్లూ తప్ప మరోటి మాట్లాడదేం! ఖర్మ ఇంత మోటు మనిషిని ఎలా భరిస్తు న్నాడో ఆ మొగుడు? జానక్కి సడన్‌గా భ్రమరాంబ మొగుడి మీద జాలేసింది.

"ఆ కొట్టు ఎంతుంటుందనుకున్నావ్? పట్టుమని రెండు మంచాలు పట్టవు. ఇద్దరు పడుకోవాలంటే మచం మీదొకరు, మంచం కిందొకరు. పడుకోవలసిందే. దానికి ముప్పై రూపా యలు అద్దెట. అంటే అన్నాని కోపం తెచ్చుకోకు గాని మీ ఇల్లు అలా వూరు వాళ్లకి అప్పచెప్పె య్యకపోతే చక్కగా బాగు చేయించి ఎవరికైనా యిచ్చుకుంటే నెలకి రెండువందల రూపాయలు చులాగ్గా వస్తాయి. అతగాడంటే మొగాడు. ఆడ దానివి నీకైనా బాధ్యత తెలియొద్దు. మొన్న నేను వెళ్ళినప్పుడు ఊరంతా ఒకటే గోలనుకో, నువ్వైనా చెప్పకూడదుటే అని నిన్ను తిడుతున్నారు. అసలు నేను అది చెబ్దామనే వచ్చి ఏదో మాట్లాడుతూ కూర్చున్నాను వస్తానూ..." అని లేచి వెళ్ళిపోయింది.

అంతవరకూ భ్రమరాంబ మాటలన్నీ విందో లేదో గాని ఆఖరి నాలుగు మాటలూ మాత్రం స్పష్టంగా వింది. భ్రమరాంబ వెళ్ళిపోగానే ఏదో పెద్ద గాలివాన వెలిసినట్ట యినప్పటికీ, మళ్ళీ అంతలో ఆవిడన్న ఆఖరి నాలుగు మాటలకీ జానకి మనసులో తుఫాను ప్రారంభమైంది.

స్వంత ఊర్లోవున్న పనికిరాని ఇంటినీ, జగన్నాథాన్నీ తలుచుకున్న కొద్దీ ఆ తుఫాను పెద్దదవడం ప్రారంభించింది. పిల్లల చదువులకే గిజగిజలాడిపోతున్న జగన్నాథానికి స్వంత ఇల్లుందా అని ఆశ్చర్య పోనవసరం లేదు. అసలతనికా ఇల్లు ఎలా వచ్చిందంటే....

# 5

"మరుపు అనేది మానవ సహజం అంటారు" మర్చిపోయే ప్రతి వాళ్లు. సహజ గుణాలన్నీ మంచివా, చెడ్డవా అన్నదానికి జవాబు చెప్పడం కష్టం. కాకపోతే అది కొంత మందికి వరం గాను, కొంతమందికి శాపంగాను తయారౌతుంది. మధుర క్షణాల్ని, మగువ స్మృతుల్ని మర్చిపోయినవాడూ, పీడ కలల్ని మర్చిపోలేని వాడూ యిద్దరూ ఒక్కలాంటి దురదృష్టవంతులే, ప్రియురాలు పెట్టుకున్న ముద్దు మాత్రం జ్ఞాపకం వుంచుకొని, పెళ్ళాం పెట్టిన చీవాట్లు మరచిపోగల్గినవాడు ధన్యుడు.

జగన్నాథానికో ఇల్లుంది అన్న సంగతి జగన్నాథమే మరిచి పోయేడు. ఈ విషయంలో అతను జానకి కంటే అదృష్ట వంతుడు. ఆ ఇల్లు అతను కట్టించలేదు. కొనాలేదు. వాళ్ళ తాతగారు కట్టించలేదు. వాళ్ళ నాన్న గారంతకంటే కట్టించలేదు మరి...

సాధారణంగా ప్రతి ఊళ్ళోను లీడింగ్ లాయర్లు కాని, లీడింగ్ డాక్టర్లు గాని అరడజను మంది దాటివుండరు. ఆ వూరి అరడజను లీడింగు లాయర్లలోను నారాయణ మూర్తిగా రొకరు. నారాయణమూర్తి గారి తండ్రి జగన్నాథ రావుగారు – జగన్నాథం తాతగారి పేరే – కూడా లాయరే.

ఏమిటో కావిళ్ళతో తెచ్చిపోసేవారు విచ్చ రూపాయలు. ఏనాడైనా లెక్క చూసిన ఎరుగునా ఏమిటి ధర్మరాజు. తెచ్చి పొయ్యడం, ఖర్చు పెట్టుకోవడం, అంతేకాని ఇప్పటిలా మూడు రూపాయలకి ముప్పై మూడు ముళ్లు వేయడం మేమెరుగం. ఆ తరమే వేరు అని నిట్టూర్చేది జగన్నాథం నాయనమ్మ.

జగన్నాథం తండ్రి నారాయణమూర్తిగారు కూడా కావి ళ్ళతో కాకపోయినా – అప్పటికే కరెన్సీ నోట్లు వచ్చేశాయి – బాగానే ఆర్జించేరు.

ఆయన కమ్యూనిస్టు కాదు, కేపిటలిస్టు కాదు. ఆసలతనికి ఏ రాజకీయాల్తోను సంబంధం లేదు. కాని అతనికి జీవితం పట్ల కొన్ని ఖచ్చితమైన అభిప్రాయాలున్నాయి.

"మనిషి తనకెంత కావాలో అంతే అర్జించాలి కాని పిల్లలకి, మనవలకి అంటూ దాచడం అనవసరం. దాచుకోవాల్సింది డబ్బు కాదు, రెక్కల కష్టం. ఎవడిమట్టుకువాడు తనక్కావల్సింది సంపాదించుకోవాలే గాని తండ్రి, తాత ఆర్జించి పడేస్తే తిని

కూర్చోవటం గొప్ప కాదు. మా నాన్న నాకేం యిచ్చేడు? నేనూ నా కొడుక్కి అదే యిస్తాను. వాడి చదువు. రెక్కల కష్టమే వాడి ఆస్థి" అన్నది అతని పాలసీ.

అతనికి ప్రేమసి, పెళ్ళాం అన్నీ జగన్నాథం తల్లి సుభద్రమ్మ గారే. వాళ్ళకి జగన్నాథం ఒక్కటే పుట్టేడు. ఒక కన్ను కన్నూ కాదు, ఒక కొడుకు కొడుకూ కాదు" అన్న సుభద్రమ్మ గారి బాధగానే వుండిపోయింది.

నారాయణమూర్తి గారెప్పుడూ ఫారిన్ సిగార్సే తప్ప ఇండి యన్ సిగరెట్టు, చుట్ట వగైరాలు కాల్చలేదు. స్కాచ్ విస్కీ తప్ప నాటు ఎప్పుడూ ముట్టలేదు. బరంపురం పట్టు పంచలు తప్ప మరేవీ కట్టలేదు. ఆయనెప్పుడూ ఏ దేవుడికి దణ్ణం పెట్టగా ఎవరూ చూడలేదు. ఏ మతాన్ని ఎప్పుడూ విమర్శించగా ఎవరూ వినలేదు.

పట్టుపంచ కట్టుకొని, నల్ల లాంకోటు తొడుక్కొని, జెరీపాగా పెట్టుకొని, నుదుటిమీద కంది గింజంత అంగారు బొట్టుతో, జర్దాకిల్లీ నములూ ఆయన కోర్టు కెళ్తూవుంటే పెద్దపులి వెళ్తుంటే చిన్న చిన్న జంతువులన్నీ తోవయిచ్చేసినట్టు, రోడ్డుమీద జనం పక్కకి తప్పుకునే వారు. ఆయన బార్ రూములో వున్నంతసేపు ఛోట ఛోటా లాయర్లంతా వరండాల్లో దేవులాడేవారు.

ఆయనకి బయటవాళ్ళకి చాదస్తాలుగా కనిపించే కొన్ని నమ్మకాలుండేవి. అతనికి అకస్మాత్తుగా సింహం ఎదురైతే "ఓహో ఇదేదో సింహంలా వుందే. ఇక్కడి కెందుకొచ్చింది చెప్మా" అనుకోని పోవే అలా వీధిలోకి పోయి ఆడుకో. ఇక్కడేం వున్నాయి నీకు కేసుకట్టలు ఫారిన్ చుట్టలు తప్ప అని దాన్ని చెవు పట్టుకొని అవతలికి పంపేస్తారే తప్ప "అమ్మ బాబోయ్ సింహం" అని భయపడరు. అంత సింహానికి భయపడని మనిషి గోడమీది చిన్న బల్లిపిల్లని చూసి భయపడతారంటే ఆశ్చర్యమే మరి. ఆ భయం అది కరుస్తుందని కాదు. మీద పడుతుందేమోనని. ఎవరిమీదైనా బల్లి పడిందని తెలిస్తే "ఎక్కడ పడింది? ఎలా పడింది? ముందు పైనపడి కిందికి పాకిందా? లేకపోతే కిందపడి పైకి పాకిందా! సరిగ్గా చేతిమీదే పడిందా? వేళ్ళు కూడా తగి లేయా? బల్లి అంతాపడిందా? తోక ఒక్కటే తగిలిందా?" అంటూ క్రాస్ ఎగ్జామిన్ చేసేస్తారు. బల్లి పతనము, ఫలితములు అన్న నిడమర్తి వారి పంచాగం లోని చాప్టరు అతనికి కంఠతా వచ్చు. అందుకేనేమో అతను చిన్నప్పుడే కంచివెళ్ళి అక్కడి బంగారపు బల్లిని ముట్టుకొని వచ్చేరు.

అతను గుమ్మం దిగి బైటకు వెళ్ళినప్పుడల్లా కనీసం అర డజను సార్లన్నా వెనక్కి తిరిగివచ్చి కాళ్ళు కడుక్కొని, కాస్సేపు కూర్చోందే వెళ్ళరు.

ఛీ, ఛీ, వెధవ. అప్పుడే తెల్లారిందా నీకుమంగలి వెధవా అనో, ఎవడ్రా తుమ్మింది వెధవతుమ్ములూ మీరూను. కొంచెం సేపు ఆగలేరూ అనో, ఏవే అమ్మీ! ఆ బిందెలో నీళ్ళున్నాయా? వట్టి బిందేనా? అనో ఏదో ఒక కారణంగా లోపలికొచ్చి మళ్ళీ వెళతారు. అందుకే అతను వీధి మలుపు తిరిగేవరకు సుభద్రమ్మ గారు వీధి తలుపు వేసుకోరు. అయినా ఏదో గుమ్మం దిగ్గానే అయితే అర్ధం వుంది కానీ, కోర్టుకి వెళ్ళేవరకు శకునాలే అయితే ఎలా? అని అప్పుడప్పుడు సుభద్రమ్మగారు ఆయనకి వినిపించ కుండా గొణుక్కునేవారు.

అలాగే పొద్దునే జగన్నాథం గెడ్డం గీసుకుంటున్నప్పుడు ఆ గెడ్డం ఓ పావుగంట వాయిదా వెయ్యకూడదురా, ఇప్పుడు వర్జ్యం వుంది" అన్న తండ్రిమీద జగన్నాథం మనస్సులోనే విసుక్కునే వాడు. ఏ దుర్ముర్తాన పుట్టేనో ఏమిటో నని.

అతను మెడ్రాస్‌లో మెడిసిన్ చదివే రోజుల్లో శలవులకి ఇంటికి రావడం అంటే గుండె గుభేల్మనేది. అతనంటే తల్లికి పంచప్రాణాలు. తండ్రికూడా జగనాథం అంటే కోపం లేదు. అసతలను ఎప్పుడొస్తాడా అని కాసుక్కూర్చుం టారు యిద్దరూ. అయితే... ఇష్టమొచ్చినప్పుడు గెడ్డంగీసుకోవాలంటే వర్జ్యం వద్దం టుంది. క్షవరం చేయించు కోవాలంటే లక్ష్మివారం, శుక్రవారం, మంగళవారం యిలా వున్న ఏడు వారాల్లో ఆరు వారాలు అడ్డొ స్తాయి. ఏ పని చేద్దామన్నా వారం, వర్జ్యం, తిథి, నక్షత్రం ఏదో ఒకటి అడ్డొస్తూనే వుంటాయి.

ఎమ్.డి. చేస్తే బావుంటుదనుకుంటున్నానమ్మా. అన్నాడో సారి బుద్ధి తక్కువై, పక్కగదిలో తండ్రి వున్నాడన్న సంగతి మర్చిపోయి.

తండ్రివి పాము చెవులు, గెద్దకళ్ళూను. అంచేత వినిపిం చనే వినిపించదు. దుర్ముహూర్తం యింకో రెండు నిమిషాల్లో వచ్చే స్తోంది. మరింక ఆలోచనలు ఆఫీ అన్నారాయన.

ఎప్పుడూ ఎదురుచెప్పని జగన్నాథం ఆ రోజు మాత్రం ఇంకా రెండు నిమిషాలుంది కదండీ అన్నాడు చికాకు పైకి కనపడ కుండా.

నారాయణమూర్తిగారొకసారి కొడుకుని పైనించి కిందకి చూశేరు. ఫరవాలేదు. మెద్రాసు నీళ్ళు వంటపడ్తున్నాయే అను కున్నారు. పైకి మాత్రం "నాగుపాము వస్తుంటే దూరం నుంచే తప్పుకుంటాం. కాళ్ళ దగ్గర కొచ్చి కుట్టేవరకు కాళ్ళు ముడుచు కొని కూర్చోం. ఈ దుర్ముహుర్తం అయినా, మంచి ముహూర్తం అయినా, అవి యింకాస్సేపటికి వస్తాయన గానే వాటి ప్రభావం ప్రారంభించి, అవి పోయిన కొంతసేపటి వరకూ వుంటుంది" అన్నారు.

బావుంది. ఇంగ్లీషు మందుల్లాగే వీటికీ సైడ్ ఎఫెక్ట్ కూడా వుంటాయన్న మాట.

అయినా జగన్నాథం ఎందుకో ఆ వేళ తండ్రితో వాదన వేసుకోవాలనుకున్నాడు. ఇవన్నీ మూఢనమ్మకాలనీ, ఇంకా ఏవేవో తండ్రికి నచ్చ చెప్పాలనుకున్నాడు.

"ఆలోచనలు వర్జ్యం వగైరాలు చూసుకొని వస్తాయటండీ" అన్నాడు నాందిగా.

నారాయణమూర్తిగారికీ నాంది ప్రస్తావనలేం నచ్చలేదు. జగన్నాథం చెప్పేవేవీ అతను వినదల్చుకోలేదు. అంచేత అవి చూసుకోవు గానీ, మనం చూసుకోవచ్చండీ" అనేసి అక్కడి నుండి వెళ్ళిపోయేరు.

యింక శలవలైపోయేక మళ్ళీ మద్రాసు ప్రయాణం అంటే యజ్ఞమే. అతనెప్పుడూ శలవలు యింకా వారం రోజులుండగానే వెళ్ళిపోవడమే గాని, రేపు కాలేజీ అంటే యివేళ బైల్దేరి ఎరుగడు.

అసలు శలవలే వుండవు. ఆ వున్న నాలుగు రోజులైనా పిల్లాడు కంటిముందు వుండకుండా ముహూర్తాలు, మట్టి గడ్డలూ అని చాటుగా విసుకున్నేవారు సుభద్రమ్మ గారు.

పాపం నారాయణమూర్తిగారు మాత్రం ఏం చేస్తారు? వారం కుదిరితే తిథి కుదరదు. ఈ రెండూ కుదిరితే నక్షత్రం కుదరదు. ఈ మూడూ కుదిరిన నాడు శుభ్రమైన ముహూర్తం కుదరదు. అవలా తగలడ్డప్పుడు తను ఏం చెయ్యగలడు? ఎలాగైతేనేం నారాయణమూర్తిగారు జ్యోతిష్కుడూ, రెండ్రోజులు పంచాం గంతో కుస్తీపట్టగా రేపు సాయంకాలం రైలుకి ఈ వేళ అర్ధరాత్రి ఓ ముహూర్తం కుదురుతుంది. ఆ టైముకి బస్సులుండవు. రైలు స్టేషను అక్కడికి పదిహేను మైళ్ళు. ఇప్పటిలా అప్పుడు గంటకో రైలులేదు. జగన్నాథం చేసుకున్న అదృష్టం అతని ఫ్రెండు కారుకొనడం. అర్ధరాత్రి వేళ దేవుడామని స్టేషనుకు పోయి, మర్నాడు సాయంత్రం వరకు ప్లాట్ ఫాం మీద భజన చేసి రైలెక్కడం జగన్నాథం చేసే యజ్ఞాలలో ఒకటి.

ఓసారి... "ఈ ముహూర్తానికి తిరుగులేదు. బ్రహ్మాండమైన పెళ్ళి ముహూర్తం. మనవాడికి ఈసారి ఫస్టుక్లాస్ వస్తుంది" అని ఆ ముహూర్తానికి తలచుకొని బ్రహ్మానంద భరితుడైపోయే వాడు. ఆయన ఆసారి వెళ్ళిన వారం తిరక్కుండానే జగన్నాథానికి డబుల్‌టైఫాయిడ్ వచ్చి చచ్చి బతికేడు. ఆసారతను పరీక్షకే కూర్చోలేదు. "ఫస్టు క్లాసు మాట దేవుడున్నాడు. పిల్లడు బతికి బట్టకట్టేడు. అంతే చాలు" అని సంతోషించేరు సుభద్రమ్మ గారు. కాని నారాయణ మూర్తిగారలా సంతోసించలేదు. ఎక్కడో లెక్క తప్పినట్టుంది. అని ఎక్కడ తప్పిందో చెప్పమని జ్యోతిష్కుడి పిలక పట్టుకున్నారాయన. ఆ జ్యోతిష్కుడు గడగడ వణికి పోయేడు. నారాయణమూర్తిక్కనక తనమీద గురి తప్పితే యింక తన పని సరి.

"ఉండండి బాబూ. మళ్ళీ ఓసారి ఆ ముహూర్తాన్ని చూద్దాం. ఆ ముహూర్తం తప్పడానికి వీల్లేదు మరి" అన్నాడు పిలకని విడిపించుకుంటూ, పంచాంగం తీసుకొని.

మళ్ళీ ఇద్దరూ ఓ గంటసేపు పంచాంగంతో కుస్తీ పట్టేరు ఆ ముహూర్తం తప్పడానికి వీల్లేదు మరి. అన్నాడు పిలకని విడిపించుకుంటూ పంచాంగం తీసుకొని.

మళ్ళీ ఇద్దరూ ఓ గంటసేపు పంచాంగంతో కుస్తీ పట్టేరు. అరవై ఒకటో నిమిషంలో జ్యోతిష్కుడు ఓ గావుకేక పెట్టేడు సంతోషంతో.

"దీని తల్లి సిగదరగ. ఎంతపని చేసింది?" అన్నాడు పంచాం గం పక్కన పెట్టి.

నారాయణమూర్తి గారికి ఆంత్రం పెరిగిపోయింది. అసలు సంగతి చెప్పకుండా కట్టుకొచ్చిన గొడ్డులా ఏమిటా గావుకేకలూ వీడూను. "ఏమిటయ్యా అది?"

"చవితండి బాబు. చవితి. మనిద్దరం చూళ్ళేదు.... నేను చూళ్ళేదని కాదు. చూశేననుకోండి. అయినా "మంత్రి అంతటి వాడు మన పక్షం వుంటే మునిసిపాలిటీ జవానేం చేస్తాడని" అంత గొప్ప ముహూర్తాన్ని వెధవ చవితేం చేస్తుందిలే అనుకు న్నాను. కానండి ఎంత చెప్పినా మంత్రి మంత్రే. జవాను జవానే. వాడిపని వాడు చేశాడు. వీడిపని వీడూ చేశాడు. అబ్బాయిగార్ని మంచం ఎక్కించింది. ఎవరనుకున్నారు? ఇదిగో ఈ వెధవ

చవితి" అంటూ పంచాంగంమీద చేత్తో కొట్టేడు. అక్కడ చవితి వున్నట్టు. "అయితేనేం మంచంమీద దింపేకుండా పట్టుకున్న దెవరు, హదిగో, ఆ ముహూర్తబలం హమ్మయ్య, ఇంకెన్నడూ యిలాంటివి అశ్రద్ధ చెయ్యకూడదు బాబూ" అంటూ కనిపించని దేవుడి దండంపెట్టి లెంపలేసుకున్నాడు.

అదన్న మాట సంగతి. అమ్మయ్య అనుకున్నారు నారాయణ మూర్తిగారు. అయినా యింకెప్పుడూ యిలాంటి చిన్న విష యాలు అశ్రద్ధ చెయొద్దని హెచ్చరించేడు అతన్ని.

అన్నట్టు జ్యోతిష్కుడి పేరు భరతశాస్త్రి.

అసలు జగన్నాథం మెడిసిన్ చదవడమే ఓ బ్రహ్మ ప్రళయం అయిపోయింది. జగన్నాథం ఇంటర్‌లో ఎం.పి.సి. గ్రూపులో మంచి మార్కుల్లో పాసైయ్యేడు. ఆకాలంలో ఎం.పి.సి గ్రూపంటే గ్రూపులన్నింటిలోకి రాచ గ్రూపు లాంటిది. రాజుగారికి అన్ని చోట్లకీ ప్రవేశం వున్నట్లు ఆ గ్రూపువాళ్ళు ఇంజనీరింగు, డాక్టర్లు, లాయరు ఏది కావాలంటే అది చదువుకోవచ్చు. కాలేజీలో ఆ గ్రూపు వాళ్ళు మిగతా గ్రూపు వాళ్ళని ఏనుగు ఎలకపిల్లని చూసినట్టు, సింహం, చెవులపిల్లిని చూసినట్టు జాలిగానూ, చులకనగానూ చూశేవారు.

ఇంటరయ్యేక జగన్నాథం మెడిసన్ చదువుతానన్నాడు. "అన్నింటికి నీ ఇష్టమేనా జాతకం వప్పుకోవద్దా?" అన్నారు నారాయణమూర్తిగారు వెంటనే భరతశాస్త్రి, నారాయణ మూర్తి గారూ జెమిలిగా యుద్ధం చేశారు. జగన్నాథం జాతకంలో వరుసగా రెండు రాత్రులు, మూడు పగళ్లు. నాలుగోనాడు రిజల్టు ఎనౌన్సు చేశారు. ఏ పరిస్థితిలోనూ జగన్నాథం మెడిసన్ చదవ డానికి వీల్లేదని. జగన్నాథం జాతకం ప్రకారం అతని విద్యా స్థానంలో వున్న గ్రహం వ్యాపారమే జేయిస్తొట్ట. వాడసలు సైన్సు గ్రహం కాదుట. అంచేత జగన్నాథం బి.కాం. చదవాల్సిందే.

జాతకం సంగతి నాకు తెలీదు కాని నేను మాత్రం చదివితే మెడిసన్ చదువుతాను. లేకపోతే ఇంట్లో కూర్చుంటాను. కాని ఛస్తే బి.కాం. చదవనన్నాడు జగన్నాథం. వీల్లదన్నారు నారాయణ మూర్తిగారు.

నిరాహార దీక్ష చేస్తానన్నాడు కొడుకు.

ఆవశ్యం అన్నాడు తండ్రి.

తండ్రీ కొడుకుల మధ్య ప్రాణం నలిగిపోయింది. ఇద్దరూ ఇద్దరే ఒకటే. ఎవరూ లొంగలేరు. ఆఖరికి ఆవిడ వాళ్ళిద్దరూ చూడకుండా భరతశాస్త్రిని బతిమాలింది. నాకున్నది ఒక్కడే కొడుకు. వాడ్ని నాకు కాకుండా చెయ్యొద్దంది. గ్రహాల దేవుంది మనమెలా చెప్తే ఆలా వింటాయి. కాస్త శాంతి చేయిస్తే సరి అని భరతశాస్త్రికి ఐయిదు వందల రూపాయలు శాంతి చేసేరు సుభద్రమ్మగారు.

ఆ మర్నాడు "పంతులుగారూ మీకో శుభవార్త అంటూ వచ్చేడు భరతశాస్త్రి.

ఏమిటన్నట్టు చూసేరు పంతులుగారు చదువుతున్న కేసు కట్టలు పక్కనపెట్టి.

నిన్న మనం సరిగ్గా చూడలేదు గానీండి. అబ్బాయి జాత కంలో విద్యాస్థానంలో సైన్సు గ్రూపు లేనిమాట నిజమే కాని, ఆ పక్కింట్లో గురువున్నాడే, వాడిటే చూస్తున్నాడు. నిజానికి విద్యాస్థానంలో వున్న కుజుడికి కొంచెం బలం తక్కువగానే వుంది మరి. అసలు అధిపతి నీరసించి పోతే మరింక గురుడిదే బలం. అంచేత అబ్బాయి మెడిసిన్ చదవడానికేం అభ్యంతరం ఉండదు మరి" అన్నాడు అభ్యంతరం అంతా మీదేనన్నట్టు యింక తనది, గ్రహాలదీ ఏమీలేనట్లు.

ఈ వెధవ గ్రహాలు అడ్డురాకపోతే తన కొడుకు ఏం చదివినా తనకేం అభ్యంతరం వుండదు నారాయణ మూర్తి గారికి.

అలా వెళ్ళేడు జాగన్నాథం మెడిసిన్‌కి.

కష్టాలెప్పుడూ ఎవరితోనూ చెప్పిరావు. పర్మిషను తీసుకొని కూడా రావు. ఇన్‌కంటాక్సు వాళ్ళలా వార్నింగు లేకుండా వచ్చే స్తాయి. నారాయణమూర్తిగారు వుంటున్నయింటి గల వాళ్ళకి కూడా ఆడపిల్లల పెళ్ళి రూపంలో వచ్చేయి కష్టాలు. మరంచేత వాళ్ళా ఇల్లు అమ్మేస్తాం అన్నారు. ఏనాడూ ఏ కోరికా లేని సుభద్రమ్మ గారికెందుకో ఆ యిల్లు మనమే కొనుక్కుందాం అనిపించింది. ఈ ఇంటికొచ్చేకే జగన్నాథం పుట్టేడు. ప్రాక్టీసు కూడా బాగానే వుంది. అచ్చొచ్చిన యిల్లు యింకోళ్ళకి వదిలేదం లేనికి. వున్న ఒక్క కొడుక్కీ ఆస్థి రూపలో కాణీ కూడా యివ్వక పోయినా కనీసం తలదాచు కోడానికి గూడైనా ఇవ్వక పోతే ఎలా అనిపించిందావిడకి.

విష్ణువు పేరెత్తితే వీపు చీరేస్తానన్నాడు హిరణ్యకశిపుడు.

ఇల్లు పేరెత్తితే ఇంటిలోంచి వెళ్ళిపోతానన్నారు నారాయణ మూర్తి గారు.

ప్రహ్లాదుడ్ని భగవంతుడు నరసింహావతారంలో వచ్చి రక్షించేరు.

సుభద్రమ్మ గార్ని భగవంతుడు భరతశాస్త్రి రూపంలో ఆదుకున్నాడు.

"పంతులుగారూ మీకు యిప్పుడు ఏ దశ నడుస్తోంది" అడిగేడు భరతశాస్త్రి.

చెప్పేరు పంతులుగారు.

బుర్ర గోక్కున్నాడు భరతశాస్త్రి. తరువాత కాస్సేపు వేళ్లు లెక్కపెట్టేడు. "ఈపాటికి చేసేయ్యాలే. ఇంకా చెయ్యలేందే చెప్మా?" అని గొణుక్కున్నాడు.

"ఏమిటయ్యా" అన్నారు పంతులుగారు.

ఈ అంతర్దశలో మీకు గృహ ప్రవేశయోగం కనిపిస్తోంది. ఆ కుజుడు పోతూ పోతూ మంచి చేసిపోతాడు. మరి మీరేమో..." అని ఆగేడు.

"తప్పదంటావా?"

"ఔననడానికి, కాదనడానికి నేనెవర్ని మధ్య? మీరు గృహ ప్రవేశం చెయ్యాలి. తప్పదు మరి. జాతకం తప్పించడం ఎవరి తరం కాదు" అన్నాడు భావగర్భితంగా సుభద్రమ్మగారి వేపు చూసి.

నాకు అసలు అస్థి, స్థిరం కాని, చరం కాని ఉండడం యిష్టం లేదయ్యా.

భళ్ళున నవ్వేడు భరతశాస్త్రి

"పంతులుగారికేం అమాయకత్వం అన్నం తింటావా, అన్నం వండడానికో కంచమో, గిన్నో వుండాలా వద్దా? అది ఆస్థి అవుతుందా? గుడ్డముక్కలు కట్టుకుంటాం. అవి దాచుకోవడానికి ఓ పెట్టగాని, బీరువా గాని ఉండాలా? అలాగే ఈ శరీరం దాచుకోవడానికి గూడు వుండాలి. ప్రతి ప్రాణికి ఓ గూడుండాలి. ఏవంటారు? మరింక గూడు స్వంతం అయితే యింకోడు ఎప్పుడైనా పొమ్మంటాడే మోనన్న భయం వుండదు. ఏవిటండీ మీ వెర్రితనం? కంచెం, గిన్నె, బీరువా ఎంతో ఇల్లూ అంతే..." అని ఆస్థి అన్న పదానికి ఇల్లు అన్వయించదని విడమర్చేడు.

నారాయణమూర్తిగారికెందుకో ఈ ఆర్గుమెంటు నచ్చింది.

"సుభద్రా, సాయంత్రం ఇంటిగల వాళ్ళకి కబురు చెయ్యి" అన్నారు.

ఇదిగో అలా సంక్రమించింది జగన్నాథానికి ఇల్లు. ఆ ఇల్లు కొన్ని ఆర్నెల్లకే జగన్నాథం చదువు, పెళ్ళి రెండూ అయి పోయేయి. ప్రాక్టీసు పెడదామా, ఉద్యోగం చేద్దామా అని జగన్నాథం తేల్చుకోవడానికి మరో ఆర్నెల్లు ఊరికే కూర్చోవడం ఇష్టంలేక బోర్డు కట్టేడు. ఆ టైములోనే నారాయణమూర్తి, సుభద్రమ్మగారు కూడబలుక్కునట్టు రెండు నెలల తేడాతో జగన్నా థాన్ని వదిలి శాశ్వతంగా వెళ్ళిపోయారు. తల్లి, తండ్రి లేని ఆ ఇంటిలో ఒక్క క్షణం కూడా వుండాలనిపించలేదు. అంచేత అతను గవర్న మెంటు సర్వీసులోకి వెళ్ళిపోయేడు. అప్పుడా ఇల్లు అతనికో సమస్య అయిపోయింది. "అమ్మేద్దాం" అంది జానకి.

ఆ ఇంటికోసం తల్లి బాధలు అతనికి తెలుసు. అంచేత అతనికి అమ్మడానికి సెంటిమెంటు అడ్డొచ్చింది. అద్దెకిచ్చీ అన్నారు ఊళ్ళోవాళ్ళు. ఛ! ఛ! అద్దెకివ్వటం ఏవిటి? ఆ మాటే అతనికెంతో ఆక్వర్డుగా వినిపించింది.

"మీకేం మతుందా పోయిందా? ఇల్లు అద్దెకీ యివ్వక, అమ్మక ఏం చేస్తారు? మనం యింకోఊర్లో అద్దె యింట్లో వుండవా ఏమిటి? ఊరికే వుండమంటే చేదా ఏమిటి? ఊరంతా ఎగబడతారు. నంగిరితు మానేసి అద్దెకిచ్చేదాం" అని జానకి నాలుగు దులిపేసింది.

అదిగో సరిగ్గా అదే టైములో వచ్చేదు అని దగ్గర ప్రకాశరావు.

ప్రకాశరావూ, జగన్నాథం ప్రాణ స్నేహితులు కారు. కారు స్నేహితులే. ఇద్దరూ ఆ ఊరి హైస్కూల్లో ఎస్.ఎస్.ఎల్.సి. వరకూ కలిసి చదువుకున్నారు. ప్రకాశరావు మరింక పై చదువుకి అవకాశం లేక చదువంతటితో ఆపేసి మందుల షాపు పెట్టు కున్నాడు. ప్రకాశరావు తండ్రి తాసిల్దారు చేసి రిటైరయ్యేడు. ఆ డిపార్టుమెంటులో ఎంత అవకాశం వుంటుందో అంతా ఆర్జించేడు. అతనికి జగన్నాథం తండ్రిలాగానే ... వుండకూడ దన్న ప్రిన్సిపల్ ఏంలేక పోయినప్పటికీ అతను పోయిన్నాడు ప్రకారశరావు దగ్గర దహనం ఖర్చులు కూడా లేవు. ఆర్జించిన దంతా అతను ఆడవాళ్ళ కోకలకి, పేక ముక్కలకీ ముడివేసేసేడు. తండ్రి పోయిన్నాడు ప్రకాశరావుకి మిగిలినవి – పదివేల రూపా యల అప్పు. పందె గుర్రాల్లా పెళ్ళికి ఎదిగున్న నలుగురు చెల్లెళ్ళు. ఇవి కాక ఏటాకానుపో, ఎబార్షనో అయ్యే ఒక ఎండి పోయిన పొట్లకాయలాంటి పెళ్ళాం, ముగ్గురు పిల్లలు. తండ్రి

మిగిల్చిన అప్పుకికనీసం వడ్డీ అయిన చెల్లు పట్టగలుగుతున్నాడు. కాని, ఒక్క చెల్లిలి కైనా పెళ్ళిచెయ్యలేకపోయాడు. ఇప్పుడతని ఇల్లు ఇంటివాళ్ళు అర్జంటుగా ఖాళీ చేసేమన్నారు. ఊర్లో ఎక్కడా యిల్లు దొరకలేదు. దొరికినా ఒకటి రెండింటి అద్దె అతను భరించలేడు. ఇది అతని పరిస్థితి.

"బాబ్బాబు. ఎలాగైనీ నీ ఇల్లు నాకియ్యి. నువ్వనుకున్న అద్దె యివ్వలేను కాని ఎంతో కొంత యిస్తాను. నీ ఋణం వచ్చే జన్మలో ఇంటి ఇటుకనై పుట్టి తీర్చుకుంటాను" అని బతిమాలాడు.

అతనిపరిస్థితి చూస్తే జగన్నాథం గుండె నీరై కంట తిరిగింది.

"చూడొరే ప్రకాశ్. మరింక నువ్వలా బతిమాలకు. నీ యిష్టమొచ్చినన్నాళ్లు వుండు. నీ దగ్గరున్నప్పుడు నీ యిష్ట మొచ్చి నంత యియ్యి డబ్బు" అని ఆ ఇల్లు ప్రకాశరావుకి ఇచ్చేశాడు.

"పరిస్థితులు ఎప్పుడూ ఒక్కలావుండవు. మనుష్యులు ఎప్పుడూ ఒక్కలా వుండరు. అంచేత అతను యిచ్చినా, యివ్వక పోయినా అద్దె యింత అని అనుకోండి. ఎందుకైనా మంచిది" అని జానకి ఎంత చెప్పిన జగన్నాథం వినలేదు. కాని ప్రకాశరావే నెలకి యాభై యిస్తానన్నాడు. నిజానికి ఆ యిల్లు యింకెవరి కిచ్చినా నూటయాభైకి కళ్ళకద్దుకొని కొబ్బరికాయ కొట్టి మరీ తీసుకుంటారు. ఇల్లే కాకుండా ఇంటిలో వున్న తండ్రి తాలూకా కుర్చీలు, టేబిల్సు, పెద్ద పందిరిమంచం, బీరువాలు కూడా "ఈ సామానంతా ఊరూరా నేనెక్కడ తిప్పగలను, నువ్వే వాడుకో" అంటూ అక్కడే వదిలేశాడు.

"ఇంక మనం ఈ ఊరువస్తామా? ఒకవేళ వచ్చినా అంత వరకు ఈ సామాన్లుంటాయా? నా మాటవిని అవన్నీ ఏదో ధరకి అమ్మేయండి. ఆ డబ్బుతో మనం మళ్ళీ సామాను కొనుక్కోవచ్చు" అన్న జానకి మాటలు అతను వినలేదు.

అలా ఆ ఇల్లు ప్రకాశరావు తీసుకున్న ఏడాది తిరక్కముందే అతని చెల్లెళ్ళిద్దర్నీ అమ్మవారు ఒకేసారి ఎత్తుకుపోయింది. మరో చెల్లెలు పక్కింటి కుర్రాడితో పట్నం లేచిపోయింది. పెళ్ళి చేసుకుంటున్నానని చిట్టీ రాసి, ఈ యింటిలో దిగిన వేళావిశేషం చాలా మంచిదనుకున్నాడు ప్రకాశరావు.

అతనా యింటిలో దిగి దగ్గదగ్గర పదిహేడేండ్లో ఎంతో అవుతోంది. ఇప్పుడు ప్రకాశరావుకి బ్యాంకులో సుమారు డెభై వేల రూపాయల ఎకౌంటు వుంది. అతని భార్య వంటి మీద ఓ యాభై కాసుల బంగారం వుంది. అతని కొడుకు ఇంజనీరింగ్ కాలేజీలోను, కూతురు మెడికల్ కాలేజీలోను వున్నారు. అతని మందుల షాపుకి 'మందు' షాపు కలిసింది. అయితే అతను జగన్నాథానికి మాత్రం ఏడాదికో యాభై రూపాయలు దిగదుడిచి పంపిస్తాడు.

అందుకే జగన్నాథం తనకో ఇల్లుంది అన్న సంగతి మర్చిపోయాడు.

యిదీ ఆ ఇంటి కథ.

## 5

తుఫాను వెలసిపోయినా, దాని ఎఫెక్ట్ కొంతకాలం వుంటుంది. భ్రమరాంబ వెళ్ళిపోయినా, ఆవిడన్న మాటలు యింకా జానక్కి వేదఘోషలా వినిపిస్తూనే వున్నాయి.

"చెప్పుడు మాటలు చెడ్డవి" అన్న వాళ్ళెవరో గాని అంత అనుభవం లేని వాళ్ళైవుంటారు అనుకుంది జానకి. అన్నీ కాక పోయినా కొన్నైనా మంచివి వుంటాయనడానికి భ్రమరాంబ మాటలే నిదర్శనం.

"నీ మొహానికో యిల్లుంది" అని జ్ఞాపకం చేసింది.

"ఆ ఇంటిని బాగుచేయించి అద్దెకిస్తే రెండు వందల రూపాయల అద్దె వస్తుంది నెలకి" అని ఆశ చూపించింది.

థ్యాంక్స్ టు భ్రమరాంబ!

నెలకి రెండు వందల రూపాయలు!!

ఎన్ని అవసరాలు తీరుతాయి? అసలిటుపైన అప్పు చెయ్యవలసిన అవసరమే వుండదు. కొంచెం జాగ్రత్తగా వుంటే పాత బాకీలు కూడా తీర్చుకోవచ్చు.

బాకీలంటే జ్ఞాపకం వచ్చింది. అసలీ అప్పులన్నీ ఎలా తీర్చుదాం అనుకుంటున్నాడో ఇతను! దగ్గర దగ్గర రిటైరయ్యే వరకూ పిల్లల చదువులు అవవు. ఆ తరువాత ఎవరిమట్టుకు వాడు పోతాడు. మరింక ఎప్పుడు తీర్చే టట్టు. అయినా యిదేం మనిషో అప్పు భయం లేదు. ఛీ! ఛీ! ఇంటి మొగాడికి బాధ్యత తెలీకపోతే అంతకంటే మహా పాపం మరోటి లేదు.

నీకేమో దేవుడిలాంటి మొగుడు, ముత్యాల్లాంటి పిల్లలు అని ఎవరయినా అన్నప్పుడు వాళ్ళనిలాగి లెంపకాయ కొట్టాలని పిస్తుంది. తనకావలసింది మామూలు మనిషి లాంటి మొగుడు, దేవుడు కాదు.

దేవుడికి వుంటే ఓ కొబ్బరికాయ కొడతాం. లేకపోతే దణ్ణం పెట్టేసి పూరుకుంటాం కాని అతనితో కాపరం చెయ్యం. అంచేత దేవుడెలాంటి వాడయినా ఫరవాలేదు. నిజమే పిల్లలు ముత్యాలు. కాని ఎంత మంచి ముత్యాన్న యినా ఓసారి తుడవాలి. జాగ్రత్త చేసుకోవాలి. లాభం లేదు యింక ఈ పూట యితన్ని శుభ్రంగా కడిగెయ్యాల.

జానకి రిహార్సలు పూర్తి అవకుండానే వచ్చేశాడు జగన్నాథం.

అతను లేనంతసేపూ యిలా తిడదాం, అలా దులిపేద్దాం అనుకోవడమే కాని, తీరా అతనికెదురుగా అక్షరం పెగల్దు జానక్కి.

"చిన్నప్పుడు తెలీక డాక్టరు మోజులోపడి ఈ ముష్టి మెడిసన్ చదివాను కాని నేను గనుక 'లా' చదివుంటే, ఈ లాయర్లందర్నీ బఠానీల్లా నమిలేసి వుండేవాణ్ణి" అని జగన్నాథం అస్తమాను విచారిస్తాడు. అందులో అబద్ధం కూడా లేదు. ఎలాంటి వాడి నయినా మాటల్తో గెల్చేస్తాడు. "నా వాక్ స్థానంలో బృహస్మతి వున్నాట్ట" అని కూడా అంటాడు.

"వాక్ స్థానంలో ఎవరున్నారో కాని వ్యయస్థానంలో మాత్రం శని వున్నట్టున్నాడు" జానకి సందేహం.

"ఎవరెక్కడున్నా మన బ్రతుకులు మాత్రం వున్నచోట నుండి కదిలేటట్టులేవు" అన్నది ఆవిడ భయం.

ఈ పూట మాత్రం తెగించి అతనితో దెబ్బలాడ్డానికే నిశ్చ యించుకుంది. మరింక ఆలస్యం ఎందుకు "ఇప్పుడు మీ కేమ యినా పనుందా?" అంది కాఫీ యిస్తూ నాందిగా.

జగన్నాథం డాక్టరు, తెలివయిన డాక్టరు.

కాఫీ అందుకుంటూ జానకి వేపు చూశాడు.

కట్టుకున్న ఎర్రచీర రంగు కళ్ళలోకి రిఫ్లెక్టయి, ఆవిడ కళ్ళలో డేంజరు లైట్లు కనిపించాయి అతనికి.

"కోపం భోంచేస్తోందీవిడ" అని గ్రహించినవాడై "ప్రస్తుతా నికేం లేదు నువ్వు చెబితే తప్ప" అన్నాడు నవ్వుతూ.

"నవ్వేలా వస్తోంది?"

"ఏం మీనాన్న గాని పోయేడా ఏమిటి కొంపదీసి? మరి మొదటే చెప్పలేదేం? టెలిగ్రాం వచ్చిందా? ఎంత పాపాత్ముడైనా యింకోనాళ్ళుండాల్సింది. ఏం చేస్తాం. వెరీ సారీ" అన్నాడు తాగుతున్నకప్పు అంచుమీంచి చూస్తూ.

ఆ కప్పు లాక్కొని గిరగిరా తిప్పి విసిరేస్తే?

మళ్లీ కప్పు కొనాలి. అదో దండుగ.

"పిల్లలకి ఫీజుల కట్టాలి"

"ఔను?"

"బట్టలు, పుస్తకాలు కొనాలి"

"చచ్చినట్టు...."

"ఏమాలోచించేరు?"

"నేనేం ఆలోచించలేదు"

"మరెలా...?"

జగన్నాథం కాఫీ కప్పు టేబులుమీద పెట్టి సిగరెట్టు వెలిగిం చుకున్నాడు.

"మాట్లాడరేం?"

సిగరెట్టు ఏష్ట్రేలో దులిపేడు.

"చెవిటి వాడి ముందు ఫిడేలు వాయిస్తే, ఆ తీగెలు తెంపడం నీ అబ్బతరం కాదన్నాట్ట. మీ వ్యవహారం. నా మాటలు వినిపిస్తు న్నాయా?"

వినిపిస్తున్నాయి. అర్థం కూడా అవుతున్నాయి.

"ఉపోద్ఘాతాలు ఆపేసి ఏం కావాలో ఒక్క ముక్కలో చెప్పు"

"డబ్బు"

"నా దగ్గర లేదు"

"లేదంటే సరిపోతుందా?"

"నేనోమాట చెప్తాను. సిన్సియర్‌గా చేస్తావా?"

తలూపింది.

గుంట వెధవల్ని చదువులు మానిపించీ, మొగ గుంటలకి తలో కొరడా యిచ్చేసి జెట్కా తోలుకోమను, ఆడపిల్లని వంట నేర్చుకోమను. అగ్గిపుల్ల దండుగెందుకని సిగరెట్టుతోనే మరో సిగరెట్టు వెలిగించేడు తాపీగా.

"కొరడాలూ, జెట్కాలూ మాత్రం ఊరికే పంచుతున్నారా?"

"చూడమ్మా, జానకమ్మా. ఈ వేళ నీ మూడ్ బావున్నట్టు లేదు. అలా బావులేకపోవడం నీ తప్పు కాదు. మీ బాబు నీకు చదువు చెప్పించేడు గాని జనరల్ నాలెడ్జి చెప్పలేదు. అసలు మనమెవరం? ఏమిటి మన పరిస్థితి? ఇవి గనుక తెలిస్తే

మరింత మూడ్ పాడయ్యే ప్రసక్తే వుండదు. అంచేత నాకింకో కప్పు స్ట్రాంగు కాఫీ యిచ్చి ఎదురుగా చేతులు కట్టుకొని కూర్చో. జ్ఞానోపదేశం చేస్తాను"

మరో కప్పు కాఫీ తెచ్చింది. కాని చేతులు కట్టుక్కూర్చో లేదు. అసలు కూర్చోనేలేదు. లేచి వంటింట్లోకి వెళ్ళి పోతున్న దాన్ని జగన్నాథమే చెయ్యి పట్టుకొని కూర్చోపెట్టాడు. కూర్చున్నాక సగం కాఫీ సాసర్లో పోసి యిచ్చేడు జానక్కి.

"నాకు మీ ఆడవాళ్ళని చూస్తే జాలేస్తుంది సుమీ. ఐ రియల్లీ పిటీ యూ. మా మొగాళ్ళకి మూడు బావులేకపోతే ఓ అరడజను సిగరెట్లు కాల్చేస్తాం. లేకపోతే ఓ నాలుగు పెగ్గులు వేసేసు కుంటాం. బస్. మరి మీరో? అలా తల్చు కొని కుళ్ళిపోతారు. ఆఖరికి నలుగురు ఫ్రెండ్స్‌ని తీసుకొని సినిమాకైనా పోరు. అలా కష్టాల మొహం వేసుకొని, భారంగా..."

జానక్కి కోపం స్టేజి దాటిపోయి మొగుడైనా,దేవుడైనా సరే నోటికొచ్చినట్లు తిట్టాలనిపించింది. అయినా తమా యించుకొని "ఇదేనా మీరు చెప్పదల్చుకున్నది?" అంది కోపంతో వణుకు తున్న గొంతుకతో.

జగన్నాథం మొహం మీది నవ్వు చెరగలేదు. అదులో ఆ నిర్లక్ష్యమే మనిషిని పిచ్చెత్తించేస్తుంది. తను అడిగిందేమిటి? అతను చెప్తున్నదేమిటి?

జగన్నాథానికి చెలగాటం, జానక్కి ప్రాణ సంకటం.

సరిగ్గా అది కాదనుకో. నీకు యిప్పుడు ఏమిటి చెప్తాన న్నాను? అన్నట్టు నువ్వు నన్ను డబ్బు కదూ అడిగేవు. నా దగ్గర అది లేదు కాని జనరల్ నాలెడ్జి పుష్కలంగా వుంది. అంచేత ప్రస్తుతానికి అదే యిస్తాను... ఏమిటంటే మనం వున్నామా? మనం అంటే నువ్వు, కుక్క, పిల్లలు, నేను కాదు. మన్లాటి వారికి నెలకు 300 పైన 1000 లోపు తెచ్చుకునే వాళ్ళు. మనల్ని అప్పర్ మిడిల్‌క్లాస్ అంటారు. గొప్పవాళ్ళ దగ్గర ముష్టివాళ్ళం, ముష్టి వాళ్ళ దగ్గర గొప్పవాళ్ళం. టు సే ప్రిసైజ్‌లీ ... మధ్యతరగతి వాళ్ళంటే గొప్ప వాళ్ళమనుకునే బీదవాళ్ళు. నాకు ఆవేశం ఇంగ్లీషులో వచ్చేస్తుంది... ఏవిటా వ్యంగ్యం నవ్వు?"

మనకి గొప్పగా బతకడానికి డబ్బుండదు. అడుక్కోవ డానికి అర్హత లేదు. ఔను దేనికైనా అర్హతవుండాలి. మనం పోయి ఎవర్నైనా "ఏవండేవండీ. అబ్బాయికి అర్జంటుగా జీతం కట్టాలి. ఓ వంద రూపాయలివ్వండి అని అడిగేమనుకో. అతను పెద్ద మనిషైతే ... ఐయామ్ సారీ.... అదే జెంటిల్మెనైతే "ఇప్పుడు డబ్బులేదనో, తరువాత యిస్తాననో తప్పుకుంటాడు. అదే మీ బాబులాంటివాడైతే "ఏం నాయనా! వెర్రా? వికారమా? నీ కొడుకు ఫీజు నేనెందుకు కట్టాలి? శక్తి వుంటే చదివించుకో. లేకపోతే ఓ రిక్షా యిచ్చి తొక్కుకోమను" అని ఉచిత సలహా యిస్తాడు.

"పోనీ అప్పుగా యివ్వండి" అన్నామనుకో.

"మళ్ళీ ఎలా తీరుస్తావ్? ఇదిగో ఈ వందా తీసుకొని అప్పు తీర్చుకో అని గవర్నమెంటు ఎక్స్‌ట్రా యిస్తుందా? ఇవ్వదు కదా. జీతంలో తీరుస్తానంటావు. పూర్తి జీతం చాలని నీకు డెఫినెట్ జీతం ఎలా సరిపోతుంది? మళ్ళీ అప్పు చేస్తావు. కష్టపడి సినిమాలు, సిగరెట్లు మానేస్తావు. కానీ నీ కష్టమే మిగుల్తుంది. కాని సగం అప్పు కూడా తీరదు. ఆ తరువాత మరి తీర్చవు. ఇష్టం లేక కాదు, తీర్చలేక కొన్నాళ్ళకి అప్పు అలవాటుగా ఆ తరువాత వ్యసనంగాను మారిపోతుంది. నాలాంటి మంచివాడైతే పోన్లే పాపం పిల్లలు గలవాడని ఊరుకుంటారు. మరోడైతే నిన్నూ, నీ యింటినీ డప్పు కొట్టేస్తాడు' అని దింకి లెక్చరిచ్చి యివ్వ కుండానే చక్కా పోతాడు.

"ఇంతకీ యిది ఎకనామిక్స్. నీకు అర్ధం కాదు. నేను చెప్తు న్నాను. కాబట్టి నన్నునమ్మి అనవసరంగా అస్తమానూ ఆలో చించి నీ మూడ్ పాడుచేసుకోకు. డబ్బో, డబ్బో అని నన్ను చంపకు..." అని ఓ గంట లెక్చరిచ్చేడు.

అంత కోపంలోను జానక్కి నవ్వొచ్చింది. ఈ సంగతు లన్నీ తనకి తెలీవనుకోవడం పొరపాటు. అందరూ అన్నీ శక్తివుండే చేస్తున్నారా? నాకు శక్తి లేదు అని కాళ్ళు చాపుక్కూర్చుంటే వీల్లేదు. కొన్ని పనులు మన శక్తితో సంబంధం లేకుండా చెయ్యా ల్సిందే. జగన్నాథాన్ని నమ్ము కోవడం దేవుణ్ని నమ్ముకోవడమే. అతనితో దెబ్బలాడి లాభం లేదు.

"ప్రస్తుతానికి ఏం బేంకులోనో, వల్ల కాట్లోనో అప్పు తేస్తే, తరువాత అట్నుంచి నరక్కు రావచ్చు" ఇంత మంచి సలహా యిచ్చినందుకు గర్వంగా కళ్ళెగరేసింది.

ఆవిడ సలహా మాటెలా వున్నా, ఆకళ్ళెగరెయ్యడం నచ్చలేదు జగన్నాథానికి.

హు! ఎంత పొగరు!

ఇంతోటి బోడి సలహాకి కళ్ళెగరెయ్యడం, కాళ్ళూపడం కూడాను.

"జానకీ దేవి మొగుడా, జగన్నాథమా! ఇంద పట్టికెళ్ళు అని యివ్వడానికి ఏం బ్యాంకు వాళ్ళు విడివిడిగాను, జెమిలిగా మూటలు పట్టుకొని కూర్చోలేదు. అమ్మగారు మర్చిపోయేరేమో మన మొగుడికి అన్ని బ్యాంకుల్లోనూ ఓవర్ డ్రాఫ్టులు వున్నాయనీ, అవి కట్టకుండా కాంపౌండులో కొస్తేకాళ్లు విరగ్గొడతారనీ, ఇంక వల్ల కాట్లో పగలైతే కాల్తున్న శవాలూ, కుండపెంకులూ, రాత్రి పూట దెయ్యాలూ వుంటాయి. ఎట్నుంచి నరకడానికీ మా హాస్పిటల్‌కి ఎప్పుడైనా డయాబెటిక్ కాళ్లూ, చేతులూ తప్ప యింకేం లేవు. అయిపోయిందా తమ సలహా? అవతల డెలివరీ కేసొచ్చి వుంది.

"ఏం పాపం! మీ లెడీ డాక్టరేమైంది?"

"ముళ్ళు లేని వాచీ పనిచేసినా ఒకటే మానేసినా ఒకటేనని అమె వున్నా లేకపోయినా ఒకటే."

సడెన్ బ్రైన్‌వేవ్ వచ్చింది జానక్కి. ఆవిడ్నే అడిగితే బ్రహ్మాండమైన ఐడియా!

"పోనీ ఆవిడ్నే అడిగితేనో?....."

"పక్కలో కొచ్చీమంటే వస్తుంది, కాని పదిరూపాయలు అప్పు యిమ్మంటే మాత్రం ప్రాణాలొదిలేస్తుంది."

"అన్నట్టు మీకు ఇండియన్ బ్యాంకులో ఓవర్ డ్రాఫ్టులేదని జ్ఞాపకం...

మీ జ్ఞాపకశక్తికి జోహార్లు. కాని దాని ఏజెంటుగాడున్నాడు చూశావ్. దగ్గుకీ, రొంపకీ లేడి డాక్టరు దగ్గరకే పోతాడు. బుద్ధి గడ్డితిని డిజివా చేసేను కదా పురుటికేనా మన దగ్గరకి రాడా అని ఆశపడుతూ ఎప్పటికైనా కంటే వాడే కనాలి. వాడి పెళ్ళాం కనదు. అయిపోయింది మన కాన్ఫరెన్సు?" అంటూ లేవ బోయేడు జగన్నాథం.

ఇప్పుడు పారిపోయేడంటే మళ్ళీ దొరకడు. ఆ ఇంటి సంగతే చెప్పి, నాలుగు తిట్లు తినేసైనా సరే, అతన్ని ఒప్పించాలి.

కాశీ మజిలీ కథల్లో ఏ దిక్కుకైనా వెళ్ళు. కాని ఉత్తర దిక్కుకి వెళ్ళకు" అన్నది ఏం చెప్పినా వింటాడు కాని ఇంటి సంగతి మాత్రం ఒప్పుకోడు. ఇల్లు పెట్టుకొని రూపాయైనా రాకపోతే మానవుడికి మనసెలా ఒప్పుతోందో. ఉండగలిగీ దరిద్రం అంటారు దీన్నే. సందర్భం వచ్చింది కనుక యిప్పుడు చెప్పేస్తే సరి. "అన్నట్టు మనూర్లో యిళ్ళకి మహా గిరాకీ వుందిట సుమండీ" అంది. అతన్ని చెయ్యి పట్టుకు కూర్చోపెడుతూ. అంతవరకు వాళ్ళిద్దరూ సరదాగా మాట్లాడుకుంటున్న ధోరణిలో.

జగన్నాథం ఒక్క సెకండు ఆవిడ్ని పై నుంచి కిందికి చూశేడు "ఫరవాలేదే పిల్ల గడుసుదే".

టాపిక్ ఎటెళ్తోందో తెలీని అమాయకుడు కాడు.

"ఏ.ఐ.,ఆర్. న్యూసా?"

"పాపం. ఆవిడేం చేసింది ఏదో డబడబా డబ్బాలో రాళ్లు పోసి గిలకరించినట్టు వాగుతుందని కాని మనిషి పాపం మంచిదే...."

"మంచిదే.... " ఆవిడ కాదు, నీ అభిప్రాయం.

"నాలుగ్గోడలు, ఒక టాపుంటే చాలు, నలభై రూపాయలు అడిగేస్తున్నారట" భ్రమరాంబ మాటలే రిపీట్ చేసింది జానకి.

"రెండు గోడలే వుంటే...."

"మీకంతా జోక్‌గానే వుంటుంది"

"అనవసర ఉపోద్ఘాతాలు ఆపి, రంగంలోకి దిగు. కమ్ టుది పాయింట్"

"మీకు కోపం వస్తుందికాని, మనం డబ్బుకి యింత యిబ్బంది పడుతున్నాం. అవతల స్వంత ఇల్లేమో ఇంకోడు అనుభవిస్తున్నాడు. ఇంక మనమెలాగ అతన్దగ్గర డబ్బు వసూలు చెయ్యలేం. అంచేత అతన్ని ఖాళీ చేసేమని శుభ్రంగా బాగుచేయించి, ఇంకెవరికైనా అద్దెకిస్తే పోతుంది"

అతని రియాక్షన్ కోసం అన్నట్టు ఆగింది. అతని రియాక్షన్ ఎప్పుడూ మారదు. ఠక్కున కుర్చీలోంచి లేచేడు. "లాభం లేదు. ఆ విషయం వదిలీ. అందులో ఐయామ్ హెల్ప్‌లెస్.

అమ్మయ్య తిట్టలేదు. అంటే గాలి సుముఖంగానే వుంది.

"పోనీ. మీరేం చెయ్యొద్దు. అంతా నాకొదిలేయండి. మీరు కేవలం ఉత్సవ విగ్రహంలా నా పక్కన వుండండి. మిగిలినదినేను చూసుకుంటాను ...."

"ఆలోచిద్దాం... " జగన్నాథం ఈసారి తిట్టకపోవడానికి కారణం అతని డబ్బు యిబ్బందులే. పైకి అనకపోయినా, అతనికి బెంగగా వుంది డబ్బు విషయం. అతనికీ చికాగ్గానే వుంది

ఆ ఇంటి విషయం. తను ఏం చెయ్యలేదు కాని జానకి చేస్తానంటోంది అంచేత ఆలోచిద్దాం అనే వరకు వచ్చేడు.

"ఇంక ఆలోచించడానికేం లేదు. ఓ వారం శలవు పెట్టండి. అయిదు వందలు ఎక్కడైనా చూడండి వెళదాం. మళ్ళీ పిల్లలకి కాలేజీ తెరిస్తే నేను కదలడానికి వీలుండదు" ఆర్డరేసింది. అతనికి ఆలోచించడానికి టైమిస్తే మళ్ళీ రానంటాడు. మళ్ళా ఒప్పించాలంటే మరో యజ్ఞం చెయ్యాలి.

అంచేత వెంటనే శలవు పెట్టేమంది.

పెట్టేడు జగన్నాథం.

## 6

శలవులు బజార్లో దొరకవు డబ్బు పెట్టి కొనుక్కోవడానికి బేంకుల్లోనూ దొరకవు చెక్కురాసి తెచ్చుకోవాడానికి. మరెలా?

కిందివాడు పైవాడ్ని అడుక్కోవడవేఁ, ఇవ్వకపోవడం పైవాడి ఇష్టం. ఈ అడుక్కోవడంలో కూడా రకాలున్నాయి. జవాను గారి శలవు ఆఫీసరు బాబు సేంక్షను చేస్తే తప్ప, వాడు అడుగు తీసి గాని, తియ్యకుండాగాని మరో అడుగు వెయ్యడానికి వీల్లేదు. ఓ మోస్తరు ఆఫీసరైతే శలవు చీటి రాసి, ఆఫీసరు మొహాన పారేసి చక్కాపోవచ్చు. ఆఫీసరుకు శెలవు కావలిస్తే తనే రాసుకుని, తనే శాంక్షను చేసుకుపోతాడు.

ఇదీ లోకరివాజు.

జగన్నాథం ఈ లోకంవాడే.

తన శెలవు తనే తీసుకోవచ్చు.

రాయడానికి పెన్ను, పెన్నులో ఇంక్, కాయితం కూడా వున్నాయి. మరేవిటి అడ్డు?

అతని కొలీగ్ శెలవులో వుంది.

ఇద్దరూ ఒక్కసారే లేకపోతే హాస్పిటల్లో పేషెంట్ల సంగతేవిటి? ఇద్దరం వుండి మాత్రం ఏం ఉద్దరిస్తున్నాం. అన్నింటికి పెద్దాసుపత్రికి తీసుకుపో అనడం తప్ప – అన్నది జగన్నాథం స్వంత అభిప్రాయం).

ఆ కొలిగ్ వచ్చేసరికి వారం పట్టింది. ఈ వారం రోజులు జగన్నాథం మూడ్ మారిపోకుండా జానకి చాలా జాగ్రత్తలు తీసుకుంది. ఎలాగైతేనేం అనుకున్న పది రోజులకి స్వంత ఊరు బైల్దేరేరు. జానకీ, జగన్నాథం పిల్లల్ని పక్కింటి వాళ్ళకు అప్పజెప్పి.

డైరెక్టు బస్సుగాని, ట్రైనుగాని వుంటే అమలాపురం నుంచి అమెరికా వెళ్ళిపోవచ్చు. కాని ట్రైను దిగి బస్సెక్కడం, బస్సుమారి బస్సెక్కడం, వాటికోసం వెయిటింగ్ వున్నాయ్. అబ్బబ్బ హారిబుల్. అందులోను ట్రాన్స్‌ఫరైనప్పుడు తప్ప, ఎక్కడికీ కదలడం అవాటు లేని జగన్నాథానికి మరీను.

వాళ్ళ ఊరిమీదుగా ప్లేన్ వెళ్తుంది కాని అక్కడ ఆగదు. ఏరోడ్రోమ్ లేనందువల్ల.

ట్రైను వాళ్ళ ఊరుమీదుగా వెళ్ళదు. అసలు మొదట ట్రైను వేసినప్పుడు వాళ్ళ ఊరిమీదుగానే వేస్తానంది గవర్నమెంటు. ట్రైను వేస్తే యింకేమైనా వుందా? ఊరంతా నాశనం అయిపోదూ? ధరలన్నీ మండిపోవూ, ససేమిరా మాకు ట్రైను వద్దన్నారు ఈ ఊరి పొలిటీషియన్లు. పెద్ద మనుషులు మతంచేత ఆ ఊరికి పదిహేను మైళ్ళు పక్క నుంచి పోతుంది ట్రైను. ఆ పదిహేను మైళ్ళు బస్సులో వెళ్ళాలి.

పలుకుబడితోనో, పెట్టుబడితోనో మెడికల్ సీటైనా సంపాదించవచ్చునేమోకాని ట్రైన్లో బెర్తు మాత్రం సంపాదించడం కష్టం. మినిమమ్ వారంముందు రిజర్వు చేసుకోకపోతే. "లేడికి లేచిందే ప్రయాణం, కాళ్ళకి నిల్చోడ వేఁగతి"

జగన్నాథం ముందుగా రిజర్వు చేయించుకోలేదు. ప్రయాణం ఎప్పుడో ఖచ్చితంగా తెలీకపోవడం వల్ల. అతనికి పలుకుబడి లేదు, పెట్టుబడి పెట్టడం యిష్టం లేదు. అంచేత అతి కష్టంమీద అర్ధరాత్రి దాటేక కూర్చోడానికి మాత్రం చోటు దొరికింది.

మార్నాడు సూర్యోదయం వేళకి ట్రైనుదిగి బస్స్టాండు చేరారు ఇద్దరూ.

ఈ ఊరి మేప్‌లో అది మున్సిపల్ రోడ్డు.

ఆ ఊరి ప్రజలకది బస్స్టాండు.

ఆ రోడ్డంతా ఒకదానివెనుకొకటి, ఒకదానికడ్డంగా యింకొకటి అడ్డదిడ్డంగా బస్సులు వుంటాయి.

వర్షాకాలంలో బస్సుస్టాండు నీళ్ళలో వుంటుంది. మిగతా కాలాల్లో నీళ్ళు బస్సుస్టాండులో వుంటాయి.

రోడ్డుకి కుడివైపు నున్న చిన్న ఖాళీ స్థలంలో ఓ పాక వుంది. ఆ పాకకి కింద పదిరాటలు పైన ఓ పాతిక తాటాకులు వున్నాయి.

అది ప్రయాణీకుల సౌకర్యార్థం లేటు సూరిశెట్టి గారి కుమార్డు లయన్ శ్రీరామిశెట్టి అండ్ సన్స్ క్లాత్ మర్చంట్స్ వారిచే ధర్మం చెయ్యబడింది.

ఆ పాకలో పగలు పశువుల, రాత్రి ముష్టివాళ్లు మరియు పశువులు వుంటాయి.

దానికి పక్కన కొంచెం లోపలికి బ్రాహ్మణ కాఫీ హోటలు ఉంది. దాని ముందు ఓ సిమెంటు బెంచీ, ఓ కర్ర బెంచీ వున్నాయి. ఆ రెండు బెంచీల వెనుక ఓ అద్దాల బీరువా వుంది. బీరువా మీద లక్ష్మీదేవి.... పొగకో, ఊదొత్తుల పొగకో మసిబారి పోయి హోటలు పనిమనిషిలా వుంది.

ఆ బీరువాలో పొగచూరిన అద్దాల వెనుక నాచురంగు ఇత్తడి పళ్ళేలలో నిన్నటి పకోడీలు, మొన్నటి వడలు వున్నాయి. సిమెంటు బెంచీకి కొంచెం వెనగ్గా కుర్చీమీద కూర్చొన్న నలబై నెంబరు నేతపంచె కట్టుకున్నతను ఆ హోటలు ప్రొపైటరు. ఈ హోటలు నిజంగా బ్రాహ్మలదే అనుకోవడానికి నిదర్శనం అతని నుదుట అడ్డంగా వున్న విబూది రేఖలు. మెళ్లో వున్న జంధ్యం. బ్రాహ్మణ చిహ్నంగానే కాకుండా, దురదేసినప్పుడు వీపు గోక్కోవడాని క్కూడా పనికొస్తుంది జంధ్యం.

సిమెంటు బెంచీనానుకునే వున్న కాసులు కిల్లా కొట్లో కిళ్లీలే కాకుండా సిగరెట్లు, బీడీలు, చుట్టలు, పదిపైసల సోడాలు, రూపాయి సోడాలు కూడా అమ్మబడును. ఈ బడ్డీకొట్టుని అను కునే వున్న వరాలమ్మ కిల్లీ షాపులో పైన చెప్పినవే కాకుండా అదనంగా డిటెక్టివ్ పుస్తకాలు అద్దెకి దొరుకుతాయి. వరాలమ్మ, కాసులమ్మ వ్యాపారంలో కాకుండా జీవితంలో కూడా పోటీదార్లే. వాళ్ళిద్దరి జమిలి మొగుడు జగ్గారావు రెండు కేట్ల మధ్య కూర్చుని యిద్దర్నీ తిడుతూ, యిద్దరి దగ్గర డబ్బు వడుక్కొని పోతాడు.

రోడ్డుకి అవతల పక్కన ఓ టిన్ రేకుల షెడ్డుంది. ఆ రేకులు క్రితం జన్మలో తారుడబ్బాలు. ఆ షెడ్డు ఓనరు పూర్వాశ్రమంలో పి.డబ్ల్యు.డిలో రోడ్డు మీద పనిచేసే మేస్త్రీ. ఆ షెడ్డుకి ముందు ఓ రాటకి కట్టిన బోర్డు మీద రాజుల మిలటరీ భోజన హోటలు అన్న బోర్డు, దానికింద మీల్స్ రెడీ అన్నబోర్డు కూడా వుంటాయి. ఆ హోటలుకి రాజులు, మిలటరీ వాళ్ళు వస్తారో, రారో తెలీదు కాని కండక్టర్లు, క్లీనర్లు, డ్రైవర్లు మాత్రం వస్తారు.

"యివేళ మన అదృష్టం బావుంది" అనుకున్నాడు జగ న్నాథం. బస్సుస్టాండులో తనూరు వెళ్ళే బస్సును చూడగానే.

"బైల్దేరిన వేళ మంచిదే" అనుకుంది జానకి ఆ బస్సు ఖాళీగా ఉండడం చూచి.

ఇంకా ఎంతసేపట్లో బైల్దేరుతుందోయ్ అడిగేడు జగన్నాథం ఆక్కడే వున్న ఓ కుర్రాడ్ని.

ఆ కుర్రాడు తొడుక్కున్నది పైజామానో, పేంటో చెప్పడం కష్టం. దాన్ని వాడికెవరో మారాజు యిచ్చేడు. కుట్టించి నప్పుడది ఏ రంగులో వుందో కాని యిప్పుడు మాత్రం బ్లాక్ అండ్ వైట్‌లో తీసిన సినిమాకి పంచరంగుల ప్రింటు వేసినట్టుంది. లేటెస్టు తెలుగు సినిమాల్లో సెక్సుపాట పాడుకుంటూ బస్సుకి స్నానం చేయిస్తున్నాడు వాడు.

పాట మంచి తారాస్థాయిలో వుందేమో జగన్నాథం మాటలు వాడికి వినిపించలేదు.

మళ్ళీ అడిగేడు జగన్నాథం.

"అబ్బో ఇప్పుడప్పుడే బైలెల్దండి" అన్నాడు వాడు బానెట్ పాలిష్ చేస్తూ.

"ఎన్ని గంటలకి వెళ్తుంది?"

"పేట బండి రావాలగదండి మరి"

"అదెప్పుడొస్తుంది?"

ఆ కుర్రాడు బానెట్ పాలిస్ ఆపి జ్ఞాపకం చేసుకోవడానికి అన్నట్టు ఓసారి బుర్ర గోక్కున్నాడు. జ్ఞాపకం రాలేదు.

ఓసారి ఆకాశంలోకి చూశేడు. అక్కడ బండి కనిపించ లేదు. కాని మండిపోతున్న మందార పువ్వులా సూర్యుడు కనిపించేడు.

"అబ్బో, శానా పొద్దెకుద్దండి" అన్నాడు బానెట్ దిగిపోయి.

"పోనీ... ఊరెళ్ళే బస్సు ఎప్పుడొస్తుందో తెలుసా?" అని తన ఊరిపేరు చెప్పాడు జగన్నాథం.

"తమరగోరు ఆవూరెళ్ళాలేటండీ? అని పరామర్శించి ఆలాగైతే ఎనిమిది గంటల బూరాటయాముకి పట్నం బండొ స్తాదండి. ఆదెక్కేసేయండి. శార్జీ కూసింత ఎక్కువే అయిన సల్దిటయాముకెల్తారు" అని తరుణోపాయం కూడా చెప్పాడు.

టైము చూసుకున్నాడు జగన్నాథం ఏడైంది.

"అబ్బ ఇంకా గంట కూర్చోవాలా?" గొణుక్కుంది జానకి. బస్సెక్కడ దొరకదో అన్న తొందర్లో రైల్వేస్టేషన్‌లో కాఫీ అయినా తాగలేదు వాళ్లిద్దరూ. అంచేత ఆకలి దహించేస్తోంది. మామూ

లుగా ఇంటి దగ్గరైతే కాఫీ కప్పు చూస్తేనే గాని మంచం దిగడు జగన్నాథం. అందుకే పొద్దున పాలు వచ్చేవరకు అతన్నెవరూ లేపరు. కాఫీ ఆలస్యం అయితే అతని కోపం డేంజర్‌లెవల్ దాటిపోతుంది. – అంచేత

"పోనీ కాఫీ తాగితే..." అని ఆపేసింది జానకి.

అతనికీ తాగుదామనే వుంది. కాని ఆ బ్రాహ్మణ కాఫీ హోటలు చూస్తే, అక్కడ ఓసారి కాఫీ తాగితే మరింక జన్మలో కాఫీ ముట్టుకోవేమో–అన్న భయం పట్టుకుంది. కాఫీ తాగు దామా మానేద్దామా అన్న డైలమాలోంచి జగన్నాథం బైటపడ కుండానే పట్నం బండొచ్చేసింది.

దూరంగా ఎక్కడో కూస్తున్న సైరను పిచ్చివాడి ఏడుపులా విషాదంగానూ, దీనంగానూ వినిపిస్తోంది.

జగన్నాథానికి బస్సు కనబళ్ళేదు. మనుషులే కనిపిస్తు న్నారు. మనుషులంతా చేరి బస్సాట ఆడుకుంటున్నారా అన్నట్టు. ఆ బస్సుకి పైనా, కిందా, బైటా, లోపలా ఎటుచూసినా మనుషులే. వాళ్ళని చూసిన జగన్నాథానికి తక్షణం వెనక్కి తిరిగి కనిపించిన రైలెక్కి పారిపోదామని పించింది.

ఇంతలో ఆ ప్రవాహంలో నుంచి "ఎవరూ దిక్కండి. బండెల్లి పొద్ది" అని అరుస్తూ తనుమాత్రం దిగి ఎదురుగా వున్న బ్రాహ్మణ కాఫీ హోటలు బెంచీమీద కూలబడి 'ఓటీ' అట్రా అన్నాడు కండక్టరు.

అగ్రనటుడి చుట్టూ ఆటోగ్రాఫుల కోసం మూగిన అభి మానుల్లా అతన్ని జనం చుట్టేసేరు.

అలనాడు అభిమన్యుడికి పద్మవ్యూహంలోకి వెళ్ళడం తెలుసు. బైటికి రావడం తెలీదు. కానీ ఈనాడు జగన్నా ధానికి ఈ పద్మవ్యూహంలోకి వెళ్ళడం కూడా తెలీదు.

టికెట్ తీసుకోండి అంది జానకి బస్సెళ్ళిపోతుందేమోనన్న భయంతో.

"ఏటి బాబూ అలా నిలబడిపోనారు?" అంటూ పలకరిం చేడు యిందాకటి కుర్రాడు.

"జనం తగ్గనీ" గొనిగేడు జగన్నాథం.

"వెనకటి కెవరో మీలాంటి ఇల్లాలే ఈ కెరటాలు తగ్గినాక స్నానం చేస్తాను అని సముద్రపుటొడ్డున కూర్చుందిట" మనసు లోనే విసుక్కుంది జానకి.

"నాను బట్టుకొస్తా ఇలాగియ్యండి" అని అభయం ఇచ్చిన కుర్రాడు జగన్నాథం దగ్గర డబ్బు తీసుకొని పద్మ వ్యూహంలోకి చొరబడిపోయేడు అభిమన్యుడిలా.

రెండు నిమిషాలు గడిచేయి.

అభిమన్యుడు రాలేదు.

మూడో నిమిషం సగం గడిచింది.

"వాడా డబ్బులు తీసుకొని పారిపోలేదు కదా!" పైకే భయ పడింది జానకి.

"నోర్మూసుకో"

మూడో నిమిషం పూర్తయింది.

చొక్కా జేబీ సింసేసినారు ఎదవ నాకొడుకులు. అంటూ రెండు టిక్కెట్లతో ప్రత్యక్షమయ్యేడు అభిమన్యుడు. "మహా ప్రసాదం" అన్నంత భక్తిగా ఆ టికెట్లని తీసుకున్న జగన్నాథం ఓ రూపాయి వాడికివ్వబోయేడు.

వాడోసారి ఆ రూపాయివేపు ఆశ్చర్యంగా చూసేడు.

ఆ తరువాత చిరిగిర జేబునోసారి సరిజేసుకున్నాడు.

"మంచోరే. యిదోపెద్ద పనేటి?" అంటూ సిగ్గుపడిపోయి రూపాయి తీసుకోకుండానే వెళ్ళిపోయాడు.

వాళ్ళ ఊళ్లో గాస్ సిలిండర్ తెచ్చినప్పుడల్లా రూపాయి పుచ్చుకొనే గాస్ వాడు జ్ఞాపకం వచ్చేడు జానక్కి.

యిచ్చినా పుచ్చుకోలేదు వీడు.

యివ్వకపోతే వూరుకోడు వాడు.

ఎంత తేడా?

అంతవరకు టికెట్ ఎలా దొరుకుతుందా అన్న బెంగ యిప్పుడు బస్సు ఎలా ఎక్కడం అన్న బెంగగా పెరిగింది.

అప్పటికి ఆ బస్సులో వున్న జనం రెండు బస్సులకు సరి పోతారు.

కొంపతీసి టాపుమీద కూర్చోమనడు కదా!

అసలు వీళ్ళని అని ప్రయోజనం లేదు.

వీళ్ళదగ్గర డబ్బులు కొట్టేసి రూట్లు యిచ్చిన ఆ మహాను భావుల్ని ఈ బస్సుకిందే తొక్కించేయ్యాలి.

కాఫీ తాగేసి, కారాకిల్లీ నముల్తూ బస్సు వేపు నడిచేడు కండక్టరు.

జానకీ, జగన్నాథం అనుసరించేరు.

"టికెట్లు అయిపోనాయి బాబూ" అన్నాడు వాడు.

చూపించేడు జగన్నాథం.

వెంటనే కిటికీలోంచి బుర్రపెట్టి "కుసింత సర్దుకో మామ్మా... అంతసోటుంచుకొని అలా కర్రోలులా నిలబడిపోతావేటి అమ్మడూ... జరుగు... జరుగు... ఒరే గుంటాడా నువ్వా మూట మీద కూకో ... సూడు అమ్మన్నా... నువ్వా బొట్టిడ్ని ఒళ్ళో కూకదుబెట్టుకో... అంటూ జనాన్ని నోటితోనే సర్దేసి వాళ్ళకి బస్సెక్కడానికి మాత్రం చోటు చూపించేడు.

జగన్నాథం పక్కన నిల్చున్నావిడ....

ఆవిడ.

ఒంటికి బంగారం రంగుంది.

ఒంటి నిండా బంగారం వుంది.

వాల్జడలో ఎర్ర చేమంతి పువ్వుంది.

నెత్తిమీద చంద్రవంక వుంది.

పక్కనే పాపిడిపిందెలున్నాయి.

పాదాలకి మామిడి పిందెలున్నాయి.

పాదాలపైన పట్టుపరికిణి వుంది.

దానిపైన శిల్కువోణీ వుంది.

ముద్దంటే ఏమిటి?

ఆడదాని చెంపకి మొగాడి పెదిమలు తగలడం (అట్నుంచి యిటైనా సరే) ముద్దయితే, జగన్నాథం తన పక్కన నిల్చున్న యాభైయేళ్ళ రాజుల ఆడమనిషిని ముద్దు పెట్టుకుంటున్నట్టే లెక్క. అంత కిక్కిరిసి పోయింది బస్సు.

లాగించీ గురూ. గావుకేక పెట్టాడు కండక్టరు.

లాగించేసేడు గురుడు.

టికెట్ లేనోళ్ళంతా దిగేయిండి. అవతల సెకింగుంది. మమ్మల్నట్టుకొని కొట్లో బడేస్తే మరింక ఒగ్గించడానికే బాబు రాడు. అందులోనూ ఆ బాబున్నాడే కడుపుతో వున్న ఖడ్గ మృగంలా వుంటాడు. బాబుకి ఒళ్ళంతా కడుపే. కడుపు నిండా ఆశే..." శతకం ప్రారంభించేడు కండక్టరు.

"చెక్కింగు టికట్లకీగాని ఓవర్‌లోడ్‌కి లేదేమిటోయ్?" ఒకడి ధర్మసందేహం.

దగ్గర్లో ఎక్కడేనా భూకంపంగాని వచ్చిందా బస్సు అంతా కుదిపేసింది? బస్సులో వున్న ఆ పసిపిల్ల ఎందుకలా కెవ్వు మంది చీమ ఏదైనా కుట్టిందా?

ఏం కాదు కండక్టరు నవ్వేడు.

అలా ఓ ఆరు నిమిషాల సేపు నవ్వేక. "ఇది ఓవర్ లోడింగా, ఇంకా నయ్యం నూకాలమ్మ సంబరాలప్పుడు చూడు. అదీ ఓవర్ లోడింగు అదిగో ఏ ఎనకాల కాంట్రాక్టు కనకయ్య గాడి బండొస్తది సూడు అదీ ఓవర్ లోడింగు" అని ఓవర్ లోడింగంటే ఏమిటో వివరించేడు.

ప్రభువు వారొస్తూంటే సలాం చేస్తున్న సేవకుల్లా తప్పు కుంటున్నాయి రోడ్డుకిటు అటు వున్న చెట్లు.

ప్రభువు వారు అలిసిపోతే విశ్రాంతి కోసం పరచిన పచ్చటి తివాసీల్లా వున్నాయి అక్కడక్కడ నారుమళ్ళు.

వరదటైములో నిండు గోదావరిలో తాపీగా, భారంగా వెళ్తోంది బస్సు.

దగ్గరలో ఎక్కడా గోదావరి లేకపోయినా ఎక్కడి నుండో వస్తున్న చల్లగాలి మాత్రం ఓల్డ్‌వైన్లా మత్తుగా తగుల్తోంది.

సీటుమీద కూర్చున్న పిల్లనిపెట్టేమీదికి మార్చి జానక్కి కూర్చోవడానికి చోటు చూపించాడు కండక్టరు.

బస్సంతా చుట్టపొగతోను, చుట్ట వాసనతోను నిండిపోయి చుట్టల ఫ్యాక్టరీలో కూర్చున్నట్టుంది జానక్కి. ఖాళీ కడుపుకి చుట్ట వాసన తోడై కడుపులో తిప్పేస్తోంది.

జానకి పక్కన కూర్చొన్న ముసలమ్మకి అరవై ఏళ్ళుం టాయి. వయసులో వున్నప్పుడు ఎంత బరువు మోసేయో కాని యిప్పుడు మాత్రం కావిడి బద్దలు దూరేటంత పెద్దవిగా వున్నాయి చెవుల కన్నాలు.

ఇప్పుడు బద్దల్లాగే ఉన్న భుజాలు వయసులో గుండ్రంగా వుండేవి.

కాలంలోని కడవంత కొప్పు యిప్పుడు ఊరు చిండి వడియంలా వుంది. వయసులో వున్న మంచితనం మాత్రం యింకా అలాగే వుంది.

ఆవిడనోట్లో మూరెడు చుట్ట పెట్టుకొని (నిప్పువైపు నోట్లో వుంది) గుప్పు గుప్పున రైలింజన్ లాగ మధ్య మధ్య కిటికీలోంచి తుపుక్కున ఉమ్మితోంది.

"ఏవూరు మన్ది?" పలకరించింది పక్కనున్న ఓ పాతికేళ్ళ పడుచుని ఉమ్మలకి, దమ్ములకి మధ్యలో.

ఆ పిల్ల పుట్టింది పల్లెటూర్లో, పెరిగిందీ అక్కడే. కాపరం మాత్రం పట్నంలో. ఆ అమ్మాయికి ఒళ్ళంతా కనిపించే నైలెక్సు చీర ...నేర్పింది. ఆ చీరలో మొకాళ్ళుల వరకే పరికిణీ వుంది. మెళ్ళో రూపాయి పూసల దండలు చాలా రంగులున్నాయి. తల్లో తట్టెడు చామంతి పుష్పాలున్నాయి.

ఈ పల్లెటూరి ముసలమ్మతో తనకి మాట్లామిటన్నట్టు ఆ పిల్ల జవాబు చెప్పలేదు.

"ఏడకెల్లాల?" మళ్ళీ అడిగింది పల్లె, పట్నం బేధం తెలీని ములసమ్మ.

చెప్పక తప్పలేదు.

"ఏటి పని నీ మొగోడికి?"

ఆ పిల్లకి మహా చికెగ్గా వుంది ములసమ్మ యింటర్వ్యూకి.

"అర్బర్లో ఉజ్జోగం"

బావుందమ్మా బావుంది. అని పట్నంలో ఉద్యోగం చేస్తున్నం దుకు మెచ్చుకుంది. ఆ తరువాత కాలుస్తున్న చుట్ట ఆర్పేసి కొంగు ముడేసింది.

కన్నోరింటి కెల్తన్నావేంటి?

ఔనన్నట్టు తలాడించింది పిల్ల.

ఆ పిల్ల చెప్పింది సగమే సత్యం. ఆ పిల్ల పుట్టినూరూ పాత రంకు మొగుడి దగ్గరికి వెళుతోంది.

అవును మరి, అల్లుడికి అత్తోరాశ. ఆడబొట్టెకి కన్నోరాశ. మళ్ళీ అభినందించింది ముసిల్ది.

ముసిల్దాని అభినందనకి ఆ పిల్ల మొహం కొంచెం విడింది.

"ఎన్నో ఏడు బొట్టుడికి?" ఆ ముసిల్ది క్రితం జన్మలో మేస్టరై వుంటుంది అనుకుంది జానకి.

బొట్టుడు జీళ్ళు తింటూ పాకం సీటుకి రాసేస్తున్నాడు.

"మొన్న సంకురేత్తిరికి మూడు జొరబడింది"

ములసమ్మ యింకా ఏం ప్రశ్నలు వేసునో కాని ఈ లోగా బస్సాగింది. తను దిగాల్సిన ఊరు అదేనేమో ఆ పట్నం పిల్ల చంకన పిల్లాడ్ని ఎత్తుకొని ఎళ్ళొస్తానవ్వా అని ముసలమ్మతో చెప్పి టాటా చెప్పరా, అంటూ కుర్రాడి చేత టాటా చెప్పించింది. ఆ కుర్రాడి తెలివికి చుట్టూ వున్న వాళ్లు మురిసిపోయారు.

"ఎళ్ళిరా అమ్మా, ఎళ్ళు నువ్వేళ్ళే తోవ సల్లగా వుండాలి. అమ్మ కడుపు సల్లంగ సుకంగా ఎళ్ళిరా" అంటూ దీవించింది ముసలమ్మ. అంతలో జ్ఞాపకం వచ్చినట్టు గబగబా కొంగు ముడివిప్పి ఓ అర్ధరూపాయి తీసి "ఇందరా బాబు మిఠాయి కొనుక్కో" అంటూ ఆ పిల్లడి చేతిలో పెట్టింది.

ఆ పిల్ల బస్సుదిగ్గానే ఓ డజనుమంది ఎక్కేసారు. పద మూడో వాడు పుట్ బోర్డుమీద ఓకాలుపెట్టి, రెండోకాలు గాలిలోకెత్తి వామనావతారం ఫోజులో "ఈ అడుగెక్కడ వెయ్యమంటావ్" అన్నట్లు కండక్టరు వేపు చూసేడు. ఎక్కడ పెట్టడమో చెప్పకపోతే బస్సు దిగేస్తాడమో నన్నట్లు ఆ కాలు గట్టిగా పట్టుకొని "పోనీ గురూ" అని ఓ పొలికేక పెట్టేడు కండక్టరు.

పోనిచ్చేసేడు గురుడు.

కండక్టరు కాలు వదిలేసేడు.

బలిచక్రవర్తియింత మోసం చేస్తాడనుకోలేదు పదమూడో వాడు.

అంచేత మూడో అడుక్కి బలిచక్రవర్తి బుర్ర బోరకని వామనావతారంలా గాలిలో వుంచేడు కాలు.

"గజం గట్టెకో పట్టుకో సామీ. మద్దెదార్లో గనుక యాక్సి డెంటైతే మాపిటేలదాకా కూడుండదు. పాసింజర్లకి" అంటూ పాసింజర్ల తిండి విషయం చాలా విచారించేడు కండక్టరు.

"బాబ్బాబు–బండాపు దిగిపోతాను. బతికుంటే మరో బండె క్కుతాను" బతిమాలేడు వామనుడు.

"మద్దె స్టేజీలో బండాగదు" రూలు చెప్పేడు.

ఈ వాదాపదాల్తో తనకేం సంబంధం తనకేం సంబంధం లేనట్టు నిదానంగా వెళ్తోంది బస్సు.

"గిద్ద పావలా అండి. బేరం నాకాడ వుండదండి" అన్న వేరుశనక్కాయల వాడి గొంతుక్కి తుళ్ళిపడ్డాడు డ్రైవరు.

"ఓరి సవటసన్నాసీ, నువ్వుండిపోనావేట్రా?"

"ఏటి? నన్ను దిగనిచ్చినాడేటి కండట్రుబాబు. ఒకటే కుక్కిడం బస్తాలో వంకాయలు కూరినట్టు. మరిప్పుడు నాను దిగాలంటే బస్సుతా ఒంపాల్సిందే" వివరించేడు వేరు శన క్కాయలు, ఓ వైపు బేరం చేస్తూనే.

మొత్తానికి కెలాగైతేనేం జగన్నాథం వాళ్ళ ఊళ్ళు చేరేసరికి తొమ్మిది దాటింది. డైరెక్టుగా స్వంత యింటి కెళ్ళడం యిష్టం లేదు. మరంచేత చిన్నప్పటి నుండి ఫ్రెండు, ఆ వూరి డాక్టరు రాజేశ్వర్రావు యింటికి వెళ్ళేరు.

## 7

"జననీ జన్మభూమి" అన్నారుట పెద్దవాళ్లు. ఈ పెద్దలకేం పనున్నట్టు లేదు. ఏదో ఒకటి అనడం తప్పిస్తే. ఏన్నో ఏళ్ళ తరువాత స్వంత ఊరేళ్ళిన సంతోషం అవగింజంత కూడా కలగలేదు జగన్నాథానికి. అసలు సంతోషమే కలగ లేదు. బోదకాళ్ళొచ్చిన చిన్ననాటి ప్రియురాల్ని చూసినట్టు బాధవేసింది. నిజానికి ఊరు ఈ మధ్యకాలంలో ఊహించ లేనంతగా అడ్డదిడ్డంగా పెరిగిపోయింది. ఊరినిండా పైరాఫీసు, ఫ్యామిలీ ప్లేనింగు, జూనియర్ కాలేజీ, కమర్షియల్ టాక్స్ ఆఫీసు, ఆడపిల్లల హైస్కూలు, ఆడవాళ్ళ క్లబు, వీధికొక వైన్‌షాపు, పేటకో సినిమాహాలు ఒకటేవిటి నానా గోత్రభ్యః వచ్చేశేయి.

ఇవన్నీ విలేజ్ డెవలప్‌మెంటు దృష్ట్యా బాగానే కనిపి స్తాయి. కాని ఏవిటో ఈ అభివృద్ధి అంత ఆరోగ్యకరం అనిపించలేదు జగన్నాథానికి. ఎనీమిక్ పేషెంటుకి సడన్‌గా ఒళ్ళు వచ్చేస్తే, చూడ్డానికి బాగానే వుంటాడు. కానీ లోపలంతా నీరే. ఆ మాటే అన్నాడు అతనారోజు సాయంత్రం తన ఫ్రెండు రాజేశ్వరరావుతో మాటలో సందర్భంలో.

దానికి రాజేశ్వర్రావు వయసులో వున్న సెలయేరులా గల గల నవ్వేడు. నవ్వడం అయిపోయేక తన కుర్చీ జగన్నాథానికి దగ్గరగా లాక్కొని ఒరే అబ్బాయ్! నీకీ ఊరు గురించి కొంచెం చెప్పాలి. మళ్ళీ నాకు జ్ఞాపకం వుండదు. టాపిక్ వచ్చింది కాబట్టి యిప్పుడే చెప్పేస్తాను. నా ఊరి గురించి నాకు చెప్పాలా అనకు. అప్పటికీ ఇప్పటికీ మారనిది పేరొక్కటే, మన చిన్నప్పటి ఊరుకాదు. అసలు నిజం చెప్పాలంటే ఊరే కాదు. పాపులపుట్ట. అదృష్టవంతుడివి కాబట్టి బైటికి దాటుకున్నావు. నేను బైటికి రాలేనంతగా కూరుకుపోయేను.

ఏదో స్వంత ఇల్లు, కన్నతల్లి అంటారు. కూటికి ఫరవా లేదుకదా అని ఆశ పడ్డాను. స్వంత ఇల్లు సంతకెళ్ళింది. కన్నతల్లి కాలం చేసింది. క్షణం సుఖం లేదు. కాణీ అర్జన లేదు. నా నర్సింగ్ హోమ్ చూశేవు కదా! ఓహ్! వాడికే విటండీ రోరింగ్ ప్రాక్టీసు అంటారు. కానీ చూసేవూ! జనం రోరింగే కాని డబ్బు కాదు, నేనెలాంటి వాడినో నీకు తెలుసు. డబ్బు కోసం ఏడవటం లేదు. అదేమిటో ఒక్క వెధవా మనస్ఫూర్తిగా డబ్బివ్వడు. నా చాకిరీది యివ్వకపోతేపోయె. కనీసం ముందు ఖరీదయినా యివ్వక పోతే మనకేం మందుల కంపెనీలున్నాయా ఊరందరికీ ఉచితంగా మందులివ్వడానికి? గోడౌన్సు నిండా మందులున్నా యనుకుంటారు, పూర్వంలా కాదు. ఇప్పుడు మందుల కంపెనీలూ తెలివి మీరిపోయేయి. ఆ రిప్రజేంటేటివ్‌గాడు వాడి అబ్బ సొమ్మేదో పోయినట్టు గీసిగీసి, మూడు టాబ్లెట్సు, ముప్పయి పాంపెట్లు యిస్తాడు. వాడిచ్చేవి మా ఆవిడ మింగటానికే చాలవు. ఈ నిజం ఎవరికీ తెలియదు. చెపితే నమ్మరు. ఎవడూ మందు కొనడు. అందరికీ సేంపిల్సు కావాలి. ఎవడూ అణా విదల్చడు. అందరికీ ఉచిత వైద్యం కావాలి. పోనీ నోరు, సిగ్గు విడిచి అడుగుదావంటే మనం ఈ ఊరివాళ్ళం. సగం మంది వేలు విడిచిన మేనమామలు, కానూ పట్టుకున్న మేనళ్ళులు మిగిలిన సగం స్నేహితులు.

డబ్బెలాగూ లేదు. కనీసం సౌఖ్యం. వుందా అంటే చచ్చి పోవడానిక్కూడా తీరకలేదు. యు ఆర్ ఏ లక్కీ ఫెలో. ఇష్టముంటే చేస్తావు. లేకపోతే మానేస్తావు. నీ హాస్పిటల్లో అంతా ఒక్కసారే చచ్చినా నీకొచ్చే పరువు నష్టం గానీ డబ్బు నష్టం కానీ ఏం వుండదు. ఇక్కడ అలాక్కాదు. వేసుకున్న మాత్ర నాలిక మీదుండ గానే ఒంట్లో వున్న జబ్బు తగ్గిపోవాలి. లేకపోతే మనకేం చేత కానట్టే లెక్క. దీనికి తోడు ప్రయివేటు విజిట్సు. ఈ మధ్య మనూర్లో చాలామంది అకస్మాత్తుగా పెద్ద లీడర్లయిపోయేరు. ఎవడింటికి రానంటే వాడికే మూడుమైళ్లు కోపం. శనక్కాయల ముక్కునే వెధవ షావుకారై ఎక్కిళ్లు కూడా ఎమర్జన్సీ అను కుంటాడు.

మన చిన్నప్పుడు స్కూలు దగ్గర పకోడీలమ్ముకొనే సుబ్బులు వెధవ జ్ఞాపకం వున్నాడా?

జగన్నాథం జ్ఞాపకశక్తిని ఎవరూ శంకించనవలసరం లేదు. అలా శంకిస్తే అతను అవమానం ఫీల్ అవుతాడు కూడా.

"చిన్న మెల్ల ఉండేది కదూ..."

జ్ఞాపకం చేసేడు జగన్నాథం.

"... ఉండేది కాబోలు వెధవకి, నేనేం వాడి లవర్నా ఏవిటి? కళ్ళలో కళ్ళు పెట్టి సూడ్డానికి? వాడిప్పుడు సుబ్బారావు బాబై పోయేడు. 250 పౌన్ల బరువైపోయేడు. ఈ ఊరికి పెద్ద బిజినెస్

మాగ్నెట్ అయిపోయేడు. రేపో ఎల్లుండో మినిష్టరయిపోయినా ఆశ్చర్యపడక్కర్లేదు"

"నువ్వీ మధ్య ఎవైనా కథలుగాని రాస్తున్నావేమిట్రా?" అడ్డొచ్చేడు జగన్నాథం. అసలింతసేపు యింకొకడు చెప్తున్నది వినడమే ఆశ్చర్యం వేసింది జానక్కి.

"కుళ్ళు జోకులు మాని విను..." మళ్ళీ ప్రారంభించేడు రాజేశ్వరరావు... ఎలా అయ్యేడో చెప్తావిను. వాడు కాలం వచ్చేక పకోడీలమ్మటం మానేసి ఓ పాక హోటలు పెట్టేడు పెట్టిన వెధవ పెట్టినట్టూరు కోకుండా పక్క వీధి. మిలియనీర్ ముండని పట్టేశేడు. ఆ ముండకి వీడి మెల్లకన్నే నచ్చిందో, మిరపకాయల బజ్జీలే నచ్చేయో తెలీదు కాదని మరివీడ్ని వదల్లేదు, పురుగును పట్టుకొన్న బల్లిలాగ.

దాంతో వీడు తపస్సు చేసిన రాక్షసుళ్ళా పెరిగేశేడు.

వీధిలో మందుల షాపూ, మలుపుకో ముండలకంపెనీ పెట్టేసి. కంట్రాక్టరయిపోయి ఛైర్మన్ అయిపోయి, ఆనాటి ఐ.సి. వెధవ యిప్పుడు వి.ఐ.పి. అయి కూర్చున్నాడు. కాని ఏ మాటకా మాటే చెప్పుకోవాలి. శెనక్కాయల్నాడూ నేనే వాడి డాక్టర్నీ, ఛైర్మెన్నాడూ నేనే.

అప్పుడూ ఫీజు లేదు, ఇప్పుడూ లేదు.

భేదం ఏమిటంటే అప్పుడే ఏంవచ్చినా మన దగ్గరకు వచ్చేవాడు. ఇప్పుడు ఏం రాకపోయినామనం వాడి దగ్గరకు వెళ్ళాలి.

మేడలు కట్టేగానేసరా మెంటాలిటీ లెక్కడికి పోతాయి.

"మొన్నేమైందో తెలుసా? వాడి కూతురు అంటే వాడి ముండ గారి మొదటి మొగుడి కూతురి కుక్క కడుపుతో వుందట. నన్ను పశువుల డాక్టరనుకున్నాటో ఏమిటో కుక్కని చెకప్‌కి పంపిస్తానన్నాడు..."

ఎవడబ్బీవాడు. గుర్తుకు రావడం లేదు అన్నాడు మధ్యలో జగన్నాథం.

మధ్యలో నన్నాపకు. ఆ వెధవని తలుచుకుంటే నాకు ఒళ్ళు తెలీదు. క్రితం వారం ఏమైందో తెలుసా? అస్పత్రిలో చచ్చి చచ్చి మధ్యాహ్నం మూడయింది. పిండాకూడు కోసం కొంప చేరుకొనేసరికి. రాగానే "సుబ్బారావు గారు మూడు సార్లు ఫోన్ చేశారు మిమ్మల్ని రమ్మని" అంటూ మా ఆవిడ సందేశం. అశ్రద్ధ చేద్దావంటే వాడికి పావుగంటకో సారి పాల్పిటేషను, అరగంటకోసారి అస్మాను, దానికి తోడు హార్టు ఎటాక్‌వచ్చి అర్నెల్లు కూడా కాలేదు. ఈ ఆర్నెల్లలోనూ వాడిచేత పది పౌన్లు తగ్గించే సరికి, నేను వందపౌన్లు తగ్గిపోయేను. ఏం ఎమర్జెన్సీనో నని ఫోన్ చేద్దామంటే ఫోను చెడిపోయింది. చచ్చినట్టు మండు టెండలో వాడింటికి వెళ్ళి చూద్దును గదా – ముగ్గురు పెళ్ళాలు కడుపుతో వున్న ప్పటి దశరథ మహారాజులా నిండుగా వున్నాడు. గాడిద కొడుకు మీదు మిక్కిలి వెళ్ళగానే పాలిటిక్స్‌లోకి దిగి నక్సలైట్ల గురించి మాట్లాడ్డం మొదలు పెట్టేడు. నేనే నక్సలైటై ఒక్క పోటు పొడిచేద్దామనుకున్నాను. వెధవని, వాడు లెక్చరాపేక.

"ఎందుకు రమ్మన్నారట" అన్నాను.

"గేదీస్తున్నాది..." అన్నాడు. ఆ పుట్టబోయే దూడకి తనే తండ్రినయినంత సంతోషంగా.

"పశువుల డాక్టరుకి కబురు చెయ్యండి" అంటూ లేచాడు.

"అబ్బే, అదికాదు. జున్ను తినొచ్చునేమో అడుగుదామని..." నసిగేడు.

ఆ అప్రాచ్యపు వెధవ జున్ను తినొచ్చునో, కూడదో చెప్ప డానికి వేసంగి మిట్ట మధ్యాహ్నం మూడు గంటలకి కబురు పెట్టాలా?

వీడ్ని జున్ను తినొద్దంటే నా కోపం తీరదు. అంచేత "నమిలి ఉమ్మెయ్యండి, మింగొద్దు" అని వచ్చేశాను.

వాడికదే పనిష్మెంటు.

జున్ను నమిలి మింగకుండా ఉమ్మెయ్యడం ఎంత శిక్షో ఊహించుకో.

ఇంతకీ వీడి ఒక్కడ్నీ అనుకొని ఏం లాభం? ఊరంతా అలాగే వున్నారు.

ఇదంతా ఎందుకు చెపుతున్నానంటే నువ్వు ఇక్కడ నాతో సహా ఎవర్నీ నమ్మవద్దని చెప్పడానికి. మీరీపూటకి రెస్టు తీసుకోండి. రేపు ఆలోచిద్దాం ఏం చెయ్యాల్లో... అంటూ వెళ్ళ బోయినవాడు వెనక్కి తిరిగి "అన్నట్టు ఆ ప్రకాశరావుగాడికో కబురు పెట్టు రేపు ఇల్లు చూసుకోవడానికీ, మాట్లాడ్డానికీ వస్తున్నామని. నా అంచనా తప్పుకాకపోతే వాడీ పాటికే ఊరు దాటె య్యాలి" అని వెళ్ళిపోయాడు.

అతని మాటలు జానక్కి కూడా అర్థం అయ్యేయి. జగన్నా థానికి సగమే అర్థమయ్యేయి.

## 8

రాజేశ్వర్రావు అంచనా తప్పుకాలేదు.

నరుడుకంట నే పడకూడదు. నాకంట నరుడు పడకూడదు అనుకుంటుందిట నాగుపాము.

ప్రకాశరావు నాగుపాముకాదు.

అయినా అతను నరుడు జగన్నాథం విషయంలో నాగు పాము అభిప్రాయాన్ని అనుసరించాలనుకున్నాడు.

ఏదైనా సరే అనుకొన్నాక అలస్యం చెయ్యడం అతని పద్ధతి కాదు. అంచేత ఆలస్యం చెయ్యకుండా అత్తారింటి కెళ్ళిపోయేడు. జగన్నాథం ఊర్నించి వెళ్ళిపోయేక కబురు చెయ్యమని పెళ్ళాంతో చెప్పి.

మర్నాడు పొద్దున్న...

ఈ సంగతి తెలిసిన జగన్నాథం పైకి చికాగ్గా కనిపించినా, లోపల్లోపల సంతోషించాడు.

రాజేశ్వర్రావు మాత్రం చిందులు తొక్కేడు.

"డబ్బు తినీడం అనుక్కుడేమిటి రాస్కెల్ ఎదుట పడ్డం అంటే మొహం చెల్లొద్దూ. మీ మాటెలా వున్నా నేను మాత్రం డెట్టాల్ వేసి కడిగేసే వాణ్ని దొరికితే, మీన్‌ఫెలో, కనీసం ఎదుటపడి "సారీరా బ్రదర్ బుద్ధి డబ్బుతింది. క్షమించు" అని వుంటే వాడి నిజాయితీకి మెచ్చుకునేవాడిని. తప్పుడు పన్లు చెయ్యడానికీ, వెదవ్వేషాలు వెయ్యడానికీ కలేజా వుండాలి. పిరికి వెధవలు వెధవపన్లు చెయ్యకూడదు..." అంటూ అరగంట తిట్టేడు.

"మరింక వాడు లేకపోతే నేనెందుకు జానకీ. నువ్వే వెళ్ళి ఆ ఇంద్రభవనాన్ని చూసేసిరా" అంటున్న జగన్నాధాన్ని ఏ భాషలో తిట్టాలో తెలీలేదు రాజేశ్వర్రావుకి.

బిక్కమొహం వేసుకున్న జానకిని చూస్తే జాలేసింది.

"సిగ్గులేదురా నీకు ఆ మాట అనడానికి? నువ్వు దంపు నేను భుజాలెగరేస్తాను, అందిట నీలాంటిదే. ఖర్చులు దండుగ కాకపోతే నువ్వెందుకొచ్చినట్టు?"

"నేనేం చెయ్యనన్న కండిషను మీదేవచ్చేను" డిపెందు చేసుకున్నాడు జగన్నాథం.

కండిషనూ లేదు, కాకరకాయా లేదు. నీ యిల్లు నువ్వు చూసుకోడానికి వాళ్ళ పర్మిషను అనవసరం. ఈ హీరోగాడే వుండాలా? వాళ్ళ వాళ్ళతో చెప్పు" అంటూ జగన్నాథాన్ని లేసి తగిలేడు.

జగన్నాథం రథం కదలక తప్పలేదు.

"మేమేం యుద్ధానికి వెళ్తున్నామా? ఏమిటి? వీడుకూడా ఎందుకు?" అన్న జగన్నాధం సణుగుడు లక్ష్య పెట్టకుండా వాళ్ళింట్లోంచి బంట్రోతు అప్పికొండని తోడుయిచ్చేడు రాజేశ్వ ర్రావు.

అప్పికొండ అప్పిగాడుగా ఉన్న రోజుల్నుంచీ రాజేశ్వరా వింట్లో పనిచేస్తున్నాడు. అంచేత అతనికి జగన్నాధాన్ని బాగా తెలుసు.

"రండి బాబు ఎల్దా. మళ్ళీ పొద్దెక్కిపోతాది" అంటూ దారి తీశేడు భుజం మీది తువ్వాలు తీసి తలకి చుట్టుకుంటూ.

పొద్దున ఎనిమిది గంటలే అయినా వేసవి ఎండకి నెత్తి చుర్రుమంటోంది.

మండుతున్న మందార పువ్వులా ఉన్నాడు సూర్యుడు.

తెల్లారకుండా లేచి చల్దన్నం తిన్న పక్షులు చెట్ల కొమ్మల్లో చల్లగా కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నాయి.

యజమాన్లకి పాలిచ్చేసిన పశువుల మేతకి బైల్దేరాయి.

వాటిని తోలుకునే కుర్రాళ్ళు తలో గేదెమీద కూర్చుని చెరు గ్గడలు తింటూ, హెలీకాప్టర్లో కూర్చున్నంత దర్జాగా ఫీలవు తున్నారు.

ముందు అప్పికొండ.

వెనక జానకీ, జగన్నాథం.

పది గజాలు నడిచారు.

"ఇంత బేగి బైలెల్లినావేడకిరా అప్పిగా?" పరామర్శించిదో ములసమ్మ.

ఆవిడ నెత్తిమీద గడ్డిమోపుంది.

చేతిలో బొరిక ఉంది,

మొలకో మూరెడు గుడ్డ చుట్టుకుంది.

గుండెల మీద చిరిగిన గావంచాలాంటిది వేసుకుంది.

"జగన్నాథం బాబొచ్చేడు కదా ఎంకమ్మత్తా ఆ బాబుని ఆరింటికి తీసికెల్తున్నాను"

నెత్తిమీదున్న గడ్డిమోపు గభాల్న కిందపెట్టేసింది.

జగన్నాధానికి దగ్గరగా వచ్చింది,

ఏటన్నావూ? జగ్గుబాబా! నా బాబు నా బాబే ముసలి ముండనై పోనాను గదా సూపుఆనదు. జొన్న మొక్కనాగ ఎదిగి పోనావు. భూమ్మీద పద్ద కాడ్నించి నా పాలేకదా బాబు తాగింది. నన్నల్లంత దూరాన్నుంచి సూచి మీదడి పోయీవోడు. సల ్లగున్నావు. అంతే సాలుబాబు. అంటూ జగన్నాథం ఒళ్ళంతా తడిమి మెటికలు విరిచింది. మళ్ళీ ఏం జ్ఞాపకం వచ్చిందో "ఏటిబాబిలాసేసినావ్? ఈ అప్పిగాడి సేతైనా కబురుపెడితే, కాఫీకైనా కాసిని పాలంపక పోనానా? అంది చంటి పిల్లాడ్ని మందలించినట్లు.

జగన్నాధానికిదంతా ఏమిటోగా ఉంది.

ఆ ముసలమ్మ అభిమానానికి సంతోషంగానూ వుంది. ఇదంతా నడిరోడ్డుమీద జరుగుతున్నందుకు ఆక్వర్డు గాను ఉంది.

"అయితే ఎంకమ్మత్తా ఈ బాబు పాలతల్లివి నువ్వేనేటి? ఎప్పుడూ సెప్పేవేకావు" అని తనకింతవరకు ఆ సంగతి చెప్పనందుకు నొచ్చుకొని "నానూ నీకాడే కదేటిపాలు తాగి నాను" అని తను, జగన్నాథం ఒకే మనిషి పాలు తాగినందుకు పిసరంత గర్వపడ్డాడు అప్పికొండ.

జగన్నాథం తను ఒక తల్లికి పుట్టకపోయినా ఒక తల్లి పాలే తాగారు. అంటే అన్నదమ్ములకిందే లెక్క మరి. ఈ అభి ప్రాయం రాగానే జగన్నాధాన్ని ఎండలో నిలబెట్టి మాట్లాడు తున్నందుకు ముసలమ్మ మీద చికాకేసింది.

"అవును గాని ఏటిలా ఎండలా మాడబెట్టిస్తన్నావు. మాపి టేల డాక్టరు బోబింటికిరా ఒల్లమాలిన ఊసులా దుదువు గాని "అని" పదండి బాబూ" అంటూ దారితీశాడు.

ఇదంతా చూసిన జానక్కి అత్తగారి మాటలు జ్ఞాపకం వచ్చాయి.

"ఏమిటో మా కాలంలో యిన్ని పాలడబ్బాలు లేవు. ఇన్ని రకాల మందులు లేవు. తల్లి దగ్గర పాల్లేకపోతే పాల తల్లుల్ని పెట్టి పాలిప్పించే వాళ్ళం. దానిచేత రోజూ స్నానం చేయించే దాన్ని. దానిక్కడుపు నిండా తిండిపెట్టి యింటిలోనే వుంచుకునే దాన్ని" అనేవారావిడ.

"మరి దాని పిల్లకో?" అన్న జానకి ప్రశ్న కావిడ "ఏమిటో సృష్టి గమ్మత్తు. మన ఇళ్ళలో పురిటాలు కోసం ప్రత్యేకం ఓ ఆవునో, గెదెనో కొని తల్లికి పాలుంటాయని ఆ పాలన్నీ తాగిం చినా సరే గేదెలా బలిచి పోవడటమే కాని పాల చమ్మ కూడా ఊరదు. వాళ్ళు తినేది బోడి అంబలి, జొన్న సంగటి అయి తేనేం? వాళ్ళ గుండెల్నిండా పాలే. ఇద్దరు పిల్లలకి సరిపోతాయి. అయితే అక్కడక్కడా వాళ్ళ పిల్లలకి ఏ ఆవుపాలో పోసుకొని డబ్బు కోసం మన పిల్లలకి పాలిచ్చేవాళ్ళు వున్నారు. ఏమిటో పాపం వాళ్ళ దరిద్రం అంతే" అనేవారు.

ఆ ఊరొచ్చిన కొత్తలో ఈ సంగతి విన్న జానక్కి ఆశ్చర్యం వేసేది. పాలమ్మినట్టు మనిషిపాలమ్మడమా!

వినడానికి భయంకరంగాలేదూ!

ఈ పాల తల్లులు సాధారణంగా ఇళ్ళలో పనిచేసే పని మనుషులు. పాలు పోసేవాళ్లు అంటే కాపులు, గొల్లలు వగైరా తక్కువ జాతివాళ్ళే.

తమాషా ఏమిటంటే వాళ్లెవరూ వంటింటిలోకిగాని, భోజనాల గది, దేవుడి గదిలోకి అడుగెయ్యకూడదు. వీధి వరండా లోనో, పెరటి గుమ్మంలోనో కూర్చుని పాలిచ్చేసి పోవాలి.

మడి, మైల మనిషికేగాని పాలకిలేదేమో!

ఆ వూరి అదృష్టమేమిటో గాని ఇళ్ళలో వున్న అన్ని నూతు ల్లోనూ ఉప్పునీళ్ళే. ఎంత ఉప్పునీళ్ళంటే ఆమెరికా వాడ్ని తీసు కొచ్చి ఆర్నెల్లు ఆ నీళ్ళతో స్నానం చేయిస్తే ఆఫ్రికా వాడైపోతాడు.

మంచి ముత్యాల్ని వరుసగా మూఁడ్రోజులు ఆ నీళ్ళతో కడిగితే మసిబొగ్గు అయిపోతుంది.

అప్పట్లో ఆ ఊరికి కొళాయిలు రాలేదు.

మంచినీళ్ళు కావాలంటే ఊరి చివర, మధ్యన వున్న చెరువు నుంచి గాని, ఆ చెరువు గట్టునున్న నూతుల నుంచి గాని తెచ్చుకోవాల్సిందే.

మిగతా కులాల మాటెలా వున్నా బ్రాహ్మణ, వైశ్యులకు మాత్రం ఈ మంచినీళ్ళ పాపం మహా బాధగా ఉండేది.

వాళ్ళకి శూద్రుల చేత నీళ్లు కాళ్లు కడుక్కోవడానిక్కూడా పనికి రావాయె.

(వాళ్ళ గుండెల్లో పాలు పనికొస్తాయి,

వాళ్ళ ఒంటి ఒంపులు పనికొస్తాయి)

ముఖ్యంగా కాస్త కలవారింటి ఆడపడుచులు నెత్తి మీద బిందె పెట్టుకొని చెరువుకి వెళ్ళడమే?

ఎంత పరువు తక్కువ!

ఎంత అప్రతిష్ట!

మరైతే వాళ్ళు:దరూ మంచినీళ్ళు లేక మాడిపోవా ల్సిందేనా? ఎంత మాటెంతమాట?

భగవత్ సృష్టి బహు గొప్పది. అతి విచిత్రమైనది కూడా. ఆ సర్వాంతర్యామి ఎవరికోసం ఎవర్ని సృష్టించేడో తెలుసు కోవడం సామాన్య మానవుల వశమా?

పుట్టిన ప్రతి జీవికి ఒక పరమార్ధం ఉంది.

రాముడు రావణ సంహారానికే అవతరించేడు.

అమెరికాని కనిపెట్టడానికి కొలంబస్ పుట్టేడు.

పెద్దపులుల్ని పెంచడానికే మేకలు ఇంకా చిన్న చిన్న యితర జంతువులు పుట్టేయి.

పాములు ఆకలితో చావకుండా ఉండడానికే ఎలుకలు, కప్పలు పుట్టాయి.

తాతాలు, బిర్లాలు ఇంకా ఇతర ఘనమైన వారు ఘనంగా ఉండడానికే, వాళ్లు పేదవాళ్లు కాకుండా కాపాడ్డానికి పేద వెధవలు పుట్టారు.

అలాగే ఈ కాలంలో....

ఇప్పుడు ఇంటికి ఒకరో, ఇద్దరో ప్రౌఢకన్యలు, ముసలి యువతులు ఉన్నట్టు – అప్పుడు ఇద్దరు లేక ముగ్గురు గిరీశం భాషలో యంగ్ అండ్ బ్యూటిఫుల్ విడోస్ వుండే వారు.

వీళ్ళు కలవారింట్లో పుడితే, పప్పురుబ్బీ, ఓ పూట మడి కట్టుకొని వంటచేసీ, అప్పడాలు, ఆవకాయ, వగైరాలు పెట్టి, ఆ ఇంటి ఇల్లాలు అలిసిపోకుండా కాపాడేవారు.

లేనియింట్లో పుట్టిన వాళ్ళు ఆ కలవారింటి ఆడపడుచులు (విధవ, సదవలిద్దరూ) అప్రతిష్ట పాలవకుండా, వాళ్ళ ఇళ్ళకి సరిపోయే మంచి నీళ్ళు సప్లై చేసేవారు. వీళ్ళు తెల్లారకుండా మూడుమూరల మల్లుపంచె ఒంటికి చుట్టుకొని తడిబట్టతో మంచినీళ్ళు తెచ్చేవారు. అందుకే ఆనాడు చాలామంది మగ వాళ్ళు పళ్లు తోముకోవడానికీ, స్నానం చెయ్యడానికీ చెరువుకే పోయేవారు.

కొత్తగా అత్తారింటికి వచ్చిన జానక్కి, ఈ మనుషుల లాజిక్ బోధపడలేదు.

ఔను శూద్రులు గుండెల్లో పాలకి లేని మైల చేతినీళ్ళకా? అయినా నిప్పు, నీరూ, గాలీ, భూమీ వీటికి మడేమిటి? మైలేమిటి?

(చాలా మంది మడిగా నీళ్ళు తెచ్చుకుంటున్నప్పుడు తోవంతా నీళ్ళు చల్లుకుంటూ వెళ్తారు. అంతకు ముందు అక్కడ శూద్రులు నడిచేరేమో నన్న భయంతో)

ఉండబట్టక ఓసారి అత్తగారితో అంది "మనం ఆ మంచి నీళ్లావిడ కోసం అలా పడిగాపులు పడి కూర్చోక పోతే హాయిగా పనిమనిషి చేతతెప్పించుకోవచ్చు కదండీ. ఆ డబ్బేదో దీనికే ఇవ్వవచ్చు" అని.

జానకి అమాయకత్వానికి సుభద్రమ్మ గారు నవ్వేరు. పట్టణ వాసంలో పెరిగిన పిల్ల కదూ. బొత్తిగా ప్రపంచ జ్ఞానం లేదు అనుకున్నారు.

"ఈ ఊరు పద్దతే ఇది. మన అన్నం మనం తిని, మన బట్ట మనం కట్టుకున్నా ప్రపంచానికి జడవాలి. ఆ సుభద్రకేం పోయేకాలం శూద్ర నీళ్లు తాగుతోందని కాకుల్లా పొడిచేస్తారు మనవాళ్ళు. నలుగురితో పాటే మనమూను" అన్నారావిడ.

ఈ ముసలమ్మని చూసిన జానక్కి అదంతా జ్ఞాపకం వచ్చి నవ్వుకుంది.

"మరండీ, అల్లదుగో అదేనండి శెట్టిగారి చినీమా. అందులో రంగు బొమ్మలు కూడా ఆడతాయటండి. శానా కూడబెట్టి నాడండి దగాకోరుగాడు" అంటున్న అప్పికొండ "అటేడకండి మన యీది ఇటైతే" అన్నాడు తిన్నగా వెళ్తున్న జానకితో.

ఇటు తిరిగింది జానకి. ఆ వీధంతా పెంకుటిల్ళు, మేడలు ఇదివరకు ఆ వీధిలో జగన్నాథంగారిదే ఓ పెంకుటిల్లు. పక్కనొక మేడాను. మిగతావన్నీ పాకలే. కంచర గాడిల మధ్య పందెపు గుర్రంలా ఆ కమ్మలిళ్ళ మధ్య వాళ్ళ ఇళ్ళు బహుదర్జాగా వుండేది.

ఇదేవిటి ? ఇది మీ వీధేనా?

"నేను నమ్మను" అంది జానకి.

"నేను నమ్ముతాను" అన్నాడు జగన్నాథం. "ఈ వీధి చివర కుళ్లు చెరువు యింకా అలాగే వుంది కాబట్టి" అని కారణం చెప్పేడు.

ముగ్గురూ మలుపు తిరిగేరు. ఓ ఇరవై గజాలు నడిచేక అది బట్టల షావుకారు పిండిమిల్లు కదూ" అంది జానకి యిటు అటు వున్న ఇళ్ళని చూస్తూ.

"ఇప్పుడది పిట్టలమిల్లండి" సరిదిద్దేడు అప్పికొండ.

"ఏ పిట్టలోయ్" జగన్నాధం సందేహం.

కోడిపిట్టలు బాబూ. ఆ సావుకోరండి ఉన్న అప్పులు నేవని, లేని అప్పులు వున్నాయని సెప్పి దివాలా తీయిస్సి నాడండి. మిషన్లన్నీ అప్పులోళ్ళు అట్టుకుపోయినారండి. మరింక ఆ సెడ్డులో కోడిపిల్లల్ని ఎట్టేసినాడండి. ఆ ఎనక జాగా కూడా కొనీసినాడండి. రేపో మాపో హోటేలెడతాట్ట. ఆలా మాట్లాడు తూనే ఓ యింటిముందాగేడు.

ఎద్దాగితే బండాగినట్టు అప్పికొండతో పాటు జానకీ, జగన్నాధం కూడా ఆగేరు.

"తమరుగోరు లోనకెల్లండి. నానిక్కడ కూకుడుంటాను" అంటూ నెత్తిమీద గుడ్డ తీసి అరుగుదులుపుకొని కూర్చు న్నాడు.

అప్పుడు చూశారు వాళ్ళ ఇంటిని.

ఇళ్ళకి పైన సాధారణంగా పెంకులో, రేకులో, సిమెంటు స్లేబో ఆఖరికి తాటాకులో, రెల్లుగడ్డో ఏదో ఒకటి వుంటుంది. ఈ ఇంటికి పైన యిందులో ఏ ఒక్కటీ లేదు. కసివింద, గాలి వాన, జిల్లేడు వగైరా మొక్కలు మనిషెత్తున వుండి అదేదో బొటినికల్ రూఫ్‌గార్డెన్లా వుంది. ఆ మొక్కలకి అడుగున ఏ వుందో తెలీదు.

"ఇదా మనిల్లు!" విస్తుపోయింది జానకి.

జగన్నాథం నిర్వికారుడు.

"ఇంటినిండా ఆ మొక్కలేవిటండీ...."

"దాన్ని రూఫ్‌గార్డెనంటారు. ఇది అసలు జపానువాళ్ళ అర్టు. పట్టణాల్లో అయితే పిట్టగోడమీద అక్కడో మొక్క ఇక్కడో గోలెంపెట్టి యిదే రూఫ్ గార్డెనంటారు. అసలూ...."

మీ లెక్చరు తరువాత వింటాను కాని ముందు లోపలికి పదండి.

"మొగాళ్లెవరైనా ఉన్నారో లేదో, నువ్వు లోపలికెళ్ళు. నేను ఇక్కడే ఉంటాను" అంటూ సిగరెట్టు తీసి వెలిగించేడు జగన్నాధం స్తంభాన్నానుకుని.

వాళ్ళు నిల్చున్నది వీధి వరండాలో. ఆ వరండాలో సిమెంటు వున్న మేరకాక ఓపది గోతులున్నాయి. ఒక్కొక్క గొయ్యి రెండు బిందెల నీళ్ళు ఈజీగా పడుతుంది. అయితే నీళ్ళు పొయ్యదల్చు కున్న వాళ్ళు మాత్రం ఏడింటిలోపే పొయ్యగలదు. ఎంచేతంటే మిగతా మూడింట రెంటిలో వీధి కుక్కలు పడుకొన్నాయి. అవి జానకిని ఒంటి కంటితో చూసి ఇంటిగలావిడ కాబోలు అను కొని తలపంకించి మళ్ళీ కళ్లు మూసుకొని పడుకొన్నాయి. మూడో గోతిలో మరో జంతువుంది. జానక్కి దాని వీపే కని పిస్తోంది. దూరనికది మరుగుజ్జు ఏనుగు పిల్లలా కనిపించి దాని దగ్గరకెళ్ళింది జానకి. పక్కనున్న కుక్కల్లాంటిది కాదది. దానికి మర్యాదలు తెలుసు. అంచేత జానకి దగ్గరికి రాగానే అది లేచి నిల్చొని ఒంటిని వున్న బురద ఒక్కసారి దులిపింది.!

అది ఒక మేలుజాతి పందిపిల్ల.

జానకి తెల్ల చీరమీద పడ్డ బురదచుక్కలు దూరానికి మోడరన్ డిజైన్లా కనిపించాన, దగ్గరకవి బురద చుక్కల్లాగే కంపు కొడు తున్నాయి. జానక్కి ఎప్పుడూ బూతులు తిట్టాలని వుండదు. అంచేత నాలుగు ఫర్లాంగుల నిట్టూర్పు విడిచింది. ఆ నిట్టూర్పు జగన్నాధంలోంచి దూసుకుపోయి, వీధికొట్లో సరసం చేసు కుంటున్న రెండు గాడిదలకి ఏ తగలకూడని చోట తగిలిందో కాని ఆవి రెండూ జట్ స్పీడులో జగన్నాధాన్ని, జానకినీ గుద్దేసి, అప్పికొండ నెత్తిమీంచి ఓ లాంగ్‌జెప్ చేసి రోడ్డుమీదికి పారి పోయేవి.

బోరున ఏడవాలనిపించింది జానక్కి.

లోపల ఏముందో తెలీని గుహలోకి వెళ్తున్న రాజ కుమా రుడిలా, నెమ్మదిగా అడుగులేస్తూ వీధి వరండాలోకి నడవలోనికి వెళ్ళింది. పక్క గదుల్లో మనుషులున్న అలికిడి వినిపిస్తోంది. కాని నడవలో ఎవరూ లేరు. నడవదాటి లోపల వరండాలో నిల్చుంది పెరటి వేపు చూస్తూ. నిజానికి ఈ పెంకుటిల్లు వెనుక అవతలి వీధి వరకూ లంకంత పెరడు వుండాలి. ఆ పెరటి నిండా మామిడి చెట్టు, ఉసిరి చెట్లు, సపోటా చెట్లు ఉండాలి. అందులో మామిడి మొక్కంటే జానక్కి చాలా ఇష్టం. అసలవన్నీ ఏవీ? ఎదురుగా కాకులు దూరని కారడవి, చీమలు దూరని చిట్టడవి.

మామిడి మొక్క మాత్రం వుంది కాని అవి పక్కింటి పెరటిలో వుంది.

వెనక కొంచెం పక్కగా వంటకీ, భోజనాలకీ వేరే చిన్న పెంకుటిల్లు కట్టించేరు సుభద్రమ్మ గారు.

ఆ ఇల్లయితే వుంది కాని ద్వారాలేవి? కిటికీలకి తలుపులేవి?

"చెదలు తినేశాయి" అన్నాడు అప్పుడే అక్కడికి వచ్చిన ఓ చెద పురుగులాంటి గుంటడు, బొంగరానికి తాడు చుడుతూ.

"చూడు బాబు,మీ అమ్మగారినోసారి పిలుస్తావా?" జానకి గొంతు జానక్కే వినిపించడం లేదు.

"అమ్మోయ్ః ఎవరో వచ్చేరే" అని ఓ గావు కేక పెట్టి తూనీ గలా పారిపోయేడు ఆ గుంటడు.

"ఎవ్రా? మడికట్టుకున్నాను కదా. ఎవరో అడగలేవూ? మళ్ళీ నేను స్నానం చెయ్యాలి" అన్న మరో గావుకేక. దాని వెనక ఓ నలభై ఏళ్ళ ఆవిడ వచ్చేరు.

ఆవిడ ఒంటిమీద తడిచీర యింకా నీరు కారుతుంది. జాకెట్టు లేని జబ్బలు చేవసరుగుడు కొమ్మల్లా వున్నాయి. చీరలేని మేర కనిపిస్తున్న మిుణుకుల కింద కాళ్ళు ఇనుప స్తంభాల్లా వున్నాయి.

మొత్తానికావిడ మడికట్టుకున్న ఖడ్గమృగంలా వుంది.

ప్రకాశరావు కుటుంబం జానక్కి తెలుసు. ఈవిడ ఎవరో? ఒక వేళ వంటమనిషేమో!

"ఈ ఇంట్లో వున్న వాళ్ళనోసారి పిలుస్తారా?"

"నేనే" ఖంగుమంది ఖడ్గమృగం.

"మరి ప్రకాశరావుగారు!"

"అదిగో అవతలి వాటాలో వుంటున్నారు" అంటూ మేడ యిల్లు చూపించింది.

పెంకుటిల్లు, మేడ వీధిలోకి రెండిళ్ళుగా కనిపించినా, లోప లంతా ఒకటే ఇల్లు.

మేము ఈ వాటాలో వుంటున్నాం అని ఓ నిమిషం ఆగి "మీరెవరూ?" అందావిడ.

"ఈ ఇంటిగలవాళ్ళం" అంది జానకి ధైర్యంగా. అంతవరకు యథాలాపంగా మాట్లాడుతున్న ఆవిడ మొహం కొంచెం చిట్లించింది.

"అలాగా" అంటూ లోపలికెళ్ళి ఓ కుర్చీ తెచ్చి "కూర్చోండి" అంది.

బతుకు జీవుడా అనుకొని కూర్చుంది జానకి.

"అవును గాని మీకెంత లక్ష్యం లేకపోయినా ఇల్లు ఇలాగేనా వుంచుతారు? మేము కాబట్టి ఈ ఇంటిలో వుంటున్నాం. కాని మరొకడైతే పారిపోతాడు. గోడలు చూడండి. రోజుకి బుట్టెడు బుగ్గి రాలుస్తుంది. వర్షం పడితే యింక ఇంటిలో పడవలేసుకొని తిరగాల్సిందే. మీరు బాగు చేయించరు. పోనీ మేమైనా బాగు చేయిద్దా మంటే ఎప్పటి అద్దె అప్పుడే పట్టుకుపోతారు. మీరు అద్దె ఇళ్ళలోనే వుంటున్నారుకదా! ఇలాంటి ఇంటిలో వుంటారా? ఎప్పుడో అప్పుడు నెత్తిమీద పడిపోతుంది. తప్పదు..." అంటూ పది నిమిషాలు దులిపేసింది ఆవిడ.

ఆవిడ చెప్పిందాంట్లో అబద్ధం ఏదీ లేనందువల్ల జానక్కి కోపం రాలేదు. కాకపోతే ఈ స్థితికి వచ్చే వరకూ తెచ్చు కున్న జగన్నాథం మీద చికాకేసింది.

"బాగుచేయిద్దామనే వచ్చేం లెండి" అంటూ లేచింది.

వాకిలంతా సిమెంటుతో కాకుండా నాచుతో చేసినట్టు ఆకుపచ్చగా వుంది. వాడుతున్న నీరంతా వాకిటిలోనే ఉన్న ట్టుంది. ఇల్లు మాట దేవుడెరుగు కాలు జారితే నడ్డి విరిగి పోతుందన్న భయంతో జానకి అతి జాగ్రత్తగా అడుగులు వేస్తూ వాకిలి దాటి మేడ యింటికి వెళ్ళింది.

మెట్లమీద నిల్చున్న జానకిని "ఎప్పుడొచ్చారూ?" అంటూ పరామర్శించింది ప్రకాశరావు భార్య.

"నిన్న" అన్న జానకి లోపకలికి వెళ్ళాలో లేదో తెలీక అలా మెట్టమీదే నిల్చుంది.

ఆవిడ జానకిని రమ్మన్లేదు, కూర్చోమనలేదు.

"ఓసారి ఇల్లు చూద్దామనీ..." ఘోరాపరాధం చేస్తున్న దానిలా గొణిగింది జానకి, వరండాలోకొచ్చి.

ఆవిడేం మాట్లాడలేదు.

"వంటెక్కడ చేసుకుంటున్నారు?"

అదిగో అక్కడ అన్నట్టు పక్కగది చూపించిందావిడ. అది జానకివాళ్ళ పడగ్గది. లోపలకడుగు పెట్టిన జానక్కి తల గోడ కేసి బాదుకోవాలనిపించిది. కాని మసి అంటుకుంటుందని మానేసింది. ఆ గది గోడలు, తలుపులు, కిటికీలు ఆఖరికి గోడకున్న మేకులు కూడా మసిబారి పోయి రాక్షసి బొగ్గుతో చేసినట్టు నల్లగా వున్నాయి. వాళ్లు వాడుతున్నది గాస్‌స్టవ్ కాదు కిరసనాయిలు స్టవ్ అంతకంటే కాదు. స్వచ్ఛమైన సాంప్రదాయ సిద్ధమైన కర్రల పొయ్యి.

లాభం లేదు వీళ్ళు తాజ్‌మహల్‌ని తారుడబ్బాలా చేసేస్తారు.

"వంటిల్లు వాడుకోవడం లేదా?"

"ఎలుకలు" అంది అక్కడేవున్న గజ్జెల గుర్రంలాంటి పన్నెం డేళ్ళ పిల్ల. ఆ పిల్లకి నోటినిండా పళ్ళే.రెండు వరసలు కాబోలు.

ఎలుకలున్నాయని ఇంటిని పాడు పెట్టుకుంటారా? ఎవరైనా. అవేం ఎలుకలా? పెద్ద పులులా?

ఏం ఇల్లాలివి నా తల్లే అనుకుంది జానకి.

ఇంకా ఏదో అడుగుదామనుకునేటంతలో "జానకీ" అన్న జగన్నాథం కేక వినిపించింది.

"వస్తానండీ. రేపటినుండి ఇల్లు రిపేరు చేయిస్తాం. సామా నదీ కొంచెం సర్దిపెట్టండి" అని వెనక్కి తిరిగి ప్రకాశరావు గారు ఎప్పుడు వస్తారండీ అని అడిగింది జానకి. దానికావిడ "ఏమో! తెలీదు" అంది మూతి తిప్పుకుంటూ

వాకిట్లో నిల్చొని పెరటిని పరీక్షగా చూస్తున్న జగన్నాథం దగ్గరికొచ్చింది జానకి.

## 9

జానకిని లోపలికి పంపిన జగన్నాథం సిగరెట్టు కాలుస్తూ వీధిని చూస్తూ నిల్చున్నాడు.

ఎంత మారిపోయిందీ వీధి. తన చిన్నప్పుడు తన ఇల్లు తప్ప మిగిలినవన్నీ పాకలే. ప్రతి వేసవికాలంలోను అధమం అరడజను సార్లన్న అంటుకొనిపోయేవి. అప్పుడే ఫైరింజన్ లూ లేవు. ఈ వీధి కొళాయిలూ లేవు. తన పెరటిలో నూతిలో నీళ్లు తోడి ఇళ్లు ఆర్పేవారు. నాలుగు బిందెలు తోడేలోపల నాలుగిళ్లు కాలిపోయేవి. ఇళ్ళలో సామానంతా గబగబా తెచ్చి తన పెరటిలో పడేసేవారు. తనూ, రాజేశ్వర్రావు మరికొందరు కలిసి యింకా అంటుకోని ఇళ్ళని తడిపేసే వారు. అవి అంటు కోకుండా. "కావాలంటే నీళ్లు తోడుగాని ఇళ్ళెక్కకురా. ప్రమా దాలు చెప్పిరావు" అని తల్లి తెగ బతిమాలేది. అయినా వినేవాడు కాదు.

ఎవరో పిల్లలు లేనివాళ్ళు రోజుకిన్ని ఇళ్ళు తగలబెడితే పిల్లలు పుడతారని కావాలనే తగలబెడుతున్నారని–ఎవరో కుష్టు వాడు రోజుకిన్ని అని తగలబెడితే నయమవు తుందని ఎవరో బైరాగి చెప్తే అంటిస్తున్నాడనీ ఒకటేమిటి.

ఎన్ని పుకార్లు? ఎంత సందడి?

రోజూ రాత్రి వంతుల ప్రకారం కాపలాలు.

కాపలాలు తిరుగుతూనే వుండేవారు. ఇళ్ళు తగలబడు తూనే వుండేవి. కాపలావాళ్ళే అంటిస్తున్నారని మళ్ళీ పుకార్లు. అదో జీవితం.

ఇప్పుడు ఊర్లో ఫైరింజన్లున్నాయి. వీధుల్లో కొళాయిలూ వున్నాయి. కాని అంటుకోవడానికి పాకలే లేవు.

వీధి గురించి బెంగపెట్టుకుంటున్న జగన్నాథం చేతికున్న వాచీ చూసి గతుక్కుమన్నాడు.

మైగాడ్! అప్పుడే జానకి వెళ్ళి అరగంట దాటింది. ఇంకా రాదేం.

కొంపతీసి వాళ్లందరూ కలిసి తన్నలేదు కదా!

గబగబా లోపలికి వెళ్ళేడు. ఎక్కడా జానకి జాడలేదు.

"జానకీ" అంత గట్టిగా కోపం లో కూడా పిల్చి ఎరుగడు.

ఆ కేకకే యిందాక ప్రకాశరావు భార్యతో మాట్లాడుతున్న జానకి బైటికొచ్చింది.

ఇద్దరూ వాకిట్లో నిల్చుని పెరడు చూస్తున్నారు. ఆ వీధిలో ఏ ఇంటికీ పెరటిలో హద్దుగోడలుండవు. చక్కగా అన్ని పెరళ్ళూ కలిసే వుంటాయి.

పక్క పెరటిలో నూతి దగ్గర కొంతమంది ఆడవాళ్లు, మగవాళ్ళు సరిగంగ స్నానాలు చేస్తున్నారు. అందులో ఒకావిడ జగన్నాథం పక్కింటావిడ. ఆవిడ చీర ఒంటిమీద గజం, నూతి గట్టుమీద అయిదు గజాలు వుంది. జాకెట్టు వగైరాలు నూతి చప్టామీద వున్నాయి.

ఆవిడ ఒంటిమీద తడిసిన చీర సిగ్గుతో ముడుచుకొని పోయింది.

వీపు మధ్య లోపలో నుంచి పడుతున్న నీరు బంగారు జల పాతంలా వుంది.

గుండెల మీద పడుతున్న నీరు రెండు కొండల మధ్య ప్రవ హిస్తున్న వాగులా వుంది.

ఆవిడ భుజాలు వేలాడుతున్న జుత్తుతో అక్కడక్కడ వున్న తెల్ల వెంట్రుకలు నల్లటి మబ్బుల మధ్య వెండి మెరుపుల్లా మెరుస్తున్నాయి ఆ ఎండలో.

ఆవిడ సబ్బువేసి తోముకుంటోంది.

నూతిగట్టుకి ఆవతలి వేపు ఉన్న తను ఏం కట్టుకున్నాడో తెలీదు. కనిపించినంత మేర దారప్పోగు కూడా లేదు. అతను

బకెట్‌తో నీళ్ళు తోడుతూ పక్కనే వున్న పాతికేళ్ళ అమ్మాయి మీద పోస్తున్నాడు. ఆ అమ్మాయి నవ్వుతూ తప్పించుకుంటూ, బిందెలో పొయ్యమంటోంది. వాళ్ళిద్దరి జలక్రీడలకి మిగతావాళ్ళు నవ్వుతున్నారు.

నూతి చప్టామీద ఒక అరవై ఏళ్ళ ముసలతను నేలని కాళ్ళు చాపుకొని కూర్చుని బీరపీచుతో ఒళ్లు తోముకుంటున్నాడు. అతను కట్టుకున్న అరగజం గావంచా కట్టుకోక పోయినా ఫరవాలేదు.

వాళ్ళని అలా చూసిన జాక్కి-జగన్నాధం అటే చూస్తు న్నాడు. బట్టలు విప్పుకొని బజార్లో నిలుచున్నట్టనిపించింది ఇక్కడి నుండి ఎంత వేగంపోతే అంత మంచిది అనిపిం చింది.

అంతలో సబ్బుతోముకుంటున్నావిడ జగన్నాధాన్ని పోల్చి నట్టుంది.

అయ్యో! నా మతి మండిపోతును సుభద్రమ్మ గారి కొడుకువి కదా నువ్వు - సబ్బు కాళ్ళకి పట్టిస్తోంది-ఆ అమ్మాయి మీ ఆవిడా? ఎప్పుడో చూసేను కదా పోల్చలేదు. పిల్లలెలా వున్నారు? సబ్బు చేతులకి పట్టిస్తోంది-అమ్మాయికి పెళ్ళి చేశేరా? చదువు తోందా? అదే మంచిదిలే - గుండెలు తోముకుంటోంది - ఏమిటో మీ అమ్మ, నాన్న పోయేక ఈ ఊరితో సంబంధం తెగిపో యింది మీకు. ఈ ఇల్లుండబట్టి ఇప్పుడైనా వచ్చేరు - నీళ్ళు పోసుకుంటూ సబ్బు కడుగుతోంది. "లేకపోతే ఎందు కొస్తారు? ఇల్లు బాగుచేయిస్తావా? బావుంది. ఎప్పటికైనా నీ ఇల్లే కదా. ఇంటికి ఒంటికి చేసుకుంటేనే అందం" అంటూ తన ఒంటికి వేసుకోవడం చాలనుకుందేమో గభాల్న ఒంటి మీదున్న తడి చీర నేలని వదిలేసి నూతి గట్టుమీదున్న పొడిచీర నిదానంగా కట్టుకోవడం ప్రారంభించింది.

అంత కోపంలోను అవన్నీ జ్ఞాపకం వచ్చి నవ్వుకుంది. పోదాం పదమని కళ్ళతోనే చెప్పింది. ఆ స్నానాల ఘట్టం దాటి ఇద్దరు వీధరుగు మీదకొచ్చేరు. ఎదురింటి వీధరుగు మీద కూర్చున్న ఓఇరవై ఏళ్ళ అమ్మాయి "మీరేనా ఇంటి వాళ్ళు ఇల్లు ఖాళీ చేయించడానికొచ్చేరటగా" అంది ప్రతి అక్షరం అరమైలు సాగదీస్తూ.

ఆ అమ్మాయి కట్టుకున్న చీర మొన్నటిది.

దువ్వుకున్న జుత్తు కూడా మొన్నటిదే.

చేతిలో వారపత్రిక మాత్రం రెండు వారాల క్రితంది.

పక్కనే చాప, చెంబు, గ్లాసు ఉన్నాయి.

సంగతి గ్రహించిన జానక్కి మళ్ళీ సిగ్గేసింది.

ఎవరికీ తెలియకూడని, తెలియవలసిన అవసరం లేని విషయాన్ని వీళ్ళు ఇలా రోడ్డెక్కిస్తారు!

అలా వీధిలో కూర్చోవడానికి సిగ్గెందుకు వుండదో!

జానకి కాపరానికొచ్చిన కొత్తలో ఇదికూడా ఓ ప్రోబ్లమ్ అయిపోయింది. డాక్టర్ల ఇళ్ళలో ఇలాంటివి అంతగా ఆలోచిం చలేదు కూడా.

పెళ్ళైన కొత్తలో ఓ అర్ధరాత్రి జానకి అతన్ని నిద్రలేపింది. "లేపి ఇప్పుడెలాగండీ?" అంది అతి దీనంగా. అవిడకి తనని అత్తగారు చాప, చెంబు ఇచ్చి వరండాలో కూర్చోపెట్టడం, కొబ్బరి చిప్పల్లో పులుసు, చారుపోసి విస్తట్లో అన్నం పెట్టడం, వచ్చేపోయే వాళ్ళు ఎప్పుడూ అనో, స్నానం ఎప్పుడూ అనో, అడగడం (మొగాళ్ళు కూడా అడుగుతారు ఖర్మ), ఏనాడూ పరుపు లేనిదే పడుకోని తను నేలని చాపమీద పడుకోవడం - వగైరా సీన్లు అరక్షణంలో అరవైసార్లు 70 ఎం.ఎం. లో కనిపించి గుండె బుల్‌డోజర్‌లా కొట్టుకోవడం ప్రారంభించింది.

కళ్ళలో నీరు తిరిగింది.

సగం నిద్రలో హఠాత్తుగా లేచిన జగన్నాధానికి విషయం అర్థం కాలేదు. అర్థం అయ్యేక జానకిని చూసి జాలేసింది. వెంటనే తల్లిని తల్చుకొని భయం వేసింది. అయినా జానకిని ఈ గండం నుంచి తప్పించడానికే నిశ్చయించుకున్నారు. కాని ఎలాగో తెలీలేదు. తల్లికి తెలిస్తే ఒప్పుకోదు సరికదా నానా రభస అవు తుంది. ఆవిడతో చెప్పి లాభం లేదు, చెప్పకుండా వుంటే.... అదీ అయిడియా.

ఎవరైనావింటే నవ్వుతారు. ఈ మాత్రానికి కళ్ళ నీళ్ళా? ఏదో ఆలోచిద్దాంలే. నువ్వు చెప్పకపోతే ఎవరికీ తెలీదు. ఈసారికి ఎవరికీ తెలీకుండా మేనేజ్ చెయ్యి. తరువాత ఆలోచిద్దాం, పడుకో, ఒంటో బాధగా వుంటే రెండు టాబ్లెట్లు వేసికో అని బుజ్జగించి పడుకోపెట్టేశాడు. అతను ప్రస్తుతం ఉపాయమే చెప్పేడు కాని శాశ్వత పరిష్కారం చెప్పలేక పోయాడు. అలా రెండుసార్లు జరిగే సరికి అత్తగారికి అనుమానం వేసింది కోడలు వట్టి మనిషి కాదేమోనని. ఈ కాంప్లికేషన్ జానక్కి తట్టలేదు. డాక్టరైనా జగన్నాథానికి తట్టలేదు. జానక్కి గుండెదడ పట్టుకుంది.

ఈసారి జగన్నాథం "జానకీ, పాపం మీ అమ్మని చూడాలని వుందన్నావు. ఓసారి చూసిరా, పంపేను కదా అని పదిహేను రోజులు మఠం వెయ్యకుండా నాలుగు రోజుల్లో వచ్చీ, కావా లంటే ఓ నెలపోయేక మళ్ళీ వెళ్ళచ్చు" అని పుట్టింటికి పంపేదు.

అయితే నాలుగోనాడు కాకుండా ఆరోనాడు వచ్చింది తనకి ఇబ్బంది వచ్చి ఆగిపోయేవి. కాని ఎన్నాళ్ళు సాగుతుంది ఇలా? కాని కాగల కార్యం గంధర్వులే తీర్చేరని అలా మరొక్కసారి వెళ్ళించు. మరి వెళ్ళనవసరం లేదు పెద్దవాడు కడుపున పడబట్టి.

ఇంకా ఈ ఊరు ఇలాగే వుంది. ఊరు మారిందని విని మనుషులు కూడా మారకపోతారా అనుకుంది. కాని మారలేదు. ఇంకా మారతారన్న ఆశ కూడా లేదు.

ఆ అమ్మాయి ప్రశ్నకి "ఔను" అని సమాధానం చెప్పి జగన్నాథాన్ని కళ్ళతోనే బరబరలాక్కుపోయింది.

ఇల్లు చూసిన జగన్నాథానికి ఒళ్ళు మండిపోయింది. ఈ పరిస్థితులు చూసి ఇల్లువద్దు, వల్లకాడు వద్దు పారిపోదాం అని పించింది.

నడవడానికి నీరసం వచ్చి అరఫర్లాంగు దూరానికి రూపా యిచ్చి రిక్షాలో ఇల్లు చేరుకున్నారు.

## 10

మధ్యాహ్నం పన్నెండు దాటి పావుగంటైంది.

పెరటిలో వున్న గోలెంలో నీళ్ళలో ఓ కాకి స్నానం చేస్తోంది. మధ్య మధ్య గట్టుమీదకొచ్చి ఒళ్ళంతా తడిసిందో లేదోనని చూచుకొని మళ్ళీ నీళ్ళలోకి దిగుతోంది.

కరివేపాకు మొక్క పాళెంలో వున్న నీళ్ళు తాగుతోంది. ఎండకి తడారిపోయిన పిచ్చిక. అదే నీళ్ళలో తన అందం చూసు కుని తనే మురిసిపోతోంది ఒక వయసు పిచ్చిక.

"ఏ చావు వార్త వింటామో సుమీ" అన్నాడు జగన్నాథం జనాంతికంగా. అప్పటికతను పావుగంట నుంచి ఆ కాకి స్నానం చూస్తున్నాడు. డ్రాయింగు రూము కిటికీలోంచి.

"డోన్ట్ బిసిల్లీ" అన్నాడు రాజేశ్వర్రావు.

ఏదో పుస్తకం తిరగేస్తున్న జానకి ఓసారి తలెత్తి జగన్నాథం కేసి చూసి మళ్ళీ పేజీలు తిరగేస్తుంది.

చూపులకి బెదిరే ఘటం కాదు జగన్నాథం.

"కాకులు స్నానం చెయ్యడం కంటపడితే ఏదో చావువార్త వింటాం అంటారు. చచ్చేక కాకులకే పిండం పెడతారు. మరం చేత కాకులకీ, మన చావుకీ ఏదో కనెక్షన్ వుండాలి. మొత్తానికి రిసెర్చి చెయ్యాల్సిన టాపిక్" అన్నాగు జగన్నాథమే మళ్ళీ.

"డోన్ట్ బి యిడియాటిక్" అన్నారు రాజేశ్వరరావు.

ఇంక ఈ కాకుల టాపిక్ ఆపకపోతే ఆ రిసెర్చి యిప్పుడే చేస్తానంటాడో ఏమిటో అనుకుంది జానకి.

"ముందా అరణ్యం బాగుచేయిస్తే కాని లాభం లేదు. రేపో నలుగురి కూలీలని పిలిపించండి. ఆ తోవనే కాస్త నమ్మకమైన మేస్త్రీని ఎవర్నైనా రమ్మనండి. సిమెంటు వగైరాలెంత కావాలో కనుక్కొని ఎల్లుండైనా పని ప్రారంభించాలి" రాజేశ్వర్రావుతో అంది చేతిలో పుస్తకం పక్కనపెట్టి.

"నువ్వు అసలు ఇల్లు బాగుచేయించడానికొచ్చేవా? పెరడు సాగు చేయించడానికొచ్చేవా?" చికాకు పడ్డాడు జగన్నాథం.

"నా పేషెంట్లలో కొందరు కులాళ్ళు ఉండాలి. సాయంత్రం కబురు చేస్తాను యిఫ్ యుడోన్ట్ మైండ్ నాకు మరోసారి జ్ఞాపకం చెయ్యండి" అని జానక్కి సమాధానం చెప్పి "ఎందుకురా అలా విసుక్కుంటావు. శుభ్రంగా కాకుల్ని చూస్తూ కూర్చోక ...." "అవును గాని నువ్వు ఇల్లు అమ్ము తానన్నావా?" జగన్నాథాన్ని ప్రశ్నించేడు రాజేశ్వర్రావు.

"ఇల్లెందుకు అమ్ముతాను!" జగన్నాథం ఆశ్చర్యం.

"ఒకవేళ అన్నా ఆశ్చర్యపోనక్కర్లేదు లెండి" అంది జగన్నాథం కామన్ సెన్స్ మీద ఏ మాత్రం సదభిప్రాయం లేని జానకి.

"కథలోయ్ కథలు. నువ్వు ఊళ్ళో పాదం మోపి పది గంటలైందో లేదో అప్పుడే నీ రాక గురించి కథలు పుట్టేస్తు న్నాయి. ఎంతైనా మనూరి వాళ్ళకి కవిత్వం పాలు కాస్త జాస్తే. శ్రీనాథుడు, పోతన, మనూరివాళ్లో, పక్కవూరి వాళ్లో అయుం టారు. రేపు నువ్వు డిస్మిస్ అయిపో యేవని పుకారు పుట్టిన ఆశ్చర్యపోకు"

"సంగతి చెప్పకుండా ఉపోద్ఘాతంతో చంపుతున్నారేమిటి?" జగన్నాథానికి చికాగ్గా వుంది. ఇంతవరకు స్నానం చేస్తున్న కాకి సర్రున ఎగిరిపోయింది. మడిగా పిండం తినడానికేమో!

ఏం లేదు. ఇందాక ఒకతను – పేరెందుకులే – మనిద్దరం ఫ్రెండ్స్‌వి కాబట్టి ఇల్లు కొంచెం చవగ్గా బేరం కుదర్చమన్నాడు.

ఒరే జగన్ ఒక్క సంగతి జ్ఞాపకం వుంచుకో. నీ జీవితంలో యింక యిల్లు మాట దేవుడెరుగు పందిరి కూడా కట్టలేవు. అద్దె వచ్చినా మానినా దాని ఖరీదు దానికుంటుంది. మరంచేత ఆ ఆలోచనే రానివ్వకు హితబోధ చేసేడు రాజేశ్వర్రావు.

"నేనా మాటే అనలేదుమొర్రో అంటే ఈ గొడవంతా ఏమిటి?"

"అసలింతకీ యింట్లో వాళ్ళేవంటున్నారు?"

జగన్నాథం జానకివేపో కోరచూపు విసిరి ఊరుకున్నాడు.

"ఆ సంగతి అడక్కండి బాబూ. గుండె గోదావరై పోతుంది" జవాబు జానకి చెప్పింది.

"ఏం? ఖాళీ చెయ్యవన్నారా?"

"అలాగన్నా బావుణ్ణు. నెత్తిన చెంగేసుకు పోదుం"

"నువ్వు చెప్పి చావకూడదురా! అలా కప్పని మింగిన పాములా కూర్చోకపోతే?" నన్ను ముట్టుకోకు నా మాలకాకి అన్న జగన్నాథం వరస రాజేశ్వర్రావుకేం నచ్చలేదు. అంచేత గట్టిగానే విసుక్కున్నాడు.

"కప్పని మింగిన పాము పడుకోదా?"

"మొగ్గలేస్తుంది. దానిష్టం అసలు సంగతి చెప్పి ఏడు. అసలే నేను కోపం వస్తే మనిషిని కాను"

"కోపం రానప్పుడు మనిషివేనా?"

"కాను. కుక్కని నక్కని, నీ పిండాకూడుని. మీరైనా చెప్పండి. జానకి గారు. వీడికంతా జోక్‌గా వుంది"

"అసలు జీవితమే ఓ పెద్ద జోక్‌రా బ్రదర్"

"అయితే ఓ వెర్రివేదాంతపు నవ్వు నవ్వేసి నోట్లో వేలు పెట్టుకొని బజ్జో. నువ్వు చెప్పవు ఆవిడ్ని చెప్పనివ్వవు"

'నేను చెప్తానుండండి పొద్దున్న మేము ఇల్లు చూడ్డానికి వెళ్ళేమా...."

ఆమెని పూర్తి చేయనివ్వలేదు జగన్నాథం.

"ఆ వాక్యం అంతా అనవసరమే. మనం ఎక్కడికి వెళ్ళేమో వాడికి తెలుసు. ఎకానమీ ఆఫ్ వర్డ్స్ నేర్చుకోవే అమ్మీ అని ఎన్నిసార్లు చెప్పినా వినవు కదా. ఆడవాళ్ళు అన్నీ దుబారాలే" అతనికి లెక్చర్ మూడ్ వచ్చేసింది.

"ఆ యింక మనం ఎకానమీ చెయ్యాల్సింది మాటల దగ్గరే మరి. నువ్వు నోరు మూసుకుంటే ఆవిడ చెప్తారు"

"దాని మొహం చెబుతుంది. ఏదైనా చెప్పాలంటే కొంత కవి హృదయం ఉండాలి. మేము వెళ్ళేమా..... అప్పుడే మైందే అమ్మడూ?"

"అబ్బా. ఏం బాధ పెడుతున్నావురా నాయనా? చిత్రవధ అన్నమాట పుస్తకాలలో చదివెను కాని యిప్పుడే అనుభవి స్తున్నాను. నువ్వేం చెప్పొద్దు కాని పోయి రెస్టు తీసుకో" అంటూ లేస్తున్న రాజేశ్వర్రావుని చెయ్యి పట్టుకొని కూర్చోబెట్టారు జగన్నాథం.

ఇంత ఓర్పు లేనివాడివి నువ్వేం డాక్టరువిరా. వైద్యుడికీ, వేశ్యకి సహనం ఉండాలి. లేకపోతే జెల్లతినేస్తారు. నాకు స్టార్టింగు ట్రబులే కాని, అందుకున్నానంటే చూడుమరి విశాఖపట్నం చచ్చుడి దాని తిట్లలాగ, అనకాపల్లి గవరదాని బూతుల్లాగ ఝూమ్మని వెళ్ళిపోతాను. అప్పుడే వైందో చెప్పమంటే అలా చెడుపు పెడుతున్న దానిలా చూస్తావేమిటి?

జరిగినదంతా చెప్పింది జానకి మధ్య మధ్య జగన్నాథం వ్యాఖ్యానాలతో..

అంతా విన్న రాజేశ్వర్రావుకి జగన్నాధానికి తన్నాలని పించింది. కనీసం నోరారా తిడితేనైనా కొంతకోపం దిగొచ్చు. అదిరా జగన్నాధా! ఇందాక నువ్వు ప్రపంచమే పెద్ద జోక్ అన్నావు చూడు. అది కాదు. ఇదీ పెద్ద జోక్. నీ ఇంటిని సంవత్సరాల తరబడి అర్ధరూపాయి అద్దె కట్టకుండా అనుభవించడమే కాకుండా, కొంత వాటా అద్దెకిచ్చుకొని ఆ అద్దె కూడా అను భవిస్తున్నాడే ప్రకాశరావో, పట్టాభిరావో, ఎవడో. అదీ జోకుల్లో కల్లా కింగ్‌జోకు, ఎండ్ యువార్ ఏ బిగ్ ఫూల్ ఛీ! ఛీ!...."

"బావుంది ఏదో కష్టాల్లో వున్నాడు పిల్లల్తో వున్నాడు, పైగా ఫ్రెండు అనుకున్నాను కాని ఇలా ఔతుందని కలగన్నావా ఏమిటి? ఏదో ముందుకు రావలసిన వాడు కాస్త ఉపకారం చేద్దామనుకున్నాను గాని...."

"ముందుకే వచ్చేడోయ్. కాని ఏమయ్యేవూ అని. పోనీ యిదీ సంగతని ఎప్పుడయినా రావడం గాని. ఎవరికయినా రాయడం గాని చేశావా? ఇంకో రెండేళ్ళు ఆగలేక పోయావా? అప్పుడు ఇల్లు వాడిదైపోతుంది. ఏం మనిషివిరా?"

"అక్కడికీ నేను తరచు చెప్తూనే వున్నాను? వింటేనా? స్నేహి తుడు, మొహమాటం అంటూను..." జానక్కీ విసుగొస్తోంది.

జగన్నాథం రాజేశ్వరావు ఎన్ని అన్నా సహిస్తాడు కాని, జానకి దెబ్బలే మాత్రం భరించలేదు.

"చూడమ్మా, జానకీదేవీ నీ సంగతి తెలీదు కాని నేను మాత్రం మీ ఇద్దరిచేతా చీవాట్లు తినడానికి రాలేదు. నా శలవింక మూడ్రోజులు మాత్రమే వుంది. నాలుగోనాడు "జాయ్ బంగ్లా" అంటూ జెండా ఎత్తేస్తాను. నువ్వు రిపేర్లే చేయించుకుంటావో, రాజ్‌భవన్‌లే కట్టించుకుంటావో "నీ యిష్టం" అని ఫైనల్‌గా చెప్పేసి థన్‌మని పక్క గదిలోకి వెళ్ళిపోయేడు జగన్నాథం.

## 11

మర్నాడు పొద్దునే కూలీలు, తాపీమేస్త్రీ వచ్చారు. మేస్త్రీ ఇల్లు సర్వే చెయ్యడానికి వెళ్ళాడు. కూలీలు పెరడు చూశేరు. చూసి వాళ్ళలో వాళ్ళు ఓ పావుగంట మాట్లాడుకున్నారు. మాటలయిపోయేక అందులో ఒకడు – వాళ్ళ లీడరు – జానకి దగ్గరగా వచ్చి చేతులు నులుపుకుంటూ నిల్చున్నాడు. ఏవిట న్నట్టు చూసింది జానకి.

"నానో మాట సెప్తాగాని ఏవనుకోకండి. ఇదేంటండి? పెరడా? అడివా? ఈ ఇంట్లో ఎవరుంటున్నారో గానీండి ఆళ్ళు మదుసులు కాదండి శ.శ్శ. ఎకరాన్నర పెరడు యిలాగే నేటండీ వుంచుతారు? సక్కగా మొక్కా మోదు ఏసుకుంటే ఊరంతా కూరగాయల ఊరికే తినొచ్చు.

అరికంటే అద్దెకున్నోళ్ళు తవరు ఇల్లుగలోరు. ఏడాదికో పాలైనా వచ్చి ఇల్లేటి, వాకిలేటి అనుకోకపోతే ఎలాగండి? తమరు పెద్దోరు. మావు సెప్పడవేటండీ గాని మాలాం టోళ్ళ క్యూడా సెట్టుకిందుంటే అదే సుబ్బరం సేసుకుంటాంగాని యింత శండాలంగా వుంచుకోం… అని ముందు జానకిని చల్ల చల్లగా చీవాట్లు పెట్టి, తరువాత అసలు విషయానికొచ్చేడు. "మావేదో ఏ పూట కూలి ఆ పూట సేసుకొని బతికేవాళ్ళం. మరింక యిదిచూస్తే ఒక్కో సెట్టు అడవినాగ పెరిగిపోనాది. ఒక్కో ముల్లు గునపంనాగుంది. ఆయేటి యినపముళ్ళండి. యింకా ఈ పని చేస్తే మరింక మావు మూడునెల్లు మంచం ఎక్కేయాల్సిందే. మా వల్లకాదండి. అసలు ఎంత దబ్బిచ్చినా ఈ పని ఎవరూ సెయ్య నేరండి. నా మాటిని ఎగ్రికల్చరోళ్ళ నడిగి యంతరం తెప్పిం చండి. అది సాపుగా సెక్కాస్తాది. మరింక మాకు సెలవిప్పిం చండి. అని ఫైనల్‌గా చెప్పేసి మిగతా కూలీలను తీసుకొని వెళ్ళి పోయాడు.

వెళ్ళిపోతున్న వాళ్ళని ఆగమందామని కూడా తట్టలేదు జానక్కి. లాంగ్‌షాట్‌లో వెళ్ళిపోతున్న కూలీల వేపు, క్లోజప్‌లా కనిపిస్తున్న దండకారణ్యం వేపు – వెళ్ళిపోతున్న హనుమంతుడి వేపు సీత చూసినట్టు దీనంగా చూస్తూ ఒక చెట్టుకానుకొని నిల్చుంది.

జగన్నాథాన్ని వీధిలోనే ఎవరో పలకరించి మాట్లాడు తున్నారు. ఆ పలకరించి నతను జగన్నాథానికి పాత పేషెంటూ, హైస్కూలు మేటూనట.

ఏమిటోయ్ జగన్నాథం ఊర్లోకి వచ్చి రెండ్రోజులయినా కనిపించేవే కావేం? (నువ్వే ఎందుకు కనిపించకూడదూ అని అడక్కపోయారా? జానకి స్వగతం) ఇల్లు రిపేరు చేస్తానని విన్నాను. యిఫ్‌యువాంట్ మై ఎడ్వయిస్ (నీ బోడి సలహా ఎవడిక్కావాలి? జానకి చికాకు)…. ఈ రిపేర్లున్నాయే, ఇవి శుద్ద వేస్ట్. అనుకో. శుభ్రంగా పడగొట్టిం చేసి యా యాభైవేలో, లక్షోపెట్టి న్యూమొడల్లో ఒక బ్రహ్మాండమైన బిల్డింగు కట్టుకో. గృహ ప్రవేశం కూతురు పెళ్ళి కలిపి చెయ్యొచ్చు…" (పునాదులు మాత్రం ఎందుకూ! అవి కూడా పీకించేసి కొత్తవి తవ్వితే సరి! జానకి సజెషన్).

"ఇలాంటివన్నీ నిదానంగా కావాలి. ఎప్పుడైనా లాంగ్‌లీవు పెట్టరా. లేకపోతే మేమంతా లేమా ఏమిటి? డబ్బు ఇలా పారే. క్షణాల్లో లేపేస్తాం…" అని జగన్నాథం ఎప్రూవల్ కోసం అన్నట్టు ఆగేడతను.

జగన్నాథం ఔనన్లేదు కాదన్లేదు.

ఊఁ కొడుతున్నాడు కాబట్టి వింటున్నాడనే అనుకోవాలి. జగన్నాథం జవాబు చెప్పకపోయేసరికి తిరిగి అతనే ప్రారంభించేడు.

"ఔను గాని, ఏమిటి. పాపం మీ ఇంట్లో వాళ్ళని సడన్‌గా ఖాళీ చెయ్యమన్నావుట. వాళ్లు పాపం నా దగ్గర "ఊహుఁ" ఒకటే గోల. రెండు నెలల ముందు నోటీసైనా యిచ్చేరు కాదు. యిలా నిల్చున్న పళాన పొమ్మంటే ఎక్కడికి పోతాం అంటూ. జగన్నాథం ఏం అసందర్భపు మనిషికాడు. మంచి యిల్లు దొరికే వరకు వుండండి. అని నేను ఓదార్చి పంపించేను. అన్నట్టు మీ ఆవిడ కూడా వచ్చిందట. వెళ్ళిపోయేలోపల మా ఇంట్లో భోంచేసి మరీవెళ్ళండి. మళ్ళీ కలుస్తానూ అంటూ వెళ్ళిపోయే డతను.

అతని మాటలకి జగన్నాథానికి కోపం రాలేదు. ఆశ్చర్యం కూడా వెయ్యలేదు అసహ్యం వేసింది.

"దరిద్రులు! ఎ సెట్ ఆఫ్ స్కాంప్స్ ఇల్లంతా వల్లకాడు చేసి, నా యిల్లు నాకివ్వండి మొర్రో అంటే రెండు నెలలు నోటీసు కావాలా?"

"లా" మాట్లాడుతున్నారోయ్. అద్దె కట్టేవాడికి నోటీసులు, ఫర్మానాలు కాని యిలాంటి అప్రాచ్యపు వెధవలని పిలక పట్టు కొని ఈడ్చేడమే, పదేళ్ళ క్రితమే నోటుసు యిచ్చేం అనుకుంటే సరి, పైగా నన్నో సినిమా విలన్నీ చూసినట్టు చూడ్డం. నా ఇల్లు నా మొహాన కొట్టమని ఒక్కడూ అడగడే ...."

ఈలోగా తాపీ మేస్త్రిని వెంటబెట్టుకొస్తున్న జానకిని చూస్తే అతనికింకా ఒల్లు మండిపోయింది. నిక్షేపంలా యింట్లో వున్న వాడ్ని ఈవిడే కదూ ఇళ్ళూ, అద్దెలూ, రిపేర్లూ అంటూ ఇలా రోడ్డు మీదకీడ్చింది. ఆడదాని సలహా విని బాగుపడ్డవాడేవడూ?

"ఏం నాబంనేదండి..." అంటున్నాడా మేస్త్రీ జానకితో. ఏమిటి లాభం లేదో చూపిస్తానన్నట్టు తన వెనకే రమ్మని సంజ్ఞ చేశాడు. వాళ్ళకి. ముందు మేస్త్రీ. అతని వెనుక ఆఫీసరు వెనుక గుమాస్తాల్లాగ జానకి, జగన్నాథం నడుస్తున్నాడు. ఆ మేస్త్రీ వెళ్తూ వెళ్తూ ఠక్కున ఆగిపోయేడు. పామో, పులో ఉంటుందను కున్నారు కాని కాదు.

ఆగిన వాడొక్కసారి భావగర్భితంగా యిటు చూడమన్నట్టు నవ్వి చేతిలో వున్న తాపీతో గోడమీద ఠక్ ఠక్ మని కొట్టేడు. వెంటనే బుట్టెడు బుగ్గి రాలింది. మళ్ళీ నడక సాగించేడు. అతని వెనకే వాళ్ళు అతి వినయంగా నడుస్తున్నారు. ఆ ఇంటి భవిష్యత్తు వాడి చేతిలో వుంది. మళ్ళీ ఆగేడు. ఇంకోచోట మళ్ళీ టకటక మనిపించాడు. ఈసారి బండెడు బుగ్గి రాలింది.

"కప్ప ఎక్కడుందో పాముకి తెలిసిపోయినట్లు, ఈ యింటి వీక్ స్పాట్స్ ఎలా పసికట్టేస్తున్నాడో చూడు వెధవ"అని ఇంగ్లీషులో అనబోయి 'వెధవ' అన్నమాట తప్ప తక్కినదంతా ఇంగ్లీషులోనే అన్నాడు జగన్నాథం.

"అవే స్ట్రాంగ్ స్పాట్సేమో చూడండి" అంది జానకి.

"వెధవ" కి ఇంగ్లీషులో ఏమంటారు?

వాసన వెయ్యని "మందు" ఈ బాబుకి ఎక్కడ దొరికింది అని ఆశ్చర్యపోయేడు మేస్త్రీ.

"విడో. ఏమిటి స్వంత ఊరొచ్చాం కదా ఇంగ్లీషులో తిడతారే మిటి నన్ను" ఆశ్చర్యపోయింది జానకి.

ఇల్లంతా అలా ఒక గంట సర్వే చేశాడు మేస్త్రీ. మర్డరు కేసులో జడ్జిమెంటు కోసం ఎదురుచూస్తున్న ముద్దాయిల్లా ఆతృ తగా నిల్చున్నారు జానకి, జగన్నాథం. చివరికి జడ్జిమెంటు చెప్పేసేడు.

బాబు తమరో గొప్పోరు. సదూకున్నోరు. తమకి నాన్జెప్ప డమేటి గాని సి! స్సీ! ఏటి గోడలో? పుచ్చిపోయిన పేకేజి పెట్టె ల్నాగ రాలిపోతున్నాయి? అసలీ గోడలకెప్పుడైనా గోరుతోనన్నా సున్నం ఏశారా? నానంటున్నాని అనుకోగ్గాని తల్లీ ఆళ్ళకేటి అద్దెకున్నోళ్ళు? ఆళ్ళకి బుద్దినేదు. తమరైనా మూడేళ్ళకోపాలైనా వొచ్చి ఇల్లెలాగుంది?ఏటి కత? అని సూసుకోవద్దా? అసలీ ఇల్లు కట్టింది మా బాబు గనక నాకుతెలసు గాని మరోడైతే ఏటిది, ఈ ఇల్లు సున్నంతో కట్టినారా? సున్నిపిండితో కట్టినారా అనడిగేవోడు. ఏటి బాబూ యినుకుంటున్నారా?" అని వాళ్ళ వేపు చూశేడు.

వింటున్నాం అన్నట్టు తలలూపేరు. ఇంకా చీవాట్లు చాప్టరు వుందా అయిపోయిందా అన్నట్టు చూస్తోంది జానకి. ఇందాక ఆ కూలాళ్ళు వేసిన చీవాట్లు ఇంకా అరగలేదు. మళ్ళీ ఈడు తగులుకున్నాడు. పోనీ తిడితే తిట్టేడు కాని, వీడు కూడా వాళ్ళలాగే మా వల్ల కాదు అనేసి పోడు కదా! వాడు నా వల్ల కాదు అనకుండా వుంటే ఈవేళ్ట్రా నాయానా నీ చేత రోజూ చీవాట్లు తింటాను. ఏదో ఈ గండం గడిపి మమ్మల్నీ ఊర్చించి బైటపడేశవంటే మా ఇంటికి నీ పేరే పెట్టుకుంటాం. మనసులోనే మేస్త్రీని మొక్కుకుంది జానకి.

వాల్ళు వింటున్నారన్న నమ్మకం కలిగేక మళ్ళీ అందు కున్నాడు మేస్త్రీ. ఎక్కువ చీవాట్లు పెట్టడం మంచిది కాదను కున్నడో ఏమో ఈసారి టాపిక్ మార్చాడు.

తమరి నాన్నగోరు, అమ్మగోరు వున్నప్పుడెలాగుందండీ పెళ్ళోరిల్లుగదండీ. ఆ సుట్టాలేటీ? ఆ పక్కాలేటీ? ఆయమ్మ దరమతల్లి సేతికి ఎవికుండేదేటి? వొచ్చీ జనం, పోయీ జనం గచ్చపొదనాగ గల గలాడేది ఎప్పుడూ. ఆ సందడంతా ఆళ్ళ తోనే పోనాది. అని కాస్సేపు గత వైభవం నెమరువేశాడు. ఆ తరువాత చెయ్యవలసిన కార్యక్రమం చెప్పేడు..." నానో మాట సెప్తాను యినుకో బాబు. నువ్వు కూడా యిను తల్లీ. ఇప్ప టికెలాగో యిల్లు పడిపోకుండా నిలబెట్టేద్దాం. ఆనక నింపాదిగా సూసుకుందాం. రేపో పది బస్తాల సిమెంటు, పదిబళ్ళ యిసుక

ఏయించండి. ఎల్లుండికాడ్నించి పన్లోకొస్తాం, నువ్వేం బెంగ పడకు తల్లీ, అదే అయిపోద్ది. ఏదీ ఉండిపోదు. ఏటుండిపోతాది? మాట.... మాటుండిపోద్ది. ఇయేల నాను పనిసేసినంటే, రేపు నాను పోయినా, నా పనుండిపోవాలి – రావణాసురిడితో రాము లోరన్నట్లు – మరి నేనెల్తాను, ఓ నాలుగు వేల ఇటిక కూడా తెప్పించండి. కూలీల సంగతి నాకొగ్గేయండి. అని భుజం మీద తువ్వాలు దులుపుకుంటూ లారీదు దుమ్మువేసి వెళ్ళిపోయాడు.

జ్ఞానోపదేశం అయిన తరువాత ఏం చెయ్యాలో నిర్ణ యించు కోలేదు వాళ్లు. ఈ లోగా మేఘాల వెనుక ఆకాశవాణిలా ఆ దుమ్ము అవతల నుంచి ఓ పొలికేక వినిపించింది.

.... అన్నట్లు మర్చేపోనాను. మారాజా అంటూ ఆ దుమ్ముని రెండు చేతుల్తో చీల్చుకుంటూ మళ్ళీ ప్రత్యక్ష్యమైనాడు ఆ మేస్త్రీ.

.... మరండి దువ్వారాలు, తలుపలు కూడా పుచ్చి పోనా యండి. ఎపుడైనా షరాబుకి కబురంపితే ఎంతండి రెండ్రోజుల్లో సేయిస్తాడు. అయికూడా పిక్సు సేసేద్దారండి. ఆ షరాబు మాటిని మామిడి సెక్క ఎట్టకండి మారాజా. వొలి తక్కువని గుడ్డిదాన్ని మనువాడితే, దొంతికుండలు దొర్లించేసినాదని సవకజ్జెప్పి మామిడి సెక్క వేయిస్తే, మళ్ళీ ఈ రోజుల్నాటికి పడవల్నాగై పోతాయి తలుపులు. మరంచేత ఆడిమాటినకండి... అంటూ మరో లారీదు దుమ్ములేపి పోయిడు.

ముందుగా తేరుకున్నది జగన్నాధమే.

అక్కడే నిల్చుని ఈ భాగవతమంతా వింటున్న నిన్నటి (పళ్ళ) పిల్లతో ఇంట్లోవాళ్ళనొకసారి పిలుస్తావా పాపా? అన్నాడు యింట్లో వాళ్ళకి వినిపించేలా?

“పాపేమిటి? పాప! యుద్ధానికొచ్చినట్టు గుండెలూ అదీ గజ్జెల గుర్రంలా వుంటు, కళ్ళు మూస్తే మూడుకొంపలూ, విప్పితే వందకొంపలూ ఆర్పేసేరకం...” గొణిగింది జానకి.

“నా పేరు పాప కాదు షీలా” అంది యుద్ధం గుండెల పిల్ల. లవ్ సీన్‌లో హీరోయిన్లా కళ్ళు టపటపలాడిస్తూ. అంతేకాని యింట్లోవాళ్ళని పిలుస్తాననీ, పిలవననీ చెప్ప కుండా ఇంట్లోకి వెళ్ళిపోయింది.

పొద్దున తాగిన కప్పుకాఫీ తప్ప మళ్ళీ కడుపులో మంచినీళ్ళు కూడా పడలేదు. ఆకలికి కడుపు మాడిపోతోంది జానక్కి. నీరసంతో కళ్ళు తిరుగుతున్నాయ్. అంచేత మసి అంటితే అంటిందని ఒక గోడకి అనుకుని నిల్చుంది. జగన్నాధానికీ కడుపు మండిపోతోంది. కాని ఈ వెధవ సమస్యలతో అతని గుండె యింకా మండిపోతోంది. అర్జంటుగా ఎవరినైనా తన్నా లని వుంది అతనికి.

ఏమిటో నాతో చెప్పమన్నారండి. గజ్జెల గుర్రం తిరిగొ చ్చింది.

“ఏం లేదు, రేపు ముందు గది ఖాళీ చేస్తే రిపేరు చేయిం చుకుంటాం. మిగిలిన ఇల్లు మూడు నాలుగు రోజుల్లో ఖాళీ చేసి మమ్మల్ని కరుణిస్తే జీవితాంతం కృతజ్ఞులం” అని వాళ్ళతో చెప్పు. వాళ్ళకి వినిపించాలనే అన్నాడు జగన్నాథం.

“ఇప్పటికిప్పుడు ఇళ్ళెక్కడ దొరుకుతాయి? మాకు సరిపోయే ఇల్లేదైనా చూపిస్తే వెళ్ళిపోతాం. ఇన్నేళ్ళై వుంటున్నాం అన్న మాటేగాని నలుగురం విస్తరేసుకుని ఒక్కనాడూ అన్నం తిన్న పాపాన పోలేదు కదా” ఘోషా గొంతుక పలికింది సినిమాలో దెయ్యంలాగ.

“ఇళ్ళెందుకు లేవు? కాకపోతే మాలాగా ఎవరూ ముఫత్‌గా యివ్వరు. అద్దె కట్టకపోతే జుత్తు పట్టుకొని చచ్చిన గొడ్డు నీడ్చి నట్టు వీధిలో కీడ్చేస్తారు. ఇల్లు చూపించాలిట. నయం కట్టించి ఇవ్వద్దూ భవంతి ఒకటి? నలుగురూ విస్తరేసుకోలేదుట. ఏంపాపం విస్తర్లులేవా? నలుగురు లేకా? పోతూ పోతూ ఈ అభాండం కూడానా? మా ఇల్లు మా మొహాన పారేస్తే యింక బుద్ధి గడ్డితిని జన్మలో ఎవరికీ అద్దెకివ్వం. తాళం పెట్టుకు పోతాం. లేకపోతే బుల్‌డోజర్‌తో గుద్దించేసి కొత్తిమీర వేసు కుంటాం” గుండె మంట తలకెక్కి, జానకి తనలో తనే గొణు క్కుంటోంది.

“అవన్నీ మాకు తెలీదు. మా ఇల్లు మాకు మూడ్రోజుల్లో కావాలి” జగన్నాధానికంత కోపం వుందని అంత వరకు తెలీదు జానక్కి.

అక్కడే వున్న గజ్జెలగుర్రం ఎవరు మాట్లాడితే వాళ్ళ వేపు ట్రాఫిక్ పోలీసు చెయ్యి తిప్పినట్టు మెడ మాత్రం తిప్పుతోంది. ఇంకా అక్కడేవుంటే ఏం రభస అవుతుందోన్న భయంతో జానకి జగన్నాథాన్ని రెక్కపట్టుకొని లాక్కెళ్ళి పోయింది.

“ఇంట్లో మొగాళ్ళు లేనప్పుడు వచ్చి ఏమిటి అర్లరి?” అన్న సినిమా దెయ్యం పలుకులు లీలగా గాలిలో వినిపించేయి వాళ్ళకి.

## 12

ఇంటికెళ్ళి భోజనం చేసి ఓ గంట కునుకు తీసిన తరువాత గాని వాళ్ళు మళ్ళీ కోలుకోలేదు. నిద్రలేచిన జానక్కి మళ్ళీ ఆలోచనలు లేచేయి. తను యిక్కడికెందు కొచ్చినట్టు? ఏం చేస్తున్నట్టు? వాళ్ళు ఖాళీ చేసే సూచనలేవీ కనుచూపు మేరలో కనిపించడం లేదు. ఈలోగా కనీసం రిపేరైనా చేయిస్తే? పేపరు చదువుతున్న జగన్నాథాన్ని సతాయించింది. కనీసం ఆ సిమెంటైనా కొని నా మొహాన పారేస్తే కొంతైనా పని అవుతుంది. వచ్చి మూడ్రోజులైంది. తిని కూర్చుంటున్నాం....."

"తిని కూర్చోడం లేదు. నిలబడి తిట్లు కూడా తింటున్నాం" జగన్నాథం కలిపేడు.

"మధ్యలో బ్రేక్ వెయ్యకండి"

"బ్రేక్ కాదు జోక్"

"ఆఖరికి బ్రతుకే జోక్ అయిపోయేటట్టుంది. ఆ ఇళ్ళ వాళ్ళ వ్యవహారం చూస్తే"

"ఇళ్ళవాళ్ళం మనం"

జానక్కి వెర్రికోపం వచ్చి నిలువెత్తు నాగుపాములా లేవ బోయి అంతలో శాంతించింది. తనక్కావల్సింది పని జరగడం. జగన్నాథంతో వాదం కాదు.

"రాజేశ్వర్రావు ఎంత ఫ్రెండు అయితే మాత్రం. ఇలా ఊరికే వాళ్ళింట్లో తిని కూర్చోడం ఏం బావుంటుంది?"

"పోనీ తినడం మానేద్దామా?"

"మీరు కొంతసేపుజోక్స్ మానేస్తే"

"తిండీ మానేసీ, జోక్స్ మానీసి ఎలా బతకడం దేవీ?"

"ఏవీ మానొద్దు. నన్ను తినేయండి నాథా!"

"ఆహా! ఎన్నాళ్ళకు విన్నాను నీ నోట జోకు. ఐయామ్ ప్రౌడ్ఆఫ్ యూ మైడియర్ జాన్"

"నా ఖర్మ సిమెంటు యింటికొచ్చే ఏర్పాటేదైనా వుందా లేదా?"

"ఈ వేళ నీకు సిమెంటు దెయ్యం పట్టుకుందే జానీ. ఉండు వెధవ సిమెంటు బస్తాలు ఓ లారీడు కొనిపారేస్తాను"

"లారీడెందుగ్గాని ఓ పది పారేయండి చాలు."

కాని జగన్నాథానికి సిమెంటు కొనడం అనుకున్నంత తేలిగ్గా అవ లేదు. బజారు వెళ్ళి ఆస్ప్రోటాబ్లెట్లు, ఆరోమైసిన్ ఆయింట్ మెంట్లు కొనుక్కున్నట్టు, డబ్బు పారేసి సిమెంటు కొనుక్కోవచ్చు అనుకున్నాడతను. సిమెంటు అసలు షాపుల్లో దొరకదని, కోటా వుంటే అమ్మరనీ కొనాలంటే పెర్మిట్ కావాలనీ విని ముందు నమ్మలేదు. తర్వాత నమ్మక తప్పలేదు.

"ఛ! యిదేమిట్రా రాజూ. డబ్బిస్తానంటే సిమెంటు లేదుట. ఎక్కడా చూసిన సిమెంటు ఫ్యాక్టరీలే. ఏం చేస్తున్నారీ సిమెం టంతా?" అడిగేడు ఆ సాయంత్రం కాఫీ తాగుతున్నప్పుడు తాగుతున్న కాఫీ కప్పు టేబులు మీదపెట్టి, రాజేశ్వ రావు ఒక్క క్షణం జగన్నాథం వేపు చూసేడు. జగన్నాథం అజ్ఞానం రాజేశ్వ రావుని ఆశ్చర్యపరచలేదు. కాకపోతే జానకి మీద జాలేసింది. ఇంత ఫూల్‌తో ఎలా నెగ్గుకొస్తుందో. వీడు చిన్నప్పటి నుంచీ ఇంతే. అయితే పెద్దయిన తరువాతయినా ప్రపంచజ్ఞానం రాక పోతుందా అనుకున్నాడు తను. రాలేదు వీడికి పుస్తక జ్ఞానమే కాని ప్రపంచ జ్ఞానం లేదు.

"మనిషి సుఖంగా బతకాలంటే చదవాల్సింది పుస్తకాన్ని కాదు ప్రపంచాన్ని. అందులో మనుషుల జీవితాన్ని" అని ఎంత చెప్పినా వీడి నెత్తికెక్కదు.

"నువ్వు యిచ్చే ముష్టి యిరవై రూపాయలకీ నీ కెవడిస్తాడు సిమెంటు?"

"కంట్రోలు రేటు అంతేనట కదా!"

కంట్రోలు రేటంటే సరుకు దొరకని రేటని అర్థం. నిర్వ చించాడు రాజేశ్వర్రావు.

"ఇంతకీ ఈ ఊళ్ళో కోటా ఎవరికుంది?"

"వరాల్సెట్టితో సహా వందమందికుంది. కాని వాళ్లెవరూ మనకి కంట్రోలు రేటుకివ్వరు. కోటా వచ్చేవరకు ఆగ మంటారు. కోటా రాగానే సరుకు అయిపోయిందంటారు. మరంచేత సిమెంటు ఆశ వదులుకోవడం మంచిది"

"ఉన్న ఊరువాడివి, డాక్టరుని, ఓ పది సిమెంటు బస్తాలు సంపాదించలేవురా?"

"బావుంది. అంతలావున్నావు పామ్మంత్రం రాదా అన్నాట్ట వెనకటికెవడో" నాదాకా ఎందుగ్గాని, ఇదివరకోసారి నువ్వు సుబ్బయ్యగాడి కొడుకుని అష్టకష్టాలు పడి బతికించేవు. జ్ఞాపకం వుందా? ఇప్పుడు వాడు సిమెంటు కోటాతోనే రెండు సినిమా హాల్సు కట్టేడు. ఒరే జగన్ నాకప్పుడు అనిపిస్తుంది. మనం

అంటే డాక్టరుగాళ్ళం ఎంతమంది దొంగ రాస్కెల్స్‌నీ, స్కాంప్స్‌నీ బతికించి ప్రజలకి మహాఘోరం చేస్తున్నామోనని.

మాటవరసకి, ఇప్పుడీ సుబ్బయ్యగాడున్నాడా? మనం ఒక పెళ్ళాన్ని, దాని పిల్లల్ని పోషించలేక ఛస్తూ వుంటే విత్ డ్యూ ఎపోలజీవ్ టు జానకిగారు–వాడి యిద్దరు అఫిషియల్ పెళ్ళాలు, ముగ్గురు ముండలు, వాళ్ళ సంతానాలు, వాడికి స్తోమతు ఉంద నుకుందాం. వాడికా స్థోమత ఎక్కడినుంచొచ్చింది? వాడి బాబు బందరు మిఠాయి, తాత తాడితీగలు అమ్ముకొని బతికేరు. మనందరి నెత్తీ నోరు కొట్టికదూ వాడు మేడలు కట్టి అందులో ముండల్ని పెట్టింది. వుయ్ ఆర్ ఆల్ హెల్పింగ్ హిమ్ అండ్ సపోర్టింట్ హిమ్. అలాగని వాడికి అణాపరక విశ్వాసం ఉందంటావా? పాముని పెంచితే నయం. ఒక్క సారే కాటేస్తుంది.

ఇలాంటి నల్లతాచుల్ని చంపకుండా, పైగా వాళ్ళకి జలుబు కూడా చెయ్యకుండా కాపాడ్డం నేషనల్ అఫెన్స్ కాదంటావా? ఈ వెధవలు తుమ్మకుండా చూడ్డానికి తొంభై డాక్టర్లు. కొంచెం లోతుగా ఆలోచిస్తే మనం ప్రజలకి ఉపకారం కంటే అపకారమే ఎక్కువ చేస్తున్నాం. అనిపిస్తుంది. ఇలాంటి చెద పురుగుల్ని చంపడానికి మనకేమైనా ప్రొవిజన్ ఉంటే బావుణ్ణు.

"ఆ సుబ్బయ్య గాడు చూడు రోజు రోజుకీ దుష్కృతన్ని సిమెంటు విగ్రహంలా తయారౌతున్నాడు......"

"అతను మనకి ముందు సిమెంటిస్తే ఆ తర్వాత విగ్రహ మైనా, దెయ్యమైనా ఒకటే" కలిసింది జానకి.

"అగండి. అక్కడికే వస్తున్నాను. ఒరే జగన్నాథం. నువ్వు గాని ఆ సుబ్బయ్యగాడి దగ్గర ఒక్క సిమెంటు బస్తాగాని, ఆఖరికి బస్తాడు సిమెంటు పుట్టించగలుగితే నేనీ నర్సింగ్ హోమ్ అంతా నీ పేర రాసేసి నీ దగ్గర కాంపౌండరుగా వుంటాను"

రాచపుట్టుక్కాకపోయినా జగన్నాథానికి రాజుగారికొచ్చి నంత కోపం వచ్చింది.

"నేనిమ్మన్నానని చెప్పి ఓ పది సిమెంటు బస్తాలు పట్టుకురా సుబ్బయ్యనడిగి. చాలా అర్జంటని చెప్పు. ఏ సంగతీ అర గంటలో చెప్పమను" అని డబ్బిచ్చి రాజేశ్వర్రావు దగ్గరున్న కాంపౌండర్ని పంపించేడు జగన్నాథం.

అరగంట గడిచింది.

కాంపౌండరు రాలేదు, సిమెంటూ రాలేదు.

కాని మరో అరగంట గడిచేక పది సిమెంటు బస్తాలు, ఒక బస్తాలోనే కూరేసినట్టు సుబ్బయ్య వచ్చేడు. వస్తూనే జగన్నాథా నికీ, రాజేశ్వర్రావుకీ దండాలు పెట్టాడు. పెట్టి పక్కనున్న బెంచీ మీద కూర్చున్నాడు. కుర్చీలో కూర్చోమని బలవంతం చేసినా వినకుండా, ఆ విషయం, ఈ విషయం మాట్లాడి జగన్నాథం కుటుంబానికి తీర్చుకోలేని ఋణం మీదికి పోనిచ్చేడు తన మాట.

"అయ్యబాబో, అలాగంటారేటండీ తవరు? నానిలాగున్నా నంటే ఆ నారాయణమూర్తి బాబు సలవేకదు బాబు. పొద్దుట నెగ్గానే ఆ సూర్యన్నారాయణమూర్తికైనా దండం ఎట్టడం మర్చిపోతానేమోగాని మన నారాయణమూర్తికి మాత్తరం దండం ఎట్టుకుంటానండీ. మనిసన్నాక కృతజ్ఞత ఉండాలి. ఆ బాబే నా ఎడాప్పును దావా గెలిపింకపోతే నా సినిమా హాలు కాదే గేటుకీపరు చేస్తుండేవోడ్ని... అమ్మా జానకమ్మా కూతుర్లాంటి దానివి, పన్నెప్పేననుకోకుండా కూసిన్ని మంచి నీళ్ళట్రా అమ్మా..." అని ఆగేడు.

జానకి తెచ్చిన మంచినీళ్ళు తాగేక "నా గొడవకేటి గాని. రాజేశ్వర్రావు బాబు నీకు ఆసుపత్రికిట్టైమైపోద్దో ఏటో, ఇందాక మీకాంపొండరు బాబొచ్చి నువ్వు సిమెంటు బస్తాలు కావాల న్నాడు. అప్పుడు నానేటన్నానోఎరికా "కొత్తిల్లు కట్టి మూడేళ్ల కాలేదు. ఆ బాబుకి సిమెంటెందుకూ? పిల్లలకి పెళ్ళి తలపెట్టి నాడు కామోసు. బియ్యం బస్తాలు కావాలన కుంటాను. సరిగ్గా కనుక్కొనిరా" అన్నాను. మరంతే ఎల్లినోడు మళ్లీ తిరిగిరానేదు అని ఆగేడు.

"బియ్యం బస్తాలు కావు. సిమెంటు బస్తాలే. నాక్కాదు జగన్నా థానికి" అన్నాడు రాజేశ్వర్రావు.

అంతే! పీడకలలోంచి లేచిన మనిషిలా దిగ్గున లేచి నిల్చు న్నాడు. నిల్చుని నమస్కారం చేస్తున్నాడో చేతుల్తో మొహం కప్పు కుంటున్నాడో తెలీకుండా మొహం దగ్గర చేతులు పెట్టేడు.

"మరి నాకు శెలవిప్పించండి. వద్దనకండి బాబు. సెలవిప్పిం చండీ. అంతేకాదు మరి నన్నెప్పుడూ పిలవనంపకండి. నా మొహం చూసించలేను...." అంటున్న సుబ్బయ్యని ఆశ్చర్యంగా చూశేడు జగన్నాథం.

"డ్రెమటైజ్ చేస్తున్నాడోయ్ గాడిద కొడుకు" అనుకున్నాడు రాజేశ్వర్రావు.

"ఏమైందోయ్? సంగతి చెప్పు?" అడిగేడు జగన్నాథం.

సుబ్బయ్య మొహం అప్పుడే పెళ్ళాన్ని తగలపెట్టి వచ్చిన వాడిలా దీనంగా అయిపోయింది. గొంతుకలో కూడా జీర వచ్చింది.

"అయ్యో. ఏవైందని మెల్లిగా అడుగుతారా బాబు. ఇంకేటి అవాలి? నా ఇంటి దీపాన్ని ఎలిగించిందెవరు? తమరు కాదా? మరలాంటి దేవుడికి పిడికెడు సిమెంటు యివ్వలేక పోతున్నాను. ఇంక ఈ యూపారం, డబ్బు, మేడలు, ఇవన్నీ ఎందుకు బాబు. అప్పుడెప్పుడో రామలోరు బ్రిడ్జికి కడతా వుంటే సిన్న ఉడత పిల్ల కూడా సాయం చేసింది. నేనా ఉడతపిల్ల సాయం కూడా చెయ్యలేకపోతే ఎందుకు? తమలాటోరికి తెలివదు బాబూ ఈ ఎదవ యాపారం లొసుగులు. సెప్పినా తమకరదం కావు. కాని ఓ మాట నమ్మండి బాబూ. ఈపాలి కోటా రాగానే లారీ ముందుగా మీకాడికే ఒట్టుకొస్తాను. తమక్కావల్సినన్ని బస్తాలు, దించుకోండి. సత్తెపెమాణికంగా సెప్తున్నాను" అని అతి దీనంగా మొరపెట్టుకున్నాడు.

"...తమ కబద్ధం, నాకు నిజం రాబోయే మూడు కోటాలకి మూణ్నెల్ల కిందటే పెరిమిట్లు బక్కిరి పారేసినాడా తాసిల్దారుబాబు. నాలుగో కోటా వరకూ నేను సస్తే నా సమాధి కట్టడాని క్కూడా నా దగ్గర సిమెంటు నేదు. అయినా మీకెం దుకు? ఈపాలి కోటాకి మీ అవుసరం గడిపే పూసీ నాది.." అంటూ లేచాడు.

జగన్నాథం ఆ ఊర్నించి వెళ్ళిపోయేలోగా భార్యా సమేతంగా వచ్చి తనింట్లో భోజనం చేస్తానన్న వాగ్దానం తీసుకొని మరీ వెళ్ళాడు.

"ఆహా. అబ్బీ బెస్ట్ యాక్టర్ ఎవార్డు నీకురా యివ్వాలి" అభినందించేడు రాజేశ్వర్రావు.

"పోనీ మరోడి దగ్గర ట్రై చేస్తే?"

"ఏ పుట్టలో ఏ పాముందో?" జానకి అమాయకత్వం.

"ఇక్కడ ఉన్న అన్నిపుట్టల్లోను నల్లతాచులే. అడిగి లేదని పించుకోవడం తప్ప నో యూజ్" రాజేశ్వర్రావు విడమర్చేడు.

"జానకీ, సామాను సర్దు సాయంత్రం పోదాం. ఇల్లూ లేదు. వల్లకాడూ లేదు. అసలు నాకా ఇల్లే అక్కర్లేదు. వాళ్ళనే కట్టుకు ఊరేగనీ, ఊం రెడీ అవు. అలా చూస్తావేమిటి చెడుపు పెట్టే దానిలా. నేను తెలుగులోనే చెపుతున్నాను. మళయాళ మంత్రాలు చదవడం లేదు. అర్థం ఔతున్నాయా? నిక్షేపంగా ఉన్నవాణ్ని నా ప్రాణం తోడేసేపు ఇల్లో, ఇల్లో అని అయిందిగా ఇంద్రభవన భోగం ఇంక రెస్టు తీసుకోండి రాణీగారు. అసలు ఆడదాని సలహా వినడం తప్పు, విని పాటించడం మహాపరాధం. ఒరే రాజా, ఇంక మమ్మల్ని ఆపకురా నాయనా. చచ్చి ఈ జన్మలోనే నీ కడుపున పుడతాను" వెర్రెత్తిపోతోంది జగన్నాథానికి.

"నీలాంటిదే వెనకటికొకావిడ అత్తగారి మీద కోపం వచ్చి కూతుర్ని కుంపట్లో కూర్చోపెట్టిందట. నువ్వు యిప్పుడు గాని ఒదిలేసి పోయేవంటే యింకా యింటికి చెమ్మాదు నువ్వులు జాగ్రత్త చెయ్యడం మంచిది" తీర్పు చెప్పేడు రాజేశ్వర్రావు.

"మరెలా చావడం? డబ్బుపెట్టి కొంటానంటే వస్తువు దొరక్క పోతే ఎలా? పోనీ సిమెంటు లేకుండా గడుపుకో లేవుటే అమ్మడూ!"

"మీ యిష్టం. పూర్తిగా ఇసకతోనే పనిచెయ్యడానికి మేస్త్రీ ఒప్పుకుంటే నాకేం అభ్యంతరం లేదు. కాకపోతే ఆ ఇసకైనా ఏటి కెళ్ళి ఏరుకు తెచ్చుకోవడం అనుకుంటున్నా రేమో! బండి యిసుక పదిరూపాయలు. బండి అంటే మూడు బుట్టలు వుంటుంది. ఇందాక అక్కడెవరో వేయించు కుంటే అడిగేను. పైగా బండికి రూపాయి "ఆశీల"ట. ఆశీలు కట్టకపోతే బండిని రోడ్డుమీంచి రానివ్వరుట. వివరించింది జానకి.

"బండిరోడ్డు మీద కాకపోతే హెలికాప్టర్లో ఎగిరొస్తుందను కున్నారేమిటి?" ఇవేవీ జగన్నాథానికి అర్థం కావు.

"నామీదె గుర్రా ఏమిటి? చేతనైతే నాలుగు లారీలు ఇసుక తెప్పించ కూడదు" దెప్పింది జానకి.

"వీడికి తెలీదు. కాని లారీలో యిసక ఖరీదు పది రూపాయలు. లారీ అద్దె ముప్పై రూపాయలు, అన్నం కంటే అవకాయ ఎక్కువని, ఎందుకీ రాద్ధాంతం. నువ్వు కాస్సేపు బ్లాకులో కొనను అన్న ప్రిన్సిపల్ తీసి గట్టుమీద పెడితే, నేను అరగంటలో అరవై బస్తాల సిమెంటు తెప్పిస్తాను ఉపాయం చెప్పేడు" రాజారావు.

కూర్చున్న జగన్నాథం ఠక్కున లేని నిల్చొని. "నెవ్వర్, నేను ఛస్తే ఒప్పుకోను. మనలాంటి వాళ్ళు కూడా యిలాంటి దోపిడీని ఎంకరేజ్ చేస్తే యింక మన చదువులెందుకు? అసలిలాంటి వాళ్ళని పిలక పట్టుకొని పోలీసుల కెందుకు అప్పజెప్ప కూడదూ?" అన్నాడు ఆవేశంగా.

జగన్నాథం ఆవేశానికి రాజేశ్వర్రావుకి నవ్వొచ్చింది.

"ఎందుక్కూడదూ, తప్పకుండా కూడును. నీకు మెడికల్ నాలెడ్జే కాని, జనరల్ నాలెడ్జి దేవుడు ఇవ్వలేదు. మనం ఇన్స్పెక్టరు దగ్గరకెళ్ళి ఏవండేవండీ? ఫలానా వాడు సిమెంటో లేక మరోటో బ్లాక్ చేస్తున్నాడు పట్టుకోండీ అంటే వాడ్ని పట్టుకున్నా, పట్టుకోకపోయినా ముందు మనల్ని పట్టుకుంటాడు. ఆ పోలీసు కొంచెం మంచివాడైతే యిది అసంభవం అనుకో – ఏం నాయనా? రాత్రి కలగాని వచ్చిందా? నీకెలా తెలుసు?" అనడుగుతాడు. మరంచేత....

మనం ఎంతకొన్నామో చెప్తాం. రాజేశ్వర్రావు మాటకి అడ్డొచ్చేడు జగన్నాథం.

"మన మాట ఎందుకు నమ్మాలీ? యిలాంటి వాటికి ఎకౌంట్లు రశీదులు ఉండవు. ఇంకా దేవుడు మేలుచేస్తే, మొన్న మా పేషెంటొకడు ఎవడి చేతికో డబ్బిచ్చి సిమెంటు బస్తా తెమ్మన్నాడు. బస్తాతో పాటు కబురొచ్చింది డబ్బిమ్మని. నేను ముందే డబ్బు పంపేనంటాడు వాడు. ఇవ్వలేదంటాడు షావుకారు."

"ఒకవేళ ఆ మధ్యవాడు జేబులో వేసుకున్నాడేమో!"

"బానిస ఎప్పుడూ బుగతనే నమ్ముతాడు. నువ్వు కూడా ఆ షావుకార్నే నమ్ముతున్నావు., ఆఫ్కోర్స్ నువ్వన్నదొ అవొచ్చు. కాని ఈ సందర్భంలో మాత్రం కాదు. వాడు నాకు తెలుసు. రెండుసార్లు డబ్బిచ్చి ఒక బస్తానే కొన్న వాడికంటే మనం నయం కదూ. నువ్వీ కంఠశోష మానేసి యింకేమైనా చూసుకో. సిమెంటు సంగతి నేను చూస్తాను అన్నాడు లేస్తూ.

ఆ సాయంత్రానికి రెట్టింపు ధరకి బ్లాకు మార్కెట్లో పది బస్తాల సిమెంటు తెప్పించాడు రాజేశ్వర్రావు.

"ఆడికీ మాకూ మామూలండి. నాక్కాబట్టి ఈ రేటు కిచ్చినాడండి. నా ఎదుటే మరో రూపాయెక్కువిచ్చి అట్టుకు పోతున్నారండి జనం. మనకవసరం నేకపోతే ఈ ధరకి ఎవుడుపడితే ఆడే కొనుక్కుపోతాడండి కళ్ళకద్దుకొని మరీ అని భరోసా యిచ్చేడు బస్తాలు తెచ్చిన బండీవాడు జగన్నాథానికి.

## 13

మర్నాడు పొద్దునే ముగ్గురు మేస్త్రీలు, ఆరుగురు మొగ, డజను ఆడ కూలీలు పనిలోకొచ్చేరు. పొద్దుట పది గంటలకొచ్చి, సాయంత్రం వరకు పనిచేస్తారనుకుంది జానకి. ఆఫీసు టైము అలవాటైపోయి.

కానీ కాదుట.

"ఓలమ్మ, ఈ ఎండకి పిట్టల్నాగ రాలిపోవా తల్లీ. ఈ ఏసం కాలం అన్నాళ్ళు బేగి లెగిసొచ్చి, పొద్దు నడినెత్తికొచ్చీ వరకు సేసిపోతావండి. మద్దెలో గెంజికో సుట్టు పనాపుతాం. మరింక మద్దినేల రావండి" అని క్లారిఫై చేశారు వాళ్ళు.

ఏదో మాట సాయమే గాని తను దగ్గరుండి ఛస్తే పనిచేయించనని, కూలీల ఫోర్టుపోలియో జానక్కిచ్చేశేడు జగన్నాథం.

ఏనాడు ఏడుగంటక్కాని లేవని జానకి చచ్చినట్టు తెల్లవారురుఝామునే అయిదు గంటలకల్లా లేచి, ఆరో గంటకల్లా స్వంత యింటికెళ్ళింది జానకి. వెళ్లేసరికి మేస్త్రీలు, కూలీలు వీధి గుమ్మంలో కూర్చుని చుట్టలు కాల్చుకుంటూ ఊసులాడు కుంటున్నారు.

"మావొచ్చి జాం పొద్దయింది తల్లీ. గెంజినీళ్ళన్నా గొంతులో ఏసుకోలేదు. ఎర్రి బేపల్నాగ ఎంతరిసినా ఎవుడూ తలుపులు తీయకపోతే మాకు, పన్లెలాగౌతాయి? ఇదిగో ఈ కూలీ జట్టుని ఎట్టుకుంటే పన్లవ్వవని మీరే అంటారు మల్లా బేగి తలుపులు తీయించమ్మా" మొత్తగా చీవాట్లు పెట్టేడు సీనియరు మేస్త్రీ.

అరవగా, అరవడగా ఎలాగయితేనేం అరగంట తరువాత మాయామహల్ తలుపులు తెరుచుకున్నాయి.

నిన్నటి పళ్ళ పిల్ల తల్లిలా ఉన్నావిడ–ఈవిడకి నోటి నిండా నూట ముప్పై పళ్ళు అడ్డదిడ్డంగా కూరేసినట్టు న్నాయి– పొద్దున్నే ఏమిటీ గోల అన్న మొహం పెట్టి నిల్చుంది.

"ఈ సామాన్లు కొంచెం పక్కగదిలో సర్దుకుంటే గోడలు రిపేరు చేస్తారు" ధీమాగా అడుగుదామనుకున్న జానకి ఎపోలజెటిగ్గా అడిగింది. గదిలో వున్న సామాను వేపు చూపిస్తూ.

ఆ గదిలో వున్న సామాన్లు పాత పేకేజీ పెట్టెలు, విరిగిపోయిన కుంపట్లు, తుప్పు పట్టిన రేకు డబ్బాలు, చిత్తు కాయితాలు, కోళ్ళు విరిగిపోయిన మంచం వగైరాలు. అసలా సామాను ఏ గదిలోను పెట్టనవసరం లేదు. వాటిక్కావల్సింది పరిటెడు పెట్రోలు, ఒక అగ్గిపుల్ల. గదిలో సామాన్లు లేనిచోట అడ్డదిడ్డంగా పిల్లలు నిద్రపోతున్నారు. కొంతమందికే చాపలున్నాయి. కొంతమంది ఒకర్నొకరు కౌగలించుకొని పడుకున్నారు.

మిగతా వాళ్ళు ఒకరి గుండెలమీద ఒకరు తన్నుకుంటున్నారు. వాళ్ళలో ఒకడు బహుశా జ్యేష్ఠుడు కాబోలు కాళ్ళు ముడుచుకొని ఉండకపోతే కాళ్ళ దగ్గర తిన్నెమీదున్న దేవుళ్ళ నడుములు విరిగిపోయుండేవి.

ఈ ముసుగులు కప్పిన శవాల్లా వున్న పిల్లల్ని చూస్తే జానక్కి అసహ్యం వేసింది.

"ఇంటిలో ఎవ్వరూ లేరు సామానంతా తియ్యడానికి. మీ కూలీల చేత తీయించుకోండి" మూతి ముప్పై వంకలు తిప్పుతూ చెప్పేసి లోపలికి మాయమైంది ఆ పళ్ళ తల్లి.

ఎవరూ లేరా?

అయితే ఈ శవాలు నిజం శవాలు కావు కదా భగవాన్!

ఈ తరువాత ఆ శవాలకి ప్రాణ ప్రతిష్ట చేసి, లేపి గదిలో సామానంతా మరో గదిలోచేర్చి మనిషి నిల్చోడానికి వాస యోగ్యంగా చెయ్యడానికి సుమారు గంటపట్టింది జానక్కి.

ఈ గంట సేపు మేస్త్రీలు చుట్టలు అరలేదు.

కబుర్లు ఆగలేదు.

మధ్యలో మాత్రం ఆc, ఆc బేగితెవcలాల.ఏటా పెళ్ళోరి నడకలు? ఓ ఇద్దరెళ్ళి నీళ్ళట్రండి అని పురామాయించేడు ఒకడు తనేమీ చెయ్యకపోవడం తన తప్పు కాదన్న మొహం పెట్టి.

"మరండి, సిమెంటులోకి నీళ్ళు ఏడనుండి తేవాలా?" ఒక కూలిదానికి డౌడ్ వచ్చింది.

"నేనేం అర్జునుడి ననుకున్నావేమిటి? నీ అమ్మకడుపు కాలా! బాణం వేసి నీళ్ళు పుట్టించడానికి?" మనసులో తిట్టుకున్న జానకి "గుమ్మంలో కొళాయి పెట్టుకొని నీళ్ళు అడుగుతా వేమిటమ్మా? లేకపోతే అల్లదిగో నుయ్యి. అందులోంచి తోడండి" అని నుయ్యి చూపించింది.

పంపుకాడ మావెలా తేగలం తల్లీ! ఎన్ని నీళ్ళు ఆయమ్మల తానాలకే సాలవు. బిందెమీద బిందెట్టేడవూ; తానవాడీడవూను. మావెళ్తే మైలడిపోనానంటారు. మూడు కుండలు తెచ్చేసరికి మాపిటేల వుద్ది. నూతికాడే తోడుతాం గాని ఓ సేదవుంటే బడీ" అంటూ చీర మోకాళ్ళ మీదికి ఎగ్గట్టింది ఓ కూలిది.

అవును అన్నట్టు నీళ్ళు తోడ్డానికి బకెట్‌కావాలి. అవి పొయ్య డానికి డ్రమ్ము కావాలి. ఇవన్నీ ఎవరిస్తారు? అసలు నిన్ననే వీటి గురించి ఆలోచించాల్సింది కొత్త పూజారత్నం.

మానసం చంపుకొని యింటిలో వున్న వాళ్ళనడిగితే

తప్పేం వుంది. ఉంటే యిస్తారు.

లేకపోతే లేదంటారు. కాని కొట్టరు.

ఉండి లేదనొచ్చని జానక్కి తట్టలేదు.

"ఆ ఇంటిలో కెళ్ళి ఆ అమ్మనడిగి తెచ్చుకో" మని ప్రకాశ రావు వాటా వేపు చూపించింది జానకి.

"ఓయమ్మా ఓ సుట్టు రెండు బాల్చీల యియ్యి. పనైపోగానే యిచ్చేస్తాం" గావుకేక పెట్టింది. ఆ కూలిమనిషి ఆ వాటా వేపు తిరిగి.

"మేమేం బకెట్ల దుకాణం పెట్టుక్కూర్చోలేదు. లేవు" వాటా వాణి పలికింది.

"ఎటోలమ్మ. మావేం కొరుక్కు తినేస్తావా" కిరిగించీసు కుంటామా, తాగేస్తామా? అలాగైపోతన్నావ్ సేదిమ్మంటేను? ఆ యమ్మదేటి ఈవూరా? ఈ దేశమా? పొరుగూరి మడిసికి సామానెక్కడొస్తాది? మావైనా కుండలు తెచ్చినావు గాని, నూతి లోకి గెంతగలవేటి నీళ్ళు తోడ్డానికి ఇల్లో నారాయణమ్మ నీ యిల్లెక్కడంటే, నా యిల్లు అడివిలోనని యింత ...." దండకం ఎత్తుకుంది కూలీ.

ఇవన్నీ తనే అనిపిస్తోందనుకుంటారేమోనన్న భయం వేసింది జానక్కి.

ఏయ్ అమ్మి. నీ నీళ్ళకో నమస్కారం కాని రభస చెయ్యకు బావుండదు. ఈ పూటకి పంపుదగ్గరే తెండి. ఎంత పనైతే అంతే ఔతుంది. కావాల్సినవి సాయంత్రం కొనుక్కుందాం. ఈలోగా ఒక మనిషి డాక్టరు రాజేశ్వరరావుగారింటి కెళ్ళి ఆ అమ్మగార్నడిగి రెండు బకెట్లు తీసుకురండి.." అని దానికి పని పురమాయించి "ఏమిటోయ్ అలా నిల్చున్నావ్? మీ పని మీరుగానీయండి" అంది మేస్త్రీలతో, ఏదో ఒకటి అనాలి కాబట్టి.

"మావేటి సెయ్యవండి. సిమెంటు వాయి కట్టండిరా అంటే యిదిగో ఈల్లింకా నీళ్ళకెల్తున్నారు. ఒలేయ్! గుంటా, బొమ్మన్లేగ అలా నిల్సుండిపోనారేటి? నాలుగుతట్టలు యిసకెత్తుకొచ్చి జల్లించండి "ఆర్డరేసేడు పెద్ద మేస్త్రీ. ఏ పనీ చెయ్యకుండా అలా నిల్చోడం తనకెంత మాత్రం ఇష్టం లేనట్లు.

"సీరెట్టి జల్లించమంటావా? సేతులెత్తి జల్లించమంటావా? సెప్పు" తన తప్పులేదంది ఆ గుంట.

అవునన్నట్లు జల్లెడ కూడా ఉండాలి. పోనీ ఈ పూటకి జల్లించ కుండానే చెయ్యండి అంటే వాళ్ళు నవ్వుతారేమో. ఆఖరికి ఈ కూలీలక్కూడా లోకువైపోవడం దేనికి?

ఆ బకెట్టకి వెళ్ళే మనిషిని డాక్టరుగారింటి నుంచి జల్లెడ కూడా తెమ్మను. హెడ్ మేస్త్రీతో అంది జానకి. అల్వేజ్ డీల్ విత్ ది టాప్ మేన్ అన్న జగన్నాధం సూక్తి గుర్తు తెచ్చుకుంటూ.

"అదెల్లి అరగంటైనాది. ఈపాటికొచ్చేస్తుంటాది" అన్నాడు టాప్‌మేన్.

"అయితే మరో మనిషిని పంపించు" అంది జానకి. రెండో కూలీని కూడా పంపిచేస్తున్నందుకు విచారం కంటే ఈ సంగతి తెలిస్తే జగన్నాధం ఇచ్చే లెక్చరు ఊహించుకొని భయపడుతూ.

"నెవ్వెళ్ళే నచ్మొ" పురమాయించేదు.

తొందరగా పని అవుతుందని లక్ష్మిని రిక్షాలో వెళ్ళమందా మనుకొని రిక్షాకోసం మళ్ళీ మూడో కూలీని పంపించమంటారే మోనని మానేసింది జానకి.

అసలు లక్ష్మి చంచల లక్ష్మిట.

కూలీ లక్ష్మి అచంచల లక్ష్మి.

గజగమన

ఆవిడ అరక్షణం ఆగకుండా నడుస్తూనే ఉంది.

అరగంటైనా వీధి చివర చేరలేదు.

దూరమౌతున్న ఆ గజగమనని చూస్తూ, నుదుటి చమట చీరతో వత్తుకుంటూ, వాకిటలో నారింజ చెట్టునానుకొని నిల్చుంది జానకి.

ఉదయం ఏడుగంటలే అయినా ఎంత నెత్తి పేలగొట్టే స్తోంది. కూర్చోడానికైనా చోటు లేదు. ఈ ప్రకారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు పేలాల్లా మాడిపోతే యింక ఇంటికెళ్ళక్కర్లేదు. భగవాన్ నిలువ నీడలేక పోవడం అంటే యిదేనేమో!.

నీడ చూపించడానికే అన్నట్టు ఎప్పుడొచ్చేవ్ జానకీ? మీ ఆయన కూడా వచ్చేట్ట. ఏడీ? యిలాంటి పని ఆడదానివి నువ్వేం చేయిస్తావు. ఆరె! అదేమిటీ? అలా ఎండలో మాడిపోతున్నావు? వరండాలో కన్నా కూర్చోకలేక పోయావా? ..." అప్పుడే వచ్చి కామేవం అడిగేస్తున్నాడు.

కామేశం, జానకి ఒక ఊరివాళ్ళు కలిసి ఆడుకున్నారు. కామేశం కుటుంబం, జానకి కుటుంబం ఒకే కుటుంబంలా వుండేవారు. జగన్నాధం గవర్నమెంటు సర్వీసులోకి వెళ్ళిపోయేక ఆ మధ్యనే కామేశం ఆ వూరు ట్రాన్సఫరయ్యేట్ట.

"ఎక్కడ కూర్చోను?" అన్నట్టు చూసింది జానకి నీరసంగా.

పొద్దున్న కాఫీ తాగేవా? టిపిన్ తిని రాలేకపోయేవా? అల వాటు లేదూ? మంచిదానివే. ఇదంతా అలవాటుందనే చేయి స్తున్నావా? అయినా మీ ఆయనే కలియుగ బుద్ధుడననుకు న్నాడేమిటి? విన్నాన్లే కథంతా దర్టీ ఫెలోస్‌ని చెంబూ, తపేలా బైటికి విసిరేద్దును నేనైతే. చూసేవా! ఖర్మ అంటే యిదే కాబోలు. యిది వరకు నమ్మకపోయినా, యిప్పుడు నమ్మాల్సివస్తోంది. ఖర్మ సిద్ధాంతం. లేకపోతే నీ ఇంటిలో నీకు నిలబడ్డానికి చోటు లేక పోవడేమిటి? డోన్ట్ ఫీల్ హర్ట్ గాని జానకీ యిదేవిల్లు. అతని మాటెలా వున్నా నీ బుద్దేవైంది? థేంక్‌గాడ్. యిప్పటి కయినా మీకు జ్ఞానోదయం అయింది కాని, లేకపోతే పునాదులే మిగిలేవి. అవును గాని సిమెంటెక్కడిది నీకు? కొంపదీసి బ్లాక్‌లో కొన్లేదు కదా?... ఎదుటి వాడిని నోరెత్తనివ్వకుండా గచ్చపొదలా గలగలా మాట్లాడ్డం కామేశం ప్రత్యేకత.

సిమెంటు కథంతా చెప్పింది జానకి.

అరెరె! ఎంతపని చేశావు. నేనిక్కడ ఇంజనీర్నని తెలుసు కదా ... పోనీ నా చెవినోసారి వెయ్యకూడదూ! ఛ! ఛ! అంత మొహమాటం నాకు నచ్చదు సుమీ! నేను గారంటీ యివ్వలేను గానీ ఐ విల్ ట్రై. నా దగ్గర కొందరు కాంట్రాక్టర్లు ఉంటారు. వాళ్ళ దగ్గర సిమెంటు బోలెడుంటుంది. నొక్కాల్సిన చోట నొక్కితే ఓ పాతిక బస్తాలు రాల్తాయేమో చూస్తాను. ఏమిటీ? పది బస్తాలు చాలన్నారా? ఆ మాట కూలీ అంటే రెండు చేతా, మేస్త్రీ అంటే నాలుగుచేతా గుణించు. ఆ పది బస్తాల్నీ ఈ ఇల్లు నంచుకుం టుంది. పర్సు తీస్తున్నావు డబ్బుకా? తరువాత చూసుకోవచ్చులే! యివ్వకుండా వెళిపోతేనో! అంటావా? నీ మీద ఆ మాత్రం పెట్టుబడి పెడితే నష్టం లేదులే. నో.నో.నో. అలా యిబ్బందిగా పెట్టకు మొహం. నువ్వేం మారలేదు సుమా. నాకు టైమై పోతోంది. పది నిమిషాలు ఆలస్యం అయితే పిప్పరమెంటు బిళ్ళలా చప్పరిస్తోంది. మా ఇ.ఇ. వస్తాను. మళ్ళీ కలుస్తాన్లే. విష్ యూ స్పీడీ ప్రోగ్రెస్..." అంటూ గాలివానలా వెళ్ళిపోయేడు. వెళ్ళినవాడు తిన్నగా ఆఫీసుకి వెళ్ళలేదు. ఇంటికెళ్ళి ప్లాస్కు నిండా కాఫీ, ఓ కప్పు, సాసరూ, ఓ కుర్చీ పంపించేడు. ఆ

ఒక్క రోజే కాదు. జానకి అక్కడున్నన్నాళ్ళూ రోజూకాఫీ కామేశం ఇంటినుంచి వచ్చేది.

ఫరవాలేదు ప్రపంచంలో ఇంకా ఒకటీ, అరా మంచి వాళ్ళు న్నారన్నమాట.

"కామేశం దేవుడి గురించి నేనెప్పుడూ ఆలోచించలేదు. కాని, ఈ క్షణాన మాత్రం దేవుడే నీ రూపంలో వచ్చేడు" అనుకుంది జానకి కాఫీ తాగుతూ.

పదిగంటలూ అవ్వోస్తోంది.

నీళ్ళెక్కడ ఒయ్యమంటారండి! అంది నెత్తిమీద నిండు కుండతో ఒక కూలిది.

"నా నెత్తిమీద" అందామనుకుంది జానకి విసుగువల్ల నిజంగా అలా పోయించుకుంటే ఎంత హాయిగా వుంటుంది. ఈ ఎండలో అనుకుంది మరక్షణమే.

పైకి మాత్ర "సిమెంటు కలుపు" అంది.

సిమెంటు ఇంకొద్దనీసి నాదండి. మేస్త్రీ సల్దులకి దిగాల కదండి మరి.

అప్పుడే పదయిందా?

సూర్యుడయినా గతితప్పుతాడేమో గాని వీళ్ళు టైము తప్పరు.

ఔనుగానీ ఎంతసేపూ మీరు నలుగురే కనిస్తున్నాను. మిగతా వాళ్ళేరీ?

అదిగో యిద్దరమే పంపుకాడ కూకున్నారండి. (అవును చక్కగా బాల్చీలు బోర్లించి వాటిమీద కూర్చుని చుట్టలు కాల్చు కుంటున్నారు. నూతిలో ఉప్పునీళ్ళని పంపెనీళ్ళే తెమ్మన్నాట్ట మేస్త్రీ). .... మరండి యిద్దరేమో ఇసిక మోస్తున్నారండి. అల్లదిగో మేస్త్రీ కాడ సిమెంటు అందజేస్తున్నారండి యిద్దరు. (ఒకర్తి మేస్త్రి నోటిలో చుట్టకి అగ్గిపుల్ల కొడ్తోంది. వాడి జోక్‌కి రెండోది నవ్వుతోంది. మీ అమ్మకడుపులు చల్లగా వుండాలి కాని మీకివాళ చుట్టలు కాలుస్తున్నందుకే నేను డబ్బు యిస్తున్నాన(రా) మరి నీళ్ళెక్కడా పొయ్యమంటారండీ?" ఆ గుంట కదల్లేదు.

"తీసుకెళ్ళి నూతిలో పోసే నన్ను చంపక" లోపల అనుకో బోయి పైకి అనేసింది.

ఓ తల్లీ. పంపు నీళ్ళట్టుకెళ్ళి ఉప్పునీళ్ళ నూతిలో ఒయ్యమంటారేమిటి? ఈడ దింపేస్తాను. సల్దులకేనా సాల్తాయి" అంటూ కుండ దింపేసింది ఆ గుంట.

మరో పావుగంటలో బిలబిల్లాడుతూ చల్దులకంటూ అందరూ పని ఆపేశారు. నూతి దగ్గర కాళ్ళూ, చేతులు కడిగేరు. జానక్కి చల్ది తినాలన్న బాధలేదు. అంచేత కామేశం పంపిన కాఫీ కప్పులో పోసుకొని వరండాలో కూర్చుని కూలీలనే చూస్తుంది.

వాళ్ళంతా జానక్కి కొత్తగానూ, తమాషాగానూ ఉన్నారు. తాళ్ళతో నారింజ కొమ్మలకి కట్టుకొన్న చిన్న చిన్న గిన్నెలు విప్పుకున్నారు. వాళ్ళకీ పాపం ఆ వరండా తప్ప కూర్చో డానికి చోటు లేదు. వరండాలో జానకి వుంది. ఏం చెయ్యాలో తోచక ఎండలో నిల్చున్న వాళ్ళని చూసిన జానక్కి ఒక్కసారి ఎవరో కడుపులో ఇనుప పళ్ళచక్రం తిప్పినట్లైంది.

అదేమిటర్రా. అలా నిల్చున్నారు? ఇక్కడకొచ్చి తినండి. నేనేం దిష్టి పెట్టనులెండి" అంది.

వాళ్లంతా వరండాలో చతికిలబడ్డారు. అమ్మగారి ఎదురుగా అలా తినవలసి వచ్చినందుకు సిగ్గుపడుతున్నారు. గిన్నెల మీది మూతల మీద ఒక ఉల్లిపాయో, రెండు కాల్చిన ఎండు మిరప కాయలో, ఒక పచ్చి మిరపకాయో ఉన్నాయి. ఒకో గిన్నెలో పిడికెడు అన్నం, గిన్నెడు గంజి.

వాళ్ళు చక్కగా మూతలు తీసి సరసాలాడుకుంటూ, నవ్వు కుంటూ ప్రపంచంలో స్వర్గం అంటే ఇదే అన్నంత హాయిగా తినేస్తున్నారు. నంచుకోవడానికి ఏవీ తెచ్చుకోనిదానికి, రెండు మిరపకాయలున్నవాడు ఒక మిరపకాయయిచ్చాడు. ఊఁ ఉఁ వద్దులేరా మావా, నాను నంచుకోనేక పోయినా తినీగల్ను, నువ్వు తినీ..." అని మొహమాట పడుతోంది అది.

"తీసుకోయే ఎర్రినంజా. మిరపకాయ నంచుకిచ్చి నిన్ను మనువాడన్లే బయం నేదు. నాకాడ రెండు మిరపకాయలున్నాయి కదా. నీకోటిస్తే ఎటిపోద్ది? ఎదవ కడుపు ఎంత తింటే వద్దంటాది? తిను తిను అని బలవంతాన దానికో మిరపకాయ యిచ్చి, ఏటే గుంటా, అలా గీరుతున్నావ్. ఎర్రసీమ లట్టేసి నాయేటి? పాపం ఆటికి మాత్తరం యెవరెడతారు? ఎర్రసీమలు కంటికి మంచిదంటారు? తినేసి బేగినేగు...." అంటూ యింకో పిల్లతో హాస్యమాడేడు.

వాళ్ళనలా చూస్తున్న జానక్కి ఎంత బాధ తెలియలేదు. వాళ్లలా యివ్వడం నేర్చుకుంటే!

తన దగ్గర రెండుండి, ఎదుటివాడికి లేనప్పుడు తనదొకటి తీసి బతకడం నేర్చుకుంటే.

వీళ్ళ దగ్గర నేర్చుకోవలసినవి చాలా ఉన్నాయి.

దేశంలో యింత దరిద్రం వుందా?

నేనిచ్చే ముష్టి మూడ్రూపాయలకి వాళ్ళకి ఎండలో శ్రమ పోను మిగిలేది ఇదా?

జానక్కి కాఫీ సహించలేదు.

కాఫీ కప్పు కిందపెట్టి వరండాలో రెండో వేపు చూసింది.

అక్కడ కూర్చున్న ఆడవాళ్ళలో ఒకామెకు పాతికేళ్ళుంటాయి.

చందనం బొమ్మలా చక్కగా వుంది.

చేరెడు కళ్ళు, చెంపల మీది జుత్తువున్న చంద్రబింబంలా వుంది.

జానకి ఆవిడ్ని పొద్దుటనుంచి కనిపెడుతూనే వుంది.

ఆమె మాటల్లో ఒక్క పొల్లు లేదు.

చేతలో క్షణం వేస్టు లేదు.

ఆవిడనెవరూ పకలకరించలేదు.

ఆవిడ మాత్రం అప్పుడప్పుడు ఒక ముప్ఫై ఏళ్ళ మరో ఆడకూలీతో మాత్రం మాట్లాడుతోంది.

మనిషి ఆరోగ్యంగానే ఉన్నా, కళ్ళలో నీరసం వుంది.

ఆవిడ పెదవిమీద చిరునవ్వు కడుపు కన్నీళ్ళ నుంచి తేలి మీదికి వచ్చినట్టు బరువుగా జాలిగా ఉంది.

ఆవిడ మిగతా ఆడ, మొగ అందరు కూలీలకు కొంచెం దూరంగా తన అల్యూమినియం గిన్నె ముందు పెట్టుకొని కూర్చుంది. గిన్నె మూత మీద ఉల్లిపాయే కాకుండా, మిరప కాయలు కూడా ఉన్నాయి.

గిన్నె మూత తాపీగానే తీసింది. కాని తియ్యగానే దెయ్యాన్ని చూసిన దానిలా అరిచిలేచి నిల్చుంది.

"ఏమైంది?" అని ఎవరూ అడగలేదు కొంతసేపు.

"ఎటైంది?" కళ్ళతోనే అడిగింది ముప్ఫై ఏళ్ళది.

"గెంజిలో బల్లిపడినాది" అంటూ ఆ మనిషి లేచివెళ్ళి గిన్నెలో గంజి అన్నం కాలవలో పారబోసి, గిన్నె కడుక్కొని వచ్చి గోడకి చేరబడి కూర్చుంది.

ఈ లోగా అంతా అన్నం తింటున్నారు. ముప్ఫై ఏళ్ళది తప్ప.

"రాయే. నాది సగం ఏస్తాను" అంది.

"ఏస్తావ్! ఏస్తావ్!! నువ్వు సచ్చిన్నాడు వీకెవరు ఏస్తారో చూస్తాను" ఉరిమింది ఒక ముసల్ది.

పాతికేళ్ళది. ముప్ఫై ఏళ్ళదీ ఎక్కడ ఉన్నవాళ్ళు అక్కడే విగ్రహాల్లా ఉండిపోయేరు. ఆ తరువాత ముప్ఫై ఏళ్ళది గోడవేపు తిరిగి అన్నం తినడం ప్రారంభించింది. ఆవిడ గిన్నెలో గంజితో పాటు, కారిన కన్నీటిని కూడా తాగిందన్న సంగతి ఎవరూ చూడలేదు.

జానక్కి ఏమీ అర్థం కాలేదు. అంత కలిసి మెలిసి బతుకుతున్న వాళ్ళలో, ఒక్కరూ ఆమెకు గుక్కెడు గంజి పొయ్య లేదు. ఎంచేత?

ఏమిటా రహస్యం?

అదేమిటో తెలుసుకొనేవరకూ అందని చోట వీపు మీద దురద వేసినట్టుంది. అంచేత ఆ పాతికేళ్ళదాన్ని కనుసంజ్ఞతో పెరట్లోకి తీసికెళ్ళింది జానకి.

"ఎవరు నువ్వు?"

"మాలలవండి."

"కులం కాదు నీ పేరు?"

'మాలచ్చి..."

"ఎవరూ నీతో మాట్లాడరేం?"

"......"

"నీకు గంజి యిస్తానన్నదెవరు?"

"మా అప్పండి"

"ఆవిడ్ని నీకు అన్నం పెట్టనివ్వలేదేం వాళ్ళు?"

"పెట్టనియ్యరండి..."

"ఎంచేత..."

"ఆళ్ళు పెట్టనియ్యకూడదండి."

"ఏం"

"అది మా కులం కట్టుబాటండి"

"అంటే...."

"నేను తప్పుచేసినానండి."

"ఏం తప్పు?" కొంచెం సందేహిస్తూనే అడిగింది జానకి.

"సెయ్యకూడనిదే నండి మరి"

"ఖూనీ చేశావా?"

"అంతకన్న గోరమేనండి"

"ఏమిటిది?"

"లెగిసిపోనానండి" మొహం చాటుచేసుకుంది కన్నీరు దాట డానికి. ..

..... ఏం మాట్లాడాలో తోచలేదు జానక్కి. ఇదంతా ఆడక్క పోతేనే బావుండుననిపించింది.

"....మాదిగోడితో లెగిసిపోనానండి. మరది తప్పేనండి..."

పాతికేళ్ల క్రితం చచ్చిన తల్లిని చూస్తున్నట్లనిపించింది ఆమెకి జానకిని చూస్తే... "మరంచేత నాతో మావోళ్లు మాటాడరండి. నీళ్ళూ, నిప్పూ కూడా యియ్యరండి. సచ్చినప్పుడు పూడిస్తే మాదిగాళ్లే పూడచాలండి..."

"నీకు నాన్నలేదూ?"

"ఆడికంట నాను పడనండి. కంటపడితే ఆడు సచ్చున్నా పోతాడు. నన్ను సంపేస్తాడండి. నాను అగుపడ్ను కాబట్టే ఎలాగోలాగ బతుకేస్తున్నానండి"

జానకి మూడు రూపాయలు తీసి ఆమెకిస్తూ "ఇంద నీ కూలి తీసుకో" అంది.

'పొయ్యేటప్పుడియ్యండి"

"ఎక్కడైనా కాఫీ తాగిరా. ఆలశ్యమైనా ఫరవాలేదు"

"ఒద్దండి"

"ఏం ? ఆకలి వెయ్యడం లేదూ"

"ఎందుకెయ్యదండి?"

"మరైతే కాఫీ తాగిరా"

"కూలి తక్కువైతే తంతాడండీ మావోడు"

మాట్లాడలేకపోయింది జానకి.

ఏడుపూ, నిస్సత్తువ ఆమెకు ఒక్కసారే వచ్చేయి.

కానీ ఆ కూలీకి డబ్బిచ్చి, "యింత ఎండలో ఆకలి కడుపుతో పని చెయ్యక్కర్లేదు. ఇంటికి పో" అని అనలేదు.

ఆ తరువాత మిగతా కూలీలు పని ఆలశ్యంగా మొదలు పెట్టినా ఆమె మాట్లాడలేదు.

# 14

చల్దులు తిని, చుట్టలు కాల్చుకొని మళ్ళీ పని ప్రారంభించే సరికి పదకొండైంది.

ఇందాక పంపు దగ్గర పెట్టిన బాల్చీలు తిరిగి పట్టుకొచ్చే సేరు ఆ యిద్దరూ. వీధిలో రోడ్డు మీద పోసిన యిసుక యింకా అలాగ ఉంది. ఇందాక పని ఆపేసిన చోట తిరిగి కూర్చున్నారు మేస్త్రీలు.

కొత్త అవడం వల్ల సరిగ్గా చూడలేదు జానకి. ఈపాటికి అపక్క పనంతా అయిపోయి వుంటుంది అనుకున్న జానక్కి వాళ్ళు చేసిన పని చూడగానే కంట నీరు తిరిగింది. ఒక గోడ సగం మాత్రం గజం ఎత్తు వరకు సిమెంటు రాశారు. సిమెంటు రెండు బస్తాలైపోయింది. మూడోది విప్పు తున్నారు.

అందులో సీనియర్ మేస్త్రీ తాపీని మాస్టర్ పెయింటర్ పాలెట్ నైఫ్ పట్టుకున్నట్టు అతి అర్టిస్టిక్‌గా పట్టుకొని ముందు కుడి నుంచి ఎడమకి రాశేడు. సాయిబులు లవ్ లెటర్ రాసినట్టు తరువాత ఒక్క నిమిషం ఆగి ఐడియా కోసం అన్నట్టు చెవి పక్కనున్న ఆరిపోయిన చుట్ట తీసి వెలిగించేడు. వెలిగించిన చుట్ట నోటిలో పెట్టుకొని, పెద్ద ఆర్టిస్టు తను గీసిన బొమ్మ బావుందో లేదో చూసు కున్నట్టు ఒక్క నిమిషం తేరిపార చూశేడు.

ఛ. ఛ. బావులేదు.

వెంటనే హిందూ పద్దతిలో ఎడమ నుండి కుడికి తాపీతో చెరిపేశాడు. తరువాత గట్టిగా ఒక దమ్ములాగి మళ్ళీ ఒక నిమిషం సేపు చూశేడు.

ఈసారీ నచ్చలేదు.

మళ్ళీ తాపీ తీసుకొని చైనా వాడిలా పైనుంచి కిందికి రాశేడు.

ఇన్‌స్పిరేషన్ చాల్లేదు. మరో రెండు దమ్ములు లాగేడు.

మూడ్ కుదరని ఆర్టిస్టులా చికాగ్గా కిందనుంచి పైకి సర్రున రాసేడు.

మిగిలిన యిద్దరు మేస్త్రీలు చుట్టూ వున్న గోడల్ని శుభ్రంగా తాపీతో అడుగు లోతు చెక్కేస్తున్నారు. వాళ్లలా గోడల్ని కొబ్బరి కాయ కోరినట్టు కోరడం చూసిన జానక్కి మళ్ళీ సిమెంటు రాసే వరకు ఆగకుండా పై బరువుకి ఈ గోడలు కూలిపోవచ్చు అన్న భయం పట్టుకుంది. ఆ భయం మనస్సులో దాచుకోలేక పైకి అనేసింది.

"మీరలా చేక్కేస్తున్నారు కదా. ఈ గోడలు నిలుస్తాయా?"

దానికి ఎంప్రెటిస్ మేస్త్రీగాడు, అమెరికా ఎంబాసిడరు ఇండియా ముష్టివాడ్ని చూసినట్టు ఓ చూపు జానకి మీద విసిరి, గోడకోరుడు తాత్కాలికంగా వాయిదా వేసి "ఏటీయమ్మ భయం? ఈ గోడలెందుకు బడిపోతాయీ పెరుగు ఎంకమ్మ ఈపునాగ మందం వుంటేనూ" అని ఎంబాసిడర్ లెవెల్ నవ్వొకటి నవ్వేడు.

జానకి కూడా చిన్న పిసరు నవ్వుదామనుకుంది. కాని అంతలో "అమ్మగోరూ, అమ్మగోరూ" అన్న సీనియరు మేస్త్రీ గావుకేకతో కొంపతీసి గొడ అటువైపు కూలీపోయేను కదా" అన్న భయంతో ఒక్కక్షణం రెఫ్రిజిరేటర్‌లో పెట్టిన మనిషిలా చల్లబడిపోయింది.

"ఏమిటీ?" డబుల్ టైఫాయిడ్ పేషెంటు గొంతులా వుంది.

"మరి గంటేనండీ. తమరిగోరి పెళ్ళికి మాంగారున్నారా? సెల్లి పోయేరా అమ్మా?" ధర్మ సందేహం వెలిబుచ్చాడు.

"మామగారి మాటెలా వున్నా, నువ్వు గాని మరో గావు కేక వేస్తే నేను చెల్లిపోతాను" అనుకున్న జానకి "బతికే వున్నారు" అంది జవాబు చెప్పకపోతే మళ్ళీ కేకలేస్తాడేమో నని.

ఆ బాబండి–గాంధీగోరు సచ్చిపోయినప్పుడు నెహ్రూ బాబన్నట్టు – మాయిలవైన మడిసండి. మడిసంటే ఒజ్రం కదండి. ఆ ఆబుకాడ పన్చెయాలంటే తెగ బయబడేవోరండి. నాకు మాత్తరం ఆ ఆబుకాడ నెలవే అనుకోండి. ఈ వొంటిల్లంతా నాసేతుల్తోనే కదా కట్టింది. అసలా బాబుకి ఎలా సేసినా నచ్చిది కాదండి. డబ్బు నెక్కనేదు. సచ్చీవరకు సెయ్యాల్సిందే... ఒలే గుంట. కుసిన్ని నీల్లట్రాయే.. ఓ పాలెటైందంటే గజమెత్తు గోడలు లెగిసినాయండి. ఈ బాబుకి ఏటనిపించిందో ఏటో "ఎట్రా ఏడుకొండలు తడచిపోయిన అట్టముక్కల్నాగున్నాయ్ అని పొట్టేలు గుద్దినట్టు గుభీమని కాలితో ఒక్క తాపు తన్నీసినాడు ఇంత గోవా పాట్ల పండునాగ యిడిపోనాది ..."

"డబ్బు దండుగ" అంది జానకి. మామగారు గుద్దీసిన గోడ కాదు, నీ పని, అనుకుంది మనసులో.

"ఆ బాబుకి డబ్బుకి యిలవనేదండి. ఓ సుట్టేటైందంటే – ఇదిగో యిలాగే గోడ పనిసేస్తున్నానండి. ఆ బాబుగారు మీరు కూకున్న కాడే కూకున్నాడండి. కురిసీమీద. ఆయేల ఒకటో తారీకు మన పాలసూరమ్మనేదండీ! తమకి తెల్దు లెండి... అప్పటికే ఇజీనగరం తమలపాకు నాగ పండిపోనాది. ఎలా గుండేదేటి? ముసిలి భీముడికి కోక కట్టినట్టుంటేడి – అదొచ్చి "బాబూ, పాల్డబ్బులు ఇస్తావేటి? గొడ్డుకి గడ్డినేదు" అనడిగినాది.

"ఎంతియ్యాలే నీకు?" అనడినాడా బాబు. ఆ బాబుగోరికి నెక్కా పద్దూ వుండేది కాదు. రూపాయలు కుడిసేత్తో తేటం, ఎడంచేత్తో ఇసిరీటవూను అదీ ఆ బాబు పద్దతి.

"అరవై రూపాయలు" అంది సూరమ్మ.

"మరైతే ఇక్కడే వుండే డబ్బట్టుకొస్తా" నన్జెప్పి ఆ బాబు గుమాస్తాకాడి కెళ్ళి డబ్బు అట్టుకొచ్చి "యిలా రాయే" అని నూతికాడ కెళ్ళినాడండి. అదిగో ఆ నుయ్యేనండి. ఏటా ఈ బాబు డబ్బిమ్మంటే నూతికాడికి రమ్మంటున్నా"డని భయపడిందో ఏటో, "డబ్బులిచ్చీ బాబూ పోతానూ" అందండి అది.

"ఓసి(ఆయే. నిన్నేం నూటిలోకి తోసీనులే" అన్నాడండి ఆ బాబు. ఇది వెళ్ళింది.

"పాలెం తియ్యాలే" ఏం తెలీనట్టు అడిగినాడు.

"తమకి తెల్దేటి బాబూ. అరవై రూపాయలు" అంది.

ఆ రోజుల్లో అరవై రూపాయలు పాలకి అయిాది ఆ బాబుకి, ఇంటిలో రెండు గేదేలుండగా మరి సూసుకోండి.

"నెక్కెట్టుకోయే" అన్చెప్పి అప్పుడీ రూపాయి కాయితాలు ఎక్కడో గాని లేవు. ఇచ్చ రూపాయలే – ముప్పై రూపాయలు నెక్కెట్టి దాని సేతిలో బడేసినాడండి.

"అరవైకి ముప్పై యిచ్చినావేటి బాబూ" అనడిగింది.

"నువ్వు పాల్డబ్బులే కదే అడిగినావు. మిగతా ముప్పై నీళ్ళ డబ్బులు. ఇదిగో ఇస్తున్నాన్జెప్పి ముప్పై ఇచ్చ రూపాయలు నూతిలోకి ఒగ్గేసినట్టు ఒగ్గీసినాడండి. అదిగదండి ఆ బాబు వొరస. మరింక అలాంటి మారాజుని సూడవండి" అని జానక్కి ఆవిడ మామగారి కథ చెప్పి –

అఁ అఁ రావాల. సిమెంటు రావాల అని ఒక వార్ క్రై పెట్టేడు.

"ఏటి ముసిల్దానా. ఏటా మొగపెళ్ళోరి నడక? సెక సెక అడుగెయ్యి. యియాలసలు నువ్వు కూలి యెలా గట్టు కెల్తావో చూస్తాను" అరిచేడు ఏ ప్రెంటిస్ మేస్త్రీ.

ఆ ములసమ్మకి వయసు ముసిలైనా, కోపం ఇంకా వయసులోనే ఉంది. ఆ మేస్త్రీ మాటలకావిడ కాలంలో వున్న కరినాగులా కస్సుమంది.

"నానేటి ఆడుకుంటున్నానేటి? ఒట్టుకెళ్లు బాబు సవ(ద్రం బాబు. నీకు పేరే కాదు, ఆశ కూడా సవం(ద్రమే, నా కూలి కూడా నువ్వే ఒట్టికెళ్ళి మిద్దె కట్టే. ముసిల్దాన్ని నన్నట్టుకోపోతే, అల్లదుగో ఊసులాడుకుంటున్నారు. ఆ గుంటల్లనవేం?" అంటూ దభీమని సిమెంటు మేస్త్రీ పక్కన పోసింది.

"ఎన్ని కలుపుతున్నారు సిమెంటు, ఇసక?" ఏ ప్రపోర్షన్‌లో కలపాలో తెలియకపోయినా అడిగింది జానకి.

"మరండి. గవర్‌నమెంటు పనైతే అసలు నెక్కెట్టవండి. బండి ఇసుక కుప్పేసి, అందులో ఒక బస్తా సిమెంటు పోస్తారండి. అరికేటండి కూలిపోతే మళ్ళా కడతారు. మావు మాత్తరం ఒకటి సిమెంటైతే యిసక ఎనిమిది ఏస్తావండి. సేసినపని శాశితంగా వుండొద్దా?

"మరి ఆ మనిషి కొలపెట్టకుండా పోస్తేస్తోందేం?"

"కొలక్కర్నేదండి ఉజ్జాయింపున అంతే ఉంటాది... ఇంక మరివోయి కలపకే ముసిల్దానా, టయమైపోనాది అంటూ తాపీ కింద పడేశారు సీనియర్, పై నుండి ఆర్డర్ అందుకోగానే మిగతా వాళ్ళంతా ఎక్కడిపన్లు అక్కడే ఆపేసి, నూతి దగ్గర కాళ్లూ చేతులూ కడుక్కోవడం ప్రారంభించేరు.

"కూల్డబ్బులు బడేయండి" అంటూ వచ్చేడు అరగంట క్రితమే రెడీ అయిన ఎప్రెంటీస్.

"ఎంతైంది" అడిగింది జానకి పర్సుతీస్తూ?

తవఁకి తెల్దేటండి? పెద్ద మేస్త్రీకి ఎనిమిదండి (పొద్దుట నుంచి కూర్చున్న చోటే తాపీ అటు ఇటు తిప్పినందుకన్న మాట. భేష్) మాకు ఆరేసి రూపాయలండి. (గోడ కొరుడికి) ఆడకూలీకి మూడు, మొగోడికి నాలుగు"

లెక్క కట్టడం సులభమే. కాని వీళ్ళలో పనిని బట్టి మొగ కూలీ ఎవరో, మేస్త్రీ ఎవరో చెప్పడం కష్టం.

లెక్క కట్టడం సులభమే. కాని వాళ్ళలో పనిని బట్టి మొగ కూలీ ఎవరో, మేస్త్రీ చెప్పడం కష్టం.

మారు మాట్లాడకుండా డబ్బు లెక్కపెట్టి యిచ్చేసింది జానకి.

మధ్యాహ్నం ఒంటిగంటైంది.

రోడ్డు మీద నిలబడితే నిలువునా కాలిపోతామేమో అన్నంత ఎండగా ఉంది. జానక్కి నాలిక ఎండిపోతోంది. ఇంట్లో వున్న వాళ్ళని మంచి నీళ్ళడగడం యిష్టం లేదు, వాళ్లు కావాలా అని అడగలేదు.

కనుచూపు మేరలో ఎక్కడా రిక్షాలేదు.

సెంటిమీటరు దూరం కూడా నడవలేనేమో అని భయ పడిన జానక్కి, అపద్బాంధవుడిలా దూరంగా ఒక రిక్షావోడు కనిపించేదు.

చప్పట్లు కొట్టి పిలిచింది.

కాని ఆ వెంటనే ఆపద్బాంధవుడ్ని చావకొట్టాలనిపించింది. వాడు ఫర్లాంగు దూరానికి రూపాయి అడిగేసరికి.

వెంటనే వాడిమీద కోపంతో చరచర నడిచేసింది. ఈ రూపాయి రేపు మూడోవంతు కూలి మనిషికైనా పని కొస్తుందని.

## 15

ఎండలో ఇల్లు చేరిన జానక్కి హాల్లో ఆవిడ కోసమే వెయిట్ చేస్తున్న జగన్నాధంగాని రాజేశ్వర్రావు కాని కనిపించలేదు. ఎండలో నడవడంవల్ల కళ్లు చీకట్లు కమ్మేస్తున్నాయి. తడుము కుంటూ పక్కనున్న కుర్చీలో కూలబడిపోయింది. జగన్నాధానికి ఆవిడ మొహంలో నిప్పుల ముళ్ళూ, విషపు సెగలూ కనిపించడం వల్ల అతను పలకరించలేదు. ఇవేమీ తెలీని రాజేశ్వర్రావు ఎంత వరకూ వచ్చింది మీ ప్రోగ్రెస్? అని పరామర్శించేడు.

"మా మామగారు నూతిలో ముప్పై రూపాయలు పడేయటం వరకూ"

ఎండలో రావటం వల్ల బుర్ర వేడెక్కిపోయి పరాకు మాటలు వస్తున్నాయి కాబోలు అని జాలిపడి ముందు శుభ్రంగా భోంచేసి నిద్రపొండి. సాయంత్రం మాట్లాడు కుందాం అన్నాడతను.

"నా కిప్పుడు ఏం తినాలని లేదు. తరువాత చేస్తాలెండి" అంటూ సోఫాలోనే కళ్లు మూసుకుంది జానకి. నీరసంతో కాళ్ళు గాలిలో తేలిపోతున్నాయి.

"ఒరే రాజూ, నేను రేపు వెళ్ళిపోతున్నాను. ఎల్లుండి జాయిన్ అవాలి అని రాజేశ్వర్రావుకి చెప్పి, జానకీ! నిన్ను ఓ పదిహేను రోజుల్లో ఎక్స్‌పెక్ట్ చెయ్యమంటావా?" అడిగేడు.

"అసలు ఎక్స్‌పెక్ట్ చెయ్యొద్దు" అని గొణిగింది జానకి.

"వెళ్ళక తప్పదంటావా?" రాజేశ్వర్రావు అడిగేడు.

"ఎవరైనా చస్తే తప్ప"

నూనె అన్నం తిని నూతికి కాళ్ళు చాచేరని, మీ కిద్దరికీ చావు తప్ప మరో మాట రాదా? నేనోసారి అలా వెళ్లి వస్తాను.

మీరు మాట్లాడుతూ వుండండి" అని లేచి వెళ్ళిపోయాడు రాజేశ్వర్రావు.

జగన్నాథం జానకి మాట్లాడుకోవడానికి డబ్బు సమస్య తప్పయితే టాపిక్ లేదు. ఆ సమస్య మాట్లాడుకున్నంత మాత్రాన తీరేది కాదు. ఒకరికొకరు యిచ్చుకోవడానికి ఎవరి దగ్గర డబ్బు లేదు.

"ఆ ఊరికి బైల్దేరినప్పుడు రిపేర్లకి మహా అయితే మూడొం దలు కంటే అవుతుందదా? మిగతా ఖర్చుకి కేవలం రెండు వందలు చాలదా?" అనుకొని అష్టకష్టాలు పడి అయిదు వందలు సంపాదించి అవి పట్టుకొని బయల్దేరారు. కాని యిక్కడి వ్యవ హారం చూస్తే అయిదు వేలు కూడా చాలేటట్టు లేవు.

ఆ వేళ......

పెరడు బాగు చెయ్యడంవల్ల కాదని కూలీలు పారిపోయేక, ఆ మర్నాడు వాళ్ళనే బతిమాలి, కాళ్ళు పట్టుకునిఎక్కువ కూలి స్తానని ఆశ పెట్టి మరింక యిలాంటి పొరపాటు యింకెప్పుడూ చెయ్యమని లెంపలేసుకొని, మరింక వాళ్ళకి మందివ్వనని రాజేశ్వర్రావు బెదిరించి-ఎలాగైతేనేం పెరడంతా శుభ్రం చేయిం చేడు. వాళ్ల కూలి నూటయాభై రూపాయలైంది. వాళ్లు మొక్కలే కొట్టేరుకాని, వేళ్లు భూమిలోనే ఉన్నాయి. ఒక్క వర్షం పడితే అవి చిగిర్చి మొక్కై, మానై, వృక్షాలైతే వచ్చే ఏడాది మళ్ళీ జానకి కేవలం పెరడు బాగుచేయించడానికే రావాలి. ఇవన్నీ ఆలోచిం చిన జానకి మరో వంద రూపాయలిచ్చి కూలీల చేత ఆ వేర్లన్నీ తవ్వించేసింది. యిక్కడితో పెరటి అధ్యాయం పూర్తి అవలేదు.ఆ కొట్టిన మొక్కలు, తవ్విన వేర్లు ఎక్కడ పొయ్యడం? రోడ్డు మీద పోస్తే మున్సిపాలిటీ వాళ్లూరు కోరు.

పక్క పెరళ్ళలో పోస్తే!

ఆ పెరళ్ళు ఈ కర్రలు పట్టవు.

ఈ ముళ్ల కంపల్ని ఏం చేసుకోవడం?

ఆఖరికి జగన్నాథం ఉపాయం చెప్పేదు.

ఆ ఉపాయం ప్రకారం ఒక డబ్బా కిరసనాయిలు కొని, యిద్దరు కూలీల్ని స్పెషల్‌గా పెట్టి అవన్నీ బోగిమంట వేయిం చేసింది జానకి. ఆ బుగ్గితో ఆ వీధి వాళ్ళంతా సంవత్సరం పాటు అంట్లు తోముకోవచ్చు. తోముకున్నారు కూడా.

కాగా పోగా పునాదుల్లో గవర్నమెంటు బిల్డింగ్స్ గ్రాంట్స్ అయిపోయినట్టు తెచ్చిన డబ్బంతా పెరట్లోనే పోసేరు. అసలు పనంతా ముందే వుంది. పుచ్చిపోయిన ద్వారాలు, కిటికీలు మళ్ళీ చేయించాలి. వాటికి నిన్ననే ఆర్డరిచ్చేరు. వాటికి మూడు వందులు దాటుతుంది. మొన్న సిమెంటుకి డబ్బు రాజేశ్వర్రావే ఇచ్చేడు.

ఇవన్నీ ఎప్పటికవుతాయి? నేనెప్పుడు ఇక్కడ్నించి కదు ల్తాను? భగవాన్ అన్న భయం పట్టుకుంది జానక్కి.

ఊరంతా ఫ్రెండ్సే. అందరూ తనచేత అంతో ఇంతో చాకిరీ చేయించుకున్నవాళ్లే. కాని ఎవర్ని అడగం? పోనీ పాపారావు నడిగితే?....

పాపారావు నాన్న సగటు పేపర్‌బోయ్‌గా పని చేసేవాడు. రాత్రి సినిమా హాలు దగ్గర పకోడీలు అమ్మేవాడు. పకోడీలు అమ్ముతున్నప్పుడు అతను చూసిన సినిమాల్లో చాలామంది హీరోల తండ్రులు, తల్లులు నీళ్లు మోసి, రాళ్ళు పగులగొట్టి, విస్తళ్ళు కుట్టి హీరోలని చదివించి డాక్టర్లని, కలెక్టర్లని చేసేరు. అంచేత అతను తను కూడా హీరోల తండ్రినై పోయి, తన కొడుకుని పెద్దసైజు హీరోని చేద్దామను కున్నాడు.

అయితే హీరోని చేద్దామన్న కోరిక తండ్రికే వుంది కాని హీరో ఔదామన్న కోరిక కొడుక్కి లవలేశం లేదు. మరంచేత పాపారావు పదో క్లాసు ఐదుసార్లు చదివేడు. ఆరోసారి స్కూలు వాళ్ళు చదవనివ్వలేదు. కాకపోతే, చదువుకీ, బతకడానికీ ఏం సంబంధం లేదు కనుక, అతను బతకడానికేం అభ్యంతరం లేకపోయింది. తన క్లాస్‌మేట్స్ జగన్నాథం, రాజేశ్వర్రావు డాక్టర్లై వచ్చేసరికి అతనా ఊరి షావుకార్లలో ఒకడైపోయేడు. ఎలా అయ్యేడు అన్న అంశం మీద డిఫరెంట్ వెర్షన్స్ ఉన్నాయి. రెండు రూపాయల నోట్లు అచ్చు వేస్తాడని కొందరంటే, నల్ల మందు వగైరా స్మగ్లింగ్ ఉందని కొందరంటారు. ఎవరేమన్నా ఫీల్ అవనంత ఎత్తు ఎదిగిపోయాడతను. ఇప్పుడతనికి రెండు వేరుశనగ మిల్లులు, సిమెంటు కోటా,ఫెర్టిలైజరు వ్యాపారం, బ్యాంకులో రెండు లక్షలూ, ఇంటిలో లక్షన్నర కేషూ వున్నాయి.

వచ్చే ఎలక్షన్లలో అధమం ఎమ్మీ అయినా ఔతాడని అభిజ్ఞుల అంచనా.

అతనే పార్టీకి చెందడు. డబ్బు ఎందులో వస్తే అతనిదా పార్టీ.

పాపారావు. రాజేశ్వర్రావు జగన్నాథం కలిసి హైస్కూల్లో చదువుకునే రోజుల్లో స్కూలు దగ్గరున్న తోటల్లోంచి మామిడి

కాయలెత్తుకొచ్చి ఉప్పు, కారం, అద్దుకొని తినేవారు. ఉప్పు జగన్నాధం, కారం రాజేశ్వర్రావు తెస్తే, మామిడికాయలు మాత్రం పాపారావు ఎత్తుకొచ్చేవాడు. అతను కాయలు కోసినట్టు తోట మాలిక్కాదు, చెట్టు క్కూడా తెలీనంత లాఘవంగా కోసేవాడు.

అయితే ఉప్పు తిన్నంత మాత్రాన అప్పు యివ్వాలన్న నియ మం లేదు…

అసలు పాపారావునే కాదు ఎవర్నీ అప్పు అడగడం జగన్నా ధానికి కిష్టం లేకపోయినా పరిస్థితులు అడిగేట్టు చేసేయి. అంచేత అతను పాపారావు దగ్గరకెళ్ళి మాటల సందర్భంలో తను ఇల్లు బాగు చేయిస్తున్నాని చెప్పేడు. ఇప్పటికైనా బాగు చేయిస్తున్నం దుకు సంతోషం వెలిబుచ్చాడు పాపారావు. తన ఎస్టిమేట్ కంటే ఖర్చు చాలా ఎక్కువయ్యేటట్టు వుందన్నాడు జగన్నాథం. ఎస్టి మేట్‌కి అయ్యే ఖర్చుకీ ఎక్కడా సంబంధం వుండదని, దానికి నిదర్శనంగా తన స్వంత అనుభవాలొక రెండు చెప్పేడు పాపా రావు. ఈ ఊరులో ఎవరైనా అప్పు యిస్తారేమో అడుగుదామను కుంటున్నానీ, అద్దెకి అప్పు తీరేవరకు వదిలేస్తాననీ చాలా డిప్లమేటిగ్గా చెప్పేడు జగన్నాధం. ఈ ఊరులో అంత అప్పు యిచ్చే వాళ్ళు వున్నారన్న నమ్మకం లేదన్నాడు పాపారావు. అంతేకాని తను ఆదుకుంటానని మాత్రం అనలేదు.

జగన్నాధానికి జుగుప్స కలిగింది. అన్ని పాపాల్లోనూ మహా పాపం అప్పు అడగడం, అడిగీ లేదనిపించుకోవడం ఆ పాపానికి శిక్ష.

కాని ప్రకృతి విచిత్రం ఏమిటోగాని, మనం ఏదైతే ప్రాణం పోయినా సరే చెయ్యకూడదనుకుంటామో అదే చేస్తాం.

ఇంక ఛస్తే ఎవ్వర్నీ అడగకూడదనుకున్న జగన్నాధం చేత ద్వారాలు చేసిన షరాబు పొద్దున్నేవచ్చి లాయరు విశ్వనాధాన్ని అడిగేటట్టు చేశాడు.

విశ్వనాథానికి ప్రాక్టీసుకొచ్చిన కొత్తలో "సిపిసి కీ, సిఆర్‌పిసి (C.P.C కీ C.R.P.C) కి తేడా వుంటుందని తెలీదు. అ తేడా వుందనీ, అదేమిటో కూడా అతనికి తెలియచెప్పింది జగన్నాధం తండ్రి నారాయణమూర్తిగారే. తనకొచ్చినది పదిమందికి చెప్పడం, తనదగ్గరున్న డబ్బు పదిమందికి పంచడం, నారాయణ మూర్తిగారి నైజం. అంచేత అతని దగ్గరెప్పుడూ నలుగురైదుగురు జూనియర్లుండేవారు. కేవలం వాయిదాలడిగించీడమే కాక, జూనియర్ల చేత చిన్న చిన్న కేసులు కూడా చేయించడం, పార్టీల చేత జూనియర్లక్కూడా డబ్బింప్పించడం చేసేది ఆయనొక్కడే. మన జూనియరు మనకంటే గొప్పవాడైపోతాడేమో అన్న అసూయ, భయం, అతనికి తెలీవు. అందిస్తే చాలు అల్లుకు పోయే చాకచర్యం వున్న విశ్వనాథం ఆయన దగ్గర పని వేగంగా నేర్చుకున్నాడు. జగన్నాథం డాక్టరు కోర్సులోకి వెళ్లిపోవడం వల్ల నారాయణమూర్తిగారికి మరింక పిల్లలు లేనందువల్ల ఆయన ప్రాక్టీసంతటికీ విశ్వనాధమే వారసుడయ్యేడు.

పెద్ద ఆస్థి ఆర్జించకపోయినా, ఏదో అయిదెకరాల పొలం, రెండిళ్లు కొన్నాడు. అరవై ఏళ్ళున్నప్పటికీ యిప్పటికీ వున్న ముగ్గురు, నలుగురు లీడింగు లాయర్లలో అతనొకడు.

జగన్నాధం కథంతా జాగ్రత్తగా విన్నాడు విశ్వనాథం. అంత గొప్ప తండ్రికి పుట్టిన ఇంత మంచి కొడుక్కి రాదగిన కష్టాలు యివికావని విచారించేడు. ఏవి రాదగిన కష్టాలో చెప్పలేదు. విచారించటం అయిపోయేక తన సలహా యిచ్చేడు ఏమని?

"నాయనా జగన్నాధం నీకు మీ నాన్నెంతో నేనూ అంతే. పెద్ద ముండావాడ్ని. చాదస్తంగా చెప్తున్నాననుకోకు. అసలా యిల్లు నాన్నకంటె పెద్దది. బాగా పాతబడిపోయింది. దానిమీద వెయ్యి, రెండువేలు పెట్టడం పరమవేస్టు. మన్లాంటి వాళ్ళం ముప్ఫై, నలభై వేలు పెట్టలేం. అలాగని ఒదిలీలేం" ఏవంటావ్! అంచేత ఏం చేస్తావంటే…. నా దగ్గర బాగా డబ్బు మలేరియా వచ్చినట్టు మూలుగుతున్న షావుకార్లు ఒకరిద్దరున్నారు. ఆఫ్‌కోర్స్ వాళ్ళు మీ ఫాదర్ క్లయింట్లే అనుకో. వాళ్ళక్కబురు చేస్తాను. ఓ పాతిక, ముప్ఫై వేలు పెట్టి రీమోడల్ చేయించమందాం. వాడే ఎవరికైనా అద్దెకిచ్చుకొని అప్పులు చూసుకుంటాడు. నీకా డబ్బు గొడవా రిపేర్ల బాధా తప్పుతుంది. ఇల్లూ బాగు పడు తుంది. ఆలోచించుకొని ఏ సంగతి చెప్పు అని ముగించాడు.

జగన్నాధం ఆలోచించదల్చుకోలేదు. ఏవుంది ఇందులో ఆలోచించుకోవడానికి, తనో వెయ్యి యివ్వలేడు కాని మరోడి చేత పాతికవేలు యిప్పిస్తాట్ట. ఏ షావు కారు దగ్గర ఎంత డబ్బు మూలిగినా తన ఇంటిమీద ఎందుకు పెడతాడు? ఒకవేళ పెట్టినా, అంతడబ్బు పెట్టిన వాడు వాడిష్టమొచ్చినట్టు రిపేరు చేయించి, వాడిష్టమొచ్చినంత అద్దెకిచ్చుకుంటాడు. కాని తన మాటెందుకు వింటాడు? అన్నిటికంటే ముఖ్యం ఆ వచ్చే అద్దె వడ్డీకి చాలదుకదా! మరి అసలెప్పుడు తీరుతుంది. తీరదు. కొన్నా ళ్ళకి ఆ పెట్టిన అప్పుకి ఆ ఇల్లు రాయించేసుకుంటాడు …"

జానకి వచ్చేవరకు ఈ విషయాలే ఆలోచించి, మరింక లాభం లేదని గ్రహించి, ఆలోచించడం మానేశాడు జగన్నాధం. ఇవేవీ రాజేశ్వర్రావుకి తెలియటం అతనికిష్టం లేదు. కాని ఆ ఊరివారి కమ్యూనికేషన్ పవర్ అమోఘం. ఏ పెళ్ళికాని అమ్మాయైనా వీధిగుమ్మంలో అయిదు నిమిషాలు నిల్చుంటే, ఆరో నిమిషలో ఆ అమ్మాయికి ఆరోనెల కడుపని పుకారు పుట్టేస్తుంది. అంచేత అన్ని వార్తల్లాగే జగన్నాధం పాపారావు దగ్గరకి, విశ్వనాథం దగ్గరకు అప్పుకెళ్ళేదన్న వార్త రాజేశ్వర్రావు భోజనానికి వచ్చేలోపే అతనికి చేరిపోయింది. అంచేత అతను ఇంటికి వస్తూనే..

"నువ్వు ఫూల్‌వని మొదటనుంచీ తెలుసు కాని ది బిగ్గెస్ట్ ఫూల్‌వని యిప్పుడే తెలిసింది. ఆ దరిద్రులందర్నీ అడగాలని నీకే తోచిందా? లేకపోతే చెప్పుడు బుద్దా? గమ్మత్తు చూశావా? నీకు నన్నడగాలనితోచలేదు. లేకపోతే వీడేమిస్తాడులే అనుకున్నావా? ఒరే జగన్నాధా ఒక్క మాట విను. ఎంచేతనంటే మళ్ళీ మళ్ళీ చెప్పడానికి తీరికా, ఓపికా కూడా వుండవు. నీకు ఏదైనా కావలిస్తే ముందు నా చేత లేదనిపించుకున్నాక పై వాళ్ల దగ్గరకెళ్ళు. అంతేగాని అడ్డమాని వెధవల్నీ దేహి అని అడక్కు. ఇంత మోటుగా చెప్పకపోతే నువ్వు వినవు. నీ దగ్గర డబ్బులు అయిపోయిందగాని, యింకా కావాలని కాని నాతో సూచనగానైనా అనలేదు. మరి నీ ఎకౌంట్స్ నా కలలో కొస్తాయనుకున్నావా? ప్రస్తుతానికి ఓ రెండువేల వరకు సర్దగలను. అంతకంటే సర్దలేనందుక ఐయామ్ ఏ షేమ్‌డ్ ఆఫ్ మైసెల్ఫ్. ఒక నెల పోయేక అప్పటికింకా నీ కవసరం ఉంటే మరలా చూస్తాను. ఇంకా కొంతమంది పేషెంట్స్ వెయిట్ చేస్తున్నారు. నీతో ఈ నాలుగు ముక్కలూ చెప్పిపోదామని వచ్చాను. జానకి గారు కూడా వచ్చే టైమైంది కాబట్టి బోజనం చేసే పోతాను. అని ముగించిన అయిదు నిమిషాలకే జానకి వచ్చింది.

వాళ్ళని మాట్లాడుకోమని రాజేశ్వర్రావు వెళ్ళిన తరువాత అయిదు నిమిషాలు ఎవరూ మాట్లాడలేదు. జానకి అలా కళ్ళు మూసుకునే కూర్చుంది సోపాలో.

"నీకేమైన డబ్బు కావలిస్తే రాజేశ్వర్రావుని అడుగు" ఏదో ఒకటి మాట్లాడాలి కాబట్టి అన్నాడు జగన్నాథం.

"అలా నూతిలో నీళ్లుతోడినట్టు తోడేటమేనా, ఇంతవరకు అని వుందా?" జానకి గొంతు నూతిలోంచి వచ్చినట్టే ఉంది.

రెండు దాటనంతవరకు.

"దాటితే"

"నువ్వీ ఊరు దాటెయ్"

పోనీ ఆ డబ్బేదో మీరే పుచ్చుకుని ఇవ్వకూడదూ? ఎంత చనువుంటే మాత్రం నాకు డబ్బు కావాలి అని ఎలా అడగను!"

"నేను నా జీవితంలో చెయ్యనివి, చెయ్యలేనివి, చెయ్య బోనివి రెండే రెండు. ఒకటి మా నాన్న మాట కాదనటం, రెండు రాజేశ్వర్రావు దగ్గర డబ్బు తీసుకోవడం, నీ కిష్టమైతే అడుగు, లేకపోతే ఓ స్లిప్ రాసి వాడి బల్ల మీద పెట్టు. ఏదైనా చాదస్తంగా కూర్చోక అయిందనిపించు కొని వచ్చీ. ఇల్లు మాట దేవుడెరుగు గాని, నువ్వు మళ్ళీ మనిషవడానికి నీ మీద చాలా పెట్టుబడి పెట్టాలి. లే. లేచి స్నానం చేసిరా. ఫ్రెష్‌గా ఉంటుంది" అంటూ చెయ్యి పట్టుకొని లేవదీసేడు. లేకపోతే అలాగే నిద్ర పోతుందేమోనని.

ఆ మధ్యాహ్నం భోంచేసి పడుకున్న జానక్కి పీడకల లొచ్చేయి. తనకీ, జగన్నాధానికీ మధ్య ఏదో విషపు సముద్రం పొంగుతోంది.

ఏదో నిప్పుల గాలి తను చిన్నప్పుడు కట్టుకున్న అట్ట ఇల్లుని తగలబెట్టేస్తోంది.

తన ఆస్తంతా పోయి తను కూలీ అయిపోయింది.

తను పిల్లలకు వడ్డించిన అన్నం మొసళ్ళంత పెనుబల్లులు తినేస్తున్నాయి.

చర్మం పోయిన తన వీపు మీద ఎవరో కనిపించని మనుషులు ముళ్ల కొరడాలతో కొడుతున్నారు.

నిద్రలో వెక్కి వెక్కి ఏడ్చింది జానకి.

కాని మేలుకున్న కాస్సేపటికే మామూలు మనిషి అయిపోయింది.

## 16

పాకిస్తాన్ వాళ్ళని 24 గంటలలోగా సరెండర్ అయిపోమని ఇండియా వాళ్ళు మొదట వార్నింగిచ్చేరు. తరువాత అనవసరంగా సర్వనాశనం చెయ్యొద్దని బతిమాలేరు. లాస్ట్ అండ్ ఫైనల్‌గా చావగొట్టి చెవులు మూస్తామని బెదిరించేరు. వాళ్ళకి ఆఖరి క్షణంలో చావు తెలివి పుట్టి లొంగిపోయేరు. దానికి వాళ్ళని మనం అభినందించక తప్పదు.

కాని ప్రకాశరావు వాళ్ళకి ఎన్ని 24 గంటల వార్నింగులిచ్చినా వాళ్ళు శిలావిగ్రహాల్లా చలించలేదు.

"బాబ్బాబు. పాతబాకీ పైసా కూడా అడగం. మా ఇల్లు మాకు పారేయండి అదే మహాప్రసాదం" అని బతిమాలేరు.

కంచు విగ్రహాలు కదల్లేదు.

మరంచేత రేపు జగన్నాథం వెళ్ళిపోతున్నాడు కాబట్టి లాస్ట్ వార్నింగ్ ఇవ్వడానికి ఆ సాయంకాలం బయల్దేరేరు జానకీ, జగన్నాథం పులితో మమ్మల్ని తినొద్దని చెప్పడానికి రిప్రజెంటేటివ్‌గా బయల్దేరిన కుందేలు పిల్లకి సపోర్టుగా అన్నట్టు, వాళ్ళకి మోరల్ సపోర్టు కోసం రాజేశ్వర్రావు కూడా వెళ్ళేడు వాళ్ళతో ఆస్పత్రిని అరగంటసేపూ కాంపౌండరుకు అప్పచెప్పి.

అయితే ప్రకాశరావు వాళ్లు పులికంటే తెలివైన వాళ్ళు.

తమ పుట్ట ఖాళీ చెయ్యమని చెప్పడానికొచ్చిన చీమల వేపు పాము చూసినట్టు చూసేరు వీళ్ళ వేపు. చూసి పాము చెప్పిన జవాబే చెప్పేరు. మేము ఖాళీ చెయ్యం అని. ఖాళీ చెయ్యమనడానికి మీకున్న అధికారం ఏమిటన్నారు? ప్రతి నెలా అద్దె కడుతున్నంత కాలం ఖాళీ చెయ్యమనడానికి మీకే కాదు కదా మూడు కోర్టులకైనా లేదన్నారు.

అద్దేమిటి? రాజేశ్వర్రావే ముందుగా మేలుకున్నాడు.

ఓ కాయితం అతని చేతిలో  పెట్టేరు వాళ్ళు.

జగన్నాథంగారి యింటి అద్దెకు గాను గత మూడు నెలల అద్దె ముట్టినట్టు రశీదు. కింద రాజేశ్వర్రావు భార్య భారతి సంతకం ఉంది. తారీకు చూసేడు. ఆ రోజే. నీకు సంతకం చెయ్యడం రాకపోతే ఎంత బావుండునే భారతీ అని వాళ్ళావిడ చదువుకున్నందుకు తొలిసారి విచారించేడు రాజేశ్వర్రావు.

జరిగినదేమిటంటే....

ఆ మధ్యాహ్నం జగన్నాథం, జానకి నిద్రపోతున్నారు. ఏదో ఎమర్జన్సీ వుండడం వల్ల రాజేశ్వర్రావు ఆస్పత్రికి వెళ్ళిపోయాడు. అదుగో... అప్పుడే... ప్రకాశరావు కొడుకు భారతి దగ్గరకెళ్ళి అద్దె తీసుకోమన్నాడు. ఆవిడ జగన్నాథానికో డాక్టరుగారికో ఇవ్వండి. నాకేం తెలీదండి. కాని ఆ కుర్రాడు ఎవరు తీసుకున్నా ఒకటేననీ, మళ్ళీ తను అర్జంట్‌గా ఊరువెళ్ళాలనీ చెప్పి ఆవిడకి డబ్బిచ్చి సంతకం చేయించుకున్నాడు. ఆవిడకి ఈ ఇంటి గొడవలేం తెలీవు. తెలుసుకోవాలన్న కోరిక, తీరికా కూడా ఆవిడకి లేవు. కేవలం వండటం, వడ్డించడం, పిల్లల్ని కనడం, పెంచడం తప్ప ఆవిడకి ఇతర ప్రపంచంతో పనిలేదు.

బి.పి. లేకపోయినా రాజేశ్వర్రావుకి ఒక్కసారి తల గిర్రున తిరిగింది. ఎంతకాలం అద్దె బకాయి వుందో ఎవరికీ స్పష్టంగా తెలీదు జగన్నాథం ధర్మమా అని. శతాబ్దాలకి కాకపోయినా, కొన్ని సంవత్సరాలదైనా బాకీ వుంది. కాని భారతి యిచ్చి రశీదు ప్రకారం ఆఖరుమూడు నెలల అద్దె ముట్టింది. కాబట్టి అంతకు ముందు కూడా బాకీ ఉన్నారంటే ఎవరూ నమ్మరు. హమ్మ రాస్కెల్ ఎంత ప్లాన్ వేశారు? ఇది వీళ్ళకు పుట్టిన బుద్ధికాదు. అలాగయితే ఏనాడో చేసేవారు ఈ పని. ఎవరో మద్దతు ఇస్తున్నారు. లీగల్ ఎడ్వైజ్ కూడా ఇస్తున్నారు. ఎవరో! తనకి తెలిసిన వాళ్ళందర్నీ ఓసారి జ్ఞాపకం చేసుకున్నాడు రాజేశ్వర్రావు.

ఆ ఊరి వాళ్లు ఎంత చెడ్డవాళ్ళైనా జగన్నాథానికి ఉపకారం చెయ్యక పోయినా, అపకారం మాత్రం చెయ్యలేరు. మరెవరై ఉంటారు.

అన్నట్టు నిన్ననో, మొన్ననో గాని, ఇంటికి ఉత్తరం వేపు రమారమి రెండు గజాల వెడుల్పున ఇంటి పొడవునా ఖాళీ స్థలం వుండాలనీ, ఇదివరకు అక్కడ మట్టిగోడ కూడా వుండాలనీ, కాని యిప్పుడు అరంగుళం కూడా లేదనీ, అక్కడ ఎవరిదో కొత్తగా కట్టిన ఇల్లుందని వెరిఫికేషన్స్ కోసం మున్సిపల్ ఆఫీస్‌లో ప్లాన్స్ వెతికించాలని జానకి జగన్నాథంతో అన్నది. ఒకవేళ ఆ ఇంటివాడు ఎందుకు కాకూడదూ?

చేతిలో ఉన్న కాయితాన్ని ఆ ఇంటివాళ్ళబ్బాయికి యిచ్చి పోదామన్నట్టు మెట్లు దిగేడు జగన్నాథరావు. అతని వెనుకే నడిచేరు జానకీ, రాజేశ్వర్రావు.

"ఒరే అబ్బీ! మీ పక్కిల్లు ఎవరిదిరా? ఈ మధ్య కొత్తగా కట్టినట్టున్నారు. నువ్వెళ్ళిన తరువాత నాకు ఈ వీధితో టచ్ పోయింది" అడిగేడు రాజేశ్వర్రావు.

"బావుంది! ఊళ్ళో వున్నవాడివి నీకు తెలీకపోతే పొరుగూరి వాణ్ని నాకేం తెలుస్తుంది?"

"నాకు తెలుసండీ లాయరు విశ్వనాథం దగ్గర గుమాస్తా అట. అంటే అసలు తండ్రి కాదులెండి. ఇతన్ని ఈ మధ్యనే దత్తు తీసుకున్నాడుట" వివరించింది జానకి.

ఔను ఇప్పుడు జ్ఞాపకం వస్తోంది. కోర్టులో కట్టాల్సిన పార్టీల సొమ్ము చంటిపిల్లల శనగపప్పు నమిలినట్టు నమిలేసేడని మీ ఫాదరు ఒక గుమాస్తాని తీసేసేరు. అయితే వాడి మనవడన్న మాట భేష్! తాత గారు పరాయి సొమ్ము పడేసుకుంటే, మనవడు

స్థలాలు పడేసుకున్నారన్న మాట. దత్తు అయినా పేరు నిల బెడుతున్నాడు. వీడిని మనం కొంచెం వాచ్ చెయ్యడం అవసరం.

"దీనివల్ల మనకొచ్చే లాభం ఏమిటి?"

అసలు మెయిన్ స్విచ్ అక్కడే వుందని నా అనుమానం. వుయ్ విల్ సీ ఇప్పుడు చేయగలిగిందేమీ లేదు. మీరు ఇంటికో, సినిమాకో పొండి అని హాస్పిటల్‌కి వెళ్ళిపోయేడు రాజేశ్వర్రావు.

# 17

మర్నాడు జగన్నాథం వెళ్ళిపోయేడు.

అతను వెళ్ళిపోగానే టైఫాయిడ్ పడినంత నీరసం వచ్చేసింది జానక్కి. ఆ నీరసం మీదే పన్లు చేయించడానికి వెళ్ళింది. తెల్లారి ఆరోగంట అయేసరికి. ఆ పూట గోడ కోరుడు పని వాయిదా వేసి, షరాబు తెచ్చిన కిటికీ బిగించేస్తామన్నారు మేస్త్రీలు. అదైనా పనే కదా అని అలాగే నంది జానకి. ముందు ముగ్గురు కలిసి పుచ్చిపోయిన కిటికీని తవ్వేసేరు. అంత చిన్న కిటికీ తవ్వడానికి ముగ్గు రెందుకో బోధపడలేదు జానక్కి. ఆ కిటికీ ప్లీడరు గుమాస్తా ఇంటివేపే వుంది. అసలా కిటికీ తవ్వడానికి వంటింటిలోకి వెళ్ళ డానికి ప్రకాశరావు వాళ్లు ఒప్పుకోలేదు. ఆ గది వాడక పోయినా దాన్నిండా ఖాళీ సీసాలు, కుర్చీలు, చిరిగిపోయిన చాప ముక్కలు, తుప్పుపట్టిన పాతబక్కెట్లు వగైరాలు వేలు మోపడానికి వీలు లేకుండా ఉన్నాయి. వీటి అన్నిటికీ కలిపి ఒక్క అగ్గిపుల్ల చాలు.

మొదటినుంచీ జానకి ఒక విషయం కనిపెడ్తూనే వుంది. వీధి కొళాయి దగ్గర గావంచాలు కట్టుకొన్ని స్నానం చేసే ఈ ఇంటి ఆడవాళ్ళు, తనని చూడగానే పది తలల్తో సహా రావణా సురుడిని చూసినట్టు అందరూ గదుల్లోకి మాయిమై పోతారు. ఖర్మకాలి తను వాళ్ల కంటపడితే, తలలేని మొండేన్ని చూసినట్టు అసహ్యించుకొని మొహం చాటు చేసుకుంటారు. మొగాళ్ళ సంగతి మరీ గమ్మత్తుగా ఉంటుంది. తనో ఆడ రావణాసురుడై నట్టు, తను రావడానికి అరగంట ముందు ఇల్లొదిలేసి, తను వెళ్లిన గంట తరువాత ఇల్లు చేరుతారు. ఇద్దర్లో ముగ్గురో పిల్లలు మాత్రం అను మానితుడ్ని కొత్త కానిస్టేబుల్స్‌లా తన వెనకే తిరుగుతారు. తను ఏమడిగినా వినిపించుకోరు, సరికదా తనని బట్టలు లేని పిచ్చి ముష్టిదాన్ని చూసినట్టు చూస్తున్నారు.

వాళ్ళని చూస్తే జానక్కి వాళ్ళని చంపేసి ఉప్పూ, కారం అడక్కుండా కాల్చుకు తినేయాలన్నంత కోపం వస్తుంది. ఇంక తమ దగ్గర ఇల్లు అద్దెకు తీసుకున్న ప్రకాశరావు బ్రతికుండగా ఆఖరిసారి ఆర్రోజుల క్రితం చూడబడ్డాడు. తరువాత అతను ఏమైందీ ఎవరికీ తెలీదు.

మరంచేత వాళ్ళు తనతో కోఆపరేట్ చేస్తారనుకోవడం కేవలం భ్రమ. అవసరం తనది కాబట్టి కాళ్ళు పట్టుకొనైనా పని చేయించుకోవాలి.

"చూడు బాబూ. ఈ సామాను కొంచెం జరుపుతారా? మేస్త్రీలు పని చేసుకోవాలి" అక్కడున్న కుర్రవాడ్ని బుజ్జగించి అడిగింది జానకి.

వాడు జానకిని చచ్చిపోయిన గొంగళిపురుగులు చూసినట్లు చూచి "మాకేం తెలీదు. కురాళ్ళచేత చేయించు కోండి" అన్నాడు.

రాజుగారి భవంతిలోకి రానివ్వడమే మహాభాగ్యమన్నట్టు, వంటింట్లోకి రానిచ్చిందే చాలనుకున్న జానకి కూలీలచేత సామా నంతా గది మధ్యకి చేరేయించింది. అదంతా అయ్యేసరికి తొమ్మి దయింది. ఇంతవరకు అరవీసం పని కాలేదు. ఇప్పుడైన పని ప్రారంభిస్తే కనీసం చల్దులకి దిగేవేళకైనా ఈ కిటికీ పని అయి పోతుందని ఆశించింది.

ఊఁ ఊ! గబగబా తెమలండి. ఒసే అమ్ములూ నువ్వెళ్ళి సిమెంటు కలపకూడదూ. ఇదిగో మామ్మా నువ్వు నీళ్లు తీసు కురా. వాళ్ళిద్దర్నీ ఇసక వెయ్యమను. నిన్న అలాగే ఒదిలేసి పోయేరు మీరు. గుంట్ల వెధవలంతా శుభ్రంగా కుమ్మేశారు. సగం కాలవలోనే పడిపోయింది. అంటూ గబగబా పనులు పుర మాయించి వరండాలోకొచ్చి కుర్చీలో కూర్చుంది.

బోయీలు పల్లకీలు మోసుకొస్తున్నట్టుమేస్త్రీలు కిటికీని అదేదో ఇనుప కిటికీ అన్నంత బరువు మొహాల్తో మోసుకెళ్ళారు.

కూలీల్లో ఒక ముసిల్ది వుంది. దానికి జానకంటే ఎంతో అభిమానం. తరచు జానకి దగ్గరే అలా చూస్తూ నిల్చుంటుంది.

"ఏయ్ ముసిల్దానా, కర్రాటలా ఏటలా నిలబడిపోనావు?" అని గాని అంటే,

"ఒల్లకుందు బాబూ. ఈయమ్మ సల్లనితల్లి. ఆ మొహం సూస్తా వుంటే అసలు ఆకలేస్తాదేటి? ఒక్కపాలి నవ్వు తల్లీ (జానకి సన్నగా నవ్వుతుంది) ఆ నవ్వుసూస్తే సాలు. ఇంకేటీ అక్కర్నేదు" అంటుంది.

కూలీలందరికి హెడ్ కూలీలాంటిది ఆవిడ. ఎవరైనా కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నట్లు కనిపిస్తే "ఏటోలె గుంటా!

ఏటా పకపకలు? పళ్ళిరగబొడిసేగల్ను. ఆడదానికంత యిరగ బాటేటి? ఎవుడేనా కట్టుకుంటే సెరుగ్గడిరిసేసినట్టు పళక్ మని నడ్డిరిసేగల్డు. తగ్గు తగ్గు" అని చీవాట్లేస్తుంది.

ఆవిడ జానకి దగ్గరకొచ్చి "కామేశం బాబింటికాడ నుంచి కాఫీ అట్టుకొస్తాను. తాగు పనీయేల కాకపోతే రేపొద్ది. నువ్వేం బెంగెట్టుకోకు, అంతపురాల్లో వుండాల్సినదానివి ఎండనబడి ఎలాగైపోనావో సూడు, నల్లగా కొరకంచులా" అని వెళ్ళిపోతున్న ఆవిడ్ని పిల్చి ముద్దుపెట్టుకోవాలని పించింది జానక్కి.

ప్రపంచంలో మంటల పొరలే కాకుండా అక్కడక్కడా మంచు తెరలు కూడా ఉన్నాయనిపించింది ఆ క్షణం. కాని ఈలోగా ఆ ఇంటి పిల్లలు స్తంభాలు చాటు నుంచి కిటికీల మాటునుండి గుసగుసలాడ్డం వినిపించింది.

"ఒరేయ్ ఏమిటో వచ్చేస్తోంది"

"ఎక్కడ్నుంచిరా?"

"కావుగాడి ఇంటి నుంచి"

"ఏమిటొస్తుందిరా?"

"ముందు కాఫీ...."

"తర్వాత?"

"..."

ఈ ఆఖరి మాట వినగానే ప్రపంచం అంతా మండిపోయి తను కాలిపోయేలోగా తన కళ్ళముందే ఈ గుంట వెధవలు కాలి కాలి చావాలనిపించింది.

మేస్త్రీలు కిటికీలు పట్టుకెళ్ళి పది నిమిషాలు కాలేదు. మళ్ళీ పట్టుకొచ్చేసేరు. "ఆ బాబు ఎట్టనివ్వనేదండి. కిటికీ ఎడితే కాళ్ళిర గ్గొడతాట్ట" అంటూ.

"ఎవరు?"

"పక్కింటి పీడరుగుమాస్తా బాబండి. కుక్కబుద్ధులూ, నక్క జిత్తులూనండి ఆరివి"

'సర్లే నువ్వెళ్ళి అతన్ని నేను రమ్మన్నానని పిలు"

వచ్చేడు అతను.

అతను లాంకోటూ, పంచె కట్టుకుంటే ప్లీడరు గుమాస్తాలా వుంటారు. పేంటు, షర్టు వేసుకుంటే మఫ్టీలో వున్న ప్లీడరు గుమాస్తాలా వుంటాడు. డ్రాయరు బనీసు వేసుకుంటే ఇంట్లో వున్న ప్లీడరు గుమాస్తాలో వుంటాడు. అతను ఎలావున్నా ఎక్క డున్నా ప్లీడరు గుమాస్తాలా ఉండడమే కాకుండా ప్లీడరు గుమాస్తానే.

అతను వచ్చి వరండాలో చూరుమీద చెయ్యేసి నిల్చు న్నాడు. జానకి లేవలేదు. కూర్చునే మాట్లాడుతోంది. ఏమని అడగాలో జానకి రిహార్సలు వేసుకునే లోపల అతనే "మీరా కిటికీ పెట్టడానికి వీల్లేదు" అన్నాడు.

అతని గొంతుక మైకులేకుండా మైలుదూరం, మైకువుంటే మూడు మైళ్ళ దూరం వినిపిస్తుంది. జానకి అతన్ని చూడ్డం ఇదే మొదటిసారైనా, ఆ గొంతులో ధ్వనించిన అహం, పొగరు, నిర్లక్ష్యం చూసి అసహ్యం వేసింది.

వీడితో ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది.

"ఏం?" అంది.

"ఆ కిటికీ మా యింటివేపుంది"

"ఈ ఇల్లుకట్టినదగ్గర్నుంచి అక్కడే ఉంది".

"ఇప్పుడుండడానికి వీల్లేదు"

"కారణం?"

"ఆ కిటికీ దగ్గర్నుంచి మా గదిలోవాళ్లు కనిపిస్తారు"

"దానికి మేమేం చేస్తాం?"

ఇంక ఈ తగవు యింతవేగం తేలదనుకున్న కూలీలు, మేస్త్రీలు చల్దులు తినడం ప్రారంభించేరు వీళ్ళ మాటలు వింటూనే.

"ఆ కిటికీ మూయించెయ్యండి" నాగయ్య శాసించేడు.

"పోనీ మీరే మీ కిటికీ మూసుకుంటే"

"అసలు ఓ అడుగు స్థలం వుంచబట్టిగాని లేకపోతే మీ ఇల్లు మూసుకుపోయేది"

"చూడండి. మీ పేరేమిటో నాకు తెలియదు కాని మా ఇల్లు కట్టిన తర్వాతే మీ యిల్లు వచ్చింది. అంచేత ఆ కిటికీ మూయవల్సిన అవసరం వుండదు"

"కాని నేను ఒప్పుకోను" అంటూ పదెం గెల్చిన గుర్రంలా దర్జాగాను, నెమ్మదిగాను నడిచి వెళ్ళిపోయేడు. అతను వెళ్ళిన గంట వరకు అతని గొంతుక వీధిలోంచి విన్పిస్తూంది.

అసలు గతంలో జరిగిన సంగతేమిటంటే...

జగన్నాథం వాళ్ళ స్థలం రెండు గజాలు బారున ఆక్రమించి తన ఇంటికి పదేళ్ళ క్రితమే పునాదులు తీయించాడు నాగయ్య. స్థలం ఆక్రమించడానికి వీల్లేదని ప్రకాశరావు అడ్డుపడ్డాను.

ఇల్లాక్రమించిన ప్రతి వెధవ స్థలం ఆక్రమించొద్దని సలహా చెప్పేవాడే. నేనే నా స్తలం ఒక అడుగు చూరునీళ్ళకి వదిలి పునాదులు తవ్విస్తే రెండు గజాలు ఆక్రమించేనంటున్నాడు ఈ పెద్దమనిషి. ఆఖరికి ఆ స్థలం తనదైనట్టు.

నేను పునాదులుతీసిన స్థలం ఒకటేనాది. లేకపోతే జగన్నాథానిది, నీది మాత్రం కాదు. మధ్య వెధవల్తో మాట్లాడ్డం మా వంశంలోనే లేదు. జగన్నాధం గారికి ఉత్తరం రాయి. తగువు అతనితో తేల్చుకుంటాను అని ప్రకాశరావుని గదమాయించాడు నాగయ్య.

ప్రకాశరావు జగన్నాథం కాళ్ళూ, వేళ్లూ పట్టుకొని ఇల్లు చవగ్గా అద్దెకు తీసుకొని, దానిలో రెండు వాటాలు అద్దెకిచ్చి (జగన్నాథానికి తను కట్టవలసిన దానికంటే ఎక్కువ). వాళ్ళ దగ్గర అద్దె ముక్కుమీద గుద్ది వసూలు చేసి జగన్నాధానికి కానీ కట్టకుండా బతికేస్తున్నాడు. పైగా అద్దెకు తీసుకున్నప్పుడు ఇంటి రిపేర్లు అన్నీ తనే భరిస్తాననీ, ప్రతి ఏటా సున్నాలు వేయిస్తాననీ కూడా వప్పుకున్నాడు. ఇంట్లోకి దిగేక ఎప్పుడైనా ప్రకాశరావు సున్నం కొంటే అది తాంబూలంలోకే. ఏనాడూ పది రూపాయలు మదుపు పెట్టి రిపేరు చేయించకపోవడం వల్ల ఇల్లంతా పుచ్చిపోయి పడిపోవడానికి సిద్ధమైంది. అంచేత జగన్నాథం తన ఇంటికి వచ్చి చూడ్డం ప్రకాశరావుకి ఇష్టం వుండదు.

ఈ కథంతా నాగయ్యకి తెలుసు.

తెలిసే జగన్నాధానికి తెప్పించమన్నాడు. ఆ తర్వాత ప్రకాశరావు నోరు మెదపలేదు.

నాగయ్య పునాదులు కదపలేదు.

పునాదు ఇల్లైంది.

ప్రకాశరావు, నాగయ్య మంచి స్నేహితులైపోయేరు....

ఇది గతంలో కథ. ఈ కథంతా జానక్కి తెలిసింది. అంచేత మరింక ఆ వేళ కిటికీ పెట్టడం అంత మంచిది కాదేమో అని పించింది.

సల్దులు తినడం అయిపోయింది. ఆ తరువాత అరగంట కూడా అవకుండానే –

"అమ్మగారూ, సిమెంటు కానాల్ట" అంది ఓ కూలీ.

"నేనేం ఒళ్లో పోసుక్కూర్చునాన్నా? బస్తాలో వుంటుంది తీసుకో" మొదట కనిపించిన వాళ్ళ మెడలో పూలదండ వెయ్యాల నుకున్న రాజకుమారిలా, కనిపించిన మొదటి వాడ్ని చంపెయ్యాలన్నంత కోపంగా ఉంది జానకి.

"బస్తాలని అయిపోయినాయండి."

"మరి నిన్న ఎందుకు చెప్పలేదు?"

"నిన్న అయిపోనేదండి."

"ఇప్పుడికిప్పుడు ఎక్కడినుంచొస్తుంది సిమెంటు? అయినా అప్పుడే ఎలా అయిపోయింది?"

"బావుందండి అదేమన్నా శనగపిండేటండి తినేదానికి? అయిగోడలా! గుండం నాగ తినేసినాయి గదా సిమెంటంతా. మరిప్పుడు సిమెంటు నేకపోతే పని జరగదు. ఏటి సెయ్యమంటారండి? సీనియర్ మేస్త్రీ అడిగేడు.

"గుంజీలు తియ్యండి" పైకన్లేదు జానకి.

టైము పదకొండైనా అవలేదు. పని ఆపకతప్పదు – సిమెంటు లేని కారణంగా.

"ఈ వేళ వరండాలో చల్దులు తిని, చుట్టలు కాల్చు కున్నందుకు గాను డబ్బివ్వాలి వీళ్ళకి" అనుకుంటూ పర్సు తీయ బోతున్న టైములో –

"ఇక్కడ ఏవో పోర్షన్సు అద్దెకిస్తారని విన్నాం. ఎప్పుట్లో ఇస్తారు?" అంటూ వచ్చేరు ఒక ఆడ, ఒక మగ.

అడ ఇరవై ఏళ్ళు, 200 పౌన్లు బరువు, 5 అడుగుల పొడవు, కసరత్తు చేసినట్టు కండలు గల కడుపుతో నున్న ఖడ్గ మృగంలా వుంది.

మొగ ముప్పై ఏళ్ళు మూరెడులోతు చొప్పి దవడలు, 101 పౌన్ల బరువు, 5 అడుగుల పొడవు గల టి.బి. వచ్చిన గుంట నక్కలా వున్నాడు.

అంత చికాగ్గా వున్న జానక్కి కూడా వాళ్ళని చూడగానే నవ్వొచ్చింది. వాళ్ళిద్దరూ మొగుడు, పెళ్ళాం కాకుండా అక్క, తమ్ముడు, మామ్మ మనవడు, ఏదైనా సరే బావుందు ననుకుంది. కానీ యివేవీ కాదు. కేవలం మొగుడు పెళ్ళాలమే సుమా అని డౌట్ తీర్చేస్తూ –

"మా వారికి పోర్షన్సులో ఉండడం అంటే ఇష్టం లేదండి. కాని ఒక్కరైనూ ఉండాలంటే భయంవేసి పోర్షన్సులో వుందా మంటున్నానండి" అంది ఆవిడ.

"నా తల్లే. నిన్ను ఎత్తుకెళ్ళాలంటే ఒక మిలిటరీ రెజిమెంట్ రావాలి. నీకేం భయం అని మనసులో అనుకొని ఔనండి అద్దె కిస్తాం. కాని రిపేరు పూర్తి అవ్వాలి. అప్పుడురండి" అంది జానకి.

అమ్మమ్మమ్మ అలా వీల్లేదండి. రిపేరయ్యేక మాకే యిస్తారని మాటివ్వండి. లేకపోతే మళ్ళీ ఇంకోరి కిచ్చేస్తారు. ఖడ్గమృగం కరకరమంది. ఆ గొంతుక వింటే మెడ్రాస్ మెయిల్ ఇంజను మంచమెక్కియ్యాల్సిందే.

"బావుంది. మీరు ఇల్లు చూసుకోలేదు. నేను అద్దె చెప్పలేదు. అప్పుడే మాట ఎలా ఇస్తాను? కాని ఒక మాటమాత్రం ఇస్తాను. యింత వేగం ఎవరికీ మాట ఇవ్వనని"

"అయితే మరి మమ్మల్ని ఎప్పుడు రమ్మంటారండీ? గుంట నక్క మొదటిసారి నోరు విప్పింది. పీక గట్టిగా పికికేస్తున్నప్పుడు పిచ్చిక పిల్ల లాస్ట్ క్రై అలాగే వుంటుంది.

"నేను రోజూ పగలు 2 గంటల వరకు ఇక్కడే ఉంటాను. తరు వాత డాక్టరు రాజేశ్వర్రావుగారింటిలో ఉంటాను. ఎప్పు డొచ్చినా సరే"

ఖడ్గమృగం గుంటనక్క చెయ్యి పట్టుకొని తీసుకొని వెళ్ళి పోయింది.

అయితే ఊళ్ళో ఇళ్ళకి డిమాండు బాగానే ఉందన్న మాట. ఫరవాలేదు. బాగు చేయించియిస్తే అద్దె బాగానే రావచ్చు. కాని ఈ బాగు ఎప్పటికౌతుందో?

జానకి మనసులోని ఆశల్ని ఆపుతూ, ఈలోగా వీధిలో ఒక జట్కా ఆగింది. జట్కాలోంచి జరీచీర కప్పిన ఒక ఆడపాదం బయటకు వచ్చింది.

ఆ తరువాత చీర జట్కా అంచునే నిలబడిపోయి పాదం తాలూకు కాలు రమారమి తొడవరకు బయటకు వచ్చింది.

కాలు బహు తెల్లగా వుంది.

తొడ నవనవలాడుతూ జున్ను ముక్కలా వుంది. అమెరికాలో వుంటే ఆ కాలుకి కలర్ ఫోటోలు తీసుకొని వేలాడగట్టుకుంటారు. ఆ కాలు పైలా పచ్చీసులా వుంది.

దాని ముత్యాల మట్టెలు బహు నాజూగ్గా ఉన్నాయి.

తరువాత జట్కాలోంచి రెండోకాలూ, తొడా వచ్చేయి. అవి కూడా పైలాసచ్చీసులాగే ఉండి ఉండాలి కాని మొదటి వాటికి మూడింతలు ఉన్నాయి. వాటి మట్టెలు మురుగుల సైజులో వున్నాయి. ఆ కాలుకి కందపిలకల్లాంటి పిలకలు కూడా ఉన్నాయి.

తొడలు బయటపెట్టినమ్మ ఒడలు బయట పెట్టలేదు. అలా జట్కాలో కూర్చునే తిట్ల లెక్చర్ ప్రారంభించింది.

"ఔ ఏమిటీ ఇసక్కుప్పలూ, పేటకుప్పలూనూ, ఆ వెధవ ఇటికలూ, కిటికీలు, ఏమిటి? నేనూర్లోలేనప్పుడు వరదొ చ్చిందా? భూకంపం వచ్చిందా? రెండూ వచ్చేయా? ఇది మా ఇల్లేనా? మరోవీధి కొచ్చేవా?" అని ఆగింది.

"వీధి మీదే, ఇల్లూ మీదేనండి" జట్కావాడు అన్నాడో గుర్రం అన్నాదో చెప్పడం కష్టం.

ఈలోగా పిల్లల సైన్యం జట్కా చుట్టూ చేరి "అత్తయ్యో చ్చింది, అత్తయ్యొచ్చింది" అని వచ్చింది మామయ్య కాదు అన్నట్టు పదిసార్లు అన్నారు.

"ఆపండొరేగోల... ఎవరి గోరీకర్రా ఈ ఇటికలు అన్నీ వచ్చేయి" అత్త అడిగింది.

"ఇంటివాళ్ళొచ్చేరు" పిల్ల జవాబిచ్చేరు.

"ఒక కారు గదికీ, రెండు కంపుకొట్లకీ అరవై రూపాయలు పుచ్చుకున్న మహానుభావులు వచ్చేరూ. ఇంకా నేనే వెళ్ళి ఫోటో ఒకటి వాళ్ళది అడిగి పూజ గదిలో పెట్టుకుందా మనుకున్నాను. వాళ్ళకీ ఇల్లంటే లక్ష్యం లేదనే అంతా అంటారు కాని, ఇల్లు దిబ్బచేరిపోతున్నా, అద్దె వసూలై పోతూవుంటే వాళ్ళెందుకు రావాలి? ఎందుకు రిపేరు చేయించాలి?

ఈ గడుసుదనం ప్రపంచానికి తెలీదు. హమ్మయ్య" అని ఒక గెంతు గెంతింది.

ఆమె కాలుకి పిలకలు వుంటే మనిషి కంపదుంపలా వుంది. జట్కా దిగేక ఆమె ముగ్గురు పిల్లల్నీ, ఒక మొగుడ్నీ జెట్కాలోంచి ఊడబీకి పడేసింది. పిల్లలు తలో బుట్టా, మొగుడు మిగతా బుట్టలూ, ఆవిడ బోధ మోసుకుంటూ వరండీ ఎక్కేరు. అంతవరకూ వాళ్ళె వరూ జానకిని చూడలేదు.

ఆవిడ అడిగింది ఎవరు మీరు?

"నువ్వు ఫోటో అడుగుదామనుకుంటున్న మనిషి" పిల్లల్లో ఎవరో అన్నారు.

"నిజంగా ఫోటో అడగాల్సినట్టే ఉన్నారు. వీధిలో కూర్చోండి పోయేరేం? రండి లోపలికి? ఎక్కడ ఉంటున్నారు? ఆ ఖాళీ వాటానే మాది" అంటూ జానకి సమాధానం కోసం ఎదురు చూడకుండా మాటాడేస్తూ ఆవిడ జానకిని లోపలికి లాక్కెళ్ళి పోయింది. తరువాత పెళ్ళీడుకు వచ్చినపిల్లని నీళ్లు తెమ్మని, పెళ్ళీడు దాటిపోయిన దాన్ని వండమని ఆర్డర్లు వేసి మీరు మా యింటిలోనే భోజనం చెయ్యాలి ఈ పూట. అని జానకిని బల వంతం చేసింది. మరోనాడు చేస్తానని తప్పించుకుంది జానకి.

ఆవిడ పేరు కమలట. ఆవిడకి రెండో పెళ్ళట. మొగుడు పోయేక మరిదినే చేసుకుందిట. వాళ్ళాయన (మొదటి) ఆర్డరుట.

ఒట్టి భోళామనిషి అనుకుంది జానకి.

# 18

ఆవేళ మధ్యాహ్నం భోజనాల దగ్గర, తనని ప్లీడరు గుమాస్తా పెట్టిన పేచీ అంతా చెప్పింది జానకి రాజేశ్వర్రావుతో.

"వాడెవడు మధ్య కౌన్ కిస్కాగాడు. మీ గోడా, మీ కిటికీ మీ ఇష్టం."

"ఆడది. పైగా ఒంటరిది. ఇదేం చేస్తుందనుకున్నాడేమో?"

"వెధవని ఎముకలు పీకేసి కిటికీ గజాలుగా వేసేస్తాను. ఏమనుకుంటున్నాడో వాడి సంగతి నాకొదిలెయ్యండి. కాని ఆ లార్డులు ఏవంటున్నారు? ఖాళీ చేసే ఉద్దేశ్యము ఏవైనా ఉందా?"

"ఆ కొత్తగా చేరినవాళ్ళు మాత్రము రేపు వెళ్ళిపోతామన్నారు. రిపేరు పూర్తయ్యేక వీలుంటే మళ్ళీ రేపే వెళ్ళిపోతామన్నారు. రిపేరు పూర్తయ్యేక వీలుంటే మళ్ళీ వాళ్ళకి యివ్వమన్నరు. ప్రకాశరావు వాళ్లు మాత్రము ఏవీ అనలేదు. పొరుగూరిది. ఎన్నాళ్లుంటుంది అని ధీమా"

ఎన్నాళ్ళేమిటి? అవసరమైతే సంవత్సరమైనా సరే వాళ్ళు కదిలితేనే మీరు కదుల్తారు. మొండివాడు మహారాజు కంటే బలవంతుడు. వాళ్ళందరూ పోగానే డెట్టాల్‌తో కడిగి, పసుపునీళ్లు జల్లి సంప్రోక్షణ చేయించి గాని మరొకరికి యివ్వద్దు.

"పొద్దున సామాను కొంచెము తియ్యండి, కూలీలు" పని చేస్తారంటే నన్నే తీయించుకోమన్నారు.

"అంటారు, అంటారు, వీధిలోకి విసిరేసి అగ్గిపుల్ల గీసేయ వలసింది. వీళ్ళకి వీళ్ళకి మద్దతు యిస్తున్న వాళ్ళకీ కూడా ఎలా బుద్ధి చెప్పాలో నాకు తెలుసు. అన్నట్టు ఓ శుభవార్త. ఎవరో కామేశంట. పది బస్తాల సిమెంటు పంపేడు కంగ్రాట్స్. నేనూ, జగన్నాథం కలిసి చెయ్యలేనిది మీరు సాధించేరు.

"నాకూతెలీదు కామేశం అంత పవర్ ఫుల్ అని"

పై సంభాషణ జరిగిన సాయంత్రం హాల్లో సోపాలో కూర్చుని ఏదో పుస్తకము చదువుకుంటోంది జానకి. అప్పుడే వచ్చేరు ముందు రాజేశ్వర్రావు, వెనక ఒకతను.

"ఇదుగో ఈవిడే యింటి ఓనరు. యితను రెవిన్యూ ఇన స్పెక్టరు... అని జానక్కి అతన్ని పరిచయం చేసి మీరు ఆవిడతోనే మాట్లాడవచ్చు అని అతనితో చెప్పి పక్కనున్న సోఫాలో కూర్చు న్నాడు చూస్తూ.

జానకి కూర్చోమన్నా అతను కూర్చోలేదు. రాజేశ్వర్రావు కూడా "ఫరవాలేదు కూర్చోండి" అని భరోసా యిచ్చేక ఎదురుగా వున్న కుర్చీలో అంచుమీద కుర్చీకి నొప్పెడు తుందేమో అన్నంత భయంభయంగా కూర్చున్నాడు.

అతను పదిహేనేళ్ళ వరకు ఎదిగి, ఎదగడము మానేసి ముసిలైపోయిన ఆడదాన్లా వున్నాడు. గెడ్డము, మీసము ఏమీ లేకుండా నున్నగా, తెల్లగా ఉప్పు చింతపండుతో తెల్లగా తోమిన కళ్ళు, ముక్కు పెట్టిన గుండు చెంబులా వుంది అతని మొహము.

జుత్తు నల్లగా లేదు.

నలుపు పోయి తెలుపు అవుదామా వద్దా అని ఆలోచించి ఎటూ తేలక చివరికి నల్లబడ్డ అల్యూమినియం గిన్నె రంగులో వుండిపోయింది. ఆల్‌టుగెదర్ అతని మొహము ఇత్తడి చెంబు మీద అల్యూమినియం గిన్నె బోర్లించినట్లుంది.

అతను ఎందుకొచ్చేడో తెలీని జానకి ఏం మాట్లాడాలో తెలీక వూరుకుంది.

"మీ ఇంట్లో ఒక పోర్షను నాకివ్వాలండి" అన్నాడతను. ఆయుర్వేద వైద్యుడు పసరు నలిపినట్లు చేతులు నలుపుతూ.

ఇల్లు ఆడగడానికి వచ్చినవాడికి అంత పిరికితనము ఎందుకో? నవ్వొచ్చింది జానక్కి. సభ్యత కోసము నవ్వలేదు. రాజేశ్వర్రావు మాత్రం నవ్వేడు. అతని సభ్యతకి పేపరు అడ్డుంది.

"ఏదండీ! ఇంకా రిపేర్లే అవలేదు. అన్నీ పూర్తి అయ్యేసరికి చాలా రోజులు అవుతుంది" అంది జానకి డిప్లమాటిగ్గా.

అసలు చివర కూర్చున్న అతను బలిమాలడానికన్నట్లు యింకా చివరికి వచ్చేసీ "అమ్మమ్మ తమరలా అంటే కుదరదు. ఇప్పుడీ ఊళ్ళో యజ్ఞమైనా చెయ్యగవేమో కాని ఇల్లు వెదకలేం. మరంచేత మీరు నాకు ఇవ్వక తప్పదు. అద్దె విషయం మీరు భయపడకండి. నా సంగతి డాక్టరు గారికి తెలుసు. ఇప్పుడు మాత్రము ఇల్లు ఇప్పించండి. లేకపోతే నడి బజార్లో నిలబడాలి" అన్నారు పసరు యింకా స్పీడుగా పిండేస్తూ.

"బజరార్లోనా?" ఆశ్చర్యపోయింది జానకి.

"మీరు కాదు-మేము" ఎక్స్‌ప్లైన్ చేశేడు గుండుచెంబు.

"ఇతని మాటలకంటే ఆలోచనలు వేగం" అనుకుంది జానకి.

తన ఎక్స్‌ప్లనేషన్‌కి తను ఆనందపడ్డాక "లేకపోతే కోర్టుకి వెళ్ళాల్సివస్తుంది" అని కలిపేడు.

"కోర్టుకా?" భయపడింది జానకి.

చదువుతున్న పేపరు టేబిలు మీద పెట్టి కళ్ళజోడు తీసి ఆర్.ఐ. వేపు చూశేడు డాక్టరు.

"మీరు కాదమ్మా! మేము మరో ఎక్స్‌ప్లనేషను" చెప్పేదు ఆర్.ఐ.

"ఏం?" జానకీ, డాక్టరూ ఒక్కసారే అడిగేరు.

"నేనా ఇల్లాల్ని చంపేక తప్పదు" (దయగల హెడ్డు దొంగతో అన్నట్టు) అతి ఫిలాసఫిక్‌గా అన్నాడు.

"ఇల్లాల్నా" డాక్టరే అడిగేడు.

పొద్దుట నుంచి చచ్చి చచ్చి వచ్చిన జానక్కి ఈ కోర్టులూ, ఖూనీల సంభాషణతో మొహం తిరిగినంతపనై మాట రాలేదు.

"మా యిల్లాల్ని కాదు, యింటిగలావిడ్ని" మళ్ళీ అతని ఎక్స్‌ప్లనేషన్. ఈ కాబోయే ఖూనీకోర్ని ఎంత వేగం వదిలించు కుంటే అంత మంచిది అనుకున్నాడో ఏమో డాక్టరు "మీకు మరేమీ అభ్యంతరము లేకపోతే యితనికొక పోర్షనివ్వండి" అని యింక తన రికమెండేషను అయిపోయి నట్లు మళ్ళీ పేపరు తీసేడు.

రాజేశ్వర్రావుని బాగా తెలిసిన జానక్కి, అతని గొంతుక "ఐ డొంట్ మైండ్ వెదర్ యు గివిట్ ఆర్ నాట్" ధ్వనిం చింది. అంచేత అతన్ని యింటర్వ్యూ ప్రారంభించింది.

"ఈ ఊరు కొత్తగా వచ్చేరా?"

"లేదు. రెండేళ్ళయింది"

"మరిన్నాళ్ళు ఎక్కడుంటున్నారు?"

"నరకంలో?"

"అంటే...."

"మరిప్పుడవేవీ నాచేత చెప్పించకండి. మా ఇంటి వాళ్ళు లంకలో వుండాల్సినవాళ్ళు"

"భేష్. కథ తిరగబడిందన్న మాట" పేపరు చాటున నవ్వు కున్నాడు డాక్టరు.

"ఇల్లు తరువాత యివ్వొచ్చు. ముందు అద్దె ఎంతో చెప్పే యండి. ప్లాను లేనిదే ఏ పనీ చెయ్యను నేను. పెళ్ళికి ముందే పిల్లల పేర్లు నిర్ణయించే రకం నేను" ఆగేడు ఆర్.ఒ.

"పిల్లల్ని స్కూలో వేసేటప్పుడే పేర్లు పెట్టే రకం ఈవిడ. అద్దె భయము మాకేం లేదు. వెళ్ళిరండి. గవర్నమెంటు దివాలాకొట్టినా మీ రెవిన్యూ ఇన్‌స్పెక్టర్లకేం ధోకా వుండదు అన్నాడు రాజేశ్వర్రావు ఆఖరి వాక్యము మాత్రము పైకన్లేదు.

మరింక నేను వెళతానండి. మళ్ళీ కలుస్తాను" అని యిద్దరికీ ఒకటే నమస్కారము పెట్టి వెళ్ళిపోయాడు ఆర్.ఐ.

"ఇల్లంటూ తయారవ్వాలేగాని అద్దెకొచ్చేవాళ్ళకేం కొదవ లేదు అమ్మయ్య" అనుకున్న జానక్కి కొంచెం హుషా రొచ్చింది.

## 19

మర్నాడు ఉదయం -

"ఎవరొస్తారో చూస్తాను" అన్నట్టు నిల్చున్నాడు ప్లీడరు గుమాస్తా. కిటికీ అవతల. అతన్నక్కడ చూసిన జానక్కి వెంటనే అర్థమైపోయింది. ఆవేళ తను సత్యభామై ఈ నరకాసురిడితో యుద్ధం చెయ్యక తప్పదని.

కాని తన కృష్ణుడు నామకఐనా పక్కనలేడే!

అయినా నిబ్బరంగా నిల్చుని "ఇవాళైనా పనులు చకచకా కానీయండోయ్. పనులు నాలుగు రోజుల్లో అయిపోవాలి. మంది ఎక్కువైతే కూలి దండుగే కాని పనవడం లేదు. రేపటి నుంచి యింతమంది అక్కర్లేదు. సైన్యంలాగ. ఆరుగురో, ఏడు గురో చాలు. ముందా కిటికీ కానివ్వండి" అంటూ పనులు పురమాయించింది.

మళ్ళీ మోసికేళ్ళేరు మేస్త్రీలు కిటికీని.

నాలుగు నిమిషాలు గడిచాయి. అమ్మయ్య అనుకుంది జానకి.

అయిదోనిమిషం సగం గడిచింది.

శబ్దం కంటే మాట వేగం ఎక్కువ.

"ఎన్నిసార్లు చెప్పాల్రా మీకు. ఆ కిటికీ పెట్టడానికి వీల్లేదని, ఒక సారిచెప్తే వినడానికి మనుషులు కారేమిటి?" అన్న ఆల్సేషియన్ అరుపులు ముందు వినిపించేయి.

ఆ తరువాత కిటికీని మోసుకొస్తున్న కూలీలు కనిపించేరు.

ఎవరు మనుషులు కానిది?

తనా? కూలీలా?

"స్సి!స్సి! పెద్దా, చిన్నా లేకుండా మిరపకాయ తిన్న మాల కాకిలా ఏటా బాబు అరుపులు? తమరేమన్నా అంటారని గాని మావైతే ఆటోయిటో తేల్చేద్దుం". అంటూ తేల్చేడానికి అన్నట్టు వెళ్ళబోయేడు ఒక మేస్త్రీ.

"నువ్వేం తెల్చనక్కర్లేదు కాని ఒక్కసారి వెళ్ళి డాక్టరు రాజేశ్వ్రరావు గార్కి నేను రమ్మంటున్నాని చెప్పి పిల్చుకురా" అంటున్న జానకి కంటినీరు కిందపడలేదు.

ఆ ఊరివారి ఆలోచనాశక్తి అమోఘం. అక్కడేదో జరుగుతుందని ముందే ఊహించిన చాలామంది వీధిలో అక్కడక్కడే తిరుగుతున్నారు. పెరట్లో నూతి దగ్గర స్నానాల వాళ్లు తమ స్నానాన్ని మరో అరగంట పొడిగించేరు.

తలొంచుకొని కుర్చీలో కూర్చున్న జానక్కి ఆ గుమాస్తా పొలికేకలు వినిపిస్తూనే ఉన్నాయి.

"బాబోయ్. నాకీ ఇల్లూ వద్దు, డబ్బూ వద్దు పారిపోదాం" అనిపిస్తోంది ఆవిడకి.

వేగం రాజేశ్వర్రావు వస్తే బాగుండును.

రాజేశ్వర్రావు రాలేదు కాని, అతని కాంపౌండరు వచ్చేడు. "డాక్టరు గారు ఆపరేషను మధ్యలో ఉన్నారు. అవగానే వస్తానన్నారు" అంటూ. కాపొండరుకేం చెవుడు లేదు. అంచేత ఆ గుమాస్తా కేకలు అతనిక్కూడా వినిపిస్తున్నాయి.

మాట్లాడే ఓపిక చచ్చిపోయింది జానక్కి. అంచేత అదేమిటో చూడమన్నట్టు సంజ్ఞ చేసింది.

గజేంద్రుడ్ని రక్షించడానికొచ్చిన విష్ణుమూర్తిలా కాంపౌండరు ముందు, తన వెంటసిరి అన్నట్టు అతని వెనుక మేస్త్రీలు బయల్దేరేరు.

"పని కానీయండ్రా, అలా నిల్చుంటారేం దిష్టిబొమ్మల్లా అర్దరేసాడు" విష్ణుమూర్తి.

"వీల్లేదంటూ వుంటే ఏమిటీ గోల?" గుమాస్తా, పీనుగులా వున్నా ఏనుగులా గర్జించేడు.

"ఏమిటి వీల్లేదు?"

"ఆ కిటికీ పెట్టడం"

"ఈ ఇల్లు నీదా?"

"కాదు"

"మీరి నీ బోడి ఇష్టం ఎవడిక్కావాలి?"

"ఇది ఇన్నాళ్ళూ బ్రాహ్మల వీధేనా?"

"నాకు తెలీదు"

"మరిప్పుడు ఈ యింట్లో శూద్రులెవరైనా దిగుతే?"

"దిగుతారు"

"వాళ్ళు మాంసం అవీ వండుకుంటే?"

"చేపలు కూడా వండుకుంటారు"

"మరి ఆ వాసనంతా ఈ కిటికీలోంచి మాకు రాదా?"

"ఒక్క కిటికీలోంచే కాదు. పెంకుల్లోంచి, పెరటిలోంచి అన్నింటిలోంచి వస్తుంది"

"మరి మేమేం చెయ్యాలి?"

"కూరొండుకోకుండా అన్నం తినెయ్యొచ్చు"

"మేం తినం"

"అయితే మానెయ్యొచ్చు"

"ఆవిడ ఆ కిటికీ పెట్టడం కూడా మానెయ్యొచ్చు"

"ఒచ్చు. కాని ఆవిడ మానదు. అడ్డొచ్చిన వెధవని పీక వరకు పాతెయ్యకుండా నేనుండలేను. తరువాత ఆ పీక తీసేకుండా మా డాక్టరు గారు ఉండలేరు. ... చూస్తారేమిట్రా సున్నప్పిడతల్లాగ .. ముందా కిటికీ ఎక్కించండి" దమాయించేడు కాంపౌండరు.

కిటికీ ఎత్తేరు కూలీలు.

నాగుపాములా బుసకొట్టేడు నాగయ్య. "చెప్తుంటే ఏమిటా జబర్దస్తీ... ఆఁ ఆఁ సరే... నేను ఆ కిటికీకి అడ్డంగా మావేపు పెద్ద బల్ల చెక్కపెట్టించేస్తాను"

"బల్ల అయితే పుచ్చిపోతుంది. కోటకట్టించేసుకో. అడ్డం వస్తే మాత్రం యిప్పుడు నేను గోరీ కట్టించేస్తాను"

"ఏమైనా సరే ఆ కిటికీ పెట్టడానికి వీల్లేదు"

"చూడు నాగయ్యా, నువ్వు చేస్తున్నది ప్లీడరు గుమాస్తా పని కాని, ప్రీవీ కౌన్సిలరుగాదు. నాకు తెలిసినపాటి "లా" కూడా తెలీదు నీకు"

"పెద్ద పెద్ద జడ్జీలే నేను చెప్పే "లా పాయింట్స్‌కి" ఆశ్చర్య పోతారు.

"అది వాళ్ళ ఖర్మ. నేనేం జడ్జీని కాను. వినుమరి. ఈ ఇల్లు ఇంటితోపాటు ఈ గోడ, గోడతోపాటు కిటికీ కట్టి పాతిక ఏళ్ళు పైనే అయింది. ఆ కిటికీ అడ్డు ఏమైనా వుంటే ఆనాడే చెప్ప వల్సింది. ఇప్పుడు నీక అడ్డే అధికారం లేదు"

"అప్పుడంటే ఈ ఇంటావిడ వెధవావిడ. మొగదిక్కు లేనిది. అంచేత వాళ్ళు దమాయించేసేరుట. అప్పుడిక్కడ ఖాళీ స్థలం ఉండేది కాబట్టి, పోన్లే పాపం అని ఊరుకుందిట"

"ఆవిడ వెధవరికానికీ, మొగదిక్కు లేకపోవడానికి మా బాధ్యత లేదు. అప్పటి ఖాళీస్తలం ఇప్పుడు ఇల్లైయితే అవచ్చు కాని కిటికీ మాత్రం గోడవదు..." లేచి అడ్డు తప్పుకో.

అలా అయితే "ఇంటిలో దిగేవాళ్ళు మాంసం అవీ వండు కోరనీ ఈవిడ్ని కాయితం రాసిమ్మను"

"ఏం వాల్‌పోస్టరు చేసి గోడలకంటించుకుంటావా? ఇంటిలో దిగే వాళ్ళని యివి వండుకోవద్దు, అవి తినొద్దు అని ఆవిడ అంటే "అమ్మా! నువ్విచ్చేది ఇల్లా? గుడా? అందులో అర్చన చెయ్యమంటావా? అన్నం వండు కోమంటావా? అనదుగుతారు. నీకీ దొట్లు ఏవీ వద్దు, ఈ యిల్లు పూర్తవగానే నేనే దిగుతాను. మాంసం, చేపలే కాదు, అడ్డొస్తే నిన్ను కూడా వండుకుతినేస్తాను. అంచేత తద్దినం పెట్టేవాడి తమ్ముడిలా గేస్ కొట్టక తప్పుకో బాబూ" అంటూ గునపం పట్టుకున్నాడు కాంపొండరు.

"ఎలా పెడతారో నేనూ చూస్తాను"

"చూస్తే మాకేం అభ్యంతరం లేదు. కాని పాపం ఒక్క సంగతి మర్చిపోకు. అసలు మా కిటికీ 25 ఏళ్ళనుంచి ఉంది. నేను ఊళ్ళో లేనప్పుడు ఇతను కొత్తగా ఇల్లు కట్టి నా కిటికీలోంచి వచ్చేగాలి, వెలుతురు వగైరాలకి అడ్డుతగుల్తున్నాడు కాబట్టి, కోర్టువారు దయచేసి వీడి ఇంటిని నా కిటికీకి అడ్డురానంత దూరం జరిపించవలసి నది అని గాని అవిడ ఒక్క కాయితం ముక్క తగిలిస్తే, నిన్నూ నీ ఇంటినీ ఊరవతలకి మోసేస్తారు కోర్టు వారు జాగ్రత్త"

అమ్మో! ప్లీడరు గుమాస్తాలకంటే పైవాళ్ళక్కూడా రూల్సు తెలుస్తాయన్న మాట. వీళ్ళ దగ్గర తురుపుముక్కలు చాలా వున్నాయి అనుకున్నాడు గుమాస్తా.

"గబగబా కానీయండ్రా యిదేం నాటకమా ఏమిటి అలా చూస్తున్నారు? ఊ కానయ్యండి" చక్రం మరిచిపోయిన విష్ణు మూర్తి గునపం ఎత్తేడు.

"మా స్థలంలోకి రాకుండా మీ యిష్టమొచ్చినట్టేడవండి" ఎగిరేడు గుమాస్తా కూలీల మీద.

"వాళ్లేం ఘటోత్కచులు అనుకున్నావేమిటి? గాలిలో ఎగు రుతూ పనిచెయ్యడానికి? ఇప్పుడే కాదు. వాళ్ళు ఈ గోడకి సున్న వేసినప్పుడుల్లా నీ స్థలంలోకి వస్తారు. అడ్డు తగిలేవా? కుళ్లబొడిచేసి సున్నంతో కలిపేసి గోడకి రాసేస్తాను. సాక్ష్యాని క్కూడా మిగలవ్. తప్పుకో బాబు అమ్మ, నాన్నకి తద్దినం పెట్టడా నికైనా మిగులుండు. బతికుంటే ఎప్పటికైనా పేచీలే పెట్టు కోవచ్చును" కాంపొండరు నచ్చచెప్పేడు యిప్పుడే కాదు యింకెప్పుడూ నోరెత్తవద్దని.

సరిగ్గా వచ్చేడు రాజేశ్వర్రావు "ఏఎమైంది అంటూ. ఏమి టోయ్ నాగయ్యా, ఏమిటి సంగతి? అసలు నువ్వు హాస్పిటల్లోనే వున్నావనుకున్నానే.

"ఇప్పుడే మీ పేషెంటుకి ఇంజక్షను ఇచ్చేను మరేం ఫరవాలేదులే" అంటూ భావగర్భితంగా నవ్వేడు రాజేశ్వర్రావు.

ప్రతిపక్ష రాజుగారు రంగంలోకి దిగుతారని ఎక్స్‌పెక్టు చెయ్యకుండా అనధికార యుద్ధం ప్రకటించిన సైనికుడిలా గాభరా పడ్డాడు నాగయ్య.

"అబ్బే. ఏం లేదండి. ఏదో కష్ట సుఖాలు మాట్లాడు కుంటు న్నాం. పని చేసుకొండ్రా. అలా నిల్చుంటారేం" అంటూ వస్తా నండి డాక్టరు గారు, అని డాక్టరుకొక నమస్కారం, జానక్కి ఒక నమస్కారం పెట్టి వెళ్ళిపోయేడు.

అందర్నీ అంతసేపూ హడలగొట్టేసిన చారలపులి రింగ్ మాస్టర్ని చూడగానే చెవలపిల్లి అయిపోయినట్టు. అంతవరకూ కురుక్షేత్రం చేసిన గుమాస్తా రాజేశ్వర్రావుని చూడగానే ఎందు

కలా అయిపోయేడో జానక్కి అర్థం కాలేదు. ఆ ముక్కే ఆ సాయంత్రం అతన్ని అడిగింది. "అదేమిటండీ? వాడలా మారీచుళ్ళా మహాయుద్ధం చేస్తున్న వాడల్లా మిమ్మల్ని చూడగానే ఎప్పుడు చచ్చేవంటే ఆర్నెల్ల కిందట అన్నట్టు అలా అయిపోయేడు" అని.

నవ్వేడు రాజేశ్వర్రావు.

కర్ణుడికి అతన జన్మ రహస్యం చెప్తున్న శ్రీకృష్ణుడిలా జాలిగా నవ్వేడు. నవ్వేక నాగయ్య నోరు మూయించిన కథ ప్రారంభించేడు. "టి.బి. పేషెంటుకి టైఫాయిడ్ ట్రీట్‌మెంట్ యిస్తే ఏమౌతుంది?" ఠపీమని చస్తాడు. మేకని తినడానికి వచ్చిన పులితో "తప్పమ్మా. ఈ మేక యిదివరకు నుంచీ మాదే. గంగిగోవు లాంటిది. పైగా దీనికి మూడు పిల్లలు కూడాను. పాపం తల్లిలేని పిల్లలైపోతాయి, యిది చస్తే. నీకు డబుల్ పాపం కూడాను" అని బోధిచేస్తే ఏం చేస్తుంది. ముందు మనల్నీ, తరువాత మేకనీ తినేస్తుంది. "నువ్వు మిగిలిన బోధ నా కడుపులోంచే చెయ్యి, నాకు వినిపిస్తుంది ఫరవాలేదు" అని. మరంచేత వాడితో ఆఫ్ ఆల్ పీపుల్ ప్లీడరు గుమాస్తాతో ఆర్గుమెంటు చెప్పకూడదు. వాడినే అలా ఆర్గ్యూ చెయ్యనిచ్చి, మనమే జెల్లకొట్టినట్టు జెడ్జిమెంటు చెప్పేయ్యాలి... అంటూ ఆగేడు.

"చెప్తాం కాని వాడు వినాలి కదా?"

"ఎవడికోసం వింటాడు? వాడు, వాడి వకీలు కూడా వింటారు"

"అదే... ఎలా విన్నాడూ అని?"

"మేడమ్. మీరు ఆడవాళ్ళు. మీతో నేను యిలాంటి మాటలు ఆడకూడదు. కాని నేను ఆడేవరకు మీరు వదలరు కనుక ఆడేస్తాను. మీరూ డాక్టర్సు వైఫ్ కాబట్టి ఫరవాలేదనుకోండి. ఆ గుమాస్తాగాడు ఓ చిన్న సైజు రామ చిలుక. వాడికి అక్కడా అక్కడా చిలకొట్లున్నాయి. మన అదృష్టం కొద్దీ అందులో ఒక దానికి జబ్బు చేసింది. అంత సీరియస్ కాదు కాని వీడి ప్రాణానికది చాలు. అదిప్పుడు మా నర్సింగ్‌హోమ్‌లోనే వుంది"

జానకి జగన్నాథం అంత అమాయకురాలు కాకపోయినప్పటికీ, ఆశ్చర్యపోయింది ఈ కథ విని. అంటే వాడికి మీ అవసరం వుండీ మనందరం ఫ్రెండ్సు అని తెలిసీ అలా చేశాడా?"

"నన్ను పూర్తిగా చెప్పనివ్వండి. ఏదో ఆడది కదా, ఓసారి ఆడిద్దాం అనుకున్నాడు. పైగా వాడు నా పెద్దమనిషి తనాన్నే నమ్మేడు కాని, నా రౌడీతనాన్ని ఊహించలేక పోయేడు. తీరా నేను రంగంలోకి రాగానే జెండా ఎత్తేసాడు. ఇది ప్రపంచ ధర్మం. ఇంతకీ ఇంక వాడు మీ ఛాయలక్కూడా రాడు అన్నాడు.

మొత్తానికెలాగైతేనేం రెండ్రోజుల యుద్ధం, రెండ్రోజుల కూలి వదిలి కిటికీ తతంగం పూర్తి అయింది.

## 20

జగన్నాథం ఇంటికి కుడివైపు నాగయ్య ఇల్లుంటే, ఎడమ వైపు పెద్దనాయుడు గారిల్లుంది. నాయుడుగారి తండ్రీ, జగన్నాథం తండ్రీ రామారమీ ఒక్కసారే కొన్నారు ఆ ఇళ్ళని. ఆ రెండిళ్ళ మధ్య గోడ జగన్నాథానికి ఉత్తరం, నాయుడికి దక్షిణం. ప్రతి ఇంటి దక్షిణపు గోడ ఆ ఇంటి వారే పెట్టించుకోవడం ఆ ఊరి ఆచారం. అవి మట్టిగోడల వల్ల వర్షాకాలంలో పడిపోవడం మళ్ళీ వేసవిలో పెట్టించడం కూడా మరో ఆచారం. ఆ గోడ ఎప్పుడు పెట్టినా, నాయుడగారు దఫాకొక నాలుగంగుళాలు చొప్పున ఆ గోడని జగన్నాథం పెరటివేపు జరపబోవడం, జగన్నాథం తండ్రి బాణాకర్ర పట్టుకొని ఆ గోడ అంగుళం కూడా జరగకుండా కాపలా కాయడము పూర్వం రోజుల్లో రివాజయిపోయింది.

జగన్నాథం తండ్రి మరో లోకానికి, జగన్నాథం గవర్నమెంటు ఉద్యోగానికి వెళ్ళిపోవడం వల్ల మరింక బాణాకర్ర కాదు కదా. చీపురుపుల్లయినా పట్టుకొని నిల్చునేవాళ్ళు లేకపోవడంతో నాయుడుగారికి మరింక ఆ గోడ పెట్టవలసిన అవసరం కనిపించలేదు. పైగా తన ఇంటిని కొంచెం ఎక్స్‌పేండు చేస్తే మంచిదేమో అనిపించింది. అంచేత ముందున్న ఇల్లంతా అరడజను భాగాలుగాఅద్దెకిచ్చేసి తనకోసమని పెరటిలో ఒక వంటగది పడగ్గది ఏదో ఓ చిన్న స్టోర్రూముతో ఒక ఇంటిని కట్టుకున్నాడు. ఆ ఇంటి వెడల్పు 5 గజాల్లో 2 గజాలు జగన్నాథం పెరటిలోను ఉంది.

నాయుడిగారింట్లో బ్రాహ్మలు, శూద్రులు, ముస్లిములు, అనిరకాల వాళ్లు ఆహా! నేషనల్ యింటిగ్రేషన్ అంటే యిదే అన్నట్టు కలిసిమెలిసి ఉంటారు. నాయుడు గారికి పాపం ఆ యిల్లే కాకుండా ఓ రెండెకరాల పొలము, రెండు ఎడ్లు, మూడు గేదెలు, పుట్టెడు చెముడు ఉన్నాయి.

జగన్నాథం పెరడంతా "ఏటలా పాడుసేస్తన్నారు. గేదెల్ని కడితే ఆ స్థలమైన శుభ్రంగా వుంటాయి" అన్జెప్పి నాయుడు

గారు తన గేదెల్ని జగన్నాథం పెరటిలోనే కట్టుకుంటున్నాడు. గేదెలు అన్నం తినవు. టిఫినులు తినవు. గడ్డి తింటాయి ఆ గేదెలక్కావాల్సిన గట్టిమేట్లు, కుడితిగోలేలు, ఆ పెరటిలోనే ఉన్నాయి. పేడకుప్ప కూడా అక్కడే ఉన్నాయి మరి. ఆ గేదెలూ, కుప్పలూ చూసిన జానక్కి కడుపు ఉడికిపోయి కబురు చేసింది నాయుడికి వెంటనే. ఆ గేదెల్ని తీసేమని, రెండిళ్ళ మధ్య గోడ కూడా పెట్టించమని.

"గోడ యిప్పట్లో తను పెట్టలేదు. అంత అర్జంటైతే జానకి పెట్టిస్తే తరువాత డబ్బు యిచ్చేస్తాడు. ఈ "ఎదవ డబ్బు" కోసం తనిల్లు వదిలి పారిపోడు. కాకపోతే ఆ గోడమీద చూరుదింపే హక్కుమాత్రము తనదే. ఇంక గేదెలు, పాపం, నోరులేని ప్రాణులు. అవి భూతాలు అయితే అవచ్చు కాని దెయ్యాలు మాత్రం కాదు. వాటిని ఉన్నపళంగా పొమ్మంటే అవి మాత్రము ఎక్కడికి పోతాయి. అంచేత వాటికి కాని, తనకి కాని యింకో పెరడు దొరికే వరకు యిక్కడే ఉంటాయి. అదీకాక ఎక్కడో పెరటి చివరున్న గేదెలు ఎవర్ని మాత్రం ఏమిచేస్తాయి? పాలిస్తాయి తప్ప. ఆ మాత్రము భూతదయ, కృతజ్ఞత లేకపోతే ఎలా?" ఇదీ అతని జవాబు.

నాయుడగారికి పాలిచ్చే గేదెల పట్ల తనకెందుకు కృతజ్ఞత ఉండాలో జానక్కి అర్థం కాలేదు. తనేదో కసాయి మనిషైనట్లు, అతను గాంధీగారైనట్టు మాటమాటికీ ఈ భూతదయేమిటి? రాస్కేల్! చంపేసి పాతెయ్యాలి యిలాంటి వాడ్ని. ఆ గేదెల్ని రాత్రికి రాత్రి పొరుగూరు సంతలో అమ్మించేస్తే రోగం ఒదిలిపోతుంది.

జానకి ఆలోచనల మధ్యలో "మరండి ఎల్లుండికొక ఐదువేల ఇటిక ఏయిస్తే గోడలు లెగుస్తాయండి. రేపటితో పునాదులై పోతాయండి" అంటూ ఎదురుగా నిల్చున్నాడు ఎంప్రెటిస్ మేస్త్రీ.

ఔను అన్నట్టు గోడలకి యిటిక కావాలి కదూ. ఒక వైపు పాతయిల్లు రిపేరు చేయిస్తూనే, వాకిట్లో రెండు బాత్రూమ్‌లు విడివిడిగా కట్టించాలనుకుంది జానకి.

"ఇప్పుడు బాత్రూమ్‌లు లేకపోతే కొంప మునిగిపోదు. వీలైనంత వేగం అయిందనిపించి వచ్చేయ్. ఇప్పటికే ఐదువేలు దాటింది అంటూ ఆవేళే ఉత్తరం రాశేడు జగన్నాథం. ఈ జగన్నాథానికేం తెలీదు. విడిగా బాత్రూ ములుంటే అద్దె ఎక్కువొస్తుంది. పనిలో పని చేయిం చేద్దాము అని జగన్నాథం పెర్మిషను కోసం కూర్చో కుండా పునాదులు తవ్వించేసింది.

ఇంతకీ బాత్‌రూంలు పూర్తి అయినా అవకపోయినా తను కదలడానికి వీల్లేదు వాళ్ళు ఇల్లు ఖాళీ చెయ్యనంత వరకు.

మూడురోజుల క్రింత ఇల్లు త్వరగా ఖాళీ చెయ్యమని జానకి ప్రకాశరావు భార్యని అడిగింది.

"మేమూ ఆ పనిమీదే ఉన్నామమ్మా. ఆయన రాత్రి, పగలు అనకుండా తిరుగుతున్నారు ఇళ్ళకోసం" అందావిడ.

"ఇళ్ళకోసం రాత్రి పగలు తిరగడానికి అవేం దొంగలను కున్నారేమిటి?" అని మనసులో అనుకొని "ఇంతూర్లో ఇళ్ళే లేవా?" అని పైకి అనకుండా ఉండలేకపోయింది జానకి. ఈవిడతో మాట్లాడితే బ్లడ్ ప్రెషర్ హెచ్చి స్ట్రోక్ వచ్చినా వస్తుంది.

"ఉండకేం. ముందుంటే వెనకుండదు. వెనకుంటే ముందుం డదు" సాగదీసింది ఆవిడ.

"కోడిగుడ్డుక్కూడా మందు, వెనుక ఉంటాయి మనము అనుకుంటే" అనేద్దామనుకుంది జానకి.

"ఈ రెండూ ఉంటే అద్దె జాస్తీ" అని కలిపింది ప్రకాశరావు యుద్ధం గుండెల కూతురు.

ఆ పిల్ల పళ్ళన్నీ పీకేసి చేతిలో పెట్టి ఒక్కొటొక్కటే ఆమె చేతే తినిపించాలన్నంత కోపం వచ్చింది జానక్కి. ఒళ్ళు మండి "ఇల్లు కూడా నన్నే చూడమంటారా?" అంది చూడమనరన్న ధైర్యంతో.

"తల్లి, తల్లి ఆ ఉపకారం చేస్తే పుట్టబోయే పిల్లకి నీ పేరే పెట్టుకుంటాము" అంది ప్రకాశరావు భార్య.

ఏమిటీ? వీళ్ళకి ఇల్లు చూడాలా? తాజ్‌మహల్ కట్టించి ఇవ్వద్దూ? ఇస్తే మాత్రము నిలుపుకోవద్దూ. స్మశానాల్లో ఉండ వలసిన జాతి. అఘోరీ జాతి. వీళ్లు స్మశానాల్లో మకాం పెడితే దెయ్యాలు పారిపోతాయి. ఇలా ఆలోచిస్తున్న జానక్కి తళుక్కున ఒక ఆలోచన వచ్చింది. వీళ్ళు ఇల్లు చూసుకునే ప్రయత్నంలో లేరు. ఒకవేళ ఆ ప్రయత్నం చేసినా వీళ్ళకి తెలిసిన వాళ్ళెవరూ వీళ్ళకి పశువుల పాక కూడా యివ్వరు. తనే వాళ్ళకి యిల్లు చూడక తప్పదు అనుకొని వాళ్ళ కోసం ఇళ్ళవేట ప్రారంభిం చింది. మూడ్రోజుల క్రితం ఓ వాటా చూపిస్తే పిల్లా పాపల్తో ఉన్నాం. అంత చిన్న ఇల్లెలా సరిపోతుందీ. అని సాగదీశేరు. "ఒకవేళ సరిపెట్టుకున్నా అంత అద్దె మేము ఎక్కడ యివ్వ గలము? సంసారులమా? సన్యాసులమా?" అన్నారు.

నిన్ననే మరో ఇల్లు చూపించింది. అది తనకీ నచ్చింది. అద్దె కూడా అందుబాటులోనే ఉంది. వాళ్లకీ ఇల్లు, అద్దె రెండూ నచ్చేయట. అమ్మయ్య అని జానకి నిట్టూర్చే లోపల "ఆ ఇంట్లో దెయ్యాలున్నాయట. అసలే పసిపిల్లల్తో ఉన్నాము" అన్నారు. ఇంకో ఇల్లుంది కాని. మా ఇంటిని తాళం పెట్టి పాడుపెట్టేస్తాం. కాని వాళ్ళకు ఇవ్వం అన్నారు ఆ ఇంటి వాళ్లు, దిక్కు తోచడం లేదు జానక్కి –

"నా మాట విని ఒకపని చెయ్యి. ఇల్లు పైకప్పు విప్పించి మళ్ళీ వాళ్ళు వెళ్ళేవరకూ వేయించకు. ఎండకి ఎలకల్లా మాడి చస్తారు. అప్పుడు చచ్చినట్లు ఖాళీ చేస్తారు" అని ఉచిత సలహా యిచ్చేడు ఒక ఉదారుడు.

సలహాకేమి? బ్రహ్మాండంగా వుంది.

కాని లోపలంతా బాగుచేయించేక యిప్పుడెవరైనా యిల్లు విప్పుతారా? పైగా ఇల్లు కట్టడానికే కాదు. విప్పడానికీ ఉండాలిలి డబ్బు. తీరా విప్పేక ఈ దూలం పనికిరాదు. ఆ వాసం పుచ్చి పోయింది అంటూ మేస్త్రీలు పీకి పారేస్తారు. దానికి అవబోయే ఖర్చు, ఇప్పటికే అయిన ఖర్చు కలిపితే ఒక చిన్న సైజు కొత్తయిల్లే కట్టుకోవచ్చును.

మరేమిటి ఉపాయం? ఏదో తట్టకపోతుందా అన్న ధైర్యం తోనే పనులు చేయిస్తుంది జానకి.

ఆవేళ సాయంత్రము రాజేశ్వర్రావు కాంపౌండరు చేత రెండువేల ఇటిక తెప్పించింది. కాని ఆ ఇటిక ఎక్కడ పెట్టడం? సాయంత్రము కూలీ లెక్కడినుంచి వస్తారు? ఏమిటో అంతా కొత్త పూజారత్వం.

"ఈ పొద్దుకి రోడ్డువారని పోసేస్తావండి రేప్పొద్దుటేళ కులాళ్ళ చేత లోపల ఒడేయించుకోండి" అంటూ బళ్ళ వాళ్ళు దభీమని ఇటుకలన్నీ రోడ్డు మీద ఒంపేసిపోయేరు. రేపు మళ్ళీ కూలీలు ఎక్స్ట్రా కావాలి.

"ఇల్లు కట్టిచూడు" అన్నారు పూర్వులు.

"ఇల్లు రిపేరు చేయించిచూడు"

"అద్దెకిచ్చి ఇల్ల రిపేరు చేయించి చూడు"

"అద్దె రాబట్టి చూడు"

కొత్త సామెతలు బావున్నాయి జానక్కి. బావులేనిది ఆమె అనుభవమే.

## 21

కేసు పోతేపోయింది. కానియాక్టు తెలిసింది అన్నాట్ట వెనుకటి కెవడో. అలాగే ఈ ఇంటిగొడవ జానక్కి చాలా అను భవం నేర్పింది. ఇప్పుడు యిల్లేం ఖర్మ. ఒక కాలనీ కట్టించీ గలదు. అంత అనుభవం వచ్చింది.

నలభై సిమెంటు బస్తాలు నంచుకున్న ఇల్లు యిప్పుడు పాడు పడిన పశువుల పాకలా కాకుండా, పాడుబడుతున్న ఇంటిలా కనిపిస్తోంది. ఇంక ఈ బాత్రూముల బాధ అయిపోతే, ఓ పది రోజుల్లో జెండా ఎత్తేయచ్చు. ఇంకా అద్దెలవాళ్ళా? పశువుల్ని రోడ్డు మీదికి తోలేసి, ఆ పాకలు అద్దెకిచ్చే ఈ రోజుల్లో ఇల్లు ఊరికే వుంటుందన్న బెంగ అనవసరం. పూర్తి అయిన మర్నాడు పువ్వుల్లో పెట్టి తీసుకుంటారు.

అమ్మయ్య! యిన్నాళ్ళకి యింక నిశ్చింతగా నిద్రపోవచ్చు.

ఈ విషయాలే తీరిగ్గా రాసింది ఆ సాయంత్రం జగన్నాధానికి.

అయితే తానొకటి తలిస్తే తాపీ మేస్త్రీ ఒకటి తలుస్తాడని, ఉత్తరం పోస్టుచేసి వచ్చేసరికి గుమ్మంలో మేస్త్రీ కూర్చుని వున్నాడు.

"అప్పుడే ఏం చేసినారేటండి ఇటిక? ఏదో సామెజెప్పినట్టు ఒంటికి గుండెనాటిదండి ఇంటికి పునాది. మరింక పునాదులు వారంరోజులైన ఆరకపోతే గోడలేటి నిలుస్తాయండి? అనక అదుగో ఆ మేస్త్రీ కట్టిన గోడలు ఎనక్కి తిరిగేసరికి బడిపోయినా యని మాకు మాటొస్తాది" ఆరిపోయిన చుట్టని అంటించు కోడానికి ఆగేడు.

గుండె గుభేల్మంది జానక్కి.

మరో వారం రోజులా?

"మరి ఆ మేస్త్రీ... అదే ... సన్నగా పొట్టిగా వుంటాడే, పేరు మరచిపోయేను అతనేమిటీ అలా చెప్పేడు?" అంది.

గంగాళం నీళ్ళు ఒక్కసారి ఒంపినట్లు గలగలా నవ్వేడు మేస్త్రీ. నవ్వు అయిపోయేక చుట్ట నోటిలోంచి తీసి తుపుక్కున ఉమ్మేడు. మళ్ళీ చుట్ట నోట్లో పెట్టుకున్నాడు. ఏం అనుమానం వచ్చిందో నోటిలోంచి తీసి తిరగేసి వూదేడు. పొగరాలేదు కాని నుసిమాత్రం ఎగిరి కంటిలో పడింది.

ఈ సస్పెన్సు మహా చిరాగ్గా వుంది జానక్కి.

వీడీ చుట్ట కార్యక్రమం అయితేగాని మాట్లాడడు కాబోలు!

వాడికీ చిరాగ్గానే వుంది. అప్పటికా చుట్ట ఆరుసార్లు అంటిం చేడు. "సి, సి, సి యిదేటిటి పొగాకా? ఇస్తరాకా? అణా సుట్ట ముక్కకి ఆరు అగ్గిపుల్లలు అయిపోతున్నాయి. ఎదవ పెపంచి కంలో మాయతప్ప మరేట్నేదు" అని తనలో గొణుక్కొని "అమ్మ గోరు, కుసింత అగ్గి నిప్పుంటే యిప్పించండి" అన్నాడు.

అదృష్టం కొద్దీ అగ్గిపెట్టె హాల్లోనే దొరికింది. అది ఎప్పుడో జగన్నాథం వదిలేసినది. ఆ ఇంటిలో ఎవరూ సిగరెట్టు కాల్చరు. అంచేత అది అక్కడే వుంది. జానకి ఇచ్చిన అగ్గిపెట్టెతో చుట్టు వెలిగించుకున్నాడు మేస్త్రీ.

"ఎవడండీ వాడు? ఆడికి రేపటి నుంచి ఎక్కడా పని దొరక నేదు కామోసు. పోనీ నాలుగురోజులైన ఆరనీయండి రోజూ ఇద్దరు కూలాళ్ళనెట్టి తడీపిస్తే గట్టిపడతాయండి. రేపో నలుగురు కూలాళ్ళ నట్టి ఆ ఇటికంతా లోపలేయించీయండి. తమరితో అనకూడదు గానీండి వట్టి దొంగముండాకొడుకులున్నారండి ఆ యీదిలో"

ఆ వీధివాళ్ళు గాంధీగారి వారసులైనా, గాడ్సే మనవలైనా తనకేం అభ్యంతరం లేదు. కాని ఈ నాలుగు రోజులూ ఏమిటి చెయ్యడం?

తాపీమేస్త్రీకి టెలిపతి ఉంటుందేమో!

ఊరికే ఎందుకుంటారండీ? సున్నాలు ఎయ్యాలి కదా? ఆ పని సెయించేద్దారండి. అదేటండి అమ్మగారు అలా డీలా పడిపోయేరు? అంతగా అయితే మరో ఇద్దరు మేస్త్రీల నెట్టి బేగి చేసేస్తాను. కాని ఒగ్గేస్తానేటి?" అని పని పూర్తి చేస్తానని భరోసా ఇచ్చి వెళ్ళిపోయాడు ఆ మేస్త్రి.

అమ్మయ్య. అయినా, అవకపోయినా, అయిపోతుందన్న అభయం ఇచ్చేడు అంతేచాలు.

చాలా రోజుల తరువాత నిశ్చింతగా నిద్రపోయిన జానక్కి ఆ రాత్రి కుంభవృష్టిగా వర్షం కురిసిన సంగతి తెల్లవారే వరకు తెలీలేదు.

వాకటిలోను, కాలవలోను పారుతున్న నీటిలో యిరుగు పొరుగు పిల్లలంతా కాయితం పడవలు వేసి ఆడుకుంటు న్నారు. మరీ చిన్నపిల్లలు నీళ్ళలో దిగి తపతప కొడుతూ గెంతుతున్నారు.

అప్పుడే నిద్రలేచిన జానక్కి ప్రపంచం అంతా చాలా పవిత్రం గాను, ప్రశాంతంగాను కనిపించింది.

రోడ్డు మీద ఆడుకుంటున్న పిల్లలు కడిగిన భూమ్మీద దేవుడు పెట్టిన ముగ్గుల్లా వున్నారు.

వాళ్ళనే చూస్తూ గుమ్మం దగ్గర నిల్చుని కాఫీ తాగుతున్న జానకిని "చూశారా? మనం నాలుగు రోజుల్లో తడపలేనిది భగవంతుడు నాలుగు గంటల్లో తడిపేసేడు. ఈ వర్షానికి పునా దులే భూమి అవతల చివర వరకూ తడిసిపోయింది" అంటూ పలకరించేడు రాజేశ్వర్రావు.

"ఔను" అన్నట్లు చిన్నగా నవ్వింది జానకి.

జగన్నాధమే కనుక అక్కడుంటే ఆ నవ్వుకి జగమంత భాష్యం చెప్పేవాడు.

"ఈవిడ చాలా అందంగా నవ్వగలదు" అనుకున్నాడు రాజే శ్వరరావు మనసులోనే.

"అయినా నడివేసవిలో ఈ వర్షాలేమిటి? మనుషులతో పాటే కాలాలూ మారిపోతున్నాయి...." అంటున్న జానకి అక స్మాత్తుగా ఎదురుగా నీళ్ళలో మొసలిని చూసినట్టు "అమ్మ బాబోయ్" అంది గట్టిగా.

ఆవిడ కేకకి నీళ్ళలో తేలుతున్న కాయితం పడవలు గబు క్కున్న మునిగిపోయేయి.

నీళ్ళలో ఆడుకుంటున్న పిల్లలు పరుగెత్తి పారిపోయారు.

చుట్టూ చూసేడతడు.

ఏమైంది?

నిన్ననే ఊళ్ళోకి వచ్చిన సర్కసువాళ్ళ సింహంగాని తప్పించు కొని రాలేదు కదా.

"ఏమిటండీ? ఏమిటి?" అతని గొంతుకలో అదుర్దా స్పష్టంగా కనిపించింది.

ఇటికలండీ, ఇటికలు. నిన్ననే రెండువేలు తెచ్చి రోడ్డు మీద పోసి పోయేరు. ఈ వర్షానికి కొట్టుకుపోయేయో ఏమిటో అంది జానకి దూరంగా రోడ్డుమీద ఇటికలు కొట్టుకొని వస్తున్నట్టు.

థేంక్ గాడ్! ఈవిడేదో చాలా తెలివైనది, గడుసుది అను కున్నాడు కాని యింత అమాయకురాలని ఎన్నడూ అనుకోలేదు.

మొత్తానికి ఆడది అనిపించుకుంది.

బావుంది. ఇదన్నమాట మీ భయం. ఈ వర్షానికే యిటికలు కరిగిపోతే ఇంక మనం ఇళ్లు కట్టుకోవడం ఎందుకూ? ఏం

ఫరవాలేదు. అయినా మీరు భయపడు తున్నారు కాబట్టి వెంటనే లోపల వెయించెయ్యండి, "మళ్ళీ మీరు కేకలు వెయ్యకుండా" అని ఓదార్చేడు.

ఓ ఓదార్పు చాలలేదు జానక్కి.

కళ్ళతో చూస్తేగాని మనసు కుదుటపడదు. అంచేత అర గంటలో తయారై బయలుదేరింది.

రోడ్డంతా చిన్న చిన్న చెరువులతోను, వాగులతోను, నీటి మయంగా వుంది. "బహుశా మేము ఈ వూరి వదిలి వెళ్ళిన తరువాత ఈ రొడ్డెప్పుడూ బాగుచేసినట్టులేదు అనుకుంది" జానకి.

చెప్పుల్తో నడక సాగడం లేదు. బురదలో చెప్పు వుండి పోయి, కాలు ఒక్కటే బయటకు వచ్చేసింది. చెప్పు తీసు కుందా మనేంతలో ఓ బస్సు రయ్యున వచ్చి ఆ చెప్పుని బురదలోపాతేసి, బురదనీళ్ళు జానకి మీద స్ప్రేచేసి వెళ్ళిపోయింది. ఒక్క చెప్పుతో ఎలానడవడం? లేకపోతే చెప్పుని చేత్తో పట్టుకుంటే వెర్రిది అనుకుంటారు.

ఛీ! ఛీ! వెధవ మనుషులు. వెధవ రోడ్డు. వెధవ బస్సు. ఇంకెవర్ని తిట్టాలో తెలియని జానకి రెండో చెప్పుని కోపంగా విసిరేసి నకడ ప్రారంభించింది. కూతవేటు దూరంలోఎక్కడా రిక్షా కూడా లేకపోవడంతో. చెప్పుల్లేని నడక.

పాలరాతి మీద కాదు, బూరుగు దూదిమీద కాదు.

బురదలో

భగవాన్! ఏదో గుచ్చుకుంటున్నాయి. గాజుపెంకులు, ఇనుప ముక్కలు కాదు కదా!

అతి కష్టం మీద ఇల్లుచేరిన జానక్కి గుండెలో గునపం గుచ్చినట్టయింది.

ఇటికలేవి?

రోడ్డుపక్కనే పారుతున్న కాలువలో నీళ్ళు ఎర్రగా రక్తపు కాలువలా వున్నాయి.

ఆ నీటిమీద పడిన ఎండనీడలో ఆ వరండా గోడలు కూడా ఎర్రగానే ఉన్నాయి.

రోడ్డుమీద ఇటికలు కరిగిన ముద్ద గడ్డకట్టిన రక్తపు ముద్దల్లా వుంది.

ఆ పారుతున్నదంతా తన రక్తమే.

తన రక్తంలో తనే కొట్టుకుపోతోంది.

ఇంక తన ఒంట్లో ఒక్క రక్తపు చుక్క కూడా లేదు.

రక్తం చూసి మొహం తిరిగినదాన్లా, నిల్చునే ఓపికలేక గోడ నానుకుని నిల్చుంది జానకి.

మూడు వందల రూపాయల కాలువై పారుతున్నాయి.

అలా ఎంతసేపు నిల్చుందో?

ఎన్ని యుగాలు గడిచేయో?

"ఓ లమ్మోలమ్మ! ఎంత మోసం సేయిస్సినాడు దగాకోరు నంజికొడుకు. ఎర్రమట్టి ముద్దలేసి బట్టుకెళ్ళిన డబ్బు అడికి మాత్తరం అరుగుద్దేటి? అరగదు కాక అరగదు భగ మంతుడు లేడా? అడు సూడడా?" అని జనాంతికంగా ఆ ఇటికలవాడ్ని శపించి "సూడు తల్లీ. ఆడ్ని మాత్రం ఒగ్గకు . పిలకుచ్చుకొని గుంజి మరీ అడుగు మావైతే ఆడ్ని ఈడుసు కొచ్చి యీ మట్టి ముద్దలోనే కప్పెటయ్యావా...." అన్న కూలీ సలహాతో మళ్ళీ ప్రపంచంలో కొచ్చింది జానకి.

పునాదులు తడపడానికొచ్చేరన్న మాట. మళ్ళీ యింకో దండుగా?

"అంత వర్షం పడింది. యింకెందుకు తడపడం? ఈ వేళ రేపు అక్కర్లేదు" తన గొంతుక తనకే వినిపించ లేదు జానక్కి.

ప్రపంచంలో మోసం ఉంటుందని తెలుసుకాని తనకి ఎప్పుడూ ప్రత్యక్ష అనుభవము కలగలేదు. అప్పుడప్పుడు పంచ దారలో గోధుమరవ్వ, నెయ్యిలో శనగనూనె కల్తీ తప్ప. పోనీ మరో పదిరూపాయలు ఎక్కువ తీసుకొని మంచి సరుకు యివ్వ కూడదూ?

కూడదు. అది వ్యాపార లక్షణం, పదిరూపాయలు ఎక్కువ తీసుకున్నా సరుకు మామూలే.

బహుశా కల్తీ చెయ్యడానికి వీల్లేనివి నీళ్లు ఒక్కటేనేమో!

ఇంక అక్కడ ఉండడం యిష్టంలేక జానకి మళ్ళీ ఆ రోడ్డు మీది వాగుల్ని చెప్పుల్లేని కాళ్ళతోనే దాటుకుంటూ అతికష్టంమీద ఇల్లు చేరింది, అన్నట్టు వెంటనే చెప్పులు కొనాలి అనుకుంటూ

## 22

"అనుకున్నది అనుకున్నట్టు జరగకపోవడమే జీవితము" అని వ్యాఖ్యానించేడు వేదాంతి.

"జరగదని తెలిసీ యేదో ఒకటి అనుకోవడం, ఆశించడం మానవ నైజం" అంటారు మరో వేదాంతి.

"ఈ వేదాంతులకేం పనీ, పాటు ఉండదు. కడుపునిండా తినడం, తిన్నది అరిగేవరకు వ్యాఖ్యానించడం" వాటికి అర్థం పర్థం ఉండదు మాటవరసకి....

"కష్టాలు మనషులక్కాక మానుల కొస్తాయా?"

"ఏం? ఎందుకు రావు? చెట్లకి చెదపడుతుంది. పురుగులు తినేస్తాయి, తుఫాన్లకి విరిగిపోతాయి. అవి వాటి కష్టాలు కావా?"

"చీకటి తరువాత వెన్నెల వస్తుంది"

వాళ్ళ మొహం. కొందరి బతుకులకి యెప్పుడూ చీకటే. కొందరి బతుకుల్లో అంతా వెన్నెలే.

మరంచేత ఈ వేదాంతాలు నమ్మకు.

"వేదాంతి ; అనగా పనీ, పాటులేని కడుపునిండిన పోరం బోకు అన్న నా ఉవాచ ఒక్కటే నమ్ము" అంటాడు జగన్నాథం.

"మరి అనుకోనిది జరగడాన్ని ఏమంటారు?"

"గమ్మత్తు" అంటారు. ఇది జగన్నాథం వ్యాఖ్య.

జానకి ఏ పరిస్థితుల్లోను అనుకోనిది ప్రకాశరావుని ఆ టైములో చూస్తాననుకోవడం.

అయితే జానకి దాన్ని "గమ్మత్తు" అని అనుకోలేదు. ఖర్మ అనుకుంది.

గుమ్మం యెక్కగానే హాల్లో కూర్చున్న ప్రకాశరావుని చూసిన జానకి ఎర్రగుడ్డని చూసిన ఎద్దులా బెదిరింది. ఇన్నాళ్లు తుపాకి దెబ్బకి దొరకని మనిషి ఇప్పుడ హఠాత్తుగా ఎందుకొచ్చినట్టు.

పాత బాకీ తీరుస్తానంటాడేమిటి కొంపదీసి!

ఇందాకటి ఎర్రరంగు యింకా ఆవిడ కంటినుంచి పోక పోవడం వల్ల ప్రకాశరావు, అతని బట్టలన్నీ ఎర్రగానే కనిచించి, అతనొక డేంజర్ సిగ్నల్లా అనిపించేడు జానక్కి.

"ఎప్పుడొచ్చేరు?" అని పలకరించి కుర్చీలో కూలబడింది జానకి.

"ఇప్పుడే" కొంచెం యిబ్బందిగా కదిలేడతను.

అతనికి జానకి బతికున్న మనిషిలా గాకుండా, గోరీలోంచి పారిపోయి వచ్చిన పదేళ్ళ క్రిందట శవంలా కనిపించి అరక్షణం పాటు, "అయ్యోపాపం" అనుకున్నాడు.

అదే అరక్షణంలో జానకి అతన్ని "ఛీ, పాపాత్ముడు" అను కుంది, తన ఈ పరిస్థితికి అతనే కారణము అని జ్ఞాపకం వచ్చి.

"ఈ చండాలుడితో నాకు మాటలేమిటి?" అని కూడా అనుకుంది.

ఏమి మాట్లాడలేదు.

అయిదు నిమిషాలు అసహ్యంగా గడిచేయి.

"జగన్నాథం యేడీ?" అడిగేడు ప్రకాశరావు. లేడని అతనికి తెలుసు.

"వెళ్ళిపోయి వారమైంది"

"మధ్య నేను ఊళ్ళోలేను...." సంజాయిషీ చెప్పేడతను.

తలూపింది జానకి.

మరో అయిదు నిమిషాలు గడిచేయి.

జానకి టేబిలుమీదున్న మాగజైను తీసింది.

ప్రకాశరావు ఎదురుగా గోడమీదున్న పెయింటింగ్ చూస్తు న్నాడు. పెయింటింగ్ పరిశీలన అయిపోయింది.

పక్క గోడ వేపు చేసేడు. యేదో మెడికల్ కంపెనీ యిచ్చిన ప్లాస్టిక్ కేలండరు వుంది. కాకపోతే కంపెనీవాడు యిచ్చిన నాటి తేదీతోనే ఉన్నది. సంవత్సరమూ అదే.

ఇంక చూడ్డానికి ఆ గదిలో ఏమీ లేవు. మరంచేత జానకి వేపు చూసేడు. ఆవిడ మాగజైను తిరగేస్తుంది.

"ఇల్లు బాగుచేస్తున్నందుకు సంతోషం...." అన్నాడు అతనే.

చూస్తున్న మాగజైను ఓసారి కిందికి దించి అతనివేపు చూసి, మళ్ళీ మాగజైను చూడ్డం ప్రారంభించింది జానకి.

"మాకు మాత్రము చాలా బాధగా ఉంది" అనలేదు.

"జగన్నాథంలో ఏకౌంట్ సెటిల్ చేసుకుందామని వచ్చేను" అని జేబులోంచి కొన్నికాయితాలు తీసి టేబులు మీద పెట్టేడు. జానికి చేతిలో మాగజైను పేజీలు తిరుగుతున్నాయి.

"మరి నే వెళతాను. ఆ ఏకౌంటు మరొకసారి చూడండి" అని వెళ్ళిపోయేడు ప్రకారరావు.

అసలే ఇటికల గొడవతో చికాగ్గా ఉన్న జానక్కి ప్రకాశరావు రాక ఆ చికాకు యింకా ఎక్కువ చేసింది.

సిగ్గు లేకపోతే సరి.

డబ్బు సంగతి ఎత్తడు కాని ఎకౌంటు చూడాలిట ఎకౌంటు.

ఇంతకీ ఏముంది ఆ ఎకౌంటులో?

మొదటిది: రిపేర్లు, పన్నులు, సున్నం

రెండోది : సున్నం, రిపేర్లు, పన్నులు

మూడోది : పన్నులు, సున్నం, రిపేర్లు

అన్ని అకౌంట్లలోనూ ఈ మూడు వున్నాయి. ఒకటి రెండింటిలో మాత్రమే నీటి పన్ను ఎక్స్ట్రా వుంది.

సారాంశం : ప్రకాశరావు యివ్వవలసిన అద్దెలో వీటి మొత్తము పోగా జగన్నాథమే ప్రకాశరావుకి మూడువందల పైచిలుకు యివ్వాలి. ఈ మధ్య తను ఊళ్ళో లేడు. ఇంటిలో ఆడ వాళ్ళకి తెలీక అద్దెపెంచేశారు.

జనక్కి ఇటికల షాక్‌కి కళ్ళు మాత్రమే తిరిగేయి.

ఈ ప్రకాశరావు ఏకౌంట్ షాక్‌కి ఒళ్ళంతా తిరిగింది.

అలాగే సోఫాలో వాలిపోయింది నీరసంగా.

మధ్యాహ్నం పన్నెండు గంటలకి యింటికొచ్చేడు రాజేశ్వరరావు.

అతన్ని చూసిన జానకి లేవలేదు.

కనీసం పలకరింపుగా నవ్వలేదు.

చేతిలో కాయితాలు మాత్రము గాలికి యెగురు తున్నాయి. నిద్రపోతుందేమో అన్న సందేహం అనవసరం, కళ్ళు తెరిచే ఉన్నాయి.

డాక్టరైనా ఒక్కసారి భయపడ్డాడు రాజేశ్వర్రావు.

ఈ దిక్కుమాలిన యిల్లు కాదు కాని మనిషి తెగ శ్రమ పడుతోంది.

కొంపతీసి హార్ట్ ఎటాక్ లాంటిది...

దగ్గరకు వెళ్ళి "జానకిగారూ!" అని గట్టిగా అరిచినట్టే పిల్చేడు చెయ్యి పట్టుకొని కుదుపుతూ...

అంతవరకూ ప్రాణం లేనట్టున్న జానకి అతని కేకకి, అంత దగ్గరగా వున్న అతన్ని చూసి తుళ్ళిపడింది.

గబుక్కున లేచి కూర్చుంది.

"ఏమిటలా ఉన్నారు? వొంటో బాగులేదా?" గాభరాగానే అడిగేడు.

ఆవిడ మాట్లాడితే తప్ప గాభరా తగ్గదు. ఆ జగన్నాథం వట్టి రాస్కేల్. ఆడదాని మీద యిలాంటి వెధవపని వదిలేసి వెళ్ళిపోతాడా? ఈవిడ్ని ఎంత వేగం వీలైతే అంత వేగం ఇక్క ణ్నుంచి పంపించెయ్యకపోతే యింటి మాట దేవుడెరుగు, మరింక ఈవిడ తేరుకోవడం కష్టం.

"బాగానే ఉంది"

"ఇంటి దగ్గర అంతా బావున్నారా?" ఆవిడ చేతిలో కాయి తాలు ఉత్తరం అనుకున్నాడతను.

"బాగానే ఉన్నారు" అంటూ కాయితాలు అందించింది.

అతనికి జానకి పరిస్థితి ఏ కాయితం చదవకుండానే తెలుసు. ఆవిడకి అర్జెంటుగా కావల్సింది రెస్టు.

"కాయితాలు తరువాత చూద్దాం. ముందు భోజనం చేద్దాం రండి. నాకు ఆకలేస్తుంది కూడాను" అంటూ ఆవిడ్ని భోజనానికి తీసుకెళ్ళి, భోజనం అవగానే, యిప్పుడే అరగంటలో వస్తానని చెప్పి యెక్కడికో వెళ్ళిపోయేడు.

మనసు, శరీరము అలిసిపోయిన జానకి అతని అంచనా ప్రకారం నిద్రపోయింది.

## 23

ఆ సాయంత్రం ఇటికల సంగతి విన్న రాజేశ్వర్రావు "కాం పౌండరుని పిల్చి ఆ రోగ్‌ని పిలక పట్టుకొని ఈడ్చుకు రమ్మని" పంపించేడు.

మరో అరగంటకి ఇటికలవాడొచ్చేడు కాని అతని పిలక మాత్రం కాంపౌండరు చేతిలో లేదు. ఎవరి చేతిలో ఉండడానికీ అతనికి పిలకే లేదు.

బ్రహ్మాండమైన క్రాపుంది.

ఆ క్రాపుని మధ్యగా చీలుస్తూ సిమెంటు రోడ్డులాంటి పాపిడి వుంది.

ఆ పాపిడి కిందున్న మొహం సిమెంటు దిమ్మలా వుంది.

ఆ మొహం కింద మొండెం సిమెంటు బస్తాలా వుంది.

ఆ మొండెం క్రింద కాళ్ళసిమెంటు దూలాల్లా ఉన్నాయి.

మొత్తంగా చెప్పాలంటే అతను నేచురల్ జుత్తు అంటించిన సిమెంటు విగ్రహంలా ఉన్నాడు.

ఆ సిమెంటు విగ్రహం సిల్కు లాల్చీ తొడుక్కుంది.

మెళ్ళోవున్న సన్నటి బంగారు గొలుసు గుండెలమీదున్న వెంట్రుకల మధ్య నల్లగడ్డిలో గోధుమ నాగులా కదుల్తోంది.

ఆ గొలుసులకి ఉన్న లాకెట్ ఆ పాము పడగలా అటూ యిటూ ఊగుతోంది.

ఆ లాకెట్టులో ఉన్న రెండు ఎర్రరాళ్ళు ఆ పాము కళ్ళలా మెరుస్తున్నాయి.

అతని పేరు పకీరు.

పేరు చూసి ఎవరైనా అతను ముస్లిం అనుకుంటే అదివాళ్ళ పొరపాటు. అతను నూటికి నూటపదకొండు పాళ్ళు హిందువు.

వాళ్ళమ్మకి వరసగా ఆరడజను మంది పిల్లలు పుట్టి వరస గానే చచ్చిపోయేరు. ఈ ఏడో వాడు పుట్టగానే తీసుకెళ్ళి పెంట కుప్పమీద పారేసి పకీరు అని పేరు పెట్టి మళ్ళీ తెచ్చుకుంటే బతికేట్ట. అతని తండ్రి మట్టితో కుండలు చేసి చేసి, ఆఖరికి తను చేసిన కుండతోనే కాటికి వెళ్ళి మట్టిలో కలిసిపోయేడు.

పకీరు మాత్రం మట్టి పిసకలేదు.

కుండలు చెయ్యలేదు.

ఇటికల వ్యాపారం పెట్టి యిప్పటికి రెండిళ్ళు కట్టేడు. సినిమా హాలు సగం పూర్తి అయింది. దేవుడు చల్లగా చూసి ఆ సినిమా హాలు బాగా లాగిస్తే యింక యిటికల వ్యాపారం మానేద్దామని అతని ఆశయం.

పకీరుని రాజేశ్వర్రావు చూసేడు. చూడ్డమే కాదు. అతను పెట్టిన "దండం బాబు" కూడా అందుకున్నాడు. అయితే తను ఎదురుచూస్తున్న యిటికల రోగ్ యితననేనని తెలీదు. ఎవరో పేషెంటేమో!

"కబురెట్టినావుట. ఉన్న పళాన రమ్మంటే యేటోననుకొని ఒచ్చీసి నాను" అన్నాడు పకీరు. మనిషి సిమెంటు విగ్రహ మైనా, గొంతుక మాత్రం కంచు గంట.

రాజేశ్వర్రావు, జానకి ఒక్కసారే తుళ్ళిపడ్డారు.

ఈ చత్కారీ, వెధవ ఇలా ఒక్కొక్కరికి రెండేసిసార్లు ఇటికలు అమ్మి ఇలా బలిసిపోయేడు'' ఒళ్లు మండిపోయింది రాజేశ్వర్రావుకి.

"నువ్వు ఏ వ్యాపారం చేస్తావు?"

"నానండి! మరి ఇటికల యాపారం కదండి"

"ఎర్ర మన్నుకాదా?"

"మట్టి నానెందుకు అమ్ముతానండి? తమకు తెల్దేటండి?"

"తెలీకే అడగడం"

"ఇటికలేనండి."

"చూడూ. టమాటోలు కారట్‌లు వగైరా కొన్ని కూరలు పచ్చివి తింటేనే ఒంటికి మంచిదిట. అలాగే పచ్చి ఇటిక లైతేనే ఇంటికి మంచిదని ఏదైనా శాస్త్రం వుందా?"

"ఫెడీ ఫెడీమని లెంపలేసుకున్నాడు పకీరు"

"అమ్మ బాబో, అంత మాటనకండి మరి. ఇనుము కైనా తుప్ప పట్టుద్దేమో గాని నా ఇటుక్కి మాత్తరం సెక్కు సెదర దండి. ఇల్లు కూలి పోయినా, ఇటిక మాత్తరం సిన్న ముక్కకూడా ఇరగదు కాదు ఇరగదు...

"మరి నిన్న మా అమ్మగారికి వేసిన ఇటికల మాటేమిటి?" రెట్టించేడు రాజేశ్వర్రావు.

అసలు నా కాడ నిన్నటేల ఇటికే ఎవరూ ఏసుకెల్లలేదండి. ఏటా ఇయాల బేరమేలేదు అని కూడా అనుకున్నానండి మరి. బాబూ ఒక్కోసుట్టు అంతేనండి అస్సలు బేరాలుండవండి. ఏటి సేస్తాం. యాపారం అన్నాక ఎగుడూ దిగుడూ ఉండవా? తమకి మాత్తరం తెల్దేటి? ఆ బండి నంజకొడుకులు ఏడ బట్టుకొచ్చేరు ఏటో, పిలకుచ్చుకొని జాడించి మరీ అడగండి. అలాంటి కంతిరీ పనులు సేస్తే మరింక యాపారం చేసినట్టే. అమ్మగారూ ఈపాలి నాకాడ ఏయించుకుని చూడండి. సరుకు సూసినాకే డబ్బు ఇప్పించండి. అమ్మబాబో .... మీలాంటోళ్ళకాడ మాటపోతే మరింక యాపారం ఏటి సేస్తాం బాబు... ఎంత కావాలో సెప్పండి. రేపీయేలకి గుమ్మం కాడ ఒంపేస్తారు ఇటిక అంటూ చేతులు కట్టుకొని నిల్చున్నాడు.

రాజేశ్వర్రావు, జానకి ఒకరు మొహాలు ఒకరు చూసు కున్నారు. "వీడి మాట నమ్మినా, నమ్మకపోయినా మళ్ళీ ఇటికలు వేయించుకోవాలన్నది మాత్రం నిజం" అనుకున్నారు ఇద్దరు.

"సర్లే. వెంటనే అక్కరలేదు. కాని నేను కబురు పెట్టినప్పుడు మాత్రం శుభ్రమైన ఇటిక పంపించు" అన్నాడు రాజేశ్వర్రావు.

దండాలండి అమ్మగారూ, వెళ్తానండి డాక్టరుబాబు. అని విడివిడిగా ఇద్దరికీ దండాలు పెట్టి వెళ్ళిపోయేడు పకీరు.

"వీడేవంటాడు?" అంటూ ప్రకాశరావు యిచ్చిన ఏకౌంటు కాయితాలు తీసేడు రాజేశ్వర్రావు. చదువుతున్న అతని మొహంలో మారుతున్న రంగులు చూస్తూ కూర్చుంది జానకి.

చదవటం పూర్తిచేసి "హారి రాస్కేల్" అని మాత్రము అన గలిగేడు అతను కాయితాలూ జానకి చేతికిచ్చేస్తూ.

పది నిమిషాలైంది.

పావుగంటైంది.

ఇద్దరూ మాట్లాడలేదు.

పదహారో నిమిషంలో జానకే అంది "ఏం చేద్దాం" అని.

ఏమిటి చెయ్యాలో అతనూ నిర్ణయించుకోలేదు.

"న్యాయం, ధర్మం మనపక్క ఉన్నప్పటికీ మనం ఏమీ చెయ్య లేని పరిస్థితులు కొన్ని ఉంటాయి. వుయ్ ఆర్ హెల్ప్ లెస్" అన్న జగన్నాథం తండ్రి మాటలు జ్ఞాపకం వచ్చేయి రాజేశ్వర్రావుకి.

పోనీ ప్రకాశరావుని పిల్చి "పన్నులు కట్టిన రశీదులేవి? ఏమిటి నువ్వు చేయించిన రిపేరు? నిజంగా రిపేరు చేయిస్తే ఇల్లు ఈ స్థితిలో ఎందుకుంటుంది? ఏమిటి నీ ఉద్దేశం అని నిలదీస్తే?"

తియ్యొచ్చు కాని అతను ఈ ఇటికల వెధవలాగా బుకాం యించేస్తే? కనీసం ఇటికలవాడు అంతటితో ఊరుకుం టాడు. ఈ ప్రకాశరావు ఇంటింటికి వెళ్ళి "చూసేరా? ఆ జగన్నాధానికి వీసమంతైనా విశ్వాసం ఉందా? ఈ బొక్కి యింటికి బోలెడు డబ్బుపోసి పోన్లే స్నేహితుడు కదా అని ఈ ఇంటికి కుక్కలా కాపాడుతూ వుంటే నేను అబద్ధాలాడుతున్నానంటాడు. అసలు నేను కాబట్టి డబ్బు యిచ్చో, యివ్వకో ఉంటున్నాను. కాని మరోడైతే ఎదురు డబ్బిచ్చినా వుండడు. ఏదో పాత అనుబంధాన్ని బట్టిగాని లేకపోతే నాకు ఈ ఊళ్ళో ఈ మాత్రం ఇల్లు దొరక్క కాదు" అని అడిగిన వాడికీ, అడగనివాడికీ కూడా చెప్తాడు.

మరైతే అతని లెక్క ప్రకారం ఆ మూడొందలు తాంబూలంలో పెట్టి యిచ్చేసి దణ్ణం పెట్టడమేనా?

నెవర్! వీడికి లొంగిపోవడమా?

పోనీ "యిది నీకూ, జగన్నాథానికీ సంబంధించిన విషయం పోయి అతన్తోనే సంప్రదించుకో" అనేస్తే?

నయం. ఆయన సంగతి మీకు తెలీదు. "వాడితో దెబ్బలాడ్డం నాకు ఇష్టం ఉండదు. ఇన్ని వేలు తగలేసిన వాళ్ళం, మరో మూడొందలు తగలెయ్యలేకపోము. మరో యింత ఇటిక కొట్టుకు పోయిందనుకొని ఆ డబ్బు వాడి మొహానకొట్టు" అంటారు. అతన్ని కాదనడం మనకి చేతకాదు అంది జానకి.

మరేమిటి చెయ్యడం?

"ఏమీలేదు. ఏమీ తెలీనట్టు ఊరుకుందాం" అని కూడా సలహా యిచ్చింది.

ఇంకో ఉపాయం దొరికేవరకు ఈ సలహా బావున్నట్టే అని పించింది రాజేశ్వర్రావుకి.

## 24

మర్నాడు పొద్దున్న యింటికి సున్నం వెయ్యడానికి అరడజను మంది ఆడకూలీలే వచ్చేరు. జానకి వెళ్ళేసరికి వాళ్లు అలవాటు ప్రకారం చుట్టలు కాల్చుకుంటూ కబుర్లు చెప్పుకుంటున్నారు.

సున్నం వెయ్యడానికి గోడలుంటే సరిపోదు.

నిచ్చెనలుండాలి. చిన్న చిన్న బకెట్లుండాలి. చీపుర్లు ఉండాలి. ఇవన్నీ ఉండాలని జానక్కీ తెలుసు. అయితే నిన్న యిటికల గొడవలో మరిచపోయింది.

"సున్నపురాళ్ళు ఉడకెయ్యమంటారేటి?" అంది వాళ్ళలో ఒకర్తె. చీర దోపుకుంటూ.

దానికి,

నెత్తిన కుండంత కొప్పుంది.

కొప్పు చుట్టూ బుట్టెడు మల్లెపువ్వులున్నాయి.

మొహాన పావు వీశ పసుపుంది.

నుదుట నిమ్మకాయంత కుంకంబొట్టుంది.

చేతినున్న కడియం కనీసం అరమణుగు బరువుంటుంది. దానితో మొట్టిందంటే నల్లరాయి కూడా అమ్మా! అని పిలుపు లేకుండా నాలుగు ముక్కలవ్వాల్సిందే.

ఇవి కాక,

దాని మొహంలో లేత వెన్నెలు వెలుగుంది.

కళ్ళలో "ఈ ప్రపంచం అంతా నాదే" అన్న ధీమా ఉంది.

పాతికేళ్ళ వయసుంది.

ఆ వయసుకి ఉండవలసిన బిగువుంది.

దాన్ని చూసిన జానక్కి ఒక్క క్షణం కళ్ళు జిగేల్మన్నాయి.

"అందం, ఆరోగ్యం, కలిపి తయారుచేసినట్టు ఎంత బావుందీ?" అనుకున్న జానక్కి అరసెకందు అసూయ కలిగీ కలగనట్టు కలిగింది.

"సున్నం యేడ ఉడకెయ్యమంటారండి?" మళ్ళీ అడిగింది అది.

మైకం వదిలిన జానకి అదిగో ఆ పీపాలో ఉడక పెట్టండి అని చెట్టు కిందున్నపీపా చూపించింది.

థ్యాంక్ గాడ్ ఈ పీపా మాత్రం జ్ఞాపకం వుంది.

కూలీలంతా కాలుస్తున్న చుట్టల్ని ఆర్పేశారు. ఆర్పేసిన వాటిని కొంగుల్లో ముడివేసేరు. ఆ కొంగుల్ని నడుం చుట్టూ దోపేరు.

సున్నపురాళ్ళు పీపాలో పోసింది ఒక్కర్తె.

రెండు బిందెలు నీళ్లుపోసింది రెండోది.

తరువాత యిద్దరూ కలిసి "ఓలమ్మో, మోకాలమీదకు తుళ్ళు తాది" అంటూదూరంగా పారిపోయారు.

"అంత సున్నితాల సుప్పనాతులు మొగుళ్ళతో కాపరా లెలా వేస్తున్నారే?" బుగ్గలు నొక్కుకుంది మూడోది.

అలా బుగ్గలు నొక్కుకున్నదానికి బుగ్గలు లేవు. జబ్బులూ లేవు. ఎముకలమీద చర్మం కప్పిన అస్థిపంజరంలా వుంది.

నిలువునా తూస్తే ఎముకలు బరువు తీసేస్తే అరకిలో మాంసం మిగలదు.

"నువ్వు సేసినట్టే" కిచకిచమంది యిందాకటి అందం.

ఏటోలమ్మ ఈ యిరగబాటు? మనం ఈడకి పని సెయ్య డానికి ఒచ్చినావా, కిచకిచమనడానికి ఒచ్చినావా? అలా సెరు గ్గడనాగ నిలబడక పోతే ఓ గెడ పట్టుకొచ్చి సున్నం కలప కూడదేటి? సోద్దెం సూస్తన్నారు సొద్దెం. ముదల కించింది ఆ ముసిల్ది.

అందానికి ఆగ్రహం తోడొచ్చింది. "ఏదీ, గేడేదీ?" ముసి లోళ్ళకి మతులుండవు కామోసు. సేతులెట్టి కలపమంటావా? కాళ్ళెట్టి కలపమంటావా? నేకపోతే నిన్ను అందలదించుతాం. కలుపు మరి...." అంది చేతులు గాల్లో ఊపుతూ.

"ఓలె ఒల్లకోయె, ముసిల్దానితో నీకేటి? దెబ్బలాడతా కూకుంటే పన్లు అవతాయేటి?" అంటూ కసిరి గెడకోసం అన్నట్టు పెరట్లోకి వెళ్ళింది ఇంకోర్తి.

జానకి చూపు కూలీల మీదున్నా, చెవులు మాత్రం ప్రకాశ రావింట్లో వున్నాయి.

ఇవేళనుంచీ సున్నం వేస్తారు కాబోలు! హుఁ గుడ్డికన్ను తెరిచినా ఒకటే మూసినా ఒకటే అని మా తాజ్‌మహల్‌కి ఏం చేసినా ఒకటే. పైగా సామానంతా ఎత్తిపెట్టా. దించిపెట్టా, ఒడినిండా సున్నం పట్టించుకొని పిల్లలు సున్నప్పిడతల్లా తయా రౌతారు. ఏవంత తొందరొచ్చిందీ? అంటోంది ప్రకాశరావు పెళ్ళాం.

"వెయ్యనిద్దూ నీ సొమ్మేం పోయిందీ" ఎంత నెమ్మదిగా అన్నా ప్రకాశరావు మాటలు జానక్కి వినిపించకపోలేదు.

సున్నంతో పాటు వుడికిపోతోంది మనసు.

"సీపురుకట్టలొడేస్తే కుంచెలు కట్టుకుంటాం" అంటూ ఎదురుగా నిల్చుంది మరో కూలీ చీర మణుకుల మీదికి కడుతూ.

"చీపుర్లు నా ఒళ్లో వేసుక్కూర్చున్నానా? పోయి ఆ కామేశం గారింట్లో అడుగు" అంటున్న జానకిని "హలో జానకి! ఏవం టోంది నీ ఇల్లు?" అంటూ పలకరించేడు అప్పుడే వచ్చిన కామేశం.

"భక్తులు తల్చుకోగానే దేముడు ప్రత్యక్షమౌతాట్ట. నేనింకా తలుచుకోబోతుండగానే నువ్వు ప్రత్యక్షమయ్యేవు" అంది జానకి నవ్వుతూ.

"అయితే నేను దేవుడి కంటే గొప్పవాడినన్న మాట" అంటూనే చుట్టూ చూసేడు.

కామేశాన్ని చూసిన జానక్కి పోయిన సత్తువ ఒక్కసారి వచ్చినట్లయింది. కామేశం లాంటి వాళ్ళు ఎంత కష్టంలో నైనా నవ్వగలరు. నవ్వించగలరు. ఎలాంటి సమస్యనైనా విప్పగలరు.

చుట్టూ చూడ్డం అయిన తరువాత "ఫరవాలేదు. కొంచెము కష్టపడితే మనుషులు కూడా వుండగలరు. మొత్తానికి ఆడది అబల కాదని నిరూపించుకున్నావు. అన్నట్టు ఏవంటున్నారు మీ ఇంటివాళ్ళు? ఖాళీ చేస్తానంటు న్నారా? లేకపోతే చెప్పు,రేపు బలగాన్ని తీసుకొచ్చి చెంబు, చాప రోడ్డుమీద విసిరేస్తాను..." అంటున్న కామేశం జానకి సౌజ్ఞలకి ఆగేడు.

ప్రకాశరావింట్లో అందరికీ వినిపించేయి అతని మాటలు వినిపించాలనే అతని ఉద్దేశ్యం. కాని జానక్కి యిష్టం లేదు. అంచేత "ఔనుగానీ ఆవేళ కనిపించనవాడివి మళ్ళీ ఎడ్రసు లేకుండా పోయేవేమిటీ? సిమెంటుకి చాలా థ్యాంక్స్" అంటూ మాట మార్చింది.

కామేశానికి ఈ థాంక్స్‌లు, నో మెన్షన్లు నచ్చవు. "అను కోకుండా ఊరు వెళ్ళేన్లే... నువ్వు ఫార్మాలిటీస్ బాగా మెయిన్‌టైన్ చేస్తావని నాకు తెలుసు... ఈ సున్నం బెడదంతా ఎందుకు పెట్టుకున్నావు? ఎవరికైనా కాంట్రాక్టు యిచ్చేస్తేపోయేది. కొంత మందికి కావలని కష్టపడ్డం సరదా అనుకుంటాను.... ఏదో పనిలేకపోతే తోచదు. సరే కాని ఆ ఇటికల ముద్దేమిటి? సిమెంటుతో పాటు కావలసినవన్నీ చెప్తే ఒక్కసారే వేయించే వాడ్ని. అంత మొహమాటం యేమిటో నా కర్థం కాదు..."

"ఈ బాత్రూముల అయిడియా ఈ మధ్యే వచ్చిందిలే" సమ ర్థించుకుంది జానకి.

వడగళ్ళ వర్షంలా నవ్వేడతను. అతని నవ్వుకి వాకిటిలో వున్న నారింజ చెట్టు నవ్వింది.

ఇంటిమీద వాలిన కాకి నవ్వింది.

గూటిలో పిచ్చిక నవ్వింది.

నవ్వడం అయిపోయేక నువ్వేదో ఈ ఊరివాళ్ళని ఎడ్యుకేట్ చేద్దామనుకుంటున్నావేమో. ఇంపాసిబుల్ ఈ ఊరివాళ్ళకి నలుగురి మధ్య స్నానం చేస్తే తప్పు చేసినట్టుండదు. వీళ్ళకి సిగ్గు తెలీదు. మరుగు అక్కర్లేదు. శుభ్రంగా కర్రలు బొగ్గులు వేసుకుంటారు. కావాలంటే పందెం కాస్తాను. ఎంత?" కామేశం పందెం కాసేలోపున అమ్మగారూ, సీపుళ్ళు జ్ఞాపకం చేసింది యిందాకటి కూలీ.

జానకి జవాబు చెప్పే లోపున కామేశమే అందుకున్నాడు "ఒసే అమ్మీ. నీ పేరేమిటన్నావ్. పై దమ్మా సరేలే. ఏదో ఒకటి... మా ఇంటికెళ్ళి తెలీదా నన్ను తెలీకుండా ఎలా వున్నావే ఈ వూర్లో ఇన్నాళ్ళూ. అదుగో అలా తిన్నగా వెళితే కుడిచేతివైపు నాలుగో ఇల్లు. నా నేమ్‌ప్లేటు వుంటుంది. ఎందుకు జానకీ ఆ నవ్వు? ఓహో దానికి చదువురాదు కదూ... వాకిటిలో విరిగి పోయిన వేపచెట్టుంటుంది. ఆ చెట్టు తాలూకు విరగని కొమ్మని మా ఇంటిగలవాడి కూతురు ఉయ్యాల ఊగుతూ ఉంటుంది. ఆ పిల్ల పూవుకి ఎప్పుడో అప్పుడు ఆ కొమ్మ చెట్టుతో సహా విరిగి మా నెత్తిమీద పడిపోతుంది. ఆ రంభకి పెళ్ళిచెయ్యాలని వాళ్ళ నాన్న కోరిక. ఆ రంభకి మాత్రము "ఎంచక్కా వర్షం పడుతూంటే వేడి వేడి పకోడీలు తింటూ సులోచనారాణి నవల చదువుకుంటూ వుంటే అబ్బ ఎంత బావుంటుందో" అన్న కోరిక.

అన్నట్టు డాక్టరో, ఇంజనీరో తప్ప పనికిరాదట వాళ్ళ బాబుకి. అరడుగులకి అరసెంటీమీటరు తక్కువైతే పనికి రాదుట ఆ రంభకి. మరింక నీ ఎరికలో ఎవడైనా అరడుగుల కథా నాయకుడుంటే చూడు వాడి హైటే వాడి కేష్... మనమూ పిల్లలు గలవాళ్ళమే. వెక్కిరించకూడదు. గాని ఆ పిల్లకన్ను కుడికన్ను ఎడమవేపు చూస్తుంది. ఎడమకన్ను కుడివేపు చూస్తుంది. అంచేత అర్ధరాత్రి కూడా గాగుల్స్ తియ్యదు.

ఎవడి పుణ్యం పుచ్చుతుందో కాని అర్ధరాత్రి అకస్మాత్తుగా చూస్తే మాత్రము కెవ్వున కేకేస్తాడు. మొహంమీద గుడ్డ కప్పేసి కాపరం చెయ్యాల్సిందే... అబ్బబ్బ నీ చీపుళ్ళు పాడుగాను... పోయి ఆ ఉయ్యాల ఇంటిలో మా అమ్మనడుగు. మా అమ్మా తెలీదా. నువ్వు ఎక్కడ దొరికేవే నాకు? అచ్చు నాకు చీరకట్టి నట్టుంది. "ఏవండ్రోయ్ అమ్మలూ సున్నం కొంచెం చిక్కగానే రాయండి" అంటూ అక్కడున్న కుర్చీలో కూర్చున్నాడు.

చీపుళ్ళు కూలీ వెళ్ళింది.

"సీపుళ్ళు తెచ్చేవరకు మావేటి సేస్తాం?" అంటూ మిగిలిన వాళ్ళూ వరండాలో చివర్న కూర్చుని యిందాక దాచిన చుట్టలు మళ్ళీ తీసేరు.

"బాబూ ఓపాలి నిప్పుపెట్టే యిస్తావేటి?" అడిగింది అందరి లోకీ ముసిల్ది.

"నేను సిగరెట్టు కాల్చును కాని పోయి ఆ ఇంటిలో నిప్పు అడిగి తెచ్చుకో" సలహా యిచ్చేడు కామేశం ప్రకాశరావు వాటా వేపు చూపిస్తూ.

"ఓలమ్మ, ఆయమ్మనా?" ఒద్దులే బాబూ. ఏదడిగినా ఎర్రి బేపినాగ గయ్యిమంటాది. తల్లి మా లచ్చిమి ఇంటిలో వుంటే అన్నం వుండదు. ఈదిలో వుంటే నీళ్ళుండవు అంటూ చుట్ట మొలన దోపుకుంది.

"ఇంతకీ బాత్రూములకి పైకప్పు ఏం వెయ్యమంటావు? రేకులా? పెంకులా?" సలహా అడిగింది జానకి పక్కనే స్టూలు మీద కూర్చుంటూ.

"నా సలహా నిజంగా వింటావా?"

"చెప్పు"

"అసలు ఏ కప్పు వెయ్యకు. ఓపెన్ ఎయిర్ థియేటర్లా అలాగే వుంచీ, ఎండలో స్నానం చేసేరనుకో ఒత్తుకోవడం

అనవసరం. తువాళ్ళ ఖర్చుండదు. వర్షం పడుతుందనుకో నీళ్ళు పోసుకోనక్కర్లేదు. నీళ్ళ మోత వుండదు" అంటున్న కామేశం మాటలకి అక్కడున్న కూలీలంతా ఏటిబాబూ అంటూ గొల్లు మన్నారు.

జానక్కి కూడా నవ్వాగలేదు.

"పోనీ తలుపులైన పెట్టించనా?" అంది నవ్వుతూ.

"ష్యూర్, ష్యూర్ తలుపుల్లేకపోతే ఎలా? అయితే టేకు, రోజ్‌వుడ్ అంటూ కూర్చోకు" మా దగ్గర బోలెడు తారుపీపాలు కాళీవి ఉంటాయి. వాటిని రేకు చేయించి కఱ్ఱ ప్రేము వేయించు చాలు. నాకు జ్ఞాపకం చెయ్యి. లేకపోతే మరచిపోతాను. మరి వస్తాను" అంటూ వెళ్ళిపోయాడు.

"బాబు ఊసులాడతా వుంటే అస్సలు పని చేసినట్టే ఉండదు" అంది ఇందాకటి అందం.

"అంచేతే నేటి అలా కూకున్నావు పని మానేసి. లెగు, లెగు వూసుల్తో కడుపులు నిండవు" అంటూ లేపింది ముసిల్ది.

ఈలోగా చీపుళ్ళ కోసం వెళ్ళిన కూలీ తిరిగి వచ్చింది. వాళ్ళు చీపుళ్ళు కట్టుకొని సున్నం రెడీ అయేసరికి పదిగంటలు దాటిపోయింది.

"ఏకంగా సల్దులు తినేసి పనిలోకి దిగుదాం" అంటూ అందరూ సల్దులు విప్పుకున్నాడు.

"ఈవేళ అరగోడ కూడా అయేటట్టులేదు" అనుకుంది జానకి.

ఆవిడ అంచనా తప్పు.

సాయంత్రానికి అరగోడ దాటి అరగజం ఎక్కువైంది.

## 25

సున్నం ప్రారంభించి అప్పుడే రెండు రోజులైంది. ఇంకా మూడోవంతు కూడా పని కాలేదు. సున్నం వెయ్యని గోడలు చక్కగా నిగనిగలాడుతున్నాయి.

వేసినవి నల్లగా లేవు,

తెల్లగానూ లేవు.

బూడిద రంగులో వున్నాయి.

ఆ గోడలు చూసిన జానక్కి గుండె ఉసూరుమంది. యింత డబ్బు ఎలాగూ అయింది. పోనీ మరోసారి సున్నం వేయిస్తేనో?

"ఏటీయమ్మ అమాకత్వం? మసిబొగ్గుని పాలల్లో ముంచితే మాత్తరం తెల్లగా ఒస్తాదేటి? యిలా ఎయ్యగా ఎయ్యగా ఎప్పటికో తెల్లగౌతాయి" అని నిచ్చెన మీదున్న కూలీ.

"అంతవొరకు ఈ గోడలు నిలవొద్దేటి?" సందేహించింది నిచ్చెన కిందున్నది.

వాళ్ళ మాటలతో మరీ బెంగపట్టుకుంది జానక్కి. సున్నం బదులు ఏ కాషాయరంగో వేయిస్తే కొంతైనా కనిపించేది యిప్పుడు నేను సున్నం వేయించేను మొర్రో అంటే తప్పు ఎవరూ నమ్మరేమో.

ఈ లోపుగా తలుపులు చేయించినా బావుణ్ను. కామేశం తన తప్పు లేకుండా మర్నాడే పంపించేడు. ఖాళీ తారు పీపాలు. నిన్ననే కబురు చేసింది కూడాను ఎవర్నైనా కార్పెంటర్ని పంపిచమని.

అనవసరంగా చాదస్తంపడకు. సోఫాలు, డ్రెసింగ్ టేబిల్ చేసే వాడక్కరలేదు. కఱ్ఱకి మేకు కొట్టడం వచ్చినవాడైతే చాలు అన్నాడు కామేశం.

యివేళో, రేపో రావాలి వాడు.

రేపటి వరకు ఆగలేదు వాడు. వెంటనే వచ్చి ఎదురుగా నిల్చు న్నాడు. "తలుపులకి సెక్కలు బిగించాలిట. కామేశం బాబంపి నాడు" అంటూ.

చింతమానుని నిలువునా కాల్చి అలాగే అర్పేసినట్టున్నాడు వాడు.

నల్లటి మొహంలో ఎఱ్ఱటి కళ్ళు భయంకరంగా మెరు స్తున్నాయి.

మొలకి మూరెడు గుడ్డ మాత్రం ఉంది. బహుశా అది కొన్న తరువాత ఉతకలేదేమో. మైనపు గుడ్డలా ఉంది. భుజాన చిన్న గుడ్డసంచి ఉంది అందులో సుత్తి వగైరా సామాగ్రి ఉందేమో అనుకుంది జానకి. అంతేకాకుండా వాడ్ని చూసిన జానక్కి "వీడు పీకలు కోసేవాడిలా ఉన్నాడు కాని తలుపులు చేసే వాడిలా మాత్రం లేదు" అనిపించింది.

"యిప్పుడేమీ అక్కర్లేదని పంపించేస్తే?

కామేశం ఏమనుకుంటాడో?

డోన్ట్ బి సిల్లీ. మనక్కావల్సింది వాడి పని కాని అందము కాదు. మనము వాడితో వియ్యం అందుతున్నావా? అంటాడు కాబోలు.

"ఏటి అప్పన్న మావా? యిలాగొచ్చినావు? మాయప్ప నీళ్ళా డిందా? బొట్టా? బొట్టిడా? కన్నారింటికాడే ఉందా?" అంటూ పలకరించింది సున్నం కలుపుతున్న చిన్నది.

అప్పనమావ ఓసారి తలెత్తి చూసేడు.

చూసి పలకరింపుగా నవ్వేడు.

"ఓస్! సాకలీది పైడమ్మేటి? పోల్సనేదు ఏటలా అమ్మోరి పండగలో ప్రభనాగ ఎదిగిపోనావు? మీ అయ్య యింక నీకు మనువు సెయ్యడేటి? నేకపోతే సెప్పు మరి ఎగరేసుకు పోతాను" అన్నాడు నవ్వుతూనే.

సున్నం కలుపుతున్న చిన్నది చేస్తున్న పని తాత్కాలికంగా ఆపింది. ఆపి కలుపుతున్న కర్రకి అని సత్యభామలా నిల్చుంది. నిల్చుని అప్పన్న మామవేపు చూసి, "ఎదవ బుద్ధులు పోనిచ్చు కున్నావు కాదు. నానడిగిందేటి, నువు సెప్పిందేటి? మనువాడ తాట్ట మనువు. సేతా వాతా గాని వొడికిద్దరు పెళ్ళాలని" అని కర్ర తప్పున నేలకేసి కొట్టింది.

పిడుగు పడినట్టు నవ్వేడు అప్పన్న.

ఆ నవ్వుకి నిచ్చెన ఓసారి జారి మళ్ళీ సర్దుకుంది.

పీపాలో సున్నం గబగబ ఉడకడం మొదలెట్టింది.

నల్లటి మొహంలో తెల్లటి పళ్ళు పిడుగు తర్వాత మెరుపులా మెరిసాయి.

"సేతగాక పోవడవేటే సత్తిబామా. మనువైన కాడ్నించి ఏటికో యీత యీనతానే వుంది కదే మీయప్ప. బాలంత, సూలింత యిదే వొరస నువ్వో పాలి మనువాడి సూడకూడ దేటి? నీకే తెలస్తాది నచ్చకపోతే అప్పుడే ఒగ్గీ" ఏటా పోకిరి మాటలూ? అమ్మగోరున్నారన్న సూపునేదేటి? పోకిరీ ఎదవ ఏసాలు" గయ్యిమంది ఆ చిన్నది.

వాళ్ళిద్దరూ జానకి వునికిని గుర్తించకుండా చాలా హాయిగా సరసాలాడుకోవడం జానక్కి ఎబ్బెట్టుగా అనిపించింది.

తను కలుగజేసుకోకపోతే వాళ్ళిద్దరూ అలా సాయంత్రం వరకు కబుర్లు చెప్పుకోగలరు అంచేత.

"నువ్వు తలుపు చెయ్యగలవా? అల్లదుగో అక్కడున్నాయి" చూడు తారుడబ్బాలు, వాటితో రేకు తలుపులు చెయ్యాలి. అంది డబ్బాల వేపు చూపిస్తూ.

అప్పన్న భుజాన వున్న సంచి తీసి నేల పెట్టేడు. తలనున్న గుడ్డముక్క ఓసారి దులిపి మళ్ళీ చుట్టుకున్నాడు. నేలని పడిన చుట్ట ముక్కని తీసి దులిపి చెవివెనక పెట్టుకున్నాడు. తరువాత సీపాల పర్యవేక్షణకి వెళ్ళాడు.

ముందు ఆ పీపాలకి ఓ ప్రదక్షిణం చేశాడు.

తరువాత జానకివేపు చూశాడు.

రెండో ప్రదక్షిణం చేసేడు.

ఈసారి ఉడుకుతున్న సున్నం వేపు చూశాడు.

తరువాత ఆ పీపాలని కాలితో ఓసారి తన్నేడు.

చేత్తో తట్టి చూశాడు.

తిరిగివచ్చి జానక్కి కొంచెం దూరంగా నేలని కూర్చున్నాడు.

"ఏమిటంటావు?" అన్నట్టు చూసింది జానకి.

ఏమిటో చెప్పేడు అతను.

"మరండి. తమతో ఉన్నమాట సెప్పుకోవాల. కావాలంటే అమ్మగోరూ కష్టం సాల్దు అని మరో రూపాయి అడ్డుక్కోవాలా? అంతేగాని దగా సెయ్యకూడదు అన్నాడు ఉపోద్ఘాతంగా.

ఈ ఉపోద్ఘాతం జానక్కి నచ్చలేదు.

"తమకి తెల్దేటండి. ముందు రేకులన్నీ యిడగొట్టాల తుప్పంతా గోకిపారెయ్యాల. ఆనక సెక్క బిగించాల"

"ఔనోయ్ అందుకే నిన్నే పిలవడం. పీపాలా పాళంగా అడ్డుపెట్టకుంటే నువ్వేందుకు?" విసుక్కుంది జానకి.

జానకి విసుగుదల అప్పన్ననేం బాధించలేదు. తనలాంటి వాళ్ళ మాటలకి అమ్మగారిలాంటి వాళ్ళు విసుక్కోవడం అతి సహజం అన్నట్లు ఊరుకున్నాడు. తను కూర్చున్న స్థలాన్ని ఓసారి మళ్ళీ దులిపేడు. అతను ఆ, ఆలు చదువు కోలేదు. అయితే ప్రపంచాన్ని అతి క్షుణ్ణంగా చదివేడు. చదవటమే కాకుండా టీకా, తాత్పర్యంతో సహా అర్థం చేసుకున్నాడు.

అంచేత జానకి విసుగు పోవడానికి కొంత టైమివ్వదల్చు కున్నాడు.

"ఓలే! ఏలవీదిగుంటా? ఏటా రాయడం? అదేం గోడకి సున్నం అనుకున్నావా? మొకానికి పగుడరనుకున్నావా? కుసింత గట్టిగా రాయి. గోడకి నెప్పెట్టదులే" అన్నాడు సున్నం రాస్తున్న అమ్మడితో.

సున్నం రాస్తున్న అమ్మడికి సత్రుమంది. "నువ్వొచ్చిన పని సూసుకోక నీకెందుకు ఈ ఊసులన్నీ? ఆడారి సన్నాసినాగ. ఆ మొకం సూడు. అరిపేసిన సుట్టముక్కనాగ ఎలాగుంది? ఈసడించింది అమ్మడు.

వాళ్ళ సరస సంభాషణ జానక్కి నచ్చలేదు. అంచేత "యింతకీ ఏవివ్వమంటారో చెప్పలేదు నువ్వు" అంది.

బుర్ర గోక్కున్నాడు అప్పన్న. అక్కడేం తగల్లేదు నేలని చేత్తో ఏదో రాసేడు తరువాత "తమకి తెల్దేటండి"అన్నాడు.

"నాకు తెలీక్కాదు నీకు ఎంత కావాలో అడుగు. మాకు యిష్ట ముంటే చేయిస్తాం. లేకపోతే లేదు" అంది జానకి లౌక్యంగా. నిజానికి ఎంత యివ్వాలో జానక్కి తెలీదు.

"మరండి ముందు డబ్బాని రేకు సెయ్యాలా? తారంతా గోకాలా?"

వీడు క్రితం జన్మలో కథలు రాసివుండాలి. చదువొస్తే ఈ జన్మలో కూడా కార్పెంటరు కాకుండా కథకుడు అయ్యేవాడు. కాకపోతే కథ అరుపేజీలైతే, ఉపోద్ఘాతం అరవై పేజీలుండేది "బెర్నార్డ్‌షా" లాగ.

"చూడు బాబూ. నువ్వేం చేస్తావో నాకు తెలీదు. నాక్కావా ల్సినవి తలుపులు నీక్కావలసింది డబ్బు, కర్ర మేకులు వగైరా అన్నీ కలిపి చెప్పు బేరమాడకుండా ఖచ్చితంగా చెప్పు" అంది జానకి. "మరలాగైతే ఓ యాభై యిప్పించండి. కామేశంబాబు చెప్పినాడు కాని నేపోతే కిట్టదండి మరి" అన్నాడు కన్సెషను చూపెడుతున్నందుకు గర్వంగా.

జానకి బుర్ర గోక్కోలేదు కాని, చుట్టూ చూసింది. నిజానికి యాభై రూపాయలు ఎక్కువో, తక్కువో తనకి తెలీదు. కాని యిప్పుడు వీలు కాదంటే మళ్ళీ మరొడ్ని వెతకాలి. మళ్ళీ కామే శాన్ని బతిమాలాలి. యిన్ని వేలు పోగాలేనిది యింకో ఈ యాభైకి కక్కుర్తిపడ్డం అనవసరం అనుకున్న జానకి ఒప్పేసుకుంది.

"రెండు మూడు రోజుల్లో మాత్రం అయ్యేటట్లు చూడు" అంది.

అప్పన్న లేచేడు.

లేచి తలగుడ్డ తీసి ఓసారి దులిపి మళ్ళీ కట్టుకున్నాడు. తరువాత "అయ్యబాబోయ్ రేపు మాపటేలకిచ్చీనేటండీ" అని అభయం యిచ్చేడు. "మేకులవీ కొనాల అందాకా ఓ యిరవై వుంటే యిప్పించండి" అని యిరవై తీసుకొని వెళ్ళిపోయేడు.

## 26

ఇల్లు అలగ్గానే పండుగ కాదు.

సున్నం వెయ్యగాన్నే పెళ్ళీ కాదు అంటారు.

యింటి సున్నం పని పూర్తి అయింది.

దూరాన్నుంచి చూస్తే "ఈ యిల్లు కట్టిన తరువాత సున్నం మొహం ఎరుగదేమో అన్నట్లున్నా" దగ్గరకొచ్చి గోడనా నుకుని నిల్చుంటే అంటుకున్న సున్నం ఈ మధ్యనే వేశేరు అన్న నిజం చెప్తుంది.

అమ్మయ్య తేలిగ్గా నిట్టూర్చింది జానకి.

మొత్తానికి అనుకున్నది సాధించగలిగేను అని చిన్న పిసరు గర్వం కూడా కలిగింది. నిజానికి బాత్రూములు మినహా పని అంతా అయిపోయినట్టే. అవి కూడా మహా అయితే మరో మూడు .... తప్పితే నాలుగు రోజులు పట్టవచ్చును.

ఏవుంది? తనింక జెండా ఎత్తెయ్యడమే.

కాని... కాని... ఎక్కడో అపశృతి

ఔను... ప్రకాశరావు వాళ్ళు ఇళ్ళు ఖాళీ చెయ్యక పోతే యిల్లు ఎంత బాగుచేసి ఏమి లాభం? యిన్ని వేలు, యింత శ్రమ ఖర్చుపెట్టింది ఆఖర్న వాళ్ళ మొహాన కొట్టడానికా?

వాళ్ళు ఖాళీ చెయ్యనంతవరకు పని పూర్తి అయినా సరే తను కదలడానిక వీల్లేదు.

మొండివాడు రాజుకంటే బలవంతుడు.

ప్రకాశరావులాంటి వాడు భగవంతుడికంటే బలవంతుడు.

"బాబ్బాబు, మా యిల్లు మాకు యివ్వండి" అని బతిమాలినా యివ్వలేదు.

"ఖాళీ చేస్తారా? తన్నమంటారా?" అని బెదిరిస్తే బెదర లేదు.

ఎప్పుడు ఖాళీ చేస్తారో?

మాకు సరిపోయే యిల్లు దొరకితే పోక యింతోటి భవనం లోనూ ఉంటామా? ఈ పాటి బోడి కొంప దొరక్కపోదు. మంచీ చెడ్డా వుండొద్దూ? నిల్చున ఫళాన పొమ్మంటే ఎక్కడికి పోతాం? వెళ్ళేవరకు ఆగకుండా ఒకటే ఊదరగొట్టేస్తున్నారేమిటమ్మా. అంటూ సాగదీసింది ప్రకాశ రావు భార్య.

ఆవిడకంటే ఘనుడు ఆవిడ మొగుడు.

ఫో, ఫో, అనడమే కాని నాకివ్వాల్సిన డబ్బు గురించి మాట్లాడరేమి? నా డబ్బు నాకు పారేస్తే వాళ్ళ ఇల్లు వాళ్ళకి పారేస్తాను. నేను గాని గుమ్మం దిగేనంటే మరింక నా డబ్బుకి చెమ్మాడు నువ్వులే గతి. ఒకటా? రెండా? మూడొందలు. అతనేమో రాడు. యీవిడేమో నాకు తెలీదంటుంది. ఈ ముష్టి మూడొందల కోసం నేను నాలుగు వందలు ఖర్చుపెట్టుకొని వెళ్ళిరావాలా? ఏం మనుషుల్రా నాయనా?" అన్నాట్ట ప్రకాశరావు.

అంటే?

డబ్బు ఇచ్చే వరకు కదలడా?

కదలడు

పోనీ డబ్బు పారేస్తే?

"డబ్బు ఒక్కటేనా? వెండి చెంబు, పట్టుబట్టలు కూడా కావాలా? ఏమనుకుంటున్నాడు యిడియట్? ఛస్తే ఒప్పు కోను" అన్నాడు రాజేశ్వర్రావు.

మరెలా?

వాములు కొట్టుకు పోతుంటే గడ్డిపరక కోసం ఏడిచేరట అలావుంది. యిన్ని వేలు తగలెయ్యగాలేనిది యింకో మూడొందల కోసం కక్కుర్తిపడితే తను యిక్కడ ఏళ్ళ తరబడి వుండాల్సిందే.

"కక్కుర్తి కాదు, ఏ కొశ్చన్ ఆఫ్ ప్రిన్సిపుల్" అంతే అంటాడు రాజేశ్వర్రావు.

"నేనూ అంతే" అన్నాడు ప్రకాశరావు.

కరవమంటే కప్పకి కోపం.

విడవమంటే పాముకి కోపం.

"ఏదీ గతి నాకు?" అని అరవలేదు జానకి.

గప్‌చుప్‌గా ప్రకాశరావు భార్యకి డబ్బు పంపించేసింది. మా యందు దయ వుంచి వెంటనే మా యిల్లు మాకివ్వ వలసింది అన్న అభ్యర్ధనతో సహా.

రశీదు జానకి అడగలేదు.

ప్రకాశరావు యివ్వలేదు.

కాకపోతే ఆ మర్నాడు మాత్రం యిల్లు ఖాళీ చేశాడు.

ఇప్పటికైనా ఖాళీ చేసినందుకు మనసులోనే కృతజ్ఞత చెప్పుకుంది జానికి.

"దొంగరాస్కెల్. ఎవడికోసం ఖాళీ చేస్తాడు? మరో రెండ్రోజులుంటే పోలీసుల్ని పెట్టి గెంటిచేవాణ్ణి. ఒంటరి ఆడది కదా జులుం చేద్దామనుకున్నాడు. యూస్‌లెస్ ఫెలో" అంటూ నవ్వేడు రాజేశ్వర్రావు గర్వంగా.

కానీ ప్రకాశరావు ఖాళీ చెయ్యడానిక్కారణం పోలీసు భయం కాదనీ, జానకి పంపిన డబ్బునీ అతనికి తెలీదు.

"పోన్లెస్తురూ ఇప్పటికైనా పోయారు. అంతేచాలు" అంది జానకి తనకేం తెలీనట్టు.

అప్పటికి బాత్రూము గోడలు పూర్తి అయ్యేయి. అప్పుడొచ్చింది భ్రమరాంబ తమ్ముడి పెళ్ళానికి గాజులు పెట్టిస్తున్నారంటూ.

"మొత్తానికి సాధించేవు సుమా జానకీ. నేను మొదటి నుంచీ మొత్తుకుంటూనే వున్నాను మొగాడ్ని నమ్ముకొని లాభం లేదూ. ఏదో అడవాళ్ళం మనమే, అన్నీ చక్కదిద్దు కోవాలి అని. పోన్లే ఇప్పటికైనా విన్నావు అంటూ బొట్టు పెట్టి, రేపు మధ్యాహ్నం భోజనానికి అక్కడికే వచ్చి పనవ లేదంటూ కూర్చోక" అంది.

అన్నాక అక్కడున్న స్టూలు మీద కూర్చుంది.

కూర్చున్నాక ఇల్లంతా ఓసారి కలయజూసింది.

చూసేక మెచ్చుకోలుగా ఓ చిరునవ్వు నవ్వింది.

నవ్వేక సందేహంగా మొహం పెట్టి సుమారు ఎంత యిందని అడిగింది.

ఆరాలు తియ్యడం భ్రమరాంబ అలవాటు. అయితే, జవాబు సూటిగా చెప్పకపోవడం జానక్కి అలవాటు.

"చాలా వదిలింది లెండి. సందేహనివృత్తి చెయ్యలేదు" జానకి.

"ఎంత అయితేనేం యిల్లంటూ ఓ రూపుకొచ్చింది, అంతే చాలు" సంతోషించింది భ్రమరాంబ అప్పటివరకు ఏదో యథాలాపంగా మాట్లాడుతున్న జానక్కి అకస్మాత్తుగా జ్ఞాపకం వచ్చింది భ్రమరాంబ తనవూరి నుండే వచ్చిందని.

"మా వాళ్ళంతా బావున్నారా?"

భారంగా నిట్టూర్చింది భ్రమరాంబ.

"ఏం బాగులే! ఆడదిక్కులేని కొంప మీపిల్లకి వారం నుంచీ జ్వరంట. పాపం అలాగే తంటాలు పడుతోంది. అప్పటికీ

చెప్పేను మీ అమ్మకి రాయి ఓ సారి వచ్చి వెళ్తుంది అని. నువ్వే మైనా అనుకో గాని జానకీ జగన్నాథం వట్టి మొండిమనిషి సుమా. అన్నట్లు నేను చెప్పేనని చెప్పకుసుమా. ఏదో ఆడప్రాణం కనక వుండబట్టక చెప్పేను. అంతా అయిపోయినట్టే కదా! ఆ కాస్త ఎవరికైనా అప్పుచెప్పి వెళ్ళిపో" అని సలహా కూడా ఇచ్చింది.

అప్పటి వరకు తను సాధించిన విజయం అంతా నీరుగారి పోయినట్లయింది జానక్కి.

కూతుర్ని తల్చుకున్న జానక్కి కడుపులో మండినట్టయింది. ఏం అవస్థలు పడుతున్నారో ఏమిటో? అందులో ఏ ఒక్కరికి మంచినీళ్లు ముంచుకొని తాగడం చేతకాదు. వెదవ యిల్లు ఉంటే ఉంటుంది. పోతే పోతుంది. భ్రమరాంబ చెప్పినట్లు ఏ రాజేశ్వ్రరావుకో అప్పు చెప్తేస్తే సరి.

కాని అప్పగించుకొనడానికి రాజేశ్వ్రరావు ఒప్పుకోలేదు.

"చూడండి. మరీ అంత భయపడతారెందుకు. జ్వరం వస్తే మాత్రం జగన్నాథం డాక్టర్ కాదా? అవసరమ నుకుంటే వాడే రాశేవాడు. నాకు చెయ్యడం యిష్టం లేదని మాత్రం అనుకోకండి. నా యిష్టాయిష్టాలతో సంబంధం లేదు. పైవాళ్ళకి మనకున్న బాధ్యత ఎందుకుంటుంది? యిన్నాళ్ళు ఓర్చుకున్నారు. మరో రెండ్రోజులు. అంతగా కావాలంటే ఫోను చేద్దాం" అన్నాడు రాజేశ్వ్రరావు.

మనసు ఎంత పీకుతున్నా, ప్రయాణం వాయిదా వేసు కోక తప్పలేదు జానక్కి.

పుణ్యంకొద్దీ పురుషుడు, దానం కొద్దీ పిల్లలు అంటారు. పాపం కొద్దీ టెలిఫోను అని కలుపుకోవచ్చు అనుకుంది జానకి ఆ మర్నాడు అలా అనుకోవడంలో ఆవిడ తప్పేం లేదు.

తెల్లవారు ఝామునే బుక్‌చేస్తే వేగం వస్తుంది అన్న రాజేశ్వరరావు మాట ప్రకారం తెల్లవారుఝామునే లేచి జగన్నాథానికి ట్రంకాల్ బుక్ చేసింది. ఎందుకేనా మంచిదని హాస్పిటల్ నెంబరు, ఇంటి నెంబరు కూడా యిచ్చింది.

"హాలో, గుడ్‌మార్నింగ్ మేడమ్" అన్న ఆపరేటరు మేనర్సుకి ఆశ్చర్యపోయింది. మన టెలిఫోను వాళ్ళు బాగా యింప్రూవ్ అయ్యేరే అని అభినందించింది కూడా.

అయితే ఆ అభినందనని వాళ్ళు ఎక్కువకాలం నిలబెట్టు కోలేకపోయేరు.

తెల్లవారింది, ఫోను రాలేదు.

ఓసారి ఎక్చేంజిని పిల్చి అడిగింది."మా పొజిషన్ ఏమిటని?"

ఎక్చేంజి వాడు పొజిషన్ చెప్పలేదు. కాని ఎప్పుడు బుక్ చేసేరన్నాడు.

చెప్పింది జానకి.

"అర్డనరీనా? ఎక్స్‌ప్రెస్సా" చెప్పమన్నాడు.

"ఎక్స్‌ప్రెస్సేనంది" జానకి

సరే ట్రై చేస్తున్నాం. లైన్లు అంత బావున్నట్టు లేవు. వస్తే మేమే పిలుస్తాం అన్నాడు.

మధ్యాహ్నం పన్నెండైంది.

ఎవ్వరూ పిలవలేదు.

మళ్ళీ పొజిషనేమిటని అడుగుదామని ట్రంక్ ఎంక్వయిరీస్‌ని పిల్చింది.

"సారీ మేడమ్ ఆ బోర్డు చాలా బిజీగా ఉంది. ఓ పది నిమిషాలు ఆగి రింగ్ చెయ్యండని" సలహా యిచ్చేడు. పది నిమిషాల తర్వాత రాజేశ్వ్రరావు భోజనానికి వచ్చేడు. అతను జానకికేసి ఓసారి చూశాడు.

జానకి లేచి మొహం కడుక్కుని కాఫీ తాగింది, అంతే.

బాత్రూములో వుండగా ఫోను వస్తే? అంచేత స్నానం చెయ్య లేదు. స్నానం చెయ్యలేదు కాబట్టి తల దువ్వుకోలేదు. రాత్రంతా నిద్ర పోయినట్టు లేదు. మొహం అంతా పీక్కు పోయింది.

అప్పుడే జానకిని చూసిన ఎవరైనా ఈవిడ ఇప్పుడిప్పుడే టైఫాయిడ్ నుంచి కోలుకుంటోంది కాబోలు అనుకుంటారు.

ఆ పరిస్థితిలో జానకిని చూసిన రాజేశ్వరరావు జగన్నాథాన్ని మరోసారి తిట్టుకున్నాడు. తిట్టడం పూర్తి అయ్యేక తిన్నగా ఫోన్ దగ్గరికి వెళ్ళి ఫోను తీసి ఎవర్నో పిల్చేడు. "పిల్చి ఎవరయ్యా ఆపరేటరు? సత్యమా? మూర్తి ఏమయ్యేడు? నైట్ ట్యూటీనా. సరే.... సరే.... నేను డాక్టర్ రాజేశ్వరరావుని, నమస్కారం... తెల్లవారు ఝామున ఓ ట్రంక్‌కాల్ బుక్ చేశాం. అదెంతవరకు

వచ్చిందో చెప్తావా .... ఏమిటీ మెద్రాస్ నుంచి ట్రై చేస్తావా? మెద్రాస్ నుంచి కాకపోతే మాస్కో నుంచి చేసుకో. పావుగంటలో మాత్రం వచ్చేటట్టు చూడు" అంటూ ఫోను పెట్టేసి రండి, ఈ లోగా భోజనం చేద్దాం అన్నాడు.

"స్నానం...." నసిగింది జానకి.

ఫెళ్ళున్న నవ్వేడు అతను.

"మనం మడికట్టుకోవడం లేదు కాని రండి–స్నానానికి అన్నానికి ఏం సంబంధం లేదు" అంటూ బలవంతంగా లాక్కెళ్ళేడు.

"ఆఖరికి ఫోనుక్కూడా రికమండేషన్ కావాలి?" ఆశ్చర్య పోయింది జానకి అన్నం తింటూ.

అనవసరంగా ఆశ్చర్యపోకండి. అదంతా నటన, నిజంగా కాల్ వస్తే మీతోపాటు నేనూ ఆశ్చర్యపోతాను. నెంబరు నో రిప్లయి అన్నది వాళ్ల స్టాక్ జవాబు... అంటుండగా ఫోను రింగైంది.

నోట్లో పెట్టుకోబోయిన అన్నం మళ్ళీ కంచంలో పడేసి అంట చేత్తోనే పరిగెత్తింది జానకి. ఎడంచేత్తో ఎత్తుకుంది.

"ఫలానా నెంబరేనా?" అడిగింది ఎక్ఛేంజ్.

ఔనంది జానకి.

"ఫలానా ఊరు ట్రంక్‌కాల్ బుక్ చేసేరా?"

"చేసేనంది"

"ఆ నెంబరు ఫలానాదేనా?"

జానకి ఓర్పు పోయింది.

"ఔను. కనెక్షనివ్వండి" తొందర పెట్టింది.

కాని ఎక్సేంజ్ వాళ్ళకేం తొందరలేదు.

అంచేత తాపీగా "సారీమేడర్ ఆ నెంబరు నో రిప్లయి" అన్నాడు.

చేతిలో వున్న రిసీవరుని నీరసంగా రాజేశ్వర్రావుకిస్తూ "నో రిప్లయట" అంది.

రిసీవరు తీసుకున్న రాజేశ్వర్రావు నేను ముందే చెప్పలేదు అన్నట్టు నవ్వి, ఫోనులో "రెండో నెంబరు ట్రై చెయ్యవయ్యా ఒకటి హాస్పటలు, రెండోది ఇల్లు, ఏదో ఒకటి పలకాలి" అన్నాడు.

ట్రై చేసేం సార్. రెండూ నో రిప్లయి. కాన్సిల్ చేసేయ మంటారా?

"అది సరే. హాస్పిటల్లో అంతా ఒక్కసారే చచ్చిపోయేరా ఏమిటి?" నో రిప్లయి రావడానికి వీల్లేదు.

"మేమేం చేస్తాంసార్. మళ్ళీ మరోసారి ట్రై చెయ్యమంటారా?"

"ఒద్దులే కాన్సిల్ చెయ్యి"

కాన్సిలైపోయింది.

జానికి అంట చెయ్యి కడుక్కోకుండా అలాగే కూలబడి పోయింది కుర్చీలో.

అక్కడ పిల్లకెలా వుందో ఏమిటో? పోనీ జగన్నాథం ఒక ఉత్తరం రాయకూడదూ? రాయడు ఎందుకు రాస్తాడు? అక్కడికి ఆ బాధలన్నీ తనొక్కడే పడుతున్నట్టు, ఆ బాధలకి కారణం తనే అయినట్టు ఛీ! ఛీ!

మొగాళ్ళకి బుద్ధుండదు.

మొగాళ్ళకి జ్ఞానం కూడా ఉండదు.

ఇప్పుడేం చెయ్యటం? తెగించి వెళ్ళిపోతే ఇంత డబ్బు, శ్రమ వృధా. ఉందామంటే మనసొప్పడం లేదు.

జానకి మనస్సుని రాజేశ్వర్రావు బాగానే చదవగలిగేడు. అంచేత "చూడండి. ముందు లేచి భోజనం పూర్తి చెయ్యండి. బెంగ పెట్టుకొని చెయ్యగలిగిందేమీ లేదు. రిప్లయి పెయిడ్ టెలిగ్రాం యిద్దాం. తెల్లారేసరికి రిప్లయి వస్తుంది లేవండి" అని ఓదార్చేడు.

అయినా జానక్కి అన్నం సహించలేదు.

చెయ్యి కడుక్కొని వచ్చి కూర్చుంది. మళ్ళీ పిల్ల గురించి ఆలోచించే లోపల వచ్చేడు అప్పన్న.

"తలుపులు అట్టుకొచ్చి ఏజామైందండి. తమరుగోరు ఒస్తారేటోనని ఈ పొద్దు దాకా కూకున్నాను. తమరో పాలి ఒస్తారేటి"

ఇష్టం లేకపోయినా బయలుదేరింది జానకి.

ఆవేళ పెద్ద పన్లేం లేకపోయినా ఓ యిద్దరు కూలీలు గదుల్లో పడిన సున్నం మరకలు కడుగుతున్నారు.

తలుపులు చూపించేడు అప్పన్న.

తెల్లబోయింది జానకి.

గొల్లుమన్నారు కూలీలు.

"ఏటి అప్పన్న మావాఁ. నువ్వు సేసినవి తలుపులా? పడ వలా?" అది ఒకర్తె చేతులు తిప్పుకుంటూ.

"సేసిన పని సుబ్బరం గుండాల, సేతగాపోతే ఒల్లకుం డాల గాని ఏటీ ఎదవ పనీ?" నిలదీసింది రెండోది.

జానకి మాట్లాడలేదు.

ఆ కూలీలు అబద్ధం చెప్పలేదు. అవి అచ్చు పడవల్లాగే ఉన్నాయి.

"మీరొల్లకొండె. నాను సెప్పుకుంతాను. అమ్మగారు ముంగల నాను సెప్పేది యినుకోండి. అనక నాది అబద్ధం అయితే తిట్టండి. ఆయేల యీడ నుంచి ఎల్లేనా? అంతే మరింక నెగనేదు. పడవలా పడిపోనాను. జెబ్బు సెయిస్సి నాది. నా బెంగంతా నా జెబ్బు కోసం కాదు. అయ్యో. అమ్మగారికి మాటిచ్చినానే. ఎలారా భగమంతుడా అని ఒకటే యిద్దైపోనాను. అదుగో, అ టయిములో భగమంతుడినాగే ఒచ్చినాడండి నా బామ్మర్ది. కాని ఆడు మా గీరగాడండి. నాడు సెయ్యనుగాక సెయ్యనన్నాడండి. కాని నాది మాటంటే మాటే. మరింక తిరుగులేదు. అంచేత ఆ బామ్మర్దిగాడ్ని బతిమిలాడి మరో అయిదు రూపాయలు ఎక్కు విచ్చ సేయిచ్చినాను, కానైతే నాకు నచ్చనేదండి..."

"అదన్నమాట కత. ఏటా మా అప్పన్న మామ యిలాంటి పన్జేచి నాడూ అనుకున్నాను. అయితే నువ్వు కాదన్న మాట" అంది మొదటిది.

"అంతే అయ్యుంటాదండి. నేపోతే అలాటోడు కాదు" అంది రెండోది.

మొత్తానికి ఆ ఇద్దరూ తలుపులు పడవలవడానిక్కారణం అప్పన్న కాదని తేల్చేశారు.

జానకి ఏం మాట్లాడలేదు.

"తమరు గోరు ఒప్పుకుంటే మళ్ళీ అట్టుకెల్లి సేసుకొత్తాను. మరి... మేకులు అయి కొత్తయి కొనాల మరో ఇరవై రూపాయి లౌతాది" అన్నాడు అప్పన్న.

అసలే పొద్దుటి నుంచి ఫోను వ్యవహారంతో చికాగ్గా వున్న జానకి ఈ తలుపుల వ్యవహారంతో మరీ చికాకెత్తి పోయింది.

తలుపులూ లేవు. ఏం లేవు.

"ఫో" అంటే.

వాడికేం నష్టం?

అనొచ్చు.

కాని బాత్రూములకి తలుపుల్లేకపోతే ఎవరు అద్దెకు వస్తారు?

మరింక లొంగక తప్పలేదు.

"సరేతీసికెళ్ళి జాగ్రత్తగా చేసుకురా. రేపు సాయంత్రం తేవాలి" అంది.

జానకి దగ్గర మరో ముప్ఫై రూపాయలూ, పడవలూ తీసుకొని వెళ్ళిపోయేడు అప్పన్న.

## 28

తప్పులు అందరూ చేస్తారు.

పశ్చాత్తాపం కొందరికే ఉంటుంది.

ఆ కొందరిలో ఆడవాళ్ళ శాతం ఎక్కువేమో.

ఏదో కోపం ఆపుకోలేక పిల్లని ఓ దెబ్బ వేసిన తల్లి ఛీ, ఛీ పాపిష్టిదాన్ని ఎంత దెబ్బ కొట్టేనో పిచ్చి వెధవని. వెధవ కోపం ఆపుకోలేకపోయేను. పిల్లలు అల్లరి చెయ్యకపోతే పెద్దవాళ్లు చేస్తారా? అంటూ మళ్ళీ మరోటి వచ్చేవరకు అలా తనలో తనే మధనపడుతుంది. అదే తండ్రి అయితే "దొంగవెధవని మరో రెండు తగల్నివ్వాల్సింది. నేను మంచివాడ్ని కాబట్టి యిక్కడితో ఆగేను" అని మరో రెండు తగల్నివ్వని తన మంచి తనాన్ని తనే అభినందించుకొని మరుక్షణం మరిచిపోతాడు.

అలాగే మొగుడితో పొరపాటున దెబ్బలాడిన్నాదు ఛీ, ఛీ పాపిష్టిదాన్ని అనవసరంగా రెచ్చగొట్టాను. పగలంతా చచ్చి, చచ్చి ఇంటికొస్తే ఆ మాత్రం కోపం కూడా ఓర్చుకోలే లేక పోయేను. పెట్టి పోషించే మగాడికి ఆ మాత్రం తిట్టే హక్కు వుండదా? నాబుద్ధి ఏమైంది? అని చెప్పడం కోసం కాసు క్కూర్చుంటుంది. అదే పెళ్ళాంతో దెబ్బలాడిన వాడు "ఛ! ఛ!

యిది యిల్లుకాదు నరకం. ఇలాంటి యింట్లో మరో మొగాడైతే ఈ పాటికి పిచ్చెక్కి పిచ్చాసుపత్రికి పోతాడు. లేకపోతే సన్యాసులలో కలిసిపోతాడు. నేను కాబట్టి ఈ రెండూ చెయ్యకుండా ఎంత విసిగించినా మళ్ళీ కొంపకి చేరుకుంటున్నాను" అని తన ఓర్పుకి తనే సంతోషించి ఏ హోటల్లోనో అన్నం తినేసి అర్ధరాత్రి యింటికి వచ్చి పెళ్ళాం చెప్పిన క్షమాపణల్ని అతి గ్రేస్ ఫుల్‌గా స్వీకరించి పడుకుంటాడు.

జానకి కూడా ఆడదే కాబట్టి దేనికీ అతీతురాలు కాదు. భ్రమరాంబ వచ్చి పిల్లకి ఒంట్లో బావులేదని చెప్పిన దగ్గర్నుంచి "ఛీ, ఛీ, అసలు తప్పంతా నాదే. వెధవ యిల్లు ఇది బాగుపడ్డం ఏమిటి? జగన్నాధం చిలక్కి చెప్పినట్టు చెప్తూనే ఉన్నాడు ఒద్దూ అని. విన్నదా? ఎందుకు వింటుందీ? శని నెత్తిమీద తాండవం చేస్తుంటే. ఎంత డబ్బు అయింది? ఎంత శ్రమ? తీరా ఆ వచ్చే అద్దెలు చేసిన అప్పుకి వడ్డీకైనా వస్తాయో రావో? ఎందుకు చేసినట్టు యింత అప్పు. అన్నట్టు అప్పు అంటే జ్ఞాపకం వచ్చింది యింక తన చేతిలో రూపాయి కూడా లేదు. చెప్పుకుంటే సిగ్గు కూడాను. పొద్దున అతను ఫోనోగ్రాము యివ్వబట్టి సరిపోయింది గాని లేకపోతే టెలిగ్రాము క్కూడా డబ్బులేదు. అప్పటికే జగన్నాధంలో ఎన్నోసార్లు చెప్పింది, ఎంతో బతిమాలింది. డబ్బు నువ్వే తీసుకో అని. ఉహు! వింటే అతను జగన్నాధం ఎందుకు అవుతాడు. అతనికేనా మొహమాటం ఉన్నది? యిప్పుడు రాజేశ్వరావుని ఎలా అడగటం? అడక్కపోతే అతనికెలా తెలుస్తుంది. బుద్ధి గడ్డితిని యిందులోకి దిగేను. అని గట్టిగా చెంపలేసుకుంది.

అయితే లెంపలేసుకున్నంత మాత్రాన సమస్యలు తీరవు. ఏమి చెయ్యాలో తోచలేదు జానక్కి. రాజేశ్వర్రావుని ఎదురుగా నిల్చుని అడగటం అసంభవం మరి... కాంపౌండరు చేత కబురు చేస్తే?

తన యింటి విషయాలు వాడికి తెలియటం అనవసరం. మరింక ఎలా?

ఏవుంది, చిన్న చీటి రాస్తే సరి.

కాని అతనా చీటిని చూసినప్పుడు తను అక్కడ వుండడం బావుండదు.

"కొంచెం డబ్బు సర్దగలరా?" అన్న చీటిని హాల్లో రేడియో మీద పెట్టి అది ఎగిరిపోకుండా ఓ పుస్తకం పైన పెట్టి తన యింటికి బైల్దేరింది. అవసరం లేకపోయినా అతనా చీటి చూడడేమోనన్న భయం అక్కర్లేదు.

అతను సాయంత్రం యింటికి వచ్చినప్పుడు కాఫీ తాగుతూ రేడియో వింటాడు.

ఔను. రాజేశ్వరావు రాగానే ఆ కాయితం చూశేడు.

చూసి నవ్వుకున్నాడు. జానకి మొహమాటానికి.

తరువాత బాధపడ్డాడు. ఆవిడ అడిగేవరకు తను యివ్వనందుకు.

వెంటనే "తల్లి చేతికి మూడువేలిచ్చి అమ్మా జానకిగారొస్తే తీసుకోమను" అని యిచ్చేడు.

అక్కడ, జానకి యింటి దగ్గరకి వెళ్ళేసరికి లోపల్నించి పెద్ద పెద్ద కేకలు, వినిపిస్తున్నాయి ఏమిటా కేకలు?

కొంపదీసి గోడలు పడిపోలేదు కదా!

లేదు. గోడలు బాగానే ఉన్నాయి.

ఓ గోడమీద ఆటోకాలు యిటోకాలు వేసి నడుం మీద చేతులేసుకొని కూర్చుని వుంది ఓ కూలీ. ఏటయ్యా అలాగిద్దై పోతన్నావ్? అదేం కుళ్లు కాలవా? నేకపోతే గంగానదా? పొద్దు టేల్నించి తలతెగిన కోడిలా గింజుకుంటున్నావ్? మా అమ్మగార్ని రానీ అయమ్మే చెప్తాది అంటోంది మధ్యలో కాలుస్తున్న చుట్టు నోట్లోంచి తీసి తుప్పున ఉమ్ముతూ.

గోడవతల నిల్చున్న నాయుడు గద యింటిలో మరిచి పోయిన కంసుడిలా ఉన్నాడు. గద బదులు చేతిలో ఒక చిన్న కర్ర ఉంది.

"ఏం చేస్తుందే మీ అమ్మగారొస్తే? తలతీసి మొలేస్తుందా? చేసింది తప్పు కాకుండా ఏమిటే ఆ సావంతం. ఈ యిల్లు నీదా? నీకెందుకు మధ్య. రంకెలేస్తున్నావు రంకెలు. రానీ ఆవిడ్నే అడుగుతాను" అంటూ చిందులు తొక్కుతున్నాడు.

అంతవరకు గోడమీద అటోకాలూ, యిటోకాలు వేసుక్కూర్చున్న ఆ గూలీ గబుక్కున లేచి గోడమీద నిల్చుంది. "ఏమయ్యోయ్? పెదనాయుడ్నని పెట్రేగిపోకు. రంకెలు, గింకెలు అన్నావంటే కాలువలోనే కప్పెట్టేగల్ను. ఒసే గిసే అంటున్నావ్,

నానేటి నీ పెళ్ళాన్నా, నేకపోతే నువ్వు రోజూ మాపిటేలకి ఎల్తావే పంతులీది పారిజాతం కొంపకి? దాన్ననుకున్నావా? అసలేటి నీ బుకాయింపు? అసలేంటి అని? మొగోడివని ఒల్లకుంటున్నాను కాని నేకపోతేనా...” ఆరిపోయిన చుట్టని అలాగే వెలిగించుకోవడానికి ఆగింది.

ఆఫ్టరాల్ ఒక ఆడది – అందులోను కూలిపని చేసుకునేది – తన ముందు కూర్చోడానికి అర్హత లేనిది – తనంతటి పెద్ద నాయుడ్ని పట్టుకొని అంతమాటంటుందా? నాయుడిలోని మొగాడి క్రోపం వచ్చేసింది.

అతను కోపంతో ఊగేడు.

అమ్మవారు పూనిన వాడిలా ఊగిపోతున్నాడు.

కోపం వల్ల మాట సరిగ్గా రావడం లేదు.

“ఏమిటే కూస్తున్నావ్? ... నిన్ను... నిన్ను”

“మొగోడివంటే గెంతుతావేంటి? కావా ఏటి?” కిసుక్కుమంది అక్కడే నిల్చుని ఈ చోద్యం చూస్తున్న చిన్నది.

“దాని వెక్కిరింపుకి నాయుడిలోని నాయుడితనం దెబ్బతింది. మిమ్మల్నిద్దర్నీ ... యివాళ ... ఇక్కడే” అంటూ చేతిలో కర్ర ఎత్తేడు. ఈ లోగా లాంగ్‌షాటలో జానకిని చూసి ఎత్తిన కర్ర దించేసి నిల్చున్నాడు.

గోడమీద నిల్చుని, యుద్ధం చేస్తున్న సత్యభామ కూడా జానకిని చూసి గబుక్కున గోడ గెంతేసింది.

విషయం తెలీదు కాని యుద్ధం జరుగుతోందని తెలుసు జానక్కి. అంచేత ఏమిటే గోల? మిమ్మల్ని నేనిక్కడ డబ్బు లిచ్చి పెట్టుకున్నది గోడలు తడపడానికా, గోడలు ఎక్కడానికా? పొండి, పొండి అని విసుక్కున్నది.

“ఏటండి, మమ్మల్నసలు తడపనిస్తన్నాడేటి ఈ బాబు. జాము పొద్దయింది ఒకటే గోలండి. మరండి, ఈ తానాల కొట్టులో నీళ్ళు ఆళ్ళ కుళ్ళు కాలవలో కలుత్తాయటండి. అలా గెల్లడానికీ ల్లేదట. అయీ కుళ్ళు నీళ్ళే, యియ్యీ కుళ్ళు నీళ్ళే. రొండూ కలిసి రోడ్డుమీదికి పోతాయి. మద్దన నీకేటి బాధ అంటేయి నిపించుకోడండి. మామేటి చేస్తాం?” అంటూ యుద్ధ కారణం వివరించింది సత్యభామ.

“ఔను, మీ నీళ్ళు మా కాలువలోనికి రావడానికి వీల్లేదు” వాళ్ళు చెప్పింది నిజమేనన్నాడు నాయుడు.

అసలు సంగతి....

జానకి కట్టించిన బాత్రూముల్లో నీళ్ళు ఎటు వదిలినా వాకిట్లోకి వచ్చేసి ఇల్లంతా హిందూ మహాసముద్రం అయిపోతుంది నాయుడింటికి, తనింటికి మధ్య హద్దుగోడ నానుకునే వాళ్ళ కాలువ ఉంది. ఆ గోడ తనే పెట్టించింది. మా బాత్రూముల్లో నీరు కూడా అందులోకే మళ్ళించేస్తే సరిపోతుంది అనుకుంది జానకి.

అదే – అతని బాధ కూడా అదే.

తనతో చెప్పి తన పర్మిషన్ తీసుకోనందుకు అతని అహం దెబ్బతిన్నది. అందుకే ఈ రభస.

“చూడండి నాయుడు గారూ. మీతో చెప్పకపోవడం పొరపాటే. చెబ్దామనే అనుకున్నాను కాని మీరు కనిపించలేదు. యివతల పని ఆగిపోతుంది. అంచేత తరువాత చెప్పొచ్చులే అనుకున్నాను. ఇంతకీ వాటి వల్ల మీకే యిబ్బంది వుండదు. మీ కాలవలో కలిసి రోడ్డుమీదికి పోతాయి. అటు మానేసి యిట్నుంచి రోడ్డు మీదికి పంపాలంటే ఓ ఫర్లాంగు సొరంగం తవ్వాలి. అని సంజీయిషీ చెప్పింది” జానకి.

జానికి సంజాయిషీతో అతనికి నిజం కనిపించినా వెంటనే ఒప్పుకోవడం ఇష్టం లేకపోయింది నాయుడికి. అంచేత.

“ఎవరి కాలవ హక్కు వాళ్ళదే కదా. ఒకరి మురుగునీరు ఇంకోరి ఇంటిలోకి వస్తే ఎవరూరుకుంటారు?” అన్నాడు మరి కొంచెం బతిమాలించుకోవాలని.

కాని జానకి బతిమాలలేదు. నాయుడి నోరు ఎలా మూయించాలో ఆవిడికి తెలుసు. కాకపోతే పెద్ద మనిషి తరహాలో పోదామనుకుంది. కాని అతను ఆ పెద్దరికం నిలబెట్టుకోలేదు. మరింక తురుపాసు కొట్టాల్సిందే.

చూడండి నాయుడుగారూ! హక్కులు గురించి మాట్లాడితే చాలా మాట్లాడాలి. సంవత్సరాల తరబడి మా పెరట్లో మీ గెదెల్ని కట్టే హక్కు మీకెవరిచ్చారు? పెరట్లో పొడవునా గజం

స్థలం మీరు కలుపుకునే హక్కు మీకెకవరిచ్చేరు? ఏదైనా సరిపెట్టుకోవటంలో గొప్పతనం వుంటుంది కాని ప్రతిదానికీ పిలకలు పట్టుకోవడం ఎవరికీ మంచిది కాదు. మీకిష్టం లేకపోతే ఆ తూములు మూయించేస్తారు. ఆ గోడకైనా డబ్బు యిచ్చే యండి" అంది కొంచెం గట్టిగానే. ఈ ఎదురు ఎటాక్‌కి నాయుడు సిద్ధంగా లేడు. పైగా ఆ గోడకి డబ్బు యివ్వడం అతనికి ఎంతమాత్రం ఇష్టం లేదు. అంచేత "సర్లేండి అయిందేదో అయింది" అని ఇంటిలోకి వెళ్ళిపోయాడు.

ఆ తరువాత జానకి కూలీలని పిల్చి ఎవర్రా ఏదైనా తగూ వొస్తే నాతో చెప్పండి కాని మీ ఇష్టం వచ్చినట్టు మాట్లాడకండి. వెధవ కుక్క జెట్టీలు మీరూను అని తిట్టి ఈ పాటికి రాజేశ్వర్రావు కాఫీ త్రాగి వెళ్ళిపోయి వుంటాడని నిర్ధారించుకున్నాక ఇంటికి బయల్దేరింది.

## 29

ఔను. జానకి అంచనా రైటే.

జానకి యిల్లు చేరేసరికి రాజేశ్వర్రావు అస్పత్రికి వెళ్ళిపోయేడు. అతనా చీటీ చూశేడో లేదో?

తను పెట్టిన చోట లేదు. కాబట్టి చూశే ఉంటారు.

మరి డబ్బు మాట ఏం చేశాడో?

"ఇదుగోనమ్మా అబ్బాయి నీకిమ్మన్నాడు" అంటూ డబ్బుతో పాటు అంతకుముందే వచ్చిన జగన్నాథం టెలిగ్రాం కూడా యిచ్చింది రాజేశ్వర్రావు తల్లి.

అల్‌వెల్. డోన్టు వర్రీ ఇది టెలిగ్రాం సారాంశం.

అమ్మయ్య అని ఒక్క క్షణం ఊపిరి పీల్చుకుంది. మరుక్షనం పెనుభూతం లాంటి అనుమానం. తనుభయపడి పారిపోయి వచ్చేస్తుందోమోనని అలా ఇచ్చేడేమో! ఒకవేళ నిజంగా పిల్లకి తగ్గలేదేమో! అయినా బుద్ధి, బుర్ర లేకపోవడం కాని వివరంగా ఓ ఉత్తరం రాస్తేనేం? పోనీ పిల్లలైనా రాయొచ్చు అయ్యో! అమ్మ భయపడుతుందే అన్న యింగిత జ్ఞానం వుండొద్దూ.

హయ్యో! రామ! అదే వుంటే వాళ్ళు జగన్నాథం పిల్లలెలా అవుతారు? పైగా జ్వరం వచ్చినంత మాత్రాన ఏమైపోతాం? అమ్మది మరీచాదస్తము అని తండ్రి, పిల్లలు కలిసి జెమిలి నవ్వులు.

పిల్లకి ఒంట్లో బావులేదని తెలిసి బాధపడ్డం చాదస్తవాఁ? ఎవరెలా పోయినా నాకేం అన్నట్టుంటే మోడర్నిజం? తనింకా అంత మోడర్న్ కాలేదు. కాదల్చుకోలేదు. ఇంతకీ ఈ జగన్నాథం టెలిగ్రాం ఎంతవరకు నిజమో? తను బెంగ పెట్టుకొనే మెంటాలిటీ కాబట్టి అలా యిచ్చేడేమో? అతనలాంటివాడే.

అందుకే ఆ రోజు రాత్రి భోజనాల దగ్గర రాజేశ్వర్రావు అమ్మయ్య. యిప్పటికి మీ మనసు కుదుట పడిందన్న మాట అన్నప్పుడు.

"ఏమిటీ? నాకాయనమాట మీద నమ్మకం లేదండీ. నేను బాధపడ్తానని అలా ఇచ్చి వుంటారేమో..." అంటున్న జానకి మాటలు అతను అన్నం తింటూ వింటున్నాడు ఆలోచిస్తు న్నాడు.

ఎంత దౌర్భాగ్యం?

కట్టకున్న పెళ్ళాం నమ్మకం పోగొట్టుకోవడం కంటే మొగాడికి దౌర్భాగ్యం యింకేం ఉంటుంది.

దానిక్కారణం?

మొగాడా? ఆడదా?

నిజానికి ప్రతి ఆడది తన మొగుడ్ని గుడ్డిగా నమ్ముతుంది. తన మొగుడంత గొప్పవాడు, తెలివైన వాడు శ్రీరామచంద్రుడు మరెక్కడా లేడనుకుంటుంది. సాధారణంగా ఏ ఆడదీ తన మొగుడి మీద ఈగ కాదు కదా కనీసం దోమ పిల్లని కూడా వాలనివ్వదు.

అంతటి నమ్మకాన్ని పోగొట్టుకున్న తప్పు నిశ్చయంగా, మొగాడిదేనని చెప్పక తప్పదేమో! మాటవరసకి రాత్రంతా స్నేహితుల్తో పేకాడి తెల్లారి యింటికి వచ్చిన మొగుడు "అబ్బబ్బ? ఇది ఉద్యోగమా? బానిసత్వమా? రాత్రీ లేదు, పగలూ లేదు. వెధవ డ్యూటీ. అయినా ఈ మధ్య మా బాస్ మరీ రావణాసురుడైపోతున్నాడు" అంటాడు పరమ విసుగు మొహం పెట్టి.

అప్పుడా సతీమణి ఏవంటుంది?

ఏమీ అనదు. నిజం తెలీక్కాదు.

కేవలం మొగుడి గొప్పతనం నిలపడం కోసం.

వాడి వీక్‌నెస్‌కి ఆవిడకి జాలేస్తుంది.

వాడి అబద్ధాలకి కోపమూ వస్తుంది.

అయితే మాత్రం? కట్టుకున్న వాడు కదా!

అంచేత కేవలం ఒక జాలితో కూడిన చిరునవ్వు నవ్వుతుంది.

అలాకాకుండా "రాత్రి ఫ్రెండ్సంతా కలిసి పేకాడుతూ కూర్చు న్నాము. టైము తెలీలేదు సుమా" అని చక్కగా నిజంతో కలిపిన ఎపోలజీ చెప్పేస్తే.

కాని చెప్పడు.

మొగ అహం చెప్పనివ్వదు.

పోనీ కొంచెం గడుసుపిల్ల, పెంకి పెళ్ళాం సరదాకో, సర సానికో "యింతకీ ఏ మాత్రం పోయిందేమిటీ? అంటుందే అనుకుందాం. అప్పుడతను మొత్తానికి తెలివైనదానివే" అని నవ్వి ఊరుకుంటే?

అలా ఊరుకోవడం అతని మొగుడరికానికే దెబ్బ.

ఔను నా ఇష్టం ఆడగడానికి నువ్వెవరు? ప్రతీది నీతో చెప్పి చెయ్యాల్సిన అవసరం నాకేంలేదు. అంటూ హక్కులు లేవ దీస్తాడు.

మొగుడు, పెళ్ళాల మధ్య వుండాల్సినవి హక్కులు. వాటి కోసం పోరాటాలు కాదు. సామరస్యం, నమ్మకం ఈ రెండు వున్న నాడు ప్రేమ, అభిమానం వాటంతట అవే వస్తాయి. అవి లేని సంసారాలు ఎన్నేళ్ళు కాపరం చేసినా అవి యుద్ధరంగాలే.

ఇంతకీ జగన్నాథం హక్కుల మనిషి కాదు. అయినా జానకి అతన్ని నమ్మలేకపోతోందంటే... జగన్నాథం విషయంలో నమ్మకం పోగొట్టుకోవడానిక్కారణం అహంకారం కాదు. అతి మంచితనం.

"యిదీ పరిస్థితి. నువ్వు అనవసరంగా గాభరాపడకు. మేము ఎలాగో మేనేజ్ చేస్తాం" అని అతను అనివుంటే?

కాని అతనలా అనడు.

"నిజం చెప్పి ఆవిడ్ని బాధపెట్టడం నాకిష్టం లేదు" అంటాడు.

అయితే పలితం యిక్కడా ఒకటే.

ఏమిటో వెధవ సంసారాలు. జీవితమంతా కలిసి బతికినా ఒకర్నొకరు నమ్మకపోతే ఆ తప్పు నిశ్చయంగా మగాడిదే.

అతి తెలివికి పోయి కొందరు, అహంకారం వల్ల కొందరు ఆడదాన్ని ఫూల్ చేద్దామనుకుంటారు.

చివరికి వాళ్లే ఫూల్ ఔతారు.

"దౌర్భాగ్యం" గట్టిగానే అనేశాడు.

"ఏమిటి?" అంది తెల్లబోయిన జానకి.

తన ఆలోచనలన్నీ ఆవిడకి తెలిస్తే?

ఛీ. ఛీ ఎంత అసహ్యంగా ఉంటుంది?

అంచేత "ఏం లేదు. ఏం లేదు" అన్నాడు తలవంచుకొని.

తన ఆలోచలన్నీ రాజేశ్వర్రావుకి తెలియడం జానక్కి యిష్టం లేదు. అంచేత "నేను..." అని ఆగిపోయింది.

ఆవిడ ఏమి చెప్పబోతోందో తెలీనంత అమాయకుడు కాదు రాజేశ్వర్రావు.

ఏమిటన్నట్టు చూశేడు.

అమ్మాయి పిల్లలకోసం బెంగపెట్టుకుందిరా. ఏంతైనా తల్లి ప్రాణం మొగాడికేం. ఎన్ని కబుర్లయినా చెప్తాడు. ఇంటిపనంతా అయి పోయినట్టేకదా. ఒకటీ, అరా ఉంటే మనం చూద్దాంలే. అమ్మాయిని పంపే ఏర్పాటు చెయ్యి. అంది కూరవడ్డిస్తున్న రాజేశ్వర్రావు తల్లి.

అమ్మయ్య! ఎంత సులువుగా తేల్చేసింది ఈవిడ.

"థ్యాంక్యు, థ్యాంక్యు" అనుకుంది జానకి.

నిశ్శబ్దంగా అన్నం తింటున్న జానకిని చూసి నవ్వు కున్నాడు రాజేశ్వర్రావు.

ఎంత చదువుకున్నా ఆడది అడదే కదా!

"ఎప్పుడు వెళదామనుకుంటున్నారు?"

"టికెట్ రిజర్వ్ అవ్వాలి కదా" అంది తనదేం అలశ్యం లేనట్టు. ఆలశ్యం అంతా టికెట్‌దే అయినట్టు.

"రిజర్వేషన్ గురించి మీరేం భయపడనక్కర్లేదు. నా ఫ్రెండు ఒకడు టి.సి.గా ఉన్నాడు. ఫోన్ చేస్తే చాలు"

"అయితే రేపు వెళ్ళిపోతాను"

## 29

ఆ ఊరు వచ్చినప్పుడు పడినన్ని కష్టాలు వెళ్తున్నప్పుడు పడలేదు జానకి. స్టేషను వరకూ కార్లో పంపించేడు రాజేశ్వ ర్రావు, బస్సు బాధ లేకుండా. ట్రైన్‌లో రిజర్వేషను దొరకడం వల్ల ప్రయాణం హాయిగానే ఉంది.

ముందుగానే రాజేశ్వర్రావు ఫోను అందిన జగన్నాథం స్టేషనుకి వచ్చేడు. చాలా రోజుల తరువాత జానకిని చూసిన

అంతనికి సంతోషానికి బదులు బాధతో మూలిగింది అతని గుండె జానకి అవతారం చూడగానే. ఈ రెండు నెలలకి ఆవిడ వయస్సు యిరవై ఏళ్ళు పెరిగినట్టయింది.

మొహం అంతా పీక్కుపోయింది.

పచ్చగా వుండే మనిషి నల్లగా అప్పుడే ఆర్పిన పొయ్యిలో కర్రలా ఉంది.

యింతకీ జబ్బు చేసింది నీకా? నీ కూతురికా? అని పైకి అన్నాడేకాని జానకిని చూసిన అతనికి డాక్టరైనప్పటికీ భయం వేసింది. ఈవిడ మళ్ళీ మామూలు మనిషి అవడానికి ఎంత బాధపడాలో అని.

"మొత్తానికి సాధించేవు. కంగ్రాట్స్ అన్నాడు" అతనే. "థాంక్స్" చెప్పలేదు జానకి.

"మరేమిటనుకున్నావ్?" అన్నట్టు కళ్ళెగరేసింది.

తల్లిని చూసిన పిల్లలు సంతోషంతో గెంతేరు.

జానకి వచ్చిన వారానికి, రాజేశ్వర్రావు దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. "పని పూర్తి అయింది" "టులెట్ బోర్డు" కూడా పెట్టేం అని.

"హమ్మయ్య" అనుకుంది జానకి.

ఎన్నో నెలల తరువాత ఆవేళ హాయిగా నిద్ర పోయింది కూడా.

ఒక నెల గడిచింది.

రాజేశ్వర్రావు దగ్గర్నుంచి ఉత్తరం లేదు.

వాడికి నీ యిల్లొక్కటే వ్యాపకం అనుకున్నావా? తీరిక వుండొద్దా? వాడే రాస్తాడులే అన్న జగన్నాధం జవాబు కొంత ఊరడించింది జానకిని.

మరో నెల గడిచింది.

ఏ ఉత్తరం లేదు రాజేశ్వర్రావు దగ్గర్నుంచి.

"అసలా ఊర్లో ఒక్క గంట కూడా యిల్లు ఖాళీగా వుండదు. నేను రిపేరు చేయిస్తున్నప్పుడే వచ్చేరు. బోలెడు మంది యిన్నాళ్ళు ఎవరూ రాకుండా వుంటారా?" అని భయపడింది జానకి.

"చూడూ. యిన్నాళ్ళూ మనం ఆ ఇంటి మీద వచ్చే డబ్బుతోనే బతికేవా ఏమిటి? అనవసరంగా బాధపడకు" అన్న జగన్నాధం మాటలు ఈసారి జానకిని ఊరుకో బెట్టలేదు.

ఆర్నెల్లైంది.

ఏ ఉత్తరం లేదు కాని భ్రమరాంబ వచ్చింది. తమ్ముడి పెళ్ళాం పురుటికి స్వంత ఊరు వెళ్ళిందట. రావడమే హడావిడిగా వచ్చింది. వస్తూనే "మీ ఆయన లేడా?" అంది ఆతృతగా.

"ఎవరికైనా ఒంట్లో బావులేదా?" అడిగింది జానకి ఆవిడ ఆతృత చూసి.

జానకి ప్రశ్నకి జవాబు చెప్పకుండా కుర్చీలో కూర్చుంది ఆవిడ. కూర్చుని ఆయాసం తీరేక "అందరము మినపరొట్టెల్లా ఉన్నాం. ఏమైందని అడక్కు. అసలా మీ ఆయనకి కొంచెమైన బుద్దుందీ? ఆహా! ఉందా అని..."

జగన్నాధానికి బుద్ధి లేదని జానకీ ఒప్పుకుంటుంది కాని భ్రమరాంబ మరీ అలా తనని నిలబెట్టి అడగడం మాత్రం ఆవిడకేం నచ్చదు.

"ఇంతకీ ఏమైంది?" అంది జగన్నాధానికి బుద్ధి వుందో లేదో చెప్పకుండా.

"ఏమైందా? మంచిపనైంది. అలాంటి ఛండాలుడికి యిల్లు యిస్తే అంత ఔతుంది. జానకీ నువ్వేం నొచ్చుకోకు. నాక్కోపం వస్తే మంచి దాన్ని కాదు మరింక మాటలూ మంచివి కావు... మొన్న మనూరు వెళ్ళేనా? ఎలాగూ వెళ్ళేనూ కదా అని మీ ఇంటి గురించి భోగట్టా చేశేను ఎవరైనా అద్దెకి వుంటున్నారేమోనని అవ్వ చెప్తే సిగ్గుచేటు. ఆ ఇంటిలో దెయ్యాలున్నాయట. అంచేతే ఎవరూ దిగడా నికి సాహసించడం లేదుట. ఎవరి నోటా విన్నా యిదే మాట.

"బిక్కచచ్చిపోయింది" జానకి. మరి "యిన్నేళ్ళూ ప్రకాశరావు వాళ్ళు ఎలా ఉన్నారూ?" అంది గొంతుక పెగుల్చుకొని.

... ఆ మాటే నేను అడిగేను. ఆ వెధవలు ఎలా ఉన్నారూ అని. గమ్మత్తు విన్నావా? ఆ వెధవలే అడుగుతున్నారుట "ఆ దెయ్యాలకి మేము అలవాటే మమ్మల్నేం చెయ్యవు. కావలిస్తే మేము వుంటాము. అని...."

"బావుంది!" అంది జానకి నీరసంగా...

"బావుందా! మరీ బావుందాంంం యిల్లు కావలిస్తే అమ్మేయండి కాని ఆ లుచ్చా వెధవలకి మాత్రం యివ్వకండి అని సలహా యిచ్చి జగన్నాధంతో చెప్పు యిదంతా" అంది పోతూ పోతూ భ్రమరాంబ.

కాని జగన్నాథానికి ఎవరూ చెప్పనవసరం లేకపోయింది అతను భ్రమరాంబ కథనం ప్రారంభంలోనే రావడం వల్ల.

అతను అంతా విన్నాడు.

ఆ మర్నాడే రాజేశ్వర్రావు ఉత్తరం రాశేడు. తిట్లు తీసేస్తే భ్రమరాంబ చెప్పినవే అతనూ రాశేడు. కాకపోతే కొంచెం సున్నితంగా రాశేడు భ్రమరాంబలాగే అతనూ సలహా యిచ్చేడు. వాళ్ళకి మాత్రం యివ్వవద్దు అని.

ఈసారి జగన్నాథానికి కోపం పిచ్చి స్థాయిలో వచ్చేసింది.

ఛీ! ఛీ! వెధవ మనుషులు. వెధవ బుద్ధులు. పశువు మనిషిలా ప్రవర్తిస్తే "భేష్" అంటాం.

అదే మనిషి పశువులా ప్రవర్తిస్తే ఛీ అంటాం.

వీళ్ళు ఆ రెండో జాతి. ఆ ఇల్లు అలా పాడు పెట్టేస్తాను. కాని వీళ్ళకి యివ్వను అని శపథం చేసేడు. అయితే అతని ప్రమేయం లేకుండా అర్నెల్లకి దానంతటా ఆదే పాడుబడి పోయింది. కిటికీలు, తలుపులు వగైరా కొన్ని పీక్కుపోయేరు.

"పోనీ అమ్మేస్తే?"

ఐడియా బాగానే ఉంది.

అచరణే బావులేదు.

"దెయ్యాలకొంప" అన్న బిరుదే అమ్మకానికీ అడ్డొచ్చింది.

ఆ మధ్య భ్రమరాంబే మరో వార్త మోసుకొచ్చింది.

"ప్రకాశరావే కొనుక్కుంటాట్ట పదివేలకైతే" అని.

ఏమిటీ? లక్షరూపాయల ఇల్లు పదివేలకా!

అంతకంటే ఊరికే యిచ్చేస్తే సరిపోదూ! కనీసం దానం చేసిన పుణ్యమైనా దక్కుతుంది.

స్థలం ఖరీదైనా యివ్వరా?

ఆ ఇల్లు బాగు చేయించకముందు తన పరిస్థితికీ ఇప్పటికీ తేడా ఏమిటీ?

"ఏం లేదు"

కాదు, ఉంది.

బాగు చేయించడానికి చేసిన అప్పు ఎక్స్ట్రా!

ఔను.

ఈ కథ ఎక్కడ ప్రారంభమైందో మళ్ళీ అక్కడే ముగుస్తోంది.

"భూమి గుండ్రంగానే ఉంది మరి!"

**(జ్యోతి, 1.1.1979)**

# ఆడదాని కథ

**"అ**మ్మోయ్! నీకు ఆకాశవాణి నుంచి పిలుపొచ్చింది" అంటూ ఓ కవరు విసిరింది మా అమ్మాయి.

నా గుండె గుభేల్మంది.

బహుశా "నిన్ను చంపబోయేవాడు మీ చెల్లి కడుపున పుడతాడు" అన్న అకాశవాణిక్కూడా కంసుడు అంత భయపడి ఉండడు.

పిల్ల పుట్టాలంటే తొమ్మిది నెలలు చాలు. కాని నా కథలు మాత్రం బుర్రలో అలా కొన్ని సంవత్సరాలుంటాయి. ఈ మధ్యలో బుర్రకి సిజేరియన్ చేసినా, బుర్ర పగుల్తుందే తప్ప కథ బయటకి రాదు. కొన్నాళ్ళపాటు నా కథలు కేవలం ప్రత్యేక సంచికల్లోనే వచ్చేవి. కారణం ఏమిటంటే ఈ ఏడాది ప్రత్యేక సంచికకి కథ రాయడం మొదలు పెడితే, అది వచ్చే ఏటికి పూర్తి అయ్యేది. మళ్ళీ ఆ వచ్చే ఏటి కథ మొదలు పెడితే అది ఆపై ఏటికి అందేది, ఈ వేళ టైముకి వచ్చిన రైలు నిన్నటిది అన్న జోక్ లాగ.

రావలసిన టైముకి రాకుండా హార్ట్ ఎటాక్నైనా ఆపుకో వచ్చునేమో గాని, రేడియో వాళ్ళకి మాత్రం టైముకి కథ రాయడం తప్పించుకోలేం. ఆలోచించిన కొద్దీ బి.పి. పెరిగిందే తప్ప ప్లాటు తట్టలేదు. కథకి ప్లాట్ సంపాదిం చడం కంటే, హైదరాబాద్లో ప్లాట్ సంపాదించడం సులువనిపించింది. ఏం చెయ్యాలో తోచక "కథలు రాయడం ఎలా?" అన్న పుస్తకం లైబ్రరీ నుంచి తెప్పించి చదివేను. అందులో వ్యాసాలన్నీ ప్రఖ్యాత రచయితలు రాసినవే. అవన్నీ చదివేక కథకి ప్లాట్ మాటెలా ఉన్నా, భయం పట్టుకుంది, ఇంతవరకు నేను రాసినవన్నీ కథలేనా అని.

ఏ యిద్దరు రచయితలూ ఏకీభవించరన్నది కేవలం సామెతే! కారణం ఏవంటే ఈ ప్రఖ్యాత రచయితలందరూ కూడబలుక్కున్నట్టు కథకి శిల్పం ఉండాలి అని నిశ్చయించే శారు. అయితే ఆ శిల్పం ముక్కెంత పొడవుండాలో, మూతి ఎంత వెడల్పుండాలో మాత్రం ఎవరూ చెప్పలదు.

ఇంతకీ విత్ ఆర్ వితౌట్ శిల్పం ఇప్పుడు కథ రాయక తప్పదు. మన దగ్గరలేనప్పుడు పక్కవాడిని అప్పో,అరువో అడగొచ్చు. ఒక్క పెళ్ళాం మినహా. మరంచేత అవమానం అనుకోకుండా నేను మా పిల్లలందర్నీ అడిగేసేను – "ఏదైనా ప్లాట్ చెప్పండర్రా" అని.